
'సంపద పంపిణీ సక్రమంగా జరిగితే అట్టడుగు వర్గాలకు చేరుతుంది. అప్పుడే వారి కొనుగోలు శక్తి పెరుగుతుంది'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 18
సంచిక: 22

సోమవారం 14-4-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 18
సంచిక: 22

సోమవారం 14-4-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'నా అక్కలూ..చెల్లెళ్లు... తమ్ముళ్ల కళ్లలో వెలుగులు చూసినపుడే నా నిజమైన పుట్టిన రోజు'



భళా బెంగళూరు

రాణించిన సాల్ట్, కోహ్లి. బెంగళూరు జట్టుకు నాలుగో విజయం -14లో



ఢిల్లీ 'రనౌట్'

ఐపీఎల్‌లో క్యాపిటల్స్‌కు తొలి ఓటమి. 12 పరుగులతో ముంబై గెలుపు -14లో



అణు విద్యుచ్ఛక్తిలో చైనా అద్భుతం!

తొలిసారిగా 'కేంద్రక సంలీన, విచ్ఛిత్తి' సూత్రాల కలబోతగా ఓ వినూత్న అణు రియాక్టర్ తయారీకి చైనా నడుం బిగించింది.

వివరాలు 6లో ▸



ఆ పైప్‌లైన్ మాకు అప్పగించండి

ఉక్రెయిన్ భూభాగం నుంచి వెళ్లే రష్యా పైప్‌లైన్‌ను తమకు అప్పగించాలనే డిమాండ్‌ను అమెరికా ముందుకు తెచ్చింది.

వివరాలు 6లో ▸



మనువుతో మతిమరుపే

పెళ్లయిన వాళ్లతో పోలిస్తే పెళ్లికాని వాళ్లకు మతిమరుపు ముప్పు తక్కువగా ఉన్నట్లు పరిశోధనలో తేలింది.

వివరాలు 6లో ▸



బీమాతో సైబర్ మోసాలకు చెక్

సైబర్ మోసాల వల్ల జరిగే నష్టాన్ని పాలసీదారులకు సైబర్ ఇన్సూరెన్స్ చెల్లిస్తుంది. రూ.లక్ష నుంచి రూ.5 కోట్ల వరకు బీమా తీసుకోవచ్చు.

వివరాలు 15లో ▸

ఎన్నికల రెఫరెండమే!

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో భూభారతే ప్రధానం

నేడు భూభారతి పోర్టల్‌ను సీఎం ప్రారంభిస్తారు

3 జిల్లాల్లోని మూడు మండలాల్లో అమలు

జూన్ 2 నాటికి రాష్ట్రవ్యాప్తంగా అందుబాటులోకి తెస్తాం

మీడియాతో ఇష్టాగోష్టిలో మంత్రి పొంగులేటి



సాక్షి, హైదరాబాద్: వచ్చే శాసనసభ ఎన్నికలకు భూభారతి చట్టం, పోర్టల్‌ను రెఫరెండంగా స్వీకరిస్తున్నామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పునరుద్ఘాటించారు. భూములున్న ప్రతి ఒక్కరికి భద్రత, భరోసా కల్పించడమే లక్ష్యంగా 'భూ భారతి'చట్టాన్ని, పోర్టల్‌ను తెస్తున్నట్లు తెలిపారు. డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ 134వ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం భూభారతి చట్టాన్ని, పోర్టల్‌ను ప్రారంభిస్తారని చెప్పారు. ఆదివారం ఆయన మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. సోమవారం నుంచే భూభారతి పోర్టల్ ద్వారా భూముల రిజిస్ట్రేషన్లు ప్రారంభమవుతాయని వెల్లడించారు. ఇకపై ధరణి పోర్టల్ ఉండదని తెలిపారు. భూ భారతి అమలులోకి వచ్చిన తర్వాత ధరణి ముసుగులో జరిగిన భూ అక్రమాలపై ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహిస్తామని చెప్పారు. పోర్టల్ ప్రారంభం కాగానే ప్రజలంతా ఒకేసారి దానిని సందర్శించవద్దని, అలా చేస్తే పోర్టల్ ఆగిపోయే ప్రమాదం ఉందని మంత్రి చెప్పారు. కొంతమంది ఉద్దేశ పూర్వకంగా పోర్టల్‌ను నిలుపుదల చేయాలని చూస్తున్నారని ఆరోపించారు.

తొలుత 3 మండలాల్లో భూభారతి

భూభారతి చట్టాన్ని, పోర్టల్‌ను తొలుత మూడు జిల్లాల్లోని మూడు మండలాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేయబోతున్నట్లు పొంగులేటి తెలిపారు. ధరణిలో తలెత్తిన సమస్యలు భూభారతిలో రాకుండా చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. అచ్చుతప్పులు, భూ విస్తీర్ణంలో హెచ్చు తగ్గులు, తండ్రి పేరు మార్పు, భూ లావాదేవీల్లో అవకతవకలను సరిదిద్దుతామని పేర్కొన్నారు. ఈ మూడు మండలాల్లో వచ్చిన ఫలితాల ఆధారంగా జూన్ 2వ తేదీ నాటికి రాష్ట్రమంతా ఈ చట్టాన్ని అమలు చేస్తామని చెప్పారు. ధరణిని

మిగతా 2వ పేజీలో ▶

ఏఐ భూమిత్ర

- ➡ భూ భారతి పోర్టల్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్
- ➡ యూజర్లు అడిగే ప్రశ్నలకు వెంటనే సమాధానాలు
- ➡ ధరణిలో ముందుగానే సిద్ధంచేసిన ప్రశ్నలు, జవాబులు
- ➡ కొత్త పోర్టల్‌లో ప్రతి ప్రశ్నకు కొత్తగా జవాబివ్వనున్న భూమిత్ర
- ➡ ధరణి రికార్డులే భూభారతిలోకి బదిలీ..
- ➡ కొత్త పోర్టల్ రూపకల్పనపై సీఎం రేవంత్ సమీక్ష
- ➡ నేడు జిల్లా కలెక్టర్లతో ముఖ్యమంత్రి సమావేశం

2లో

వేలుడు ధాటికి ధ్వంసమైన బాణసంచా తయారీ కేంద్రం



బాణసంచా తయారీ కేంద్రంలో భారీ విస్ఫోటం

అనకాపల్లి జిల్లా కైలాసపట్నంలో ఘోర ప్రమాదం

అగ్ని కీలల్లో 8 మంది సజీవ దహనం

మరో 8 మందికి తీవ్ర గాయాలు

క్షతగాత్రుల్లో ఇద్దరి పరిస్థితి విషమం

- విశాఖ, నర్సీపట్నం ఆస్పత్రులకు తరలింపు
- ఘటనపై ఏపీ సీఎం చంద్రబాబు ఆరా
- రూ.15 లక్షల చొప్పున పరిహారం ప్రకటన
- ప్రమాదంపై మాజీ సీఎం వైఎస్ జగన్ దిగ్భ్రాంతి
- బాధితుల్ని సత్వరమే ఆదుకోవాలని డిమాండ్
- జగన్ ఆదేశాలతో సహాయక చర్యల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు

12లో

న్యూస్‌రీల్

మనసు మాట మెటాకు తెలుసు



ఏఐ ద్వారా మనకు ఇష్టమైన వాటి గురించి ముందే తెలుసుకుంటున్నాయి సోషల్ మీడియా సంస్థలు. ఇది గతంలోనూ ఉన్నప్పటికీ ఈ రంగంలో మెటా తీసుకొచ్చిన 'ఆంద్రోమెడా'ఇప్పుడు సరికొత్త సంచలనం.

- వివరాలు 16లో▶

అవకాశ లౌకికవాది చంద్రబాబు



ఏపీ సీఎం చంద్రబాబుకు రాజకీయ ప్రయోజనాలు తప్ప సిద్ధాంతాలు, విలువలు లేవని ప్రముఖ జర్నలిస్ట్ రాజ్‌దీప్ సర్దేశాయ్ పేర్కొన్నారు. తన యూట్యూబ్ ఛానల్‌లో తాజాగా ఈమేరకు వీడియో అప్‌లోడ్ చేశారు.

- వివరాలు 12లో▶

అకాల వర్షాన్ని ఒడిసిపడితే.. బోరులోనూ జలహోరు



భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. అకాల వర్షపు నీటిని పొలాల్లో ఎక్కడికక్కడే ఒడిసిపట్టి భూమిలోకి ఇంకింపజేసుకుంటే ఈ సమస్యకు పరిష్కారం దొరుకుతుంది.

- వివరాలు 12లో▶

ఎండలు మండుతాయ్



రాష్ట్రంలో రానున్న రెండ్రోజులు సాధారణం కంటే అధికంగా ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. ఒకటి నుంచి మూడు డిగ్రీల మేర అధికంగా గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదు కావొచ్చని పేర్కొంది.

- వివరాలు 16లో▶

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్. చిత్రంలో మంత్రులు సీతక్క, పొన్నం, రాజనర్సింహ, జస్టిస్ షమీమ్ అక్తర్



నేడు ఎస్సీ వర్గీకరణ ఉత్తర్వులు

తొలి ప్రతి సీఎంకు...

అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని జారీ చేయనున్న రాష్ట్ర ప్రభుత్వం

- ఎస్సీ వర్గీకరణ మంత్రివర్గ ఉపసంఘం చైర్మన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడి
- 2026లో జనగణన గణాంకాలు అందుబాటులోకొచ్చాక రిజర్వేషన్లు పెంచుతామని స్పష్టీకరణ

సాక్షి, హైదరాబాద్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ ఉత్తర్వులు విడుదల చేయనుంది. అసెంబ్లీ వేదికగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీకి అనుగుణంగా ప్రభుత్వ యంత్రాంగం ఎస్సీ వర్గీకరణకు సంబంధించి రూపొందించిన మార్గదర్శకాలకు తాజాగా ఎస్సీ వర్గీకరణ మంత్రివర్గ ఉపసంఘం ఆమోదం తెలిపింది. ఇందులో భాగంగా సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయనుంది. ఉత్తర్వుల తొలి ప్రతిని సీఎం రేవంత్‌రెడ్డికి అందించనున్నట్లు

మిగతా 2వ పేజీలో ▶

సుప్రీం తీర్పుతో మొదలై.. గతేడాది ఆగస్టు 1 నుంచి నేటి దాకా ఎస్సీ వర్గీకరణ ప్రక్రియ ప్రస్థానం 2లో

చంద్రబాబు, నితీశ్ వల్లే వక్ఫ్ చట్టం



ఏఐఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ వెల్లడి

- వారి మద్దతుతోనే మోదీ ఈ నల్లచట్టాన్ని తెచ్చారు
- చంద్రబాబు వారసులను ముస్లింలు ఎలా విశ్వసిస్తారు?
- వక్ఫ్ సవరణ చట్టం రాజ్యాంగ విరుద్ధం
- ప్రాథమిక హక్కులను అది ఉల్లంఘిస్తోంది
- వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా 19న హైదరాబాద్‌లో భారీ సభ

సాక్షి, హైదరాబాద్: కేంద్రంలోని బీజేపీ సంకీర్ణ ప్రభుత్వంలో కీలక భాగస్వాములైన టీడీపీ అధినేత చంద్రబాబు, బిహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ సంపూర్ణ సహకారంతోనే ప్రధాని నరేంద్రమోదీ వక్ఫ్ నల్ల చట్టాన్ని తీసుకురాగలిగారని ఏఐఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఆరోపించారు. ఆదివారం హైదరాబాద్‌లోని దారుస్సలాంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీటీడీ బోర్డులో హిందువులను మాత్రమే సభ్యులుగా కొనసాగిస్తున్న ఏపీ సీఎం చంద్రబాబు.. వక్ఫ్ బోర్డులో ఇతర మతస్తులను సభ్యులుగా చేర్చే బిల్లుకు ఏ విధంగా మద్దతు ఇచ్చారని ప్రశ్నించారు. చంద్రబాబు తాత్కాలిక రాజకీయ ప్రయోజనాల కోసం వక్ఫ్ చట్ట సవరణ బిల్లుకు మద్దతిచ్చి.. తన కుమారుడు లోకేశ్ రాజకీయ భవితవ్యాన్ని దెబ్బతీశారని అన్నారు. భవిష్యత్‌లో ముస్లింలు చంద్రబాబు వారసులను ఎలా విశ్వసిస్తారని ప్రశ్నించారు.

వక్ఫ్ చట్టం ప్రాథమిక హక్కుల ఉల్లంఘనే..

వక్ఫ్ సవరణ చట్టం రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 15, 25, 26, 29లలో పొందుపరిచిన ప్రాథమిక హక్కులను ఉల్లంఘిస్తోందని అసదుద్దీన్ అన్నారు. మోదీ ప్రభుత్వం ఈ చట్టం ద్వారా

మిగతా 5వ పేజీలో ▶

అంబేడ్కర్ విగ్రహం వద్ద ముస్లింల భారీ ర్యాలీ

మద్దతు పలికిన కాంగ్రెస్ నేతలు - వివరాలు 5లో▶

30 రోజుల్లో వెళ్లిపొండి

- లేదంటే భారీ జరిమానా విధిస్తాం.. తర్వాత శిక్షిస్తాం
- లేదంటే స్వదేశానికి తరిమేస్తాం
- అక్రమ వలసదారులకు అమెరికా ప్రభుత్వం అల్టిమేటమ్




అక్రమ వలసదారులపై కఠిన ఆంక్షల కొరడాలను ఝుళిపిస్తున్న డొనాల్డ్ ట్రంప్ సర్కార్ మరో హెచ్చరిక అస్త్రాన్ని ప్రయోగించింది. 30 రోజుల్లో దేశం విడిచి వెళ్లాలని లేదంటే అక్రమంగా నివసిస్తున్నందుకు భారీ జరిమానా విధిస్తామని, లేదంటే జైళ్లో పడేస్తామని హెచ్చరించింది. ఈ నేపథ్యంలో అక్కడి హెచ్1బీ, విద్యార్థి వీసాదారుల కష్టాలు మరింత ఎక్కువకానున్నాయి. - వివరాలు 6లో▶

ఇదండీ సంగతి



మీరు ప్రపంచం మొత్తాన్ని బెదిరిస్తుంటే.. మీ ఒక్కరిని బెదిరిస్తే తప్పా? అని అంటున్నాడ్సార్

మహిళామణులు



జిల్లా కోర్టుల్లో మహిళల భాగస్వామ్యం పెరుగుతోంది. రాష్ట్రంలో ప్రస్తుతం జిల్లా జడ్జీల్లో 60 శాతం వరకు మహిళలున్నారు. భవిష్యత్‌లో రాష్ట్రంలోని న్యాయవ్యవస్థలో పురుషుల కోసం 30% రిజర్వు చేయాల్సిన పరిస్థితి రావొచ్చు (నవ్వుతూ).



జస్టిస్ సుజోయ్‌పాల్, హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి

లింగ భేదానికి తావులేకుండా తమను తాము నిరూపించుకున్నప్పుడే మహిళలు నిజంగా సంతోషంగా ఉంటారు. కోర్టులకొచ్చే ప్రజలు న్యాయమూర్తి పురుషుడా.. మహిళా.. అని చూడటం లేదు. న్యాయం అందుతోందా? లేదా? అనేదే చూస్తున్నారు.



జస్టిస్ మౌషుమి భట్టాచార్య, హైకోర్టు న్యాయమూర్తి

న్యాయమూర్తులుగా రాణిస్తున్న స్త్రీలు

జిల్లా, కింది కోర్టుల్లో వారి సంఖ్య	హైకోర్టులో వారి సంఖ్య
56 %	33%

- భవిష్యత్‌లో ఈ సంఖ్య మరింత పెరిగే చాన్స్.. న్యాయం అర్థించడం నుంచి అందించే స్థాయికి..
- రోజూ వందల తీర్పులిస్తూ దేశానికే స్ఫూర్తి

సాక్షి, హైదరాబాద్: కోర్టు అనగానే న్యాయ దేవతే అందరికీ గుర్తొస్తుంది. కానీ, చాలా ఏళ్ల పురుషాధిక్యతే కొనసాగింది. ఇప్పుడు న్యాయవ్యవస్థ తమదే అంటూ సాగిపోతున్నారు మహిళలు. కేవలం చిహ్నానికే పరిమితం కాకుండా మహిళలు న్యాయదేవతలుగా అవతరిస్తున్నారు. న్యాయం అర్థించే స్థాయి నుంచి న్యాయం అందించే స్థాయికి ఎదుగుతున్నారు. ఈ విషయంలో దేశానికి తెలంగాణ స్ఫూర్తిగా నిలుస్తోంది. జిల్లా, కింది కోర్టుల జడ్జీల్లో 56 శాతం మహిళలే న్యాయం అందిస్తున్నారు. ఉన్నత న్యాయస్థానంలోనూ 33 శాతంతో ముఖ్యమైన కేసుల్లోనూ తీర్పులిస్తున్నారు. భవిష్యత్‌లో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం లేకపోలేదు. మహిళలకు న్యాయవాదిగా ఎన్‌రోల్ చేసుకునే హక్కులేదని చెప్పిన ఈ దేశంలోనే పురుషులను మించి సత్తా చాటుకుంటున్నారు. రోజూ వందల తీర్పులిస్తున్న న్యాయదేవతలపై ప్రత్యేక కథనం.

మహిళా న్యాయవాదా? కుదరదు..

కోల్‌కతాకు చెందిన రెజీనా గుహ న్యాయ విద్య పూర్తి చేసుకుని, అలీపూర్ జిల్లా జడ్జి కోర్టులో ప్లీడర్ (లాయర్)గా చేరడానికి 1916లో దరఖాస్తు చేసుకున్నారు. అప్పట్లో అదో పెద్ద వింత. మహిళలు నమోదు చేసుకోవడానికి అనుమతి లేదంటూ ఆమె దరఖాస్తును తిరస్కరించారు. ఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ రెజీనా కలకత్తా హైకోర్టులో పిటిషన్ వేశారు. లీగల్ ప్రాక్టీషనర్స్ యాక్ట్.. అర్హత కలిగిన 'వ్యక్తులు' న్యాయవాదులుగా నమోదు చేసుకోవడానికి అనుమతిస్తుందని పేర్కొన్నారు. వ్యక్తి అంటే మహిళ అని కూడా

మిగతా 3వ పేజీలో ▶



ఒక్క కమిషనరూ లేరు..

సమాచార కమిషనర్ల నియామకంలో సర్కార్ మీనమేషాలు

- సీఐసీ పదవీ కాలం ముగిసి ఐదేళ్లు
- ఒక్క కమిషనర్ కూడా లేక రెండేళ్లు
- వినతులు పరిష్కరించే వారు లేక ప్రజల అవస్థలు

3లో

అంబేడ్కర్‌కు గవర్నర్, సీఎం నివాళి

సాక్షి, హైదరాబాద్: డాక్టర్ బీఆర్ అంబేడ్క ర్ జయంతి సందర్భంగా ఆయనకు గవర్నర్, సీఎం ఘనంగా నివాళులర్పించారు. దేశ రాజ్యాంగ రూపకల్పనలో అంబేడ్కర్ కీలక భూమిక పోషించారని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ కొనియాడారు. బడుగు, బలహీన వర్గాలు, మహిళల సాధికారతకు అంబేడ్కర్ అవిశ్రాంతంగా కృషి చేశారని సీఎం రేవంత్ పేర్కొన్నారు. దీర్ఘదృష్టితో దేశ భవిష్యత్తును ఊహించి, దార్శనికతతో రాజ్యాంగాన్ని రూపొందించి.. భావితరాలకు స్ఫూర్తిగా నిలిచారన్నారు.

మరో 44,676 ఎకరాలు!

రాజధాని విస్తరణ పేరుతో తీసుకునేందుకు ఏపీ సర్కారు సన్నాహాలు



సాక్షి, అమరావతి: నా దాహం తీరనిది..! అన్నట్లుగా ఏపీ ప్రభుత్వ పెద్దల భూ దాహం తీరడం లేదు. రైతులు కాళ్లావేళ్లా పడుతున్నా హృదయం కరగడం లేదు! రాజధాని పేరుతో ఏటా మూడు వాణిజ్య పంటలు పండే ఎంతో సారవంతమైన భూములను రైతుల నుంచి ల్యాండ్ పూలింగ్ ద్వారా గతంలోనే 34,568 ఎకరాలను టీడీపీ సర్కారు తీసుకుంది. ఇది కాకుండా ప్రభుత్వ భూములతో కలిపి మొత్తం 53,749 ఎకరాలను రాజధాని కోసం ఇప్పటికే సమీకరించారు. అయితే ఇది ఇంకా సరిపోదంటూ రాజధాని విస్తరణ పేరుతో మరో 44,676 ఎకరాలను సమీకరించేందుకు చంద్రబాబు ప్రభుత్వం తాజాగా కసరత్తు ప్రారంభించింది. తుళ్లూరు, అమరావతి, తాడికొండ, మంగళగిరి మండలాల్లోని పలు గ్రామాల పరిధిలో వేల ఎకరాలను సమీకరించే లక్ష్యంతో అడుగులు వేస్తోంది.

విస్తరణ పేరుతో భూముల సమీకరణకు కసరత్తు ఇలా..

తుళ్లూరు (మండలం)
హరిచంద్రాపురు
2,429.05 ఎకరాలు

వడ్డమాను
1,937.31 ఎకరాలు

పెదపరిమి
6,513.69 ఎకరాలు

అమరావతి (మండలం)
వైకుంఠపురం
3,360.63 ఎకరాలు

ఎండ్రాయి
2,167.11 ఎకరాలు

కార్లపూడి
2,947.96 ఎకరాలు

మోతడక
2,345.03 ఎకరాలు

నిడుముక్కల
2,013.91 ఎకరాలు

తాడికొండ (మండలం)
తాడికొండ
12,797.59 ఎకరాలు

కంతేరు
3,671.98 ఎకరాలు

మంగళగిరి (మండలం)
కాజా 4,492.37 ఎకరాలు

రెండ్రోజులు ఢిల్లీలో సీఎస్ మకాం

16న సుప్రీంలో కంచ గచ్చిబౌలి కేసు నేపథ్యంలో న్యాయనిపుణులతో భేటీ కోసమే..!



సాక్షి, న్యూఢిల్లీ: కంచ గచ్చిబౌలి భూముల కేసులో సుప్రీంకోర్టు ఆదేశాలపై ఎలా స్పందించాలనే అంశంపై రాష్ట్ర ప్రభుత్వం ముమ్మర కసరత్తు చేస్తోంది. గత విచారణలో భాగంగా కంచ గచ్చిబౌలిలో వెంటనే పనులు ఆపేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని సుప్రీంకోర్టు ఆదేశించింది. తమ ఆదేశాల విషయంలో ఎలాంటి ఉల్లంఘనలు జరిగినా సీఎస్ వ్యక్తిగతంగా బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. అలాగే ఆ భూములను సందర్శించి ఈ నెల 16లోగా సమగ్ర నివేదిక సమర్పించాలని చెప్పింది. ఈ నేపథ్యంలో ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్‌తోపాటు మరో 10 మంది అధికారులతో కలిసి శనివారం ఢిల్లీ చేరుకున్న సీఎస్ శాంతికుమారి ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు సుమారు ఐదు గంటలపాటు అధికారులతో సమాలోచనలు చేశారు. సుప్రీంకోర్టుకు సమర్పించాల్సిన నివేదికపై సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ సహా మరికొందరు న్యాయవాదులతో ఆమె ప్రత్యేకంగా సమావేశమైనట్లు సమాచారం. నివేదికలో పొందుపర్చాల్సిన అంశాలేమిటి? క్షేత్రస్థాయిలో ఏం జరిగింది? ప్రభుత్వం నివేదిక సమర్పించాక న్యాయస్థానం ఎలా స్పందిస్తుంది? వంటి విషయాలపై న్యాయవాదుల సలహాలు, సూచనలు అడిగి తెలుసుకున్నట్లు తెలిసింది. అనంతరం ఢిల్లీ పర్యటన ముగించుకొని ఆదివారం సాయంత్రం ఆమె హైదరాబాద్‌కు తిరిగి వెళ్లారు.

ఏఐ భూమిత్ర



రాష్ట్రంలో భూ లావాదేవీలకు సంబంధించి ధరణి స్థానంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమల్లోకి తెస్తున్న భూభారతి పోర్టల్‌లో కృత్రిమ మేధ (ఏఐ)ను ఉపయోగించనున్నారు. ఏఐ సహకారంతో ఈ పోర్టల్‌లోని ఒక విభాగాన్ని నిర్వహించనున్నారు. ధరణిలో యూజర్ల సందేహాలను నివృత్తి చేసేలా ముందుగానే రూపొందించిన ప్రశ్నలు, సమాధానాలు అందుబాటులో ఉండేవి. భూ భారతిలో యూజర్ల ప్రశ్నలకు అప్పటికప్పుడు సమాధానమిచ్చేలా చాట్ బాట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు సమాచారం. హెల్ప్ డెస్క్ కింద ఈ చాట్‌బాట్‌ను వినియోగించనున్నారని తెలుస్తోంది. యూజర్ ఏ ప్రశ్న అడిగినా సరైన సమాధానమిచ్చేలా 'భూమిత్ర' పేరుతో హెల్ప్ డెస్క్‌ను రూపొందిస్తున్నారు. భూముల వివరాలు, లావాదేవీల నిర్వహణలో వచ్చే సందేహాలను నివృత్తి చేసేలా ఏఐని వినియోగించనున్నట్టు భూపరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ) కార్యాలయ వర్గాలు వెల్లడించాయి. - సాక్షి, హైదరాబాద్

భూ భారతి పోర్టల్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్

యూజర్లు అడిగే ప్రశ్నలకు అప్పటికప్పుడు సమాధానం
ధరణిలో ముందుగానే సిద్ధంచేసిన ప్రశ్నలు, జవాబులు
కొత్త పోర్టల్‌లో ప్రతి ప్రశ్నకు కొత్తగా జవాబివ్వనున్న భూమిత్ర
గోప్యతకు చెక్.. భూ వివరాలన్నీ బహిరంగమే
ధరణి రికార్డులే భూభారతిలోకి బదిలీ.. త్వరలో కొత్త పోర్టల్
కొత్త పోర్టల్ రూపకల్పనపై సీఎం రేవంత్ సమీక్ష

కొత్త పోర్టల్‌లో పాత రికార్డులే..

ధరణి పోర్టల్‌లో నమోదైన భూ రికార్డులను యథాతథంగా భూభారతి పోర్టల్‌లోకి బదిలీ చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. కొత్త రికార్డులేవీ రాయడం లేదని చెబుతున్నారు. ఇప్పటికే పాత రికార్డుల్లో సరిగ్గా ఉన్న వివరాలు అలాగే ఉంటాయని, తప్పుగా నమోదైన వివరాలను సరిచేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఇందు కోసం ధరణిలో ఉన్న 35 మాడ్యూళ్ల స్థానంలో 6 మాడ్యూళ్లను మాత్రమే భూభారతిలో అందుబాటులోకి తేనున్నారు. ధరణిలో చాలా మాడ్యూళ్లు ఉండడంతో రైతులకు దేని ద్వారా దరఖాస్తు చేసుకోవాలో అర్థమయ్యేది కాదని, ఇప్పుడు సులభంగా దరఖాస్తు చేసుకునేలా అన్ని సమస్యలను ఆరు మాడ్యూళ్ల ద్వారానే పరిష్కరించే ఏర్పాట్లు చేశామని రెవెన్యూ వర్గాలంటున్నాయి.

ఆటంకం లేకుండా రిజిస్ట్రేషన్లు

ధరణి నుంచి భూభారతి పోర్టల్‌కు మారుతున్న సందర్భంగా రిజిస్ట్రేషన్ల ప్రక్రియకు ఎలాంటి ఆటంకం ఉండదని, యథాతథంగా రిజిస్ట్రేషన్లు కొనసాగుతాయని రెవెన్యూ శాఖ వర్గాలు తెలిపాయి. గతంలో ధరణి పోర్టల్ అందుబాటులోకి తెచ్చే సమయంలో 100 రోజులకు పైగా వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్‌ను నిలిపివేశారు. ఇప్పుడు ఓ వైపు క్రయవిక్రయ లావాదేవీలను కొనసాగిస్తూనే మరోవైపు పోర్టల్‌ను బలోపేతం చేసేలా సాఫ్ట్‌వేర్‌ను రూపొందించినట్లు వెల్లడించాయి. ఇప్పటివరకు ప్రైవసీ ఆప్షన్ కింద కొన్ని భూముల వివరాలను ప్రజలందరికీ అందుబాటులో ఉండకుండా దాచారు. అలా కాకుండా భూభారతిలో రాష్ట్రంలోని ప్రతి ఎకరా భూమికి సంబంధించిన వివరాలను నమోదు చేశారు. భూమి పట్టాదారు ఎవరు? ఎవరి నుంచి, ఎంత భూమిని, ఎవరు కొనుగోలు చేశారు? ఆ భూమిపై హక్కులు ఏ విధంగా సంక్రమించాయి? అనే పూర్తి వివరాలు ప్రజలందరికీ అందుబాటులో ఉంటాయని అధికారులు తెలిపారు.

ప్రస్తుత పోర్టల్ తాత్కాలికమే

ప్రస్తుతం అమల్లోకి తెస్తున్న భూభారతి పోర్టల్ తాత్కాలికమేనని అధికారులు తెలిపారు. ధరణి ఆనవాళ్లు లేకుండా కొత్త పోర్టల్‌ను రూపొందించనున్నట్లు చెబుతున్నారు. ఇందుకోసం అవసరమైన చర్యలు తీసుకోవాలని ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించినట్టు తెలిసింది. నేటి నుంచి అమల్లోకి రానున్న భూభారతి పోర్టల్ లోగో, డిజైన్‌పై ఆదివారం తన నివాసంలో సీఎం రేవంత్ సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, నల్లగొండ ఎంపీ కె. రఘువీర్‌రెడ్డి, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, సీసీఎల్ఏ నవీన్ మిత్తల్, సీసీఎల్ఏ కార్యదర్శి మకరంద్, భూచట్టాల నిపుణుడు భూమి సునీల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. సామాన్య రైతుకు కూడా అర్థమయ్యే భాషలో భూభారతి వెబ్‌సైట్ ఉండాలని సూచించారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించాలని, భూ రికార్డులకు ఎలాంటి సమస్యలు రాకుండా పకడ్బందీ ఫైర్‌వాల్స్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కొత్త పోర్టల్‌ను డిజైన్ చేసి నిర్వహించే బాధ్యతను విశ్వసనీయ సంస్థకు అప్పగించాలని అన్నారు. కనీసం వందేళ్లపాటు వినియోగంలో ఉండేలా పోర్టల్‌ను రూపొందించాలని ఆదేశించారు. కాగా, సోమవారం సాయంత్రం శిల్పారామంలో జరిగే కార్యక్రమంలో భూభారతి పోర్టల్‌ను సీఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరించనున్నారు. అంతకుముందు అన్ని జిల్లాల కలెక్టర్లతో ఆయన ఎంసీఆర్‌హెచ్ఆర్డీలో సమావేశమవుతారు.


అధికారులతో సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి

ఎన్నికల రెఫరెండమే!

▶ మొదటి పేజీ తరువాయి

తెచ్చిన సమయంలో దాదాపు 4 నెలలపాటు రిజిస్ట్రేషన్లు నిలిపివేశారని, ఇప్పుడు ఆ పరిస్థితి ఉండదని తెలిపారు. పార్ట్ బీలోని భూముల సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారు. ధరణిలో 33 మాడ్యూల్స్ ఉండగా, భూభారతిలో 6 మాత్రమే ఉంటాయని వెల్లడించారు. భూభారతి అమలు కోసం ఎంపికచేసిన గ్రామాల్లో అవగాహనా సదస్సులు నిర్వహిస్తామని చెప్పారు. భూభారతిలో ఎమ్మార్వో స్థాయి నుంచి సీసీఎల్ఏ వరకు ఐదు స్థాయిల్లో భూ సమస్యల పరిష్కారానికి వీలుగా అధికారాల వికేంద్రీకరణ చేసినట్లు వివరించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదుల సంఖ్య ఆధారంగా ట్రిబ్యునల్స్ ఏర్పాటు చేస్తామని చెప్పారు.

మే మొదటివారంలో గ్రామ పాలనాధికారులు

వచ్చేనెల మొదటివారంలో గ్రామాల్లో రెవెన్యూ పాలనా యంత్రాంగాన్ని పునరుద్ధరిస్తామని పొంగులేటి తెలిపారు. ఇప్పటికే ఈ ప్రక్రియ ప్రారంభించినట్లు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా వేయి మంది లైసెన్స్డ్ సర్వేయర్లను నియమిస్తామని మంత్రి ప్రకటించారు.

ధర్మరాజులా ఉండాల్సిన జానారెడ్డి
ధృతరాష్ట్రుడి పాత్ర పోషిస్తున్నారు

- మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ధ్వజం
- ఉమ్మడి నల్లగొండ జిల్లాకు మంత్రి పదవి ఇవ్వొద్దని ఆయన అధిష్టానానికి లేఖ రాశారు
- 20 ఏళ్లు మంత్రిగా ఉన్న జానాకు ఈ అంశం ఇప్పుడు గుర్తొచ్చిందా?
- ఒకేఇంట్లో ఇద్దరికి మంత్రి పదవులు ఉంటే తప్పేంటి?



చౌటుప్పల్/ చండూరు: కాంగ్రెస్ పార్టీ అధిష్టానం తనకు మంత్రి పదవి ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నా కొందరు వ్యక్తులు దుర్మార్గంగా అడ్డుపడుతున్నారని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ధ్వజమెత్తారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో ఆదివారం నిర్వహించిన వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణస్వీకారోత్సవంలో ఆయన మాట్లాడారు. మహాభారతంలో ధర్మరాజులా ఉండాల్సిన మాజీ మంత్రి జానారెడ్డి ధృతరాష్ట్రుడి పాత్ర పోషిస్తున్నారని దుయ్యబట్టారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాకు మంత్రి పదవి ఇవ్వకుండా రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు ఇవ్వాలని అధిష్టానానికి జానా లేఖ రాశారని పేర్కొన్నారు. 20 ఏళ్లు మంత్రి పదవులు అనుభవించిన జానాకు ఈ అంశం ఇప్పుడు గుర్తుకొచ్చిందా? అని ప్రశ్నించారు. 'ఒకే ఇంట్లో ఇద్దరికి మంత్రి పదవులు ఇవ్వొద్దని కొందరు మాట్లాడుతున్నారు. ఇద్దరికి ఎందుకు ఇవ్వకూడదో చెప్పాలి. తెలంగాణ రాష్ట్ర సాధనకు నా సోదరుడు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మంత్రి పదవినే త్యాగం చేశారు. నేను సోనియాగాంధీని ఒప్పించి, తెగించి పార్లమెంట్‌లో పోరాడా. మా ఇద్దరికీ మంత్రి పదవులు ఇస్తే తప్పేంటి? ఖమ్మం జిల్లాలో తొమ్మిది మంది ఎమ్మెల్యేలకు 3 మంత్రి పదవులు ఇచ్చినప్పుడు నల్లగొండలో 11 మందికి 3 మంత్రి పదవులు ఇస్తే తప్పేంటి?' అని రాజగోపాల్‌రెడ్డి ప్రశ్నించారు.

మాట నిలుపుకోవాల్సింది ఎవరు?

గత పార్లమెంట్ ఎన్నికల సమయంలో మంత్రులు ఇన్‌చార్జీలుగా ఉన్న పార్లమెంట్ స్థానాలైన కరీంనగర్, మహబూబ్‌నగర్, మల్కాజ్‌గిరి, మెదక్, సికింద్రాబాద్, ఆదిలాబాద్ స్థానాల్లో పార్టీ ఓడిపోయిందని రాజగోపాల్‌రెడ్డి గుర్తుచేశారు. మరి ఇప్పుడు ఆ స్థానాల బాధ్యతలు తీసుకున్న మంత్రులు ఎక్కడికి పోయారని ఆయన నిలదీశారు. తన బలం ఏమిటో తెలిసినందునే ఎంపీ స్థానాన్ని గెలిపించుకొని వస్తానన్న నమ్మకంతో ఎమ్మెల్యే అయిన తనను భువనగిరి పార్లమెంట్ ఇన్‌చార్జిగా అధిష్టానం నియమించిందన్నారు.

పదవుల కోసం అడుక్కోను.. పాకులాడను..

తాను మంత్రి కావాలని జాలితోనో, పైరవీ చేసో అడగట్లేదని రాజగోపాల్‌రెడ్డి స్పష్టం చేశారు. తనకు దమ్ము, ధైర్యం ఉందని.. మంత్రి పదవికి అర్హత, పదవిని సమర్థంగా చేపట్టగలనని నమ్మితేనే మంత్రి పదవి ఇవ్వాలన్నారు. తాను పదవుల కోసం పాకులాడనని, పదవులు కావాలని అడుక్కోనని స్పష్టం చేశారు. ఎవరి దయాదాక్షిణ్యాల కోసం ఎదురు చూడట్లేదని తేల్చిచెప్పారు. ప్రాణం పోయినా నియోజకవర్గ ప్రజలు తలదించుకొనేలా ప్రవర్తించబోనని భావోద్వేగానికి లోనయ్యారు. కార్యక్రమంలో భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. కాగా, చండూరు మార్కెట్ కమిటీ ప్రమాణస్వీకార కార్యక్రమంలోనూ పాల్గొన్న రాజగోపాల్‌రెడ్డి అనంతరం మీడియాతో మాట్లాడారు. తన ఓపికను చేతగానితనంగా చూడొద్దని.. తనకు ఇచ్చిన హామీ మేరకు మంత్రి పదవి ఇవ్వాలని డిమాండ్ చేశారు. 16 నెలలుగా మంత్రి పదవులను ఖాళీగా ఉంచడం సరికాదని అభిప్రాయపడ్డారు.

సుప్రీం తీర్పుతో మొదలై..

గతేడాది ఆగస్టు 1 నుంచి నేటి దాకా ఎస్సీ వర్గీకరణ ప్రక్రియ ప్రస్థానం ఇదీ..

సాక్షి, హైదరాబాద్: ఎస్సీ వర్గీకరణ అంశం రాష్ట్రాల పరిధిలోనిదేనని స్పష్టం చేస్తూ... ఆ మేరకు రాష్ట్ర ప్రభుత్వాలే చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు 2024 ఆగస్టు 1న తీర్పు ఇచ్చింది. ఆ తీర్పు వచ్చిన వెంటనే అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ వర్గీకరణను మొదటగా తెలంగాణలోనే అమలు చేస్తామని ప్రకటించారు. ఆ తర్వాత ఎస్సీ వర్గీకరణ కోసం ప్రత్యేకంగా మంత్రివర్గ ఉపసంఘాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఉపసంఘం సంబంధిత అధికారులతో పలుమార్లు సమీక్షలు నిర్వహించి న్యాయపరమైన చిక్కులు లేకుండా వర్గీకరణ చేపట్టాలంటే ఏకసభ్య కమిషన్‌ను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది. దీంతో ప్రభుత్వం జస్టిస్ షమీమ్ అక్తర్‌తో కూడిన ఏకసభ్య కమిషన్‌ను ఏర్పాటు చేసింది. గతేడాది నవంబర్ 11న బాధ్యతలు స్వీకరించిన కమిషన్ ప్రత్యేకంగా అన్ని వర్గాల నుంచి వినతులు స్వీకరించడంతోపాటు ఉమ్మడి జిల్లా కేంద్రంగా పలు ప్రాంతాల్లో పర్యటించింది. 82 రోజులపాటు అధ్యయనం చేపట్టి మంత్రివర్గ ఉపసంఘానికి ఈ ఏడాది ఫిబ్రవరి 3న నివేదిక అందించింది. ఈ నివేదికను రాష్ట్ర ప్రభుత్వం ఫిబ్రవరి 4న అసెంబ్లీ ముందుంచింది. ఆ తర్వాత మళ్లీ కమిషన్ క్షేత్రస్థాయి నుంచి అభ్యంతరాలు, వినతులు స్వీకరించేందుకు మరికొంత సమయం ఇచ్చింది. అనంతరం తుది నివేదికను రూపొందించి ప్రభుత్వానికి సమర్పించింది. నివేదిక, అందులోని సిఫార్సులకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ బిల్లును రూపొందించి మార్చి 18న అసెంబ్లీలో ప్రవేశపెట్టింది. బిల్లుపై సుదీర్ఘ చర్చ అనంతరం ఉభయసభలు ఆమోదం తెలిపాయి. ఈ బిల్లును ఈ నెల 9న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆమోదించారు. నేడు రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ ఉత్తర్వులు జారీ చేయనుంది.

ఎస్సీ కులాల గ్రూపులు, వాటి జనాభా శాతం, కేటాయించిన రిజర్వేషన్లు ఇలా...

కేటగిరీ	గ్రూపులోకి పరిగణన	కులాలు	జనాభా శాతం	రిజర్వేషన్
గ్రూప్-1	సామాజికంగా, ఆర్థికంగా, విద్యాపరంగా అత్యంత వెనుకబడిన, పట్టించుకోనివి	15	3.288	1
గ్రూప్-2	మధ్యస్తంగా లబ్ధి పొందినవి	18	62.748	9
గ్రూప్-3	మెరుగైన ప్రయోజనం పొందినవి	26	33.963	5

- ప్రస్తుతం రాష్ట్రంలో ఎస్సీలకు 15 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్నారు. ఇందులో సామాజికంగా, ఆర్థికంగా, విద్యాపరంగా వెనుకబడిన, పట్టించుకోని షెడ్యూల్ కులాలను గ్రూప్-1 కేటగిరీలోకి చేర్చారు. వారి జనాభా ఎస్సీల్లో 3.288 శాతం ఉండటంతో ఒక శాతం రిజర్వేషన్ అమలు చేయాలని బిల్లులో పేర్కొన్నారు. అదేవిధంగా ఎస్సీల్లో మధ్యస్తంగా లబ్ధి పొందిన షెడ్యూల్ కులాలను గ్రూప్-2 కేటగిరీలో చేర్చారు. వారి జనాభా ఎస్సీల్లో 62.748 శాతం ఉండగా 9% రిజర్వేషన్లు కేటాయించారు. మెరుగైన ప్రయోజనం పొందిన షెడ్యూల్ కులాలను గ్రూప్-3లోకి చేర్చారు. ఎస్సీ జనాభాలో 33.963 శాతం ఉన్న వారికి 5 శాతం రిజర్వేషన్లు కేటాయించారు.
- ఉద్యోగ నియామకాల్లో క్రమపద్ధతిలో అనుసరించేందుకు గ్రూపులవారీగా రోస్టర్ పాయింట్లు నిర్దేశించారు.
- గ్రూప్-1లో నోటిఫై చేసిన, భర్తీ చేయని ఖాళీలను తదుపరి ప్రాధాన్యత గ్రూప్‌లో అంటే గ్రూప్-2లో భర్తీ చేస్తారు. ఇందులో భర్తీ చేయని ఖాళీలను గ్రూప్-3లో భర్తీ చేస్తారు. అన్ని గ్రూపుల్లో తగిన అభ్యర్థులు అందుబాటులో లేకుంటే ఆ పోస్టులను క్యారీఫార్వర్డ్ చేస్తారు.

ఎస్సీ వర్గీకరణ తర్వాత కేటాయించే రోస్టర్ పాయింట్లు ఇవీ..

గ్రూప్	రోస్టర్ పాయింట్లు
గ్రూప్-1	7
గ్రూప్-2	2, 16, 27, 47, 52, 66, 72, 87, 97
గ్రూప్-3	22, 41, 62, 77, 91

సంక్షేమంలో దేశానికే ఆదర్శం తెలంగాణ

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క


మధిరలో విలేకరులతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క. పక్కన వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్

మధిర: సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందని, ఈ విషయంలో అన్ని రాష్ట్రాలూ తెలంగాణ వైపే చూస్తున్నాయని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఆదివారం ఆయన ఖమ్మం జిల్లా మధిరలో విలేకరులతో మాట్లాడుతూ, గత పాలకులు రూ.8 లక్షల కోట్ల అప్పులతో రాష్ట్రాన్ని అప్పగిస్తే, వాటన్నింటినీ తీరుస్తూనే రాష్ట్ర ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నామని చెప్పారు. బీఆర్ఎస్‌హయాంలో సన్నబియ్యం ఇస్తామని హామీ ఇచ్చారే తప్ప అమలు చేయలేదని, పేదలకు రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం పంపిణీ దేశంలో ఎక్కడా జరగడం లేదని తెలిపారు. రాష్ట్రంలో 2.85 కోట్ల మంది లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని వివరించారు. ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ప్రజలను కోరారు. సన్నధాన్యం సాగు చేసే రైతులకు బోనస్ అందించి ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ఇందుకు ఏడాదికి రూ.2,675 కోట్లు, రుణమాఫీకి రూ.21 వేల కోట్లు, రైతుభరోసాకు రూ.18 వేల కోట్లు, వ్యవసాయ పంపుసెట్లకు 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరాకు రూ.12,500 కోట్లు ఖర్చు చేస్తున్నామని వివరించారు. రాష్ట్రంలో ఇప్పటికే 56 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామని, మరో 30 వేల ఉద్యోగాలు భర్తీ చేయబోతున్నామని వివరించారు. నిరుద్యోగుల కోసం రూ.9 వేల కోట్లతో రాజీవ్ యువ వికాసం పేరిట స్వయం ఉపాధి పథకాన్ని చేపట్టినట్టు తెలిపారు. ఈ సమావేశంలో వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, హస్తకళల బోర్డు చైర్మన్ నాయుడు సత్యం తదితరులు పాల్గొన్నారు.

అధిష్టానం హామీ ఇచ్చింది వాస్తవమే..

రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవిపై భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి



చౌటుప్పల్/సాక్షి, హైదరాబాద్: మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి ఇచ్చే విషయమై అధిష్టానం హామీ ఇచ్చిన మాట వాస్తవమేనని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ నూతన పాలకవర్గ ప్రమాణస్వీకార మహోత్సవంలో ఆయన మాట్లాడారు. రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి విషయంలో తమవంతు సహకారం అందిస్తానని తెలిపారు. రాజగోపాల్‌రెడ్డి భువనగిరి లోక్‌సభ స్థానానికి ఇన్‌చార్జిగా ఉండి తనను ఎంపీగా గెలిపించారన్నారు.

ముందు అమిత్‌షాతో క్షమాపణలు చెప్పించండి

అంబేడ్కర్ జయంతికి ఒకరోజు ముందు ఏదో హడావుడి చేసి అంబేడ్కర్ అడుగుజాడల్లోనే బీజేపీ ముందుకెళుతున్నట్టు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తున్నారని చామల కిరణ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం చామల మీడియాతో మాట్లాడుతూ అంబేడ్కర్ విగ్రహాన్ని శుద్ధిచేసి ఫొటో దిగినంత మాత్రాన ప్రజలు బీజేపీని నమ్మే పరిస్థితి లేదన్నారు. నిజంగా కిషన్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే అమిత్‌షాతో క్షమాపణలు చెప్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

బీజేపీ జిమ్మిక్కులు: ఎమ్మెల్సీ బల్మూరి

పార్లమెంటు సాక్షిగా అంబేడ్కర్‌ను అమిత్‌షా అవమానిస్తే ఇక్కడ కిషన్‌రెడ్డి పాలాభిషేకాలు, విగ్రహశుద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ఎద్దేవా చేశారు. బీజేపీ నేతలు ఎన్ని జిమ్మిక్కులు చేసినా అంబేడ్కర్‌ను ఆ పార్టీ అవమానించిన తీరును దేశం మర్చిపోదన్నారు.

మాట తప్పడమే రేవంత్ బ్రాండ్

మాజీ మంత్రి హరీశ్‌రావు


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న హరీశ్‌రావు. చిత్రంలో యాదవరెడ్డి, వంటేరు ప్రతాప్‌రెడ్డి తదితరులు

గజ్వేల్: 'యంగ్ ఇండియా' పాఠశాలలు తన బ్రాండ్ అని ప్రకటించుకుంటున్న సీఎం రేవంత్‌రెడ్డికి ఆ మాట వర్తించదని, మాట తప్పడమే తన బ్రాండ్‌గా ఆయన చెప్పుకోవచ్చని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. ఆదివారం సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో, బీఆర్ఎస్ భారీ బహిరంగ సభకు సంబంధించి సన్నాహక సమావేశం నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన హరీశ్‌రావు మాట్లాడుతూ కేసీఆర్ ఒక్కో విద్యార్థిపై ఏటా రూ.1.20 లక్షలను ప్రభుత్వం తరఫున ఖర్చు చేసి గురుకుల పాఠశాలలు తీసుకొస్తే.. సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం 'యంగ్ ఇండియా' పేరిట పాఠశాలలు తీసుకొస్తూ, ఏటా రూ.1.50 లక్షల ఫీజు, బస్సు ఫీజు చెల్లించాలని సూచిస్తున్నారని విమర్శించారు. చెట్లు నరికితే సామాన్యులపై వాల్టా చట్టాన్ని ప్రయోగించి శిక్షిస్తున్న అధికారులు.. హెచ్‌సీయూ భూముల్లో చెట్లను నరికేసి, నాలుగు జింకల మరణానికి కారణమైన సీఎం రేవంత్‌రెడ్డిపై ఎన్ని కేసులు పెట్టాలో చెప్పాలన్నారు. 400 ఎకరాల భూమిని తాకట్టు పెట్టి రూ.10 వేల కోట్ల అప్పులు తెచ్చి, బ్రోకర్ ఫీజు కింద రూ.170 కోట్ల లంచం చెల్లించారని ఆరోపించారు. చట్టాన్ని ఉల్లంఘించి తప్పులు చేస్తున్న అధికారులు రాబోయే రోజుల్లో జైలుకు వెళ్లక తప్పదని హెచ్చరించారు. ఈ సమావేశంలో వరంగల్ బహిరంగ సభకు సంబంధించిన కరపత్రాలను హరీశ్ ఆవిష్కరించారు. ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎస్సీ వర్గీకరణ ఉత్తర్వులు..
తొలి ప్రతి సీఎంకు

▶ మొదటి పేజీ తరువాయి

ఎస్సీ వర్గీకరణ మంత్రివర్గ ఉపసంఘం చైర్మన్ ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. ఆదివారం సచివాలయంలో కేబినెట్ సబ్ కమిటీ సమావేశమైంది. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కమిటీ వైస్ చైర్మన్, మంత్రి దామోదర రాజనర్సింహ, మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్, ఏకసభ్య కమిషన్‌కు నేతృత్వం వహించిన జస్టిస్ షమీమ్ అక్తర్, ఎస్సీ అభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి ఎన్.శ్రీధర్, న్యాయ కార్యదర్శి తిరుపతి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ఎస్సీ వర్గీకరణ అంశాన్ని నెరవేర్చింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని చెప్పారు. పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ మద్దతుతో వర్గీకరణ ప్రక్రియ వేగంగా పూర్తయిందన్నారు. ఎస్సీ వర్గీకరణలో క్రీమీలేయర్ ప్రవేశపెట్టాలన్న కమిషన్ సిఫార్సును ఉపసంఘం తిరస్కరించిందన్నారు. ఆర్థిక ప్రమాణాల ఆధారంగా ఏ ఉప సమూహాన్ని మినహాయించకుండా సమాన ప్రయోజనాలను నిర్ధారించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. ప్రస్తుతం ఉన్న ఏ ప్రయోజనాలను నీరుగార్చబోమని.. ఎస్సీ వర్గాల హక్కులను కాపాడుతూ న్యాయాన్ని పెంపొందించడానికే వర్గీకరణ రూపొందించామని వివరించారు. 2011 జనాభా లెక్కల ఆధారంగా ఎస్సీలకు ప్రస్తుతం 15% రిజర్వేషన్లు అమల్లో ఉన్నాయని.. రాష్ట్రంలో ఎస్సీ జనాభా దాదాపు 17.5 శాతానికి పెరిగిందన్నారు. 2026లో జనగణన గణాంకాలు అందుబాటులోకి వచ్చాక ఎస్సీ రిజర్వేషన్లను పెంచుతామన్నారు.

క్లుప్తంగా...



శ్రీవారి సేవలో ఏసీజే



జస్టిస్ అనిల్‌కుమార్

తిరుమల శ్రీవారిని ఆదివారం రాష్ట్ర హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (ఏసీజే) జస్టిస్ సుజయ్ పాల్, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జూకంటి అనిల్ కుమార్ దర్శించుకున్నారు. - తిరుమల

జై భీమ్ ర్యాలీ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి జూపల్లి తదితరులు

సాక్షి, హైదరాబాద్: అంబేడ్కర్ జయంతి సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లోని బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు నిర్వహించనున్న జైభీమ్ ర్యాలీ పోస్టర్‌ను ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆవిష్కరించారు. జలసౌధలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవితో కలిసి మంత్రి జూపల్లి పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయాల సాధన కోసమే.. రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. కార్యక్రమంలో అంబేడ్కర్ జయంతి ఉత్సవాల కమిటీ చైర్మన్ మీసాల మల్లేశం, గిరిజన శక్తి రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్ చౌహాన్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలపై 50 ఏళ్ల పోరు

టీఎస్‌యూటీఎఫ్ అధ్యక్షుడు రవి



సాక్షి, హైదరాబాద్: యాభై ఏళ్లుగా ఉపాధ్యాయుల పక్షాన యూటీఎఫ్ అనేక పోరాటాలు చేసిందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చావా రవి అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) 12వ ఆవిర్భావ దినోత్సవం ఆదివారం హైదరాబాద్‌లోని సంఘ కార్యాలయంలో జరిగింది. ఎస్టీఎఫ్ఐ ఉపాధ్యక్షులు మోతుకూరి సంయుక్త.. టీఎస్ యూటీఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ.. ప్రాథమిక పాఠశాల్లో పూర్వ ప్రాథమిక తరగతులను ప్రారంభిస్తేనే ప్రభుత్వ పాఠశాలలకు మనుగడ ఉంటుందని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.వెంకట్ మాట్లాడుతూ, వేసవి సెలవుల్లో ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శులు ఎ.సింహాచలం, ఎ.వెంకటప్ప తదితరులు పాల్గొన్నారు.

స్త్రీనిధి ఎండీగా ఐఏఎస్‌ను నియమించండి

మంత్రులు, పీసీసీ అధ్యక్షుడికి ఉద్యోగుల వినతి

సాక్షి, హైదరాబాద్: స్త్రీనిధి సమాఖ్య మేనేజింగ్ డైరెక్టర్‌గా ఐఏఎస్ అధికారిని నియమించాలని స్త్రీనిధి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.రాము, శంకర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, పీసీసీ అధ్యక్షుడు బి.మహేశ్‌కుమార్‌గౌడ్‌ను ఆది వారం కలిసి వినతిపత్రాలు సమర్పించారు. రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఇటీవల తొలగించిన రిటైర్డ్ ఉద్యోగులను తిరిగి నియమించుకునే ప్రయత్నం జరుగుతోందని ఆందోళన వ్యక్తంచేశారు. స్త్రీనిధి సమాఖ్యలో తొలగించిన విద్యాసాగర్ రెడ్డి తిరిగి ఎండీగా వచ్చేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయని, ఆయన ఉద్యోగాన్ని రెన్యువల్ చేశారనే ప్రచారంతో ఉద్యోగులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని తెలిపారు. రూ.5,400 కోట్ల స్త్రీనిధి సమాఖ్య బాధ్యతలు విద్యాసాగర్‌రెడ్డికి కాకుండా ఐఏ ఎస్ స్థాయి అధికారికి అప్పగించాలని కోరారు.

రాజీవ్ యువ వికాసం గడువు పొడిగించండి

ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటస్వామి

సాక్షి, హైదరాబాద్: రాజీవ్ యువవికాసం గడువును పొడిగించాలని భారత జాతీయ విద్యార్థి సంఘం (ఎన్ఎస్‌యూఐ) కోరింది. ఈ మేరకు ఈ పథకానికి దరఖాస్తు చేసుకునే గడువును మరో 10 రోజుల పాటు పొడిగించాలని కోరుతూ.. ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు యడవల్లి వెంకటస్వామి ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. పథకం కింద దరఖాస్తు చేసుకునేందుకు అవసరమైన ధ్రువపత్రాల జారీలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. పథకం ద్వారా అర్హులందరికీ లబ్ధి జరగాలంటే.. గడువును మరో 10 రోజుల పాటు పొడిగించాలని సీఎంకు విజ్ఞప్తి చేశారు.

ఒక్క కమిషనరూ లేరు..!

రాష్ట్ర సమాచార కమిషన్‌లో ఒక్కరంటే ఒక్క కమిషనరూ లేరా? మరి అప్పీళ్లను సిబ్బంది విచారిస్తారా?.. ఇలాగైతే సమాచార హక్కు చట్టం తెచ్చి ఏం ప్రయోజనం?.. వెంటనే నియామకాలు చేపట్టండి.
- సర్కారుకు హైకోర్టు ఆదేశం

ప్రధాన సమాచార కమిషనర్ పోస్టుకు 40 దర ఖాస్తులు, రాష్ట్ర సమాచార కమిషనర్ పోస్టులకు 273 దరఖాస్తులొచ్చాయి. త్వరలో సమాచార కమిషనర్ల నియామకం కోసం ఎంపిక కమిటీని ఏర్పాటు చేస్తాం. దీని కోసం 4 వారాల గడువు ఇవ్వాలి.
- 2023, ఆగస్టులో హైకోర్టుకు సర్కార్ నివేదన

సమాచార కమిషనర్ల నియామకంలో సర్కార్ మీనమేషాలు
సీఐసీ పదవీ కాలం ముగిసి ఐదేళ్లు
ఒక్క కమిషనర్ కూడా లేక రెండేళ్లు
వినతులు పరిష్కరించే వారు లేక ప్రజల అవస్థలు

సాక్షి, హైదరాబాద్: ఏళ్లు గడుస్తున్నాయి.. ప్రభుత్వాలు మారుతున్నాయి.. కానీ, సమాచార కమిషనర్ల నియామకం మాత్రం జరగడం లేదు. మాకు సమాచారం ఇవ్వడం లేదని ప్రజలు మొరపెట్టుకున్నా పట్టించుకునే నాథుడే లేడు. పాలనలో పారదర్శకంగా వ్యవహరించాల్సిన సర్కార్ సీఐసీ, ఐసీల నియామకంలో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. ప్రధాన కమిషనర్ (సీఐసీ) పోస్టు దాదాపు ఐదేళ్లుగా ఖాళీ. ఒక్క సమాచార కమిషనరూ (ఐసీ) లేక రెండేళ్లు. రాష్ట్రంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచారం అడిగినా సకాలంలో ఇచ్చే వారు కరువయ్యారు. దీనిపై కమిషన్‌ను సంప్రదించడానికి.. జిల్లా కమిటీలు సరిగా లేవు. అప్పీలు చేద్దామంటే రాష్ట్రస్థాయిలో కమిషనే లేదు. ఎందుకు నియమించడం లేదంటే ప్రభుత్వం వద్ద సమాధానం లేదు. పాలన పారదర్శకంగా, జవాబుదారీ తనంతో సాగాలని, ఎలాంటి సమాచారమైనా ప్రజలకు తెలియాలని కేంద్ర ప్రభుత్వం 2005లో సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) తెచ్చింది. అవినీతిని నిరోధించడంలో ఈ చట్టం కీలక భూమిక పోషించాల్సి ఉంది. ఆర్టీఐ దరఖాస్తు చేసిన 30 రోజుల్లోగా సమాచారం ఇవ్వాలని చెబుతున్నా అది ఆశించిన ఫలితాన్నివ్వడం లేదు.

వెంటనే నియామకాలు చేపట్టాలి



కేంద్రం తెచ్చిన సమాచార హక్కు చట్టం ప్రజలకు బ్రహ్మాస్త్రం లాంటిది. అధికారులు జవాబుదారీతనంతో పనిచేసేలా చేస్తుంది. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకునే అధికారం సీఐసీకి ఉంటుంది. అలాంటి సీఐసీ, ఐసీలు లేకపోవడంతో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అర్హులతో వెంటనే నియామకాలు చేపట్టాలి.
- మహ్మద్ గఫార్, న్యాయవాది

రాష్ట్ర కమిషన్.. సెక్షన్ 15(1) కింద ఈ కమిషన్ ఏర్పాటవుతుంది. ఇందులో ఓ ప్రధాన కమిషనర్‌తోపాటు గరిష్ఠంగా 10 మంది కమిషనర్ల వరకు నియమించవచ్చు. సీఎం చైర్ పర్సన్‌గా శాసన సభలో ప్రతిపక్ష నేత, ఓ కేబినెట్ మంత్రి సభ్యులుగా ఉండే కమిటీ సిఫార్సు మేరకు గవర్నర్ వీరిని నియమిస్తారు. కమిషన్‌కు స్వతంత్ర ప్రతిపత్తి ఉంటుంది.

ఎవరు అర్హులు..

1. ప్రజా జీవనంలో సుప్రసిద్ధులై ఉండాలి. విశాలమైన విషయ పరిజ్ఞానం, చట్టం, శాస్త్ర సాంకేతిక రంగాలు, సామాజిక సేవ, జర్నలిజం, ప్రసార మాధ్యమాలు, కార్యనిర్వహణ, పరిపాలనలో అనుభవమున్న వారు ప్రధాన కమిషనర్, కమిషనర్‌గా అర్హులు.
2. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సహా రాజకీయ పార్టీలతో సంబంధమున్న వారు అనర్హులు.
3. ప్రధాన కమిషనర్, కమిషనర్లు నియామకమైన నాటి నుంచి ఐదేళ్లు లేదా వయసు 65 ఏళ్లు వచ్చే వరకు బాధ్యతల్లో కొనసాగుతారు. వీరి పునర్నియామకానికి అవకాశం లేదు. కమిషనర్లకు ప్రధాన కమిషనర్‌గా నియామకం పొందే అర్హత ఉంటుంది. అయితే మొత్తంగా ఐదేళ్లు మించి బాధ్యతల్లో ఉండకూడదు.
4. గవర్నర్ ఉత్తర్వు ద్వారా మాత్రమే వీరిని తొలగించవచ్చు.



కమిషన్‌కు ఎవరు అప్పీల్ చేయొచ్చు...

- ఏదేనీ ప్రభుత్వ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం కింద అడిగిన సమాచారం ఇచ్చేందుకు అధికారి నిరాకరించినప్పుడు..
- నిర్దేశించిన 30 రోజుల్లో సమాచారం ఇవ్వకపోయినా..
- సమాచారం కోసం చెల్లించాల్సిన రుసుము సహేతుకంగా లేదని అనిపిస్తే..
- ఒకవేళ అధికారి తప్పుడు లేదా తప్పుదోవ పట్టించేలా సమాచారం ఇచ్చారని భావిస్తే.. తగిన కారణాలుంటే కమిషన్ నేరుగా విచారణకూ స్వీకరించవచ్చు.

సమాచార కమిషన్‌లో వినతులు ఇలా..

	అప్పీళ్లు	ఫిర్యాదులు	మొత్తం
2017 వరకు (ఉమ్మడి ఏపీసీఐ)	3,991	2,834	6,825
2017 నుంచి 2025 (తెలంగాణ కమిషన్)	29,666	15,534	45,200
మొత్తం	33,657	18,368	52,025
పరిష్కారం	22,218	12,666	34,884
పెండింగ్	11,439	5,702	17,141
పరిష్కార శాతం	66.01	68.95	67.05

నోట్: 2023, ఫిబ్రవరి 24తో చివరి సమాచార కమిషనర్ పదవీ కాలం కూడా ముగిసింది. ఆ తర్వాత ఎలాంటి కేసులు పరిష్కారం కాలేదు.

సంప్రదించండి ఇలా... తెలంగాణ సమాచార కమిషన్, సమాచార హక్కు భవన్, డోర్ నంబర్ 5-4-399, మొజంజాహి మార్కెట్ పక్కన, హైదరాబాద్-500001
ఫోన్: 040-24720240 (ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 వరకు)

బిల్డర్ల సమస్యల పరిష్కారానికి సిద్ధం

- మరో సిలికాన్ వ్యాలీ ఆఫ్ ఆసియాగా హైదరాబాద్
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



మంత్రి ఉత్తమ్‌కు జ్ఞాపికను బహూకరిస్తున్న సైబరాబాద్ బిల్డర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

సాక్షి, హైదరాబాద్: బిల్డర్ల సమస్యలు పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నామని నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ప్రభుత్వంలో బిల్డర్లు ఎప్పటికీ భాగస్వాములుగానే ఉంటారని ఆయన స్పష్టం చేశారు. బిల్డర్లకు ప్రజా ప్రభుత్వం వెన్నుదన్నుగా ఉంటుందని హామీ ఇచ్చారు. హెచ్ఐసీసీ నోవాటెల్ హోటల్‌లో ఆదివారం జరిగిన సైబరాబాద్ బిల్డర్స్ అసోసియేషన్ (సీబీఏ) తొలి వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. హైదరాబాద్ అభివృద్ధి నుంచి ప్రతీ బిల్డర్ ప్రయోజనాన్ని పొందాలని ప్రభుత్వం కోరుకుంటోందని తెలిపారు. హైదరాబాద్ అభివృద్ధికి బిల్డర్లు కృషి చేయాలని సూచించారు. నగరంలో మౌలిక సదుపాయాల కల్పనకు కాంగ్రెస్ పార్టీ ఎంతో చేసిందని, శంషాబాద్ ఎయిర్‌పోర్ట్, ఔటర్‌రింగ్ రోడ్డు, కృష్ణా–గోదావరి జలాల తరలింపు గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే జరిగాయని గుర్తు చేశారు. ప్రస్తుతం ఈ అభివృద్ధిని ప్రభుత్వం మరింత ముందుకు తీసుకెళ్లాలని లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. ప్రజా రవాణా మెట్రో విస్తరణ, మూసీ పునరుజ్జీవం, ఫోర్త్ సిటీ అభివృద్ధి ఇందులో భాగమేనని వివరించారు. హైదరాబాద్ నిర్మాణ రంగంలో అంతర్జాతీయ పెట్టుబడిదారుల ఆసక్తి పెరుగుతోందని వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పెట్టుబడులను మరింత ఆకర్షించేందుకు సరైన, సమర్థవంతమైన పర్యావరణ వ్యవస్థను సృష్టిస్తోందని తెలిపారు. హైదరాబాద్‌ను మరో సిలికాన్ వ్యాలీ ఆఫ్ ఆసియాగా తీర్చిదిద్దుతామని ప్రకటించారు. కార్యక్రమంలో పీఏసీ చైర్మన్ అరికెపూడి గాంధీ, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫ్యూచర్ టెక్ కేంద్రంగా తెలంగాణ

- గ్లోబల్ ఇన్నోవేషన్ ఎకోసిస్టమ్‌గా తీర్చిదిద్దుతాం
- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు
- నేడు క్వాంటం ఫ్రాంటియర్ టెక్ చార్టర్ ప్రారంభం



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రాన్ని భవిష్యత్ సాంకేతికతల కేంద్రంగా మార్చే దిశగా కీలక నిర్ణయాలు తీసుకుంటున్నట్టు ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. సోమవారం వరల్డ్ క్వాంటం డే సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం.. నీతి ఎఫ్‌టిహెచ్ (ఫ్రాంటియర్ టెక్ హబ్) తో కలిసి క్వాంటం ఫ్రాంటియర్ టెక్ చార్టర్‌ను ప్రకటించనున్న సందర్భంగా ఆదివారం మంత్రి ప్రకటన విడుదల చేశారు. తెలంగాణను భవిష్యత్ సాంకేతికతల కేంద్రంగా మార్చే దిశగా ఫ్రాంటియర్ టెక్ చార్టర్ పెద్ద ముందడుగు అని పేర్కొన్నారు. ఫ్రాంటియర్ సాంకేతికతలను ప్రజా సంక్షేమ సాధనాలుగా మార్చడం ద్వారా తెలంగాణను గ్లోబల్ ఇన్నోవేషన్ ఎకో సిస్టమ్‌గా తీర్చిదిద్దుతామని తెలిపారు. ఐక్యరాజ్యసమితి 2025ను అంతర్జాతీయ క్వాంటం సంవత్సరంగా ప్రకటించిన నేపథ్యంలో ఏప్రిల్ 14న (సోమవారం) తెలంగాణ ప్రభుత్వం నీతి ఎఫ్‌టిహెచ్‌తో కలిసి క్వాంటం ఫ్రాంటియర్ టెక్ చార్టర్‌ను ప్రకటించనుందని చెప్పారు. సైబర్ సెక్యూరిటీ, ఆరోగ్యం, ఆర్థిక రంగం, మెటీరియల్ సైన్స్, లాజిస్టిక్స్ వంటి కీలక రంగాల్లో సవాళ్లను పరిష్కరించడానికి క్వాంటం స్కిల్లింగ్, క్వాంటం సెక్యూరిటీపై ఈ చార్టర్ దృష్టి పెడుతుందని వెల్లడించారు. 'క్వాంటం సాంకేతికత భారతదేశానికి ఒక విప్లవాత్మక అవకాశం. ఇది భారతదేశం సాంకేతిక స్వావలంబన, స్థిరమైన అభివృద్ధి దిశగా ముందుకు సాగే మార్గాన్ని వేగవంతం చేస్తుంది' అని నీతి ఆయోగ్ డిస్టింగ్విష్డ్ ఫెలో డాక్టర్ దేబజానీ ఘోష్ మరో ప్రకటనలో పేర్కొన్నారు.

మహి'లా'మణులు!

▶ మొదటి పేజీ తరువాయి

అర్థం అని నివేదించారు. అయితే విచిత్రంగా ఆమె పిటిషన్‌ను నాటి కోర్టు కొట్టివేసింది.

1937 దేశంలో తొలి మహిళా న్యాయమూర్తి (జిల్లా కోర్టు) జస్టిస్ అన్నా చాందీ

1959 హైకోర్టులో న్యాయమూర్తిగా నియమితులైన తొలి మహిళ జస్టిస్ అన్నా చాందీ

1989 సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమితులైన తొలి మహిళ జస్టిస్ ఫాతిమా బీవీ

1991 హైకోర్టు సీజేగా నియమితులైన తొలి మహిళ జస్టిస్ లీలా సేథ్ (హిమాచల్‌ప్రదేశ్ హైకోర్టు)

దేశవ్యాప్తంగా హైకోర్టుల్లో సిట్టింగ్ జడ్జీల్లో మహిళల శాతం

2022లో: 11, 2023లో: 13, 2024లో: 14

ఒక మహిళా న్యాయమూర్తి సగటు పదవీ కాలం: 4.5 ఏళ్లు

మొత్తం సగటుతో పోలిస్తే ఒక ఏడాది తక్కువ

హైకోర్టులో మొత్తం
న్యాయమూర్తుల సంఖ్య: 42
ప్రస్తుతం పనిచేస్తున్న వారు: 30
పురుషులు: 20,
మహిళలు: 10
పనిచేస్తున్న న్యాయమూర్తుల్లో మహిళల శాతం: 33.3

సమాచార హక్కు చట్టం మేరకు మార్చి 24న హైకోర్టు వెల్లడించిన జడ్జీల వివరాలు

కేడర్	ఉండాల్సింది	ఉన్నది	పురుషులు	మహిళలు	ఖాళీలు
జిల్లా జడ్జీలు, స్పెషల్ ఫాస్ట్‌ట్రాక్ కోర్టు జడ్జీలు	224	125	67	58	99
సీనియర్ సివిల్ జడ్జీలు	155	130	62	68	25
జూనియర్ సివిల్ జడ్జీలు	276	185	63	122	91
మొత్తం	655	440	192	248	215



హైకోర్టు జడ్జిగా పదవిని స్వీకరించమని చాలామంది మహిళలను ఆహ్వానించాం. కానీ, వాళ్లంతా నిరాకరించారు. ఇంటి బాధ్యతలున్నాయి, పిల్లవాడు పన్నెండో తరగతి చదువుతున్నాడు.. లాంటి కారణాలు చెప్పి హైకోర్టు జడ్జిగా ఉండటానికి నిరాకరించారని ఒక హైకోర్టు న్యాయమూర్తి నాకు రిపోర్ట్ చేశారు. ఈ విషయాలన్నిటినీ బహిరంగంగా చర్చించలేం.
- 2021లో అప్పటి సీజేఐ జస్టిస్ బోబ్డే



దేశవ్యాప్తంగా 33 శాతం మహిళా న్యాయమూర్తులున్న అతి కొద్ది హైకోర్టుల్లో తెలంగాణ ఒకటి. జిల్లా కోర్టులతో పోలిస్తే హైకోర్టులు, సుప్రీంకోర్టు మహిళల శాతంలో వెనుకబడి ఉన్నాయి. మహిళలను న్యాయమూర్తులుగా మార్చేందుకు బార్ ప్రోత్సాహం మరింత అవసరం.
-జస్టిస్ రాధారాణి



సమాజంలో మహిళలు శక్తిమంతంగా మారితే అది శాంతికి, శ్రేయస్సుకు దారితీస్తుంది. తల్లిగా, భార్యగా, చెల్లిగా, కూతురిగానే కాదు.. న్యాయమూర్తిగా సేవలు అందించడంలోనూ మహిళలు ముందుంటున్నారు.
-జస్టిస్ సూరేపల్లి నందా

హైకోర్టులో మహిళా న్యాయమూర్తులు..

జస్టిస్ మౌషుమి భట్టాచార్య, జస్టిస్ పీ శ్రీసుధ, జస్టిస్ జీ రాధారాణి, జస్టిస్ టి.మాధవీ దేవి, జస్టిస్ సూరేపల్లి నందా, జస్టిస్ జువ్వాడీ శ్రీదేవి, జస్టిస్ ఎంజీ ప్రియదర్శిని, జస్టిస్ సుజన కళాసికం, జస్టిస్ రేణుక యారా, జస్టిస్ తిరుమలాదేవి

న్యాయ విద్యలో రాణిస్తున్నారు



న్యాయ వ్యవస్థలో న్యాయమూర్తులుగా ఎంతో మంది మహిళలు న్యాయం అందిస్తున్నారు. రాష్ట్రంలో 56 శాతం మహిళలు ఉండటం శుభపరిణామం. హైకోర్టు, సుప్రీంకోర్టుల్లోనూ ఈ స్థాయికి చేరాలని అభిలషిస్తున్నా. న్యాయ విద్యతో మహిళలు తమ హక్కులు తెలుసుకోగలుగుతారు. న్యాయ విద్యతో ఎన్నో ఉపాధి అవకాశాలున్నాయి. మహిళా స్త్రీ శిశు సంక్షేమ శాఖలోనూ ప్రత్యేక పోస్టులుంటాయ్. మహిళలు న్యాయవ్యవస్థలో మరింత రాణించాలి.
-సాయి రమాదేవి, సిద్దిపేట జిల్లా ప్రధాన న్యాయమూర్తి

ఇప్పటికే ఆలస్యమైంది. మనకు దేశంలో స్త్రీ, పురుష నిష్పత్తి 50:50 ఉంటే న్యాయవ్యవస్థలో కూడా ఈ నిష్పత్తి ప్రతిబింబించాలి. లింగ సమానత్వం ఉండాలి. ఈ సమస్యపై ఎప్పుడో పోరాటం జరగాల్సింది. అలా జరిగి ఉంటే ఈపాటికి మహిళా న్యాయమూర్తుల సంఖ్య పెరిగి ఉండేది.
-శోభా గుప్త, లాయర్

జడ్జిల నియామకాలు ఇలా 'సాక్షి ప్లస్'లో

రెండు నెలలుగా జీతాల్లేవ్!

కాంట్రాక్టు ఎస్‌జీటీలుగా నియమితులైన 2008 డీఎస్సీ అర్హులకు అందని వేతనాలు



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: 2008 డీఎస్సీ అర్హుల్లో 1,382 మందికి ప్రభుత్వం ఈ ఏడాది ఫిబ్రవరి 15న కాంట్రాక్టు ప్రాతిపదికన ఎస్‌జీటీలుగా ఉద్యోగాలు ఇచ్చింది. వారికి నెలకు రూ. 31,040 గౌరవ వేతనంగా నిర్ణయించింది. ఇంతకాలం ప్రైవేటు వృత్తుల్లో చాలీచాలని వేతనాలకు పనిచేస్తూ కుటుంబాలను నెట్టుకొచ్చిన వారంతా 17 ఏళ్ల తర్వాత ఎస్‌జీటీలుగా సంతోషంగా చేరారు. కానీ ఉద్యోగంలో చేరి రెండు నెలలవుతున్నా వారికి ఇప్పటికీ వేతనం అందలేదు. జీతాల గురించి ఏ అధికారిని అడిగినా సరైన స్పందన లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రాలేదని జిల్లా విద్యాశాఖ కార్యాలయ అధికారులు చెబుతున్నారు. వారికి వెంటనే వేతనాలు విడుదల చేయాలని పాఠశాల విద్య సంచాలకులకు వినతిపత్రం అందించామని టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు అనిల్‌కుమార్, తిరుపతి 'సాక్షి'కి తెలిపారు.

ప్రతినెలా 5లోగానే వచ్చేవి.. ఈసారి 13 దాటినా రాలేదు!

హోంగార్డులకు ఇంకా అందని వేతనాలు



సాక్షి ప్రతినిధి, కరీంనగర్: రాష్ట్రంలోని హోంగార్డులకు ఈ నెల 13వ తేదీ దాటినా ఇంకా వేతనాలు అందలేదు. దీంతో వారు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాస్తవానికి ప్రతి నెలా 5వ తేదీలోగానే వారికి వేతనాలు అందేవి. కానీ ఈసారి ఇంకా బ్యాంకు ఖాతాల్లో జమకాలేదు. అందుకుగల కారణాలను ప్రభుత్వం వెల్లడించలేదు. తెలంగాణలో ప్రస్తుతం సుమారు 16 వేల మంది హోంగార్డులు పనిచేస్తున్నారు. బందోబస్తు డ్యూటీలు, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, సభలు, సమావేశాలు, ఎన్నికల విధుల్లో పోలీసులతో సమానంగా వారు విధులు నిర్వహిస్తున్నారు. అయినప్పటికీ ప్రభుత్వం హోంగార్డులను రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించట్లేదు. టీఏ, డీఏ, హెచ్ఆర్ఏలతోపాటు యూనిఫాం అలవెన్స్ సైతం ఇవ్వట్లేదు. రిటైరైనా ఎలాంటి ఆర్థిక ప్రయోజనాలు కల్పించట్లేదు. ప్రభుత్వం ఇటీవల హోంగార్డులకు హెల్త్‌కార్డులు ఇస్తామని ప్రకటించినా ఆ ప్రక్రియ ఇంకా అమలుకు నోచుకోలేదు. మరోవైపు ఏపీలో పనిచేస్తున్న సుమారు 15 వేల మంది హోంగార్డులకు సైతం ఈ నెల ఇంకా వేతనాలు అందకపోవడం గమనార్హం.

వెళ్లొస్తాం లింగమయ్యా.. ముగిసిన సలేశ్వరం ఉత్సవాలు



సలేశ్వరం యాత్రలో భక్తులు

అచ్చంపేట: తెలంగాణ అమర్‌నాథ్ యాత్రగా పేరుగాంచిన సలేశ్వరం లింగమయ్య క్షేత్రం ఉత్సవాలు ఆదివారం ముగిశాయి. ఉత్సవాల నిర్వహణకు అటవీశాఖ మూడు రోజుల పాటు అనుమతి ఇవ్వగా.. మొదటి రోజు నుంచే భక్తులు పోటెత్తారు. మూడు రోజుల్లో రెండు లక్షలకు పైగా భక్తులు దర్శనం చేసుకున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. గతేడాదితో పోలిస్తే ఈసారి భక్తుల సంఖ్య భారీగా పెరిగింది. మూడు రోజులు సెలవులు రావడంతో శని, ఆదివారాల్లో భారీగా తరలి వచ్చారు. వేల సంఖ్యలో వాహనాలు అటవీ మార్గంలో బారులు తీరడంతో.. ట్రాఫిక్ నియంత్రించలేక పోలీస్, అటవీ శాఖ ఒక దశలో చేతులెత్తేశాయి. అటవీ ప్రాంతంలో ఇష్టం వచ్చినట్లు.. ఎక్కడ పడితే అక్కడ వాహనాలను పార్కింగ్ చేయడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనాల్సి వచ్చింది. ఎత్తయిన కొండలు, లోయల మధ్య ఉన్న లింగమయ్య స్వామిని దర్శించుకునేందుకు తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు వచ్చారు. దర్శనానంతరం తిరిగి వెళ్తున్నప్పుడు 'వెళ్లొస్తాం లింగమయ్యా..' అంటూ భక్తులు చేసిన నినాదాలతో నల్లమల అభయారణ్యం మార్మోగింది.

టీచర్ల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తాం

- ఎస్‌జీటీయూ అధ్యక్షుడు కరివేదన మహిపాల్‌రెడ్డి
- ఇందిరా పార్క్ వద్ద ఎస్‌జీటీల భారీ ధర్నా



కవాడిగూడ: ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల టీచర్ల సమస్యలను పరిష్కరించాలని సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయ సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. సెకండరీ గ్రేడ్ టీచర్లకు పదోన్నతులు కల్పించి 10 వేల హెచ్ఎం పోస్టులను భర్తీ చేయాలని కోరింది. సమస్యల సాధన కోసం ఆదివారం ఇందిరా పార్క్ వద్ద ఉపాధ్యాయ సంఘం పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కరివేదన మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ, ఉపాధ్యాయుల ఆత్మగౌరవం కోసం రాజీలేని పోరాటం చేస్తామన్నారు. పెండింగ్ డీఏలు, బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. పీఆర్‌సీపై ప్రకటన చేయాలని కోరారు. ప్రాథమిక స్కూళ్లలో పనిచేసే టీచర్లకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ విధానం రద్దు చేసి, ఓపీఎస్ విధానం తేవాలని, 317 జీవో ద్వారా తలెత్తిన సమస్యలను పరిష్కరించాలని, మెరుగైన వైద్య విధానంతో కూడిన ఈహెచ్ఎస్‌ను అమలు చేయాలని, జీవో 2, 3, 9 ద్వారా పండిత ప్రమోషన్లలో నష్టపోయిన ఎస్‌జీటీలకు న్యాయం చేయాలని ఆయన కోరారు. ఉపాధ్యాయ సమస్యలపై పోరాటంలో తమ సంఘం ముందుంటుందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరికెల వెంకటేశం అన్నారు. టీచర్ల సమస్యలు పరిష్కరిస్తామని ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు.



స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావాలను బోధించే మతాన్ని నేను ఇష్టపడతాను.
– బి.ఆర్. అంబేడ్కర్

సాక్షి
సోమవారం, 14 ఏప్రిల్ 2025

లాంగ్‌లిస్ట్‌లూ... షార్ట్‌లిస్ట్‌లూ....

ఆంధ్రప్రదేశ్‌లో వందల ఉగాది పురస్కారాల హడావిడిలో రచయితలు ఉండగా, తెలంగాణలో కంచ గచ్చిబౌలి స్థలాలకు సంబంధించి తమ పర్యావరణ స్పృహను సోషల్ మీడియా పోస్టులతో వెల్లడించే పనిలో సాహితీకారులు ఉండగా దేశాన కొన్ని ఆసక్తికరమైన సాహితీ ఘటనలు చోటు చేసుకున్నాయి. తన మానాన తానుంటూ తన రాతేదో తాను రాసుకుంటూ వచ్చిన హిందీ కవి వినోద్ కుమార్ శుక్లాకు జ్ఞానపీఠ పురస్కారం ప్రకటించడం వాటిలో ఒకటి. ఆయన సీదాసాదా మనిషి. రచనల శీర్షికలు కూడా బహు సరళంగా ఉంటాయి. 'పనివాడి అంగీ'... 'గోడలో ఒక కిటికీ ఉండేది'... వినోద్ కుమార్ శుక్లా మొదట రచ్చ గెలిచారు. ప్రతిష్ఠాత్మకమైన 'పెన్ నబకోవ్ అవార్డ్'ను 2023 సంవత్సరానికి గెలుచుకున్నారు. ఆ అవార్డు పొందిన ఏకైక భారతీయ కవి ఆయనే. కాబట్టి విలువైన ఆయన సాహిత్యానికి సర్వోత్కృష్ట జ్ఞానపీఠం దక్కడం అందరూ హర్షించారు. శుక్లా గారితో పోటీ పడినవారిలో ఒక తెలుగు పేరు ఉంది. జ్ఞానపీఠ్ షార్ట్‌లిస్టులో తెలుగు పేరు ఉండటం ఘనతే. రావూరి భరద్వాజ తర్వాత తాము జ్ఞానపీఠ పురస్కారానికి యోగ్యులమని భావిస్తున్నవారు ఉన్నారు. అయితే అలా యోగ్యులమని అనుకునేవారిలో కొందరి పేర్లు హడలిచచ్చేలా ఉన్నాయనే గిట్టనివారూ ఉన్నారు.

భారతదేశంలో స్థానికంగా గాని, జాతీయస్థాయిలో గాని షార్ట్‌లిస్టులలో పేరు చేరేవారు కొందరైతే చేర్పించుకునేవారు కొందరు. 'సాహిత్య అకాడెమీ అవార్డు' షార్ట్‌లిస్టుల్లో చేర్చబడ్డాయేమో అనిపించేలా కొన్ని పేర్లు చూసి ఆకలిదప్పులు మాని మంచం పట్టే సాహిత్యాభిమానులు ఉన్నారు. ప్రతిఏటా ఈ షార్ట్‌లిస్ట్ వీరి పాలిట ప్రాణాంతకంగా మారడం ఆందోళనకరం. అయితే అంతర్జాతీయ స్థాయిలో ఇలా చేర్పించుకోవడం సాధ్యం కాదు. అందుకే కన్నడ నేలన ఇప్పుడు సంబరాలు సాగుతున్నాయి. కారణం 'ఇంటర్నేషనల్ బుకర్ ప్రైజ్ 2025' షార్ట్‌లిస్ట్‌లో మొదటిసారి కన్నడ పుస్తకానికి చోటు దక్కింది. సీనియర్ కన్నడ రచయిత్రి బాను ముష్తాక్ రాసిన కథాసంపుటి 'హార్ట్ ల్యాంప్' ఈ షార్ట్‌లిస్టులో ఉంది. యాక్టివిస్ట్‌గా ఉంటూ దళిత, మైనార్టీ మహిళా జీవితాలను ఎక్కువగా రాసే బాను ముష్తాక్ పుస్తకంతో పాటు కేవలం 6 పుస్తకాలతో ఉన్న షార్ట్‌లిస్ట్ నుంచి మే 20న విజేతను ప్రకటిస్తారు. 50 లక్షల రూపాయల బహుమతి ఉంటుంది. అదొక్కటే కాదు ఆ నవల ప్రపంచవ్యాప్తంగా పాఠకులకు చేరువవుతుంది. బాను ముష్తాక్ గెలిస్తే కన్నడ భాష ఘనతకు మరో నిదర్శనమవుతుంది. ఇలాగే 2022లో 'రేత్ కీ సమాధి' నవల ఇంగ్లిష్ అనువాదం 'టూంబ్ ఆఫ్ శాండ్'కు గీతాంజలిశ్రీ బుకర్‌ప్రైజ్ గెలుచుకున్నారు. అప్పుడుగాని ఇప్పుడుగాని తెలుగు నవల, కథ ఈ దారుల్లోకి రాకపోవడం మన వరకూ ఘనతే.

ప్రపంచ దేశాలలో తెలుగు రాష్ట్రాలలో ఒక జిల్లా అంత ఉన్నవారు, హైదరాబాద్ జనాభా అంత సంఖ్యలో భాషను మాట్లాడేవారు, మన దేశంలో పదేళ్ల కాలంలో కేవలం యాక్సిడెంట్లలో మరణించేంతమంది మాత్రమే రాసే, చదివే భాష ఉన్నవారు కూడా అంతర్జాతీయస్థాయి అవార్డుల లాంగ్‌లిస్టులలో, షార్ట్‌లిస్టులలో కనిపిస్తారు. రెండు కోట్ల మంది జనాభా ఉన్న శ్రీలంక నుంచి ఎందరో అంతర్జాతీయ స్థాయి రచయితలు ఉన్నారు. పది కోట్ల తెలుగు జనాభా నుంచి అంతర్జాతీయ అవార్డుల సంగతి అటుంచి పెంగ్విన్ వంటి ప్రసిద్ధ పబ్లిషర్ల వరకూ చేరే రచనలు ఎన్ని... రచయితలు ఎందరు?

'ఇంటర్నేషనల్ బుకర్ ప్రైజ్ 2025' కోసం 12 దేశాల నుంచి 13 మంది రచయితల పుస్తకాలు లాంగ్‌లిస్ట్ అయ్యాయి. విశేషం ఏమిటంటే వీరంతా మొదటిసారి నామినేట్ అయినవారు. బోణి కొట్టి తమ ఉనికి చాటినవారు. వీరి నుంచి ఆరు మందితో షార్ట్‌లిస్ట్‌ను ప్రకటించారు. ఆ షార్ట్‌లిస్ట్‌లో కన్నడ నుంచి బాను ముష్తాక్ ఉన్నారు. షార్ట్‌లిస్ట్‌ను ప్రకటిస్తూ బుకర్ ప్రైజ్ కమిటి యు.కె.కు చెందిన ట్రాన్స్‌లేటర్ సోఫీ హ్యూస్‌ను ప్రత్యేకంగా ప్రశంసించింది. ఆమె అనువాదం చేసిన రచనలు ఇప్పటికి ఐదుసార్లు లాంగ్‌లిస్ట్‌లో మూడుసార్లు షార్ట్‌లిస్ట్‌లో వచ్చాయి. ఇది రికార్డు. ఇక్కడే తెలుగు వారి ఘనత ఉంది. తెలుగు పుస్తకాలు గతంలో కాని వర్తమానంలోగాని ఇంగ్లిష్‌లో గట్టిగా అనువాదం చేసేవారి సంఖ్య చేతి వేళ్లకు మించి లేకపోవడమే ఆ ఘనత. విదేశాలకు లక్షలమంది తెలుగువారు పైచదువులకు వెళ్లినా వారిలో సాంకేతిక విద్య, దాని వల్ల వచ్చే సంపద లక్ష్యంగా కనిపిస్తుంది గాని లింగ్విస్టిక్స్ చదవడం, ఇతర భాషలు నేర్చి తెలుగు సాహిత్యాన్ని అనువాదం చేయడం అనేదే లేదు. మిగిలిన భాషల వారు ఈ పని చేస్తున్నారు. ప్రపంచ భాషలు నేర్చి తమ సాహిత్యానికి వాహకులుగా మారుతున్నారు. సోఫీ హ్యూస్‌లాంటి వారు మనలో తయారవ్వాలి లేదా మన కోసం రావాలి.

సిఫార్సులు, పైరవీలు లేకుండా... గ్రూపులూ గుంపులూ కట్టకుండా మంచి సాహిత్యం కోసం కృషిని లగ్నం చేసిన తెలుగు రచయితలు ఉన్నారు. ప్రపంచం దృష్టికి వెళ్లాల్సిన రచనలు వీరివి కొద్దిగా అయినా సరే ఉన్నాయి. స్థానిక రాజకీయాలకు ఎడంగా జరిగి దేశీయంగా, అంతర్జాతీయ స్థాయిలో మనమేంటి, మనమెక్కడ అనే ఆలోచనతో సాహితీ పరివారం మేలుకోవాల్సిన తరుణం ఇది. రచయితలు, అనువాదకులు, పబ్లిషర్లు, యూనివర్సిటీలు... దండు కట్టి దృష్టి పెట్టగలిగితే నేడు కన్నడ సీమలో జరుగుతున్న సంబరాలు తెలుగులో జరక్కపోవు. షార్ట్‌లిస్టులలో చేరాల్సిన వారి గురించి పట్టకపోతే చేర్చబడేవారే మన ప్రతినిధులుగా కాన వస్తారు.

ప్రస్తుతానికి లక్ష్యం క్రోసులకొద్ది దూరం. మొదటి అడుగు పడితే గమ్యం ఎంతసేపని?

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, చైత్ర మాసం, **తిథి:** బ.పాడ్యమి ఉ.6.24 వరకు, తదుపరి విదియ, **నక్షత్రం:** స్వాతి రా.10.17 వరకు, తదుపరి విశాఖ, **వర్జ్యం:** తె.4.30 నుండి 6.14 వరకు (తెల్లవారితే మంగళవారం), **దుర్ముహూర్తం:** ప.12.23 నుండి 1.14 వరకు, తదుపరి ప.2.54 నుండి 3.43 వరకు, **అమృతఘడియలు:** ప.12.32 నుండి 2.20 వరకు

సూర్యోదయం : 5.49
సూర్యాస్తమయం : 6.10
రాహుకాలం : ఉ.7.30 నుండి 9.00 వరకు
యమగండం : ఉ.10.30 నుండి 12.00 వరకు

దూరదృష్టి గల సంస్కర్త

సందర్భం



రాజ్‌నాథ్ సింగ్

భారతదేశపు గొప్ప దార్శనికులలో ఒకరైన డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ 135వ జయంతి ఈ రోజు. ఆయన వారసత్వాన్ని తక్కువ చేసి చూపించడానికి ఉద్దేశపూర్వకంగా అవాంఛనీయ ప్రయత్నాలెన్నో జరిగాయి. శతాబ్దం గడచిన తర్వాత కూడా, అంబేడ్కర్ అంటే కేవలం ఒక దళిత నాయకుడిగా పరిగణించడం శోచనీయం. ఆయనను దళితులు, అణగారిన వర్గాల ప్రతినిధిగా మాత్రమే కాకుండా, ఆధునిక భారత దేశపు అగ్రశ్రేణి మేధావుల్లో ఒకరిగా పరిగణించాలన్నది అత్యావశ్యం.

చదువుకునే రోజుల్లో పిల్లలంతా తాగే సాధారణ కుళాయి నుంచి నీళ్లు తాగడానికి కూడా ఆయనను అనుమతించేవారు కాదు. ఒకసారి మండు వేసవిలో దాహం తట్టుకోలేక దగ్గర్లో ఉన్న కుళాయి నుంచి నీళ్లు తాగడానికి ప్రయత్నిస్తే... కట్టుబాట్లు ఉల్లంఘించారనే కారణంతో ఆయన మీద దాడికి తెగబడ్డారు. ఆ సంఘటన తరువాత చాలామంది తమ రాత ఇంతే అని సరిపెట్టుకుని ఉండేవారు. మరి కొందరైతే హింసా మార్గాన్ని ఎంచుకుని ఉండేవారు. కానీ, ఆయన అలా చేయలేదు. తనలోని బాధను గుండెల్లోనే అదిమిపెట్టుకుని జీవితాన్ని చదవడం నేర్చుకున్నారు. కొలంబియా, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో డిగ్రీలతో సహా ఎంఏ, ఎంఎస్సీ, పీహెచ్డీ, డీఎస్సీ, డీలిట్, బార్–ఎట్–లా పూర్తి చేశారు. ఏ పాఠశాలల్లో అయితే తనను చదువుకోవడానికి అనుమతించలేదో... అంతకు మించిన స్థాయిలో విదేశాల్లో విద్యను పూర్తి చేసి తానేమిటో సమాజానికి చూపించారు. అయినా తన మాతృభూమి, కర్మభూమి అయిన భారతదేశానికి తిరిగి వచ్చే విషయంలో స్పష్టమైన వైఖరితో ఉండేవారు.

పేరెన్నికగన్న సంస్థల ఏర్పాటులో అంబేడ్కర్ పాత్ర విస్మరించలేనిది. ఆధునిక భారతదేశంలో ఆర్బీఐ, సెంట్రల్ వాటర్ కమిషన్ వంటి అనేక సంస్థలు బాబాసాహెబ్ దూరదృష్టితో పురుడు పోసుకున్నవే. ఆర్థికశాస్త్రం, ఆర్థిక చరిత్రపై తన ప్రావీణ్యంతో భారత్ ఎదుర్కొంటున్న ద్రవ్య సమస్యలను ఆధారాలతో సహా 'రాయల్ కమిషన్ ఆన్ ఇండియన్ కరెన్సీ అండ్ ఫైనాన్స్'కు విశ్లేషణాత్మకంగా వివరించారు. ఫలితంగా ఒక సెంట్రల్ బ్యాంక్‌గా విధులను నిర్వర్తించే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏర్పాటుకు పునాది పడింది.

గట్టి ప్రజాస్వామ్యవాది

అంబేడ్కర్ దృఢమైన ప్రజాస్వామ్యవాది. భారత దేశపు భవిష్యత్తు, దాని ప్రజాస్వామ్యం, కష్టపడి సంపాదించిన స్వాతంత్ర్యం గురించే ఆయన ఎక్కువగా ఆలోచించేవారు. రాజ్యాంగ సభలో ఆయన చివరి ప్రసంగంలో ఈ భయాందోళనలు సుస్పష్టంగా వ్యక్తమయ్యాయి. ఆయన హెచ్చరికలే భారతదేశాన్ని దాదాపు ఎనిమిది దశాబ్దాలుగా ప్రజాస్వామ్య మార్గంలో నడిపిస్తున్నాయి. అయితే నేడు కులం, మతం, జాతి, భాష మొదలైన సామాజిక విభేదాలతో భారతీయుల మధ్య సోదరభావాన్ని తగ్గించే ప్రయత్నాలను చూస్తున్నాం.



నేడు బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ జయంతి

> శతాబ్దం గడచిన తర్వాత కూడా, అంబేడ్కర్‌ను కేవలం ఒక దళిత నాయకుడిగా పరిగణించడం శోచనీయం. బాబాసాహెబ్... భారత దేశానికి దేవుడిచ్చిన వరం. ప్రపంచానికి భారతదేశమిచ్చిన బహుమతి.

ఆర్య–ద్రావిడ విభజన నుంచి ఎక్కువ ప్రయోజనం పొందగలిగే సమయంలో కూడా ఆర్య దండయాత్ర సిద్ధాంతాన్ని అంబేడ్కర్ తప్పు పట్టారు. 'ఒక తెగ లేదా కుటుంబం జాతిపరంగా ఆర్యులా లేదా ద్రావిడులా అనేది విదేశీ వ్యక్తులొచ్చి విభజన రేఖ గీసేవరకు భారత ప్రజల మదిలో ఇలాంటి ఆలోచనలు తలెత్తలే'దని 1918లో ప్రచురించిన ఒక పత్రికా వ్యాసంలో పేర్కొన్నారు. పైగా యజుర్వేద, అధర్వణ వేదాల్లోని రుషులు శూద్రులకు తగిన ప్రాధాన్యమిచ్చిన అనేక సందర్భాలను ఉదాహరించారు. ఆర్యులు, ద్రవిడుల కంటే అంటరానివారు జాతిపరంగా భిన్నమైనవారనే సిద్ధాంతాన్ని కూడా ఆయన తోసిపుచ్చారు.

తమ సంకుచిత, మతపరమైన ప్రయోజనాల కోసం భాషా సమస్యలను సాకుగా చూపించేవారు దేశ ఐక్యత విషయంలో అంబేడ్కర్ అభిప్రాయాలను తెలుసుకుంటే ఎంతో ప్రయోజనం పొందుతారు. తాను ప్రావీణ్యం సంపాదించిన తొమ్మిది భాషలలో ఒకటైన సంస్కృతాన్ని అధికారిక భాషగా ఆమోదించడానికి మద్దతుగా 1949 సెప్టెంబరు 10న ఆయన రాజ్యాంగ సభలో ఒక సవరణను ప్రవేశపెట్టారు. భాషా ప్రయుక్త రాష్ట్రాలపై తన ఆలోచనలు వెల్లడిస్తూ... 'హిందీని తమ భాషగా స్వీకరించడం భారతీయులందరి విధి' అని ప్రకటించారు. హిందీ మాట్లాడే ప్రాంతానికి చెందిన వ్యక్తి కాకపోయినప్పటికీ, దేశ ప్రాధాన్యాలకు ప్రథమ స్థానమిచ్చా రన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి.

ఆయన దార్శనికతకు అనుగుణంగా...

'ప్రజాస్వామ్యం విజయవంతంగా సాగడానికి అనుసరించాల్సిన పద్ధతుల'పై 1952 డిసెంబర్ 22న ఒక ప్రసంగమిస్తూ... ప్రజాస్వామ్యం రూపం, ఉద్దేశం కాలక్రమేణా మారుతాయనీ, ప్రజలకు సంక్షేమాన్ని అందించడమే ఆధునిక ప్రజాస్వామ్యపు లక్ష్యమనీ పేర్కొన్నారు. ఈ దార్శనికతతోనే మా ప్రభుత్వం గత పదేళ్లలో 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటకు తీసుకురావడంలో విజయం సాధించింది. 16 కోట్ల గృహాలకు కుళాయి నీటిని అందించడానికి కృషి చేశాం. పేద కుటుంబాల కోసం 5 కోట్ల ఇళ్లను నిర్మించాం. 2023లో 'జన్ మన్ అభియాన్'ను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీజీ ప్రారంభించారు. బలహీన గిరిజన వర్గాల (పీవీటీజీ) సామాజిక–ఆర్థిక పరిస్థితులను మెరుగుపరచడం, పీవీటీజీ గృహాలు–ఆవాసాలకు ప్రాథమిక సౌకర్యాలు కల్పించడం దీని లక్ష్యం.

ప్రధాన మంత్రి 2047 నాటికి 'వికసిత్ భారత్' లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు. ఇది బాబాసాహెబ్ దార్శనికతకు అనుగుణంగా ఉంటుంది. అంతేకాదు, బాబాసాహెబ్ వారసత్వం, రచనల గురించి భవిష్యత్ తరాలకు మరింతగా తెలియజెప్పడానికి, మా ప్రభుత్వం పంచతీర్థాన్ని అభివృద్ధి చేసింది. అంబేడ్కర్‌తో ముడిపడిన మహూ (మధ్యప్రదేశ్); నాగపూర్ (మహారాష్ట్ర) లోని దీక్షా భూమి; లండన్‌లోని డాక్టర్ అంబేడ్కర్ మెమోరియల్ హోమ్; అలీపూర్ రోడ్ (ఢిల్లీ) లోని మహాపరినిర్వాణ భూమి, మరియు ముంబయి (మహారాష్ట్ర) లోని చైత్య భూమిలే ఆ పంచ తీర్థాలు.

గత నెలలో ప్రధాని దీక్షాభూమిని సందర్శించినప్పుడు, బాబాసాహెబ్ ఊహించిన భారతదేశాన్ని సాకారం చేయడానికి మరింత కష్టించి పనిచేయాలన్న ప్రభుత్వ నిబద్ధతను పునరుద్ఘాటించారు. అంబేడ్కర్ ఆదర్శాలకు అనుగుణంగా నడుచుకుంటామంటూ ప్రతిజ్ఞ చేసే అవకాశాన్ని ఆయన జయంతి కల్పిస్తోంది. జాతి, మత, ప్రాంత, కులాలకు అతీతంగా మనమంతా 'భారతీయులు'గా సాగిపోదాం. ఆయన్ని ఏదో ఒక ప్రాంతానికి పరిమితమైన నాయకుడిగా చేసే ప్రయత్నాలను అడ్డుకోవాలి. ఒక సందర్భంలో సైమన్ కమిషన్ ఆధారాల గురించి అడిగితే... ప్రాంతీయ దురభిమానమూ, సమూహ భావనలకూ లోనయ్యే ప్రమాదముందని హెచ్చరిస్తూ, 'మనమెప్పుడూ భారతీయులమే' అన్న చైతన్యాన్ని ప్రజల్లో కలిగించడం అత్యవశ్యమని చెప్పారు. బాబాసాహెబ్... భారతదేశానికి దేవుడిచ్చిన వరం. ప్రపంచానికి భారతదేశమిచ్చిన బహుమతి. అప్పటి బ్రిటిష్ ఇండియా గానీ, నవ స్వతంత్ర భారతం గానీ ఇవ్వని గౌరవ పీఠాన్ని మనం ఆయనకిద్దాం.

వ్యాసకర్త భారత రక్షణ మంత్రి

జ్ఞాన ప్రభాసితుడు



డా॥ కత్తి పద్మారావు

డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ ప్రపంచ దార్శనికుడిగా ఇప్పుడు నివాళులు అందుకుంటున్నారు. ఆయనది విశ్వజనీన భావన. సామ్రాజ్యవాద, పెట్టుబడిదారీ, మతాధిపత్య భావనలతో ప్రపంచం అట్టుడుకుతున్న తరుణంలో ఆయన సిద్ధాంతం ఒక జీవౌషధంగా ముందుకొచ్చింది.

కొందరు వ్యక్తుల మానసిక వ్యవస్థల్లోని రుగ్మతలను తొలగించడానికి ప్రయత్నిస్తే, కొందరు సమాజంలో ఉన్న రుగ్మతలను తొలగించడానికి కృషి చేస్తారు. అందుకు సామాజిక, ఆర్థిక, రాజకీయ శాస్త్రాల అధ్యయనం అవసరం. భారతదేశంలో కులం చట్రం నుండి బయటకు రాలేక చాలామంది దేశ నాయకులు, ప్రపంచ మేధావులు కాలేకపోయారు. కానీ అంబేడ్కర్ బహుముఖ ప్రజ్ఞాశాలిగా ప్రభాసించడానికి కారణం ఆయన నిరంతర అధ్యయనం. విద్య ద్వారా ఇంతగా రాణించినవారు మరొకరు లేరు. తన అధ్యయనం నుండి మహా మహోపాధ్యాయుడిగా ఎదిగారు. అనేక సందర్భాల్లో ఆయనకు ఎదురు వాదించిన మహాత్మా గాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ సైతం భారత రాజ్యాంగ నిర్మాణం విషయంలో ఆయన్ను అభినందించక తప్పలేదు.

ఒక తాత్త్వికుడు, ఒక మేధావి అనేక వైవిధ్యాలను సమన్వయించగలడు. అంబేడ్కర్ ప్రపంచ తత్త్వవేత్తలందరినీ అధ్యయనం చేశారు. గ్రీకు ఫిలాసఫీలో ముఖ్యంగా సోక్రటీస్ ప్రశ్న ఆయన్ను ఆకర్షించింది. ప్లేటో ఆదర్శ రాజ్య భావన నిర్మాణ దక్షతలను ఆయన స్వీకరించారు. ఇమ్మానుయేల్ కాంట్, హెగెల్, బెర్‌ట్రాండ్ రసెల్, నీషే, రూసోలను లోతుగా చదివారు. భారతీయ దర్శనీయాలైన బౌద్ధ దర్శనంలో క్రీ.పూ. 6వ శతాబ్దినాడే గతితర్కం ఉందని నిరూపించారు. కార్ల్ మార్క్స్ సిద్ధాంతాలను లోతుగా చదివి దుఃఖ నివారణను మొదట చెప్పింది బౌద్ధ తత్త్వశాస్త్రమే అన్నారు. మార్క్స్ చెప్పిన సూత్రాలన్నీ బుద్ధిజంలో వున్నాయి. వేదాల దగ్గర నుండి ప్రారంభించి సంస్కృత సాహిత్యాన్ని మొత్తం చదివేశారు. ఏదో తెలుసుకోవడానికి చదవలేదు. శూద్రుల్ని, అస్పృశ్యుల్ని ఎలా అణగదొక్కారో నిరూపించడానికి చదివారు.

నడుస్తున్న చరిత్ర...

ఈ రోజున అంబేడ్కర్ భావజాలంతోనే భారతదేశ చరిత్ర నడుస్తోంది. నిరంకుశత్వాన్ని ఏ రూపంలో వున్నా ఆయన వ్యతిరేకించారు. ప్రజాస్వామ్య తాత్త్వికతను ఆయన బౌద్ధంలో చూశారు. బౌద్ధ తాత్త్విక దృక్పథంతోనే భారత రాజ్యాంగాన్ని రాయగలిగారు. జాన్ డ్యూయీ శిష్యుడిగా ఆయనది ప్రజాస్వామిక చైతన్యం. ప్రజల జీవన వ్యవస్థల్లో ఉండే వర్ణ, కుల మూఢాచారాల భావనకు ప్రత్యామ్నాయ భావజాలాన్ని రూపొందించడానికి జాన్ డ్యూయీ భావాలను స్వీకరించాడు. డ్యూయీ కొలంబియా యూనివర్సిటీలో అంబేడ్కర్ పరిశోధనకు గైడ్‌గా ఉన్నారు.



> అంబేడ్కర్ రాజకీయ ఉద్యమంలో సిద్ధాంత బలం ఉంది. పునర్నిర్మాణ ప్రణాళిక ఉంది.

ఆయన విస్తృతమైన అధ్యయనం ఆయన్ని భారతీయ పునర్నిర్మాణ కర్తగా ఆవిర్భవింపజేసింది. ఈ క్రమంలో ఆయన భారతీయ దార్శనికులు మహాత్మా పూలే, సావిత్రీబాయి పూలే విద్యా విప్లవాన్ని నూత్న రాజకీయ ప్రత్యామ్నాయంగా ప్రచారం చేశారు. ఆయన రాజకీయ ఉద్యమంలో సిద్ధాంత బలం ఉంది. పునర్నిర్మాణ ప్రణాళిక ఉంది. అంబేడ్కర్ స్థాపించిన ఇండియన్ లేబర్ పార్టీ 1937లో బొంబాయి ప్రెసిడెన్సీలో కాంగ్రెస్‌కు పటిష్ఠమైన ప్రతిపక్షంగా వ్యవహరించింది. ఇండియన్ లేబర్ పార్టీని విస్తృతపరచాలనే ఉద్దేశంతో 1942 జులైలో ఆలిండియా షెడ్యూల్డు క్యాస్ట్ ఫెడరేషన్ (ఎఐఎస్‌సిఎఫ్)ను స్థాపించారు. దళితుల సాంఘిక, ఆర్థిక హక్కులను సాధించటానికి వారికి రాజకీయాధికారం కావాలని ప్రబోధించారు. భారతీయుడైన ప్రతివాడు ఆర్థిక సాంఘిక స్వాతంత్ర్యాలను పొందాలని నొక్కి వక్కాణించారు. ప్రతి మనిషికి నిర్భయంతో కూడిన స్వేచ్ఛను సాధించడం ప్రభుత్వ బాధ్యత అన్నారు. 'దళిత బహుజనులు బానిస భావాలను వదిలించుకోవాలి. జ్ఞానమే శక్తియని, మనిషి ప్రతి జీవనరంగంలోనూ విజ్ఞానమే ప్రధానమని నేను నిత్యం భావిస్తాను. షెడ్యూల్డు కులాలవారు సంపూర్ణంగా విద్యావంతులయ్యే వరకు స్వాతంత్ర్యం, సమానత్వాల గమ్యాన్ని చేరుకోలేరు. ఏ విద్య అయితే సమర్థతను సమున్నతంగా పెంచలేదో, సమానత్వాన్ని పెంపొందించుకోవడానికి బాధ్యత వహించదో, నీతికి భూమికగా నిలువదో అది విద్యకాదు. విద్య అనేది మానవ సంక్షేమానికి రక్షణగా, బహుళ ప్రయోజనకారిగా, సమతానురాగాల మూలస్థానంగా ఉండాలి. సంఘంలో సమానత్వాన్ని, నిత్యావసరమైన ఆహారాన్ని, విజ్ఞానపరంగా సంతృప్తిని సమకూర్చాలి. విద్యావంతులైన జాతి దానంతటదే అభివృద్ధిలోకి వస్తుంది' అన్నారు. బుద్ధుడి, అశోకుడి తర్వాత ఆసియా నుండి ప్రపంచ దేశాలను వెలిగిస్తున్న జ్ఞాన సూర్యుడు అంబేడ్కర్. ఆ వెలుగుల్లో మనం పయనిద్దాం.

వ్యాసకర్త దళితోద్యమ నాయకులు । 98497 41695

వైరుధ్య భారతంలో జాతీయవాదమా?



ప్రొ॥ చల్లపల్లి స్వరూపరాణి


బాబా సాహెబ్ అంబేడ్కర్ ఒక సందర్భంలో గాంధీజీతో జరిపిన సంభాషణలో 'నాకు మాతృదేశం లేదు' అంటారు. అందుకు గాంధీజీ 'లేదు, మీకు మాతృ దేశం వుంది' అని బదులిస్తే... 'మమ్మల్ని కుక్కలు, పందులకంటే హీనంగా చూసే దేశాన్ని చూసి ఏ అంటరానివాడైనా ఈ దేశం నాది అని ఎలా అనుకోగలడు?' అని అంబేడ్కర్ పేర్కొనడం విశేషం.

భారత్‌లో ఇటీవలి కాలంలో జాతీయవాదం లేదా దేశభక్తి అనే భావనలు తరచూ వివాదాస్పద చర్చలకు దారితీస్తున్న క్రమంలో అంబేడ్కర్ జాతీయవాదంపై వెలిబుచ్చిన అభిప్రాయాలను చర్చించడం అవసరం. ఒకవైపు బ్రిటీష్ వలసవాదం అంతమై దేశానికి పాలనాధికారాలు బదిలీ అవుతున్న సందర్భంలో ఆయన జాతీయవాదంపై వ్యక్తపరిచిన అభిప్రాయాలు ఎంతో కీలకమైనవి. బ్రిటిష్ పాలన అంతమొందడంతోనే ఇక్కడి సమస్యలన్నీ సద్దుమణిగిపోతాయని అంబేడ్కర్‌తో పాటు అణగారిన కులాలు భావించకపోవడం గమనార్హం.

బ్రిటిష్ వారికంటే ఇక్కడ ప్రత్యక్షంగా తమపై కుల దాష్టీకాన్ని ప్రదర్శించే నల్ల దొరలే తమ ప్రధాన శత్రువులు అనే అవగాహన అణగారిన వర్గాల్లో దేశ వ్యాప్తంగా పెంపొందింది. ఉత్తరాదిన పంజాబ్‌లో 'ఆదిధర్మ్' ఉద్యమం, ఒరిస్సాలో 'మహిమ ధర్మం', ఉత్తరప్రదేశ్, హైదరాబాద్ రాష్ట్రాలలో 'ఆది హిందూ', దక్షిణాదిలో 'ఆది ద్రావిడ', 'ఆది ఆంధ్ర', 'ఆది కన్నడ' వంటి ఉద్యమాలు దళితులు ఈ దేశ మూలవాసులనే ఆత్మగౌరవ ప్రకటనలు వెలువడుతున్న కాలమది. ఆధిపత్య కులాలకు చెందిన కవి గరిమెళ్ళ సత్యనారాయణ బ్రిటిష్ వలస పాలనను వ్యతిరేకిస్తూ 'మాకొద్దీ తెల్ల దొరతనం' అనే గేయాన్ని రాస్తే... కుసుమ ధర్మన్న అనే దళిత కవి 'మాకొద్దీ నల్ల దొరతనం' అనే గేయాన్ని రాసి స్వరాజ్యం, స్వతంత్రం అనే అంశాలలో దళితుల ఆకాంక్షలను వ్యక్తీకరించడం గమనార్హం. తమిళనాట పండిత అయోతీ దాస్, పెరియార్ల నాయకత్వంలో జరిగిన ఆది ద్రావిడ ఉద్యమం కూడా ఆధిపత్య కులాల జాతీయోద్యమంలో భాగస్వామి కాకుండా తమదైన స్వతంత్ర ఆకాంక్షలను వ్యక్తపరచడం చూస్తాం.

ప్రాంతీయంగా వ్యక్తమవుతున్న అణగారిన కులాల స్వతంత్ర ఆకాంక్షలకు అంబేడ్కర్ జాతీయ స్థాయిలో ప్రాతినిధ్యం వహిస్తూ పెద్ద కాన్వాసు మీద తమ జాతీయవాదం ఏమిటో నిర్మొహమాటంగా చెబుతూ బ్రాహ్మణ బనియాల జాతీయవాద లొసుగులను దుయ్యబట్టాడు. అనేక కులాలు, మతాలు, భాషలు, ప్రాంతీయ అస్తిత్వాలు, వాటిమధ్య వైరుధ్యాలు గల భారతదేశం ఒక జాతిగా ఉండే అవకాశం లేదని చెబుతూ ఇక్కడ జాతీయతా భావన ఇంకా సాధించాల్సిన ఆదర్శమేనని పేర్కొన్నారు. ఈ 'దేశభక్తులు' ఎంతసేపటికీ తమకూ, తమ వర్గానికీ అధికారం దక్కాలని తాపత్రయ పడుతుంటారని అన్నారు. తన జాతీయవాదం అన్ని రకాల గుత్తాధిపత్యాలనూ తిరస్కరిస్తుందని అన్నాడు.

అంబేడ్కర్ జాతీయవాదంపై వెలిబుచ్చిన భావాలకు నేటికీ ప్రాసంగికత ఉంది. ఆయన ఒక సందర్భంలో తన కాలపు దేశ భక్తులను ఉద్దేశించి వీరికి తమ పూర్వీకులు అణగారిన ప్రజలపై సాగించిన దారుణాలపై ఎటువంటి ప్రాయశ్చిత్త ధోరణీ లేకపోగా రాబోయే కాలంలో తమ వారు గతంలో సాగించిన ధోరణినే తిరిగి ప్రదర్శించడానికి వెనకాడబోరు అని పేర్కొన్నారు. అది ఈనాటి దేశ భక్తుల విషయంలో అక్షర సత్యమని తెలుస్తుంది. ఇప్పుడు అణగారిన కులాలు, ఆదివాసులు, స్త్రీలు, మైనారిటీల పట్ల పెత్తందారీ కులాల వారు సాగించే హత్యలు, అత్యాచారాలు సమస్తమైన దౌర్జన్యాలకు వారు దేశభక్తినీ, దైవ భావననూ అడ్డు పెట్టుకోవడం కళ్ళారా చూస్తున్నాం. కుహనా జాతీయవాదుల రెండు నాల్కల ధోరణిని ఆయన సరిగ్గానే అంచనా వేయడం గమనార్హం. ఆయన చూపించిన వెలుగు దారిలో సమకాలీన ప్రజా వ్యతిరేక శక్తుల ఆట కట్టించి సామాజిక, రాజకీయ వైరుధ్యాలను పరిష్కరించుకోవడం మనం ఆయనకిచ్చే నిజమైన నివాళి.



వ్యాసకర్త ప్రముఖ దళిత కవి, రచయిత్రి

అంబేడ్కరుని పాత్రికేయ ప్రమాణాలు

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అంటే గుర్తొచ్చేవి రాజ్యాంగ రచన, అంటరానితనం, కులనిర్మూలన పోరాటాలు, పోరాడి సాధించుకున్న స్వాతంత్ర్య ఫలాలు అందరికీ సమానంగా దక్కాలన్న భావన, సమాలోచనలు. అయితే అంబేడ్కర్ గొప్ప పాత్రికేయులనీ, పాత్రికేయ ప్రమాణాలు, నైతిక విలువలకు అత్యంత ప్రాధాన్యత నిచ్చేవారనీ, వాటిని కాపాడేందుకు స్వయంగా తానే పత్రికలు స్థాపించి అక్షర పోరాటం చేశారనీ చాలా తక్కువ మందికే తెలుసు.

ఆయన 'మూక్ నాయక్' (1920), 'బహిష్కృత భారత్' (1027), 'సమత' (1928), 'జనత' (1930) 'ప్రబుద్ధ భారత్' (1956) పత్రికలు స్థాపించి పత్రికా స్వేచ్ఛకు పట్టం కట్టారు. ప్రతి అక్షరాన్ని నిటారుగా నిలిపి, పాత్రికేయ శక్తి సామర్థ్యాలను ప్రపంచానికి చాటిచెప్పారు.

ఆయన ఏ పత్రిక ప్రారంభించినా, దానికి ఒక ప్రత్యేక అజెండా ఉండేది. ఆరంభ సంచికలోనే తానెందుకు, ఎవరి కోసం సదరు పత్రిక ప్రారంభించారో తెలియచేసేవారు. దేశంలో విపరీతంగా పెరిగిపోతున్న కులవివక్ష, అంటరానితనం తనని ఎక్కువగా ప్రభావితం చేశాయని 'బహిష్కృత భారత్' పత్రిక లక్ష్యాన్ని వివరిస్తూ తొలిసంచికలో 'సంతకపు సంపాదకీయం'(సైన్డ్ ఎడిటోరియల్) రాశారు. చైతన్య పరచడం ద్వారానే ప్రజల్లో కదలిక తీసుకురావడం సాధ్యమవుతుందనీ, దాన్ని సాధించడం కోసం 'ప్రబుద్ధ భారత్' పత్రిక ప్రారంభించాననీ ఆరంభ సంచికలో సంపాదకీయం ద్వారా పత్రిక అజెండాను చెప్పారు.

అంబేడ్కర్ స్థాపించిన పత్రికల్లో అగ్రస్థానం 'మూక్ నాయక్'దే! నూరేళ్ళ చరిత్రకు సాక్ష్యంగా నిలిచి, ఈ మధ్యనే అక్షర సంబరాలు జరుపుకొన్న ఈ పత్రిక జర్నలిజాన్ని కొత్త పుంతలు తొక్కించిందనే చెప్పాలి. నిర్భీతిగా, నిజంవైపు నిలబడడం, పాత్రికేయ విలువలు తు. చ. తప్పక పాటించడం, రాతల్లో అపోహలకు, అసత్యాలకు తావివ్వకపోవడం; కుల రాజకీయాలకు, వివక్షకు దూరంగా రచనలు చెయ్యడం వంటి సూత్రాలను కడదాకా పాటించారాయన. చాలా మటుకు భారతీయ పత్రికలు ఏకపక్షంగా రాస్తున్నాయనీ, కేవలం ఒక వర్గం తాలూకు అభీష్టానికి అనుగుణంగానే రాస్తున్నాయనీ, కొన్నిసార్లు ఊహాజనిత వార్తల్ని వండి వార్చుతున్నాయనీ దుయ్యబట్టారు. రాజ్యాంగ రూపశిల్పిగా, కేంద్ర మంత్రిగా, ఉత్తమ పార్లమెంటేరియన్‌గా పేరు పొందిన తనపైనే అవాకులు, చవాకులు పేలడం తనను కలచివేసిందని, అందువల్లనే తానీ పత్రిక ప్రారంభించడానికి సంకల్పించినట్లు తన సంపాదకీయంలో పేర్కొన్నారు. పెద్దలకు అనుకూలంగానూ, పేదలు బడుగు బలహీన వర్గాలకు వ్యతిరేకంగానూ పత్రికలు కొనసాగడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి పెను ప్రమాదమని హెచ్చరించారు. వెనుకబాటుతనానికి ఆర్థిక అంశాలు ద్వితీయ స్థానంలో ఉండగా, సామాజికాంశాలే ప్రథమ స్థానంలో ఉన్నా యనేది అంబేడ్కర్ నిశ్చితాభిప్రాయం. తదనుగుణంగానే రాజ్యాంగ రూపకల్పనలో సామాజిక రిజర్వేషన్లకు ప్రాధాన్యమిచ్చినట్లు తన రచనల్లో స్పష్టం చేశారు. పేదరికం, నిస్సహాయత, ఆత్మన్యూనత, వెనుక బాటుతనం దాడి చేస్తుండడం వల్లనే అణగారిన వర్గాలు అభివృద్ధి ఫలాలను అందుకోలేక పోతున్నాయని, ఈ రుగ్మతల నుంచి మెజారిటీ జనాలను 'విముక్తుల్ని' చేయడమే తన ముందున్న లక్ష్య మని తన పత్రికల్లో పదే పదే ప్రస్తావించారు.



ప్రొ॥ పీటా బాబీ వర్ధన్

మిగతా వృత్తుల కంటే జర్నలిజం 'పవిత్ర'మైనదని, జనజాగృతికి, దిశానిర్దేశం చేయడానికి దీన్ని మించిన 'వజ్రాయుధం' మరోటి లేదన్నది అంబేడ్కర్ దృఢమైన అభిప్రాయం. సంచలనాల కోసం, తానెప్పుడూ తప్పుడు రాతలు రాయబోనని ప్రతిన బూనారు. పాత్రికేయునికి నైతికబాధ్యత ఆయుధమై ఉండాలన్నారు. జర్నలిజం వృత్తిని గౌరవించేవారు కనీసం ఆయన ప్రమాణాల్లో కొన్ని పాటించినా ఆ మహనీయునికి ఘననివాళి అర్పించినట్లే!

వ్యాసకర్త మీడియా విశ్లేషకులు
మొబైల్: 93931 00566

క్లుప్తంగా...

హెచ్‌సీయూ పేరిట భూములు రిజిస్ట్రేషన్ చేయాలి: మహేశ్వర్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: హెచ్‌సీయూ పరిధిలో ప్రస్తుత వివాదాస్పద భూములను.. వర్సిటీ పేరిట రిజిస్ట్రేషన్ చేయాలని బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆయన ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మంత్రి శ్రీధర్ బాబు ప్రజలను తప్పుదోవ పట్టించేలా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీజీఐఐసీకి బదలాయించిన భూములు వర్సిటీ వేనని స్పష్టం చేశారు. రాష్ట్రంలో హెచ్‌సీయూ భూములే కాకుండా.. ఎక్కడా ప్రభుత్వ భూములను అమ్మడానికి వీల్లేదని స్పష్టం చేశారు. హెచ్‌సీయూ సమీపంలోని 400 ఎకరాలకు అదనంగా మరో 400 ఎకరాల భూమిని కలుపుతూ ఎకో పార్కులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీగా టీజీపీఎస్సీ

- బీఆర్ఎస్ నేత రాకేశ్ రెడ్డి



సాక్షి, హైదరాబాద్: టీజీపీఎస్సీ తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీగా మారిందనే అనుమానాలు కలుగుతున్నాయని బీఆర్ఎస్ నేత ఏనుగుల రాకేశ్‌రెడ్డి అన్నారు. తాను లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా టీజీపీఎస్సీ.. పరువు నష్టం దావా నోటీసు పంపించడం దుర్మార్గమని అన్నారు. ఆయన ఆదివారం తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. గ్రూప్–1 పరీక్ష ఫలితాల్లో అవకతవ కలు జరిగాయంటూ అభ్యర్థులు తెలంగాణ భవన్‌కు వచ్చి ఫిర్యాదు చేశారని, పూర్తి ఆధారాలతో, సహేతుకమైన విశ్లేషణతో ప్రెస్ మీట్ నిర్వహించినట్టు స్పష్టం చేశారు. తన వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నానని.. క్షమాపణ చెప్పేది లేదని.. టీజీపీ ఎస్సీయే క్షమాపణ చెప్పాలని రాకేశ్‌రెడ్డి డిమాండ్ చేశారు.

ఒకే కాన్పులో ముగ్గురు శిశువులు



ముస్తాబాద్(సిరిసిల్ల): రాజన్నసిరిసిల్ల జిల్లా ముస్తాబాద్‌లో ఆదివారం ఓ గర్భిణికి ముగ్గురు శిశువులు జన్మించారు. తల్లితో పాటు ముగ్గురు శిశువులు క్షేమంగా ఉన్నారు. ముస్తాబాద్ మండలం చిప్పలపల్లికి చెందిన కొడెండ్ల సృజనకు ఆదివారం పురిటినొప్పులు రాగా.. మండల కేంద్రంలోని శ్రీతిరుమల నర్సింగ్‌హోమ్‌కు తరలించారు. వైద్యపరీక్షలు చేసిన వైద్యులు ప్రవంతి, శ్రీకాంత్‌లు.. సృజన గర్భంలో ముగ్గురు శిశువులు ఉన్నట్లు గుర్తించి.. వెంటనే శస్త్రచికిత్స చేశారు. సృజన ఇద్దరు ఆడ శిశువులు, ఒక మగ శిశువుకు జన్మనిచ్చారు. ఆస్పత్రి వైద్యులు మాట్లాడుతూ 15వేల మంది గర్భిణుల్లో.. ఇలా ఒకే కాన్పులో ముగ్గురు శిశువులు జన్మిస్తారని తెలిపారు.

పెళ్లి కావట్లేదని మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్య



నీల

కొడకండ్ల: పెళ్లి సంబంధం కుదరడం లేదన్న మనస్తాపంతో జనగామ జిల్లా కొడ కండ్ల మండలం నీలి బండ తండాకు చెందిన ఏఆర్ కానిస్టేబుల్ గుగులోత్ నీల (26) ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గుగులోత్ హేమ, చిన్ని దంపతుల రెండో కుమార్తె నీల 2020లో ఏఆర్ కానిస్టేబుల్‌గా ఎంపికై వరంగల్‌లో పనిచేస్తోంది. శనివారం విధులు ముగించుకొని ఇంటికి వచ్చిన నీల.. ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. పెళ్లి సంబంధం కుదరడం లేదన్న మనస్తాపంతో తన కూతురు ఆత్మహత్య చేసు కుందని మృతురాలి తల్లి చిన్ని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చింత రాజు తెలిపారు.

చుట్ట.. బీడీ.. సిగరెట్‌తోనే.. నిప్పు



పొగ తాగడం కేవలం ఆరోగ్యానికే కాదు.. ఆస్తికీ హానికరమన్న విషయాన్ని రాష్ట్ర అగ్నిమాపక శాఖ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఏటా రాష్ట్రంలో జరుగుతున్న అగ్నిప్రమాదాల్లో అత్యధికం కేర్‌లెస్ స్మోకింగ్‌గా పిలిచే ఆర్పకుండా కాల్చి పారేసిన చుట్ట, బీడీ, సిగరెట్‌ల వల్లే జరిగాయి. 2023 జనవరి నుంచి ఈ ఏడాది జనవరి 11 వరకు రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 15,404 అగ్నిప్రమాదాలు చోటు చేసుకున్నాయి. వీటిలో అత్యధికంగా 6,653 (43.19 శాతం) దుర్ఘటనలు ఈ కేర్‌లెస్ స్మోకింగ్‌తో జరిగాయి. వేసవి కాలంతోపాటు ఎండలూ జోరందుకోవడంతో తమ విభాగాన్ని అగ్నిమాపకశాఖ డీజీ వై.నాగిరెడ్డి అప్రమత్తం చేశారు. జూన్ మొదటివారం వరకు అనుసరించాల్సిన వ్యూహాన్ని ఆయన సిద్ధం చేశారు.

సాక్షి, హైదరాబాద్

రాష్ట్రంలో అత్యధిక అగ్నిప్రమాదాలకు కారణం ఇవే

2023-2025 జనవరి 11 మధ్య
15,404
ఉదంతాలు

వీటిలో కేర్‌లెస్ స్మోకింగ్ కారణంగా జరిగినవి
6,653
ఘటనలు

ఈ విషయం స్పష్టం చేస్తున్న అగ్నిమాపకశాఖ గణాంకాలు

వేసవి నేపథ్యంలో ప్రత్యేకచర్యలు తీసుకుంటున్న అధికారులు

అర్బన్ ఏరియాల్లో విద్యుత్ వల్లే...

కేర్‌లెస్ స్మోకింగ్ వల్ల ఎక్కువగా అగ్ని ప్రమాదాలు రూరల్, సెమీ అర్బన్ ప్రాంతాల్లోనే జరుగుతున్నాయి. పట్టణాలు, నగరాల్లో జరిగే ఫైర్ యాక్సిడెంట్స్‌కు విద్యుత్ సంబంధిత అంశాలే కారణమవుతున్నాయి.


- ఇళ్లలో జరిగే అగ్ని ప్రమాదాలకు విద్యుత్ సంబంధిత అంశాలతోపాటు చిన్నపాటి నిర్లక్ష్యాలు కారణమవుతున్నాయి. అత్యధిక ఉదంతాల్లో వంటగది, అందులో ఉండే గ్యాస్ అగ్ని ప్రమాదాలకు కారణం కాగా.. చాలా తక్కువ సందర్భాల్లో పూజ గది సైతం అగ్నికి ఆజ్యం పోస్తోందని అధికారులు తమ అధ్యయనంలో గుర్తించారు.
- వాటర్ హీటర్లు, గీజర్లు వంటి ఉపకరణాల నిర్వహణలో ఉన్న నిర్లక్ష్యంతో కూడా ప్రమాదాలు జరుగుతున్నాయి.
- రాష్ట్రంలో జరుగుతున్న అగ్నిప్రమాదాల్లో ఎక్కువ బహిరంగ ప్రదేశాల్లో నిల్వ చేసిన వస్తువులు, చెత్త వల్లే చోటు చేసుకుంటున్నాయని అగ్నిమాపక శాఖ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

వేసవి కోసం ప్రత్యేక ప్రణాళిక సిద్ధం

అగ్నిప్రమాదాలు చోటు చేసుకోకుండా అవగాహన కల్పించడానికి పెద్దపీట వేస్తూనే..ఏదైనా ఉదంతం జరిగినప్పుడు వీలైనంత త్వరగా ఘటనాస్థలికి చేరుకొని, ఆస్తి నష్టాన్ని తగ్గించడం, ప్రాణనష్టం లేకుండా చేయడం లక్ష్యంగా అధికారులు నిర్దేశించుకున్నారు. ఇందులో భాగంగా జూన్ మొదటి వారం వరకు అత్యవసరమైతే తప్ప అధికారులు, సిబ్బందికి సెలవులు ఇవ్వకూడదని నిర్ణయించుకున్నారు. అగ్నిమాపక శకటాలతోపాటు ఉపకరణాలు, యంత్రాలకు మరమ్మతులు లేకుండా చూస్తున్నారు. ప్రైవేట్ కార్యక్రమాల కోసం ఫైర్ వాహనాల తరలింపును నియంత్రిస్తున్నారు. మార్గదర్శకాలకు అనుగుణంగా ఆస్పత్రులు, హైరైజ్ బిల్డింగ్స్ తదితరాల్లో ఫైర్ ఆడిట్ నిర్వహిస్తున్నారు.

అగ్నిమాపక శకటాలకు జీపీఎస్ ఏర్పాటు

ఇప్పటికే అగ్నిమాపక శకటాలకు జీపీఎస్ పరిజ్ఞానం ఏర్పాటు చేశారు. దీనివల్ల అవి ఏ ప్రాంతంలో ఉన్నాయో ఎప్పటికప్పుడు ఫైర్ కంట్రోల్ రూమ్‌లోని సిబ్బందికి తెలుస్తుంది. ఓ చోట అగ్నిప్రమాదం జరిగినట్టు సమాచారం అందిన వెంటనే.. అది ఏ ఫైర్‌స్టేషన్ పరిధిలో ఉందో అక్కడి ఫైరింజన్లను తొలుత అప్రమత్తం చేస్తున్నారు. దీంతోపాటు జీపీఎస్ పరిజ్ఞానం ఆధారంగా ప్రమాదం జరిగిన చోటుకు సమీపంలో ఉన్న ఫైరింజన్లను అక్కడకు మళ్లించనున్నారు. మరోపక్క ఫైరింజన్ల రాకపోకల్లో గ్రీన్‌చానల్ ఇచ్చేలా ట్రాఫిక్ అధికారులతో సమన్వయం చేసుకుంటున్నారు.




ఈ అంశాలను గమనించుకోండి



వేసవి నేపథ్యంలో అగ్నిప్రమాదాల బారినపడకుండా ఉండటానికి ప్రతి ఒక్కరూ కొన్ని అంశాలను గమనించాలి. గ్యాస్, విద్యుత్ ఉపకరణాలతోపాటు విద్యుత్ సరఫరా వ్యవస్థను పరిశీలించాలి. తమ వద్ద ఉన్న ఫైర్ సేఫ్టీ పరికరాలు పనిచేస్తున్నాయా? లేదా? చూడాలి. ఫైర్ ఎస్టింగ్విషర్‌లో ఉండే ఉపకరణాలను సరిచూసుకోవాలి. అవసరమైన వాటికి మరమ్మతులు చేయించాలి. ఇవేవీ లేని ప్రాంతాల్లో కనీసం నీళ్ల డ్రమ్ములైనా అందుబాటులో ఉంచుకోవాలి. పిల్లలు అగ్నికారకమైన వాటిలో ఆడుకోకుండా చూసుకోవాలి.

– వై.నాగిరెడ్డి, డైరెక్టర్ జనరల్, అగ్నిమాపక శాఖ

అగ్ని ప్రమాదాలకు కారణాలు ఇలా...



ఏడాది	తీవ్రమైన ప్రమాదాలు	సాధారణ ప్రమాదాలు
2023	123	4,533
2024	90	7,408
2025 (జనవరి 11)	18	1,082

మిగిలిన ప్రమాదాలు మధ్య స్థాయికి చెందినవి. కొన్ని రెస్క్యూ చేసిన ఉదంతాలు.



వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న ముస్లింలు

అంబేడ్కర్ విగ్రహం వద్ద ముస్లింల భారీ ర్యాలీ

- మద్దతు పలికిన కాంగ్రెస్ నేతలు

కవాడిగూడ(హైదరాబాద్): వక్ఫ్ బోర్డు సవరణ చట్టాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ ఆదివారం హైదరాబాద్‌లోని పలు ముస్లిం సంస్థల ఆధ్వర్యంలో నల్ల జెండాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. బషీర్‌బాగ్ నుంచి ట్యాంక్‌బండ్ అంబేడ్కర్ విగ్రహం వరకు జరిగిన ర్యాలీలో వేలాది మంది పాల్గొన్నారు. ఈ ర్యాలీకి టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్‌తో పాటు ఉత్తరప్రదేశ్ ఎంపీ ఇమ్రాన్ మసూద్, ఎమ్మెల్సీలు బల్మూరు వెంకట్, అమీర్ అలీ ఖాన్, మాజీ ఎంపీ వి.హనుమంతరావు, తెలంగాణ ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ తదితరులు హాజరయ్యారు. ప్రధాని మోదీకి రోజులు దగ్గర పడ్డాయని, వక్ఫ్ బోర్డు సవరణ చట్టాన్ని విరమించుకోకుంటే తగిన మూల్యం చెల్లించక తప్పదని మహేశ్‌కుమార్‌గౌడ్ హెచ్చరించారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ పోరాడుతుందని చెప్పారు.

చంద్రబాబు, నితీశ్ వల్లే వక్ఫ్ చట్టం

▶ మొదటి పేజీ తరువాయి

ముస్లింల హక్కులన్నింటినీ లాక్కుందని ఆవేదన వ్యక్తం చేశారు. మోదీ సర్కారు దేశంలోని ముస్లింలకు వ్యతిరేకంగా పనిచేస్తోందని ఆరోపించారు. వక్ఫ్‌పై బీజేపీ చెప్పేవన్నీ అబద్ధాలేనని మండిపడ్డారు. హిందూ, జైన, సిక్కు ఎండోమెంట్ బోర్డులలో ఆ మత విశ్వాసాలను అనుసరించే వారు మాత్రమే సభ్యులుగా ఉంటారని, అలాంటప్పుడు వక్ఫ్ బోర్డులో ముస్లిమేతరులు సభ్యులుగా ఉండటం సబబా? అని ప్రశ్నించారు. ఈ చట్టాన్ని అడ్డు పెట్టుకొని వక్ఫ్ భూములను ఆక్రమించిన వారికే వాటిని కట్టబెట్టే ప్రమాదముని ఆందోళన వ్యక్తం చేశారు.

సవరణకు వ్యతిరేకంగా సభ: వక్ఫ్ చట్ట సవరణకు వ్యతిరేకంగా ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు ఆధ్వర్యంలో ఈ నెల 19న దారుస్సలాంలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు అసదుద్దీన్ ప్రకటించారు. వక్ఫ్ బోర్డు అధ్యక్షుడు మౌలానా ఖలీద్ సైఫుల్లా రెహమానీ అధ్యక్షతన జరిగే ఈ సభకు దేశవ్యాప్తంగా మత పెద్దలు, పలువురు రాజకీయ నేతలు హాజరవుతారని చెప్పారు. వక్ఫ్ చట్ట వ్యతిరేక నిరసనలు శాంతియుతంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు.

ఉపాధ్యాయ ఉద్యమ నేత రమణ మృతి



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: టీపీటీఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కందుకూరి రమణ కేన్సర్‌తో బాధపడుతూ ఆదివారం మృతి చెందారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డి పేటకు చెందిన రమణ.. అప్పట్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఉద్యోగం చేస్తూ ఉపాధ్యాయ నేతగా చురుగ్గా పనిచేశారు. తర్వాత నిజామాబాద్ జిల్లాకు బదిలీపై వచ్చిన ఆయన.. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఉపాధ్యాయ ఉద్యమాలకు నాయకత్వం వహించి టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షునిగా సేవలందించారు. ఆదివారం సాయంత్రం కామారెడ్డిలో నిర్వహించిన రమణ అంత్యక్రియల్లో.. రాష్ట్రం నలుమూలల నుంచి ఉపాధ్యాయులు, ప్రజా సంఘాల నాయకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

అధికార లాంఛనాలతో వనజీవి అంత్యక్రియలు



వనజీవి రామయ్య సతీమణి జానకమ్మను ఓదారుస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఖమ్మంమయూరిసెంటర్/ఖమ్మంరూరల్: పద్మశ్రీ వనజీవి (దరిపల్లి) రామయ్య అంత్యక్రియలను అధికారిక లాంఛనాలతో నిర్వహించారు. ఆదివారం ఖమ్మం రూరల్ మండలం రెడ్డిపల్లిలో జరిగిన అంత్యక్రియల్లో రూరల్ తహసీల్దార్ పి.రాంప్రసాద్, ఏదులాపురం మున్సిపల్ కమిషనర్ ఆళ్ల శ్రీనివాసరెడ్డి రామయ్య పాడె మోశారు. జిల్లా అటవీ అధికారి సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్ సిబ్బందితో కలసి వైకుంఠధామంలో మొక్కలు నాటి నివాళులర్పించారు. మొక్కల పెంపకం, రక్షణకోసం రామయ్య చేపట్టిన ప్రచార కార్యక్రమాల బోర్డులను పట్టుకుని ఆయన కుటుంబసభ్యులు అంతిమయాత్రలో పాల్గొన్నారు. వనజీవికి కన్నీటి వీడ్కోలు పలికేందుకు కవులు, కళాకారులు, ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు, ప్రజా సంఘాల నాయకులు, గ్రామస్తులతో పాటు ఉమ్మడి ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల నుంచి పెద్దసంఖ్యలో జనం తరలివచ్చారు.

రామయ్య జీవితం స్ఫూర్తిదాయకం

పద్మశ్రీ వనజీవి రామయ్య జీవితం స్ఫూర్తిదాయకమని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డితో కలసి ఆదివారం ఆయన ఖమ్మం రూరల్ మండలం రెడ్డిపల్లిలో రామయ్య పార్థివదేహం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రామయ్య చేసిన పనులు కలకాలం గుర్తుండిపోతాయని పేర్కొన్నారు.

మందుకొట్టి కారు నడిపిన కేకే మనుమడు

- ట్రాలీని ఢీకొట్టడంతో కేసు



ట్రాలీని ఢీ కొట్టిన కారు

బంజారాహిల్స్ (హైదరాబాద్): మద్యం మత్తులో కారు నడుపుతూ.. ఆగి ఉన్న ఆటో ట్రాలీని ఢీకొట్టిన ప్రభుత్వ సలహాదారు కేకే మనుమడిపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలివి. బంజారాహిల్స్ రోడ్ నంబర్ 4లో నివసిస్తున్న మాజీ కార్పొరేషన్ చైర్మన్ విప్లవ కుమార్ కుమారుడు, కేకే మనుమడు కె.వశిష్ట ధ్రువ్ (21) ఆదివారం మధ్యాహ్నం స్నేహితుడితో కలిసి తన ఐ 20 కారు (టీఎస్09 ఎఫ్‌డబ్ల్యూ 2204)లో కేబీఆర్ పార్క్ వైపు నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు వైపు వెళ్తున్నాడు. జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు వద్ద సిగ్నల్ పడడంతో.. ముందు గ్యాస్ సిలిండర్లతో వెళ్తున్న ట్రాలీ ఆటో డ్రైవర్ వాహనాన్ని ఒక్కసారిగా ఆపేశాడు. దీంతో వెనక వస్తున్న కారు అదుపుతప్పి ట్రాలీ వెనక భాగంలో ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు ముందుభాగం నుజ్జు నుజ్జవగా.. ఆటో ట్రాలీ వెనుక భాగం ధ్వంసమైంది. సమాచారం అందుకున్న బంజారాహిల్స్ పోలీసులు అక్కడికి చేరుకుని.. కారు నడిపిన వశిష్ట ధ్రువ్‌కు బ్రీత్ అనలైజర్ పరీక్షలు నిర్వహించగా.. 150 బీఏసీ పాయింట్లు వచ్చింది. శనివారం రాత్రి స్నేహితులతో కలిసి ఐపీఎల్ మ్యాచ్ చూసిన వశిష్ట, అతడి స్నేహితులు కలిసి ఆదివారం మధ్యాహ్నం పార్టీ చేసుకున్నట్లు పోలీసులు గుర్తించారు. బంజారాహిల్స్ పోలీసులు సుమోటోగా కేసు నమోదు చేశారు. కారును స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

బాలికల హాస్టల్‌లో ఫుడ్ పాయిజన్

- 30 మంది విద్యార్థినులకు అస్వస్థత



హాస్టల్‌లో విద్యార్థినులతో మాట్లాడుతున్న డీసీహెచ్ఓ శివదయాల్

కౌడిపల్లి(నర్సాపూర్): మెదక్ జిల్లా కౌడిపల్లి మండల కేంద్రంలోని ఇంటిగ్రేటెడ్ బాలికల హాస్టల్‌లో ఆదివారం ఫుడ్ పాయిజన్ కావడంతో విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. తీవ్ర కడుపునొప్పి, వాంతులతో ఇబ్బంది పడ్డారు. ఈ హాస్టల్‌లో 97 మంది విద్యార్థినులు చదువుతున్నారు. ఆదివారం ఉదయం అల్పాహారంగా ఇడ్లీ వడ్డించారు. ఇడ్లీలు తిన్న కాసేపటికే కొందరు విద్యార్థులు కడుపునొప్పితో వాంతులు చేసుకున్నారు. దీంతో హాస్టల్ సిబ్బంది వారిని సీహెచ్‌సీకి తరలించి వైద్యం అందించారు. పులిసిపోయిన ఇడ్లీ తినడంతో విద్యార్థినులు అస్వస్థతకు గురై ఉంటారని డాక్టర్ తెలిపారు. సుమారు 30 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. చికిత్స అనంతరం వారిని తిరిగి హాస్టల్‌కు పంపించారు. అయితే, ఆదివారం రాత్రి మరికొందరికి వాంతులు కావడంతో సీహెచ్‌సీకి తరలించారు. విషయం తెలుసుకున్న డీసీహెచ్ఓ శివదయాల్ హాస్టల్‌కు చేరుకొని విద్యార్థులు, సిబ్బందితో మాట్లాడారు. డీఎంహెచ్‌వో శ్రీరాం కూడా హాస్టల్‌ను సందర్శించి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

బయ్యక్కపేట అడవుల్లో పెద్దపులి!

- ఆవును హతమార్చిన పులి
- పాద ముద్రలను గుర్తించిన అటవీ అధికారులు



ఎస్ఎస్‌తాడ్వాయి: ములుగు జిల్లా ఎస్ఎస్ తాడ్వాయి మండల పరిధి బయ్యక్కపేట అడవుల్లో పెద్ద పులి సంచరిస్తున్నట్లు పాదముద్రల ద్వారా అటవీ శాఖ అధికారులు గుర్తించారు. మూడు రోజుల క్రితం బయ్యక్కపేట అటవీ ప్రాంతంలోకి ప్రవేశించిన పెద్దపులి.. సమీప ముసలమ్మపెంట గొత్తికోయగూడెంకు చెందిన పోడియం సత్యం ఆవును హతమార్చినట్లు అధికారులు తెలిపారు. పెద్దపులి ఆచూకీ కోసం ఆదివారం.. మేడారం రేంజ్ అధికారి ఎల్లయ్య ఆధ్వర్యాన సిబ్బంది ముసులమ్మపెంట, గూడెంతోపాటు సమీప అటవీ ప్రాంతంలో గాలింపు చేపట్టారు. బయ్యక్కపేట సమీప వట్టివాగు, తూములవాగు ప్రాంతంలో పులి సంచరించినట్లు పాదముద్రల ద్వారా గుర్తించామని మేడారం రేంజ్ అధికారి ఎల్లయ్య తెలిపారు. ఆవును వెంటాడిన పులి ముసులమ్మపెంట అటవీ ప్రాంతంలో సంచరిస్తున్నట్లు అనుమానం వ్యక్తం చేశారు. గొత్తికోయగూడెం ప్రజలు అడవికి వెళొద్దని హెచ్చరించారు.

కల్లు తయారీలో యాంటీ సైకోటిక్ డ్రగ్?

దుర్కిలో జరిగిన ఘటన నేపథ్యంలో ఇదే వాడినట్టు డాక్టర్ల అనుమానం

- చెట్టు లేకుండానే లక్షల లీటర్ల కల్లు తయారు చేస్తున్న అక్రమార్కులు
- డైజోఫాం, ఆల్ప్రాజోలం కంటే తక్కువ రేటుకే దొరికే రసాయనాలతో దందా

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: కృత్రిమ కల్లు తయారీలో అక్రమార్కులు కొత్తదారులు వెతుకుతున్నారు. మొదట్లో క్లోరోహైడ్రేట్ రసాయనంతో కృత్రిమ కల్లు తయారు చేసేవారు. ప్రభుత్వం దీన్ని నిషేధించాక డైజోఫాం ఉపయోగించారు. ప్రస్తుతం కృత్రిమ కల్లు తయారీకి ఆల్ప్రాజోలం రసాయనం వాడుతున్నారు. ఖర్చు ఇంకా తగ్గించుకునేందుకు యాంటీ సైకోటిక్ డ్రగ్ వాడుతున్నట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

అక్కడ తాగిన వారంతా అపస్మారక స్థితిలోకి..

ఈ నెల 7న కామారెడ్డి జిల్లా నస్రుల్లాబాద్ మండలం దుర్కి కల్లు డిపోలో కల్లు తాగినవారంతా అపస్మారక స్థితిలోకి వెళ్లారు. 69 మంది ప్రభావితం కాగా, ఇందులో 17 మందిపై తీవ్ర ప్రభావం చూపడంతో నిజామాబాద్ ప్రభుత్వాస్పత్రిలో చేర్చి చికిత్స అందించారు. గత ఘటనలకు భిన్నంగా లక్షణాలు కనిపించడంతో క్షుణ్ణంగా పరిశీలించిన వైద్యులు కల్లు తయారీలో కలిపిన రసాయనాల విషయమై దృష్టిసారించారు. బాధితులకు గంటల వ్యవధిలోనే నాడీవ్యవస్థ దెబ్బతినడంతోపాటు నాలుక దొడ్డుగా మారడం, డిస్టోనియా (మరమనిషి మాదిరిగా), రిజిడ్(గట్టిగా), సిరలు పడిపోవడం, నొప్పులు వంటి లక్షణాలు కనిపించాయి. దీంతో కొత్తగా 'యాంటీ సైకోటిక్ గ్రూపు'నకు చెందిన డ్రగ్స్‌ను కల్లులో వాడినట్టు అనుమానిస్తున్నారు. ఈ డ్రగ్‌ను 'మేజర్ మెంటల్ డిజార్డర్' ఉన్నవారికి ఉపయోగిస్తారని వైద్యులు చెబుతున్నారు.

కల్లుపై ప్రయోగాలు.. ప్రాణాలతో చెలగాటం

తెల్లగా మెరుస్తూ, కలిపితే నురగ వస్తూ, పుల్లగా, తియ్యగా ఉంటూ కల్లులా భ్రమింపచేసేందుకు అక్రమార్కులు రసాయనాలను వాడుతున్నారు. ఇందుకోసం గతంలో క్లోరోహైడ్రేట్‌ను వాడేవారు. ప్రభుత్వం నిషేధించడంతో ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా తెచ్చి కలుపుతున్నారు. కొంత కాలం డైజోఫాంతో కల్లు తయారుచేశారు. ప్రస్తుతం ఆల్ప్రాజోలం ఉపయోగించి కృత్రిమ కల్లు తయారు చేస్తున్నారు. అయితే ఈ రసాయనాల ఖర్చును మరింతగా తగ్గించుకునేందుకుగాను అక్రమార్కులు ప్రయోగాలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే యాంటీ సైకోటిక్ డ్రగ్ తెరపైకి వచ్చిందనే అనుమానాలున్నాయి. రసాయనాలతో తయారుచేసిన కల్లులో కుంకుడు కాయల రసం, శాక్రీన్ సైతం కలుపుతున్నారు.

కృత్రిమ కల్లు దందా ఇలా..

- కృత్రిమ కల్లు తయారీలో ఆల్ప్రాజోలం, డైజోఫాం, క్లోరోహైడ్రేట్, సిట్రిక్ యాసిడ్ లాంటి రసాయనాలతో పాటు పులుపు కోసం నిమ్మ ఉప్పు, తెలుపు కోసం సిల్వర్ వైట్, కప్ పౌడర్, తీపి కోసం శాక్రీన్, నురగ కోసం కుంకుడు రసం, యూరియా, సోడా యాష్, అమ్మోనియా మిశ్రమం, డ్రై ఈస్ట్ రసాయనాలను ఉపయోగిస్తున్నారు.
- 2,400 సీసాల తయారీకి రూ.7,800 ఖర్చవుతోంది. ఒక్కో కల్లు ప్యాకెట్ రూ.20కి అమ్ముతున్నారు.
- ఒక్క నిజామాబాద్ నగరంలోనే ఒక్క తాటిచెట్టు కూడా లేకుండానే రోజుకు ఏకంగా 3 లక్షల లీటర్ల కృత్రిమ కల్లు తయారుచేస్తున్నారు.

డేంజర్.. 'యాంటీ సైకోటిక్ డ్రగ్'



మేజర్ మెంటల్ డిజార్డర్ ఉన్న రోగులకు మాత్రమే యాంటీ సైకోటిక్ గ్రూపునకు సంబంధించిన డ్రగ్ వాడాలి. ఇష్టానుసారం వాడితే తీవ్ర ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి.

– డాక్టర్ కె శివప్రసాద్, నిజామాబాద్ వైద్యకళాశాల ప్రిన్సిపల్, సైకియాట్రి ప్రొఫెసర్

కొత్త రసాయనం కలిపి తయారీ



దుర్కిలో కల్లు తాగిన వారిని వివిధ రకాలుగా పరిశీలించాం. ఆల్ప్రాజోలం, డైజోఫాం కాకుండా కొత్తగా మరో రసాయనం కలపడంతోనే బాధితుల్లో అనారోగ్య సమస్యలు తలెత్తాయి.

– డాక్టర్ శ్రీనివాస్, నిజామాబాద్ జీజీహెచ్ సూపరింటెండెంట్



అంతరిక్షం నుంచి అందాల భారతం

వాషింగ్టన్: అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం నుంచి రాత్రివేళ భారత్ ఎలా కనిపిస్తుందో తెలుసా? ఇదుగో, సరిగ్గా ఇలా! నక్షత్రాల వలయం కిందుగా నగరాల తాలూకు విద్యుద్దీప కాంతుల్లో ధగధగా మెరిసిపోతోంది కదూ. ఐఎస్ఎస్ నుంచి తీసిన ఈ ఫొటోను నాసా ఆదివారం విడుదల చేసింది. మేఘావృతమైన అమెరికా, అందమైన ఆగ్నేయాసియా తీర ప్రాంతం, ఆకుపచ్చని అరోరా కాంతులతో కూడిన కెనడా తాలూకు ఫొటోలను కూడా ఎక్స్‌లో పంచుకుంది. ''పైన నక్షత్రాలు, కింద మహానగరాల తాలూకు కాంతులు. దిగంతాల వెంబడి పరుచుకున్న వాతావరణపు మసక వెలుతురులు. అచ్చెరువొందించే అందాలకు ఆలవాలం మన భూగోళం'' అంటూ చక్కని క్యాప్షన్ జోడించింది. అంతరిక్షం నుంచి భారత్ భలేగా కనిపిస్తోందంటూ సోషల్ మీడియాలో కామెంట్లు వెల్లువెత్తుతున్నాయి. 'అయితే భారతీయులమంతా సాలెగూడులా అందంగా విస్తరించామన్నమాట' అంటూ ఒక యూజర్ మురిసిపోయాడు.

అణు విద్యుచ్ఛక్తిలో... చైనా అద్భుతం!

ప్రపంచంలోనే తొలిసారి కేంద్రక సంలీన, విచ్ఛిత్తి అణు రియాక్టర్

విజయవంతమైతే నిరంతర, అపార విద్యుచ్ఛక్తి అందుబాటులోకి



ప్రపంచవ్యాప్తంగా విద్యుత్ అవసరాలు నానాటికీ ఊహాతీతంగా పెరిగిపోతున్నాయి. కృత్రిమ మేధ, రోబోటిక్స్, సెమీ కండక్టర్లు, బయో టెక్నాలజీ వంటి రంగాల్లో ముందంజలో ఉండాలంటే అత్యధిక విద్యుత్, అది కూడా కారుచౌకగా అందుబాటులో ఉండటం అత్యంత ముఖ్యం. ఎందుకంటే ఒక అతిపెద్ద ఏఐ డేటా సెంటర్‌ను నిర్వహించాలంటే కనీసం 40 లక్షల విద్యుత్ వాహనాలను చార్జ్ చేయడానికి సమానమైన విద్యుత్ కావాలని అంచనా. ఆన్‌లైన్ డేటాను రెప్పపాటులో ప్రాసెస్ చేసే కృత్రిమ మేధ డేటా సెంటర్లకు ప్రాణమైన గ్రాఫిక్ ప్రాసెసింగ్ యూనిట్ (జీపీయూ)లకు కూడా నిరంతరం నిరాటంకమైన విద్యుత్ సరఫరా తప్పనిసరి. ప్రపంచమే డేటామయంగా మారిన నేపథ్యంలో డేటాను కాపాడుకోవాలన్నా, ఆన్‌లైన్‌లో నిరంతరం అందుబాటులో ఉంచాలన్నా అపారమైన విద్యుచ్ఛక్తి కావాల్సిందే. అణు విద్యుత్ రంగంలో ఇప్పటికే నంబర్‌వన్‌గా ఉన్న చైనా దీన్ని ముందే పసిగట్టింది. ప్రపంచంలోనే తొలిసారిగా 'కేంద్రక సంలీన, విచ్ఛిత్తి' సూత్రాల కలబోతగా ఓ వినూత్న అణు రియాక్టర్ తయారీకి నడుం బిగించింది. ఈ ప్రయత్నం గనుక ఫలిస్తే అపారమైన విద్యుత్ నిరంతరంగా అందుబాటులోకి వస్తుందని చెబుతున్నారు.

అన్నింట్లోనూ అగ్రస్థానం కేసి...

ప్రపంచంలో ఎక్కడ ఏ కొత్త రకం వస్తువు తయారైనా వెంటనే దానికి నకలు తయారు చేస్తుందని చైనాకు పేరుంది. ఇమిటేషన్ టెక్నాలజీకి పేరెన్నికగన్న చైనా ఇప్పుడు వినూత్న ఆవిష్కరణల ఆధారిత ఆర్థిక శక్తిగా ఎదగాలని ఆశపడుతోంది. పరిశోధన, అభివృద్ధిపై భారీగా పెట్టుబడులు పెడుతోంది. గతేడాది ప్రపంచవ్యాప్తంగా వాటికి అత్యధిక నిధులు కేటాయించిన దేశాల్లో చైనాది రెండో స్థానం విశేషం. హువావే, టెన్‌సెంట్, అలీబాబా, గ్జియోమీ, డీజేఐ కంపెనీలు, ఇన్నోవేషన్‌కు సంబంధించి బీవైడీ తదితరాలు చైనాను టెక్నాలజీలో అగ్రస్థానంలో నిలిపాయి. 5జీ టెక్నాలజీలో హువావే, డ్రోన్ టెక్నాలజీలో బీవైడీ టాప్ కంపెనీలుగా వెలుగొందుతున్నాయి. ఐదు నిమిషాలు ఛార్జ్ చేస్తే 400 కిలోమీటర్ల వెళ్లగల బ్యాటరీ, చార్జింగ్ వ్యవస్థలను బీవైడీ అభివృద్ధి చేసింది. విద్యుత్ వాహనాల అమ్మకాలు, ఆదాయంలో అది 'టెస్లా'ను దాటేసిందని బీబీసీ ఇటీవలే పేర్కొంది. విద్యుత్ ఆధారిత రంగాల్లో అగ్రగామిగా కొనసాగాలంటే నిరంతర విద్యుత్ అవసరం. ఆ అవసరాలు తీరేలా చైనా ఇలా కేంద్రక సంలీన, విచ్ఛిత్తి రియాక్టర్ పనిలో పడింది.

ఇలా పని చేస్తుంది

జియాన్‌గ్జీ ప్రావిన్సులోని యహోహూ సైన్స్ ద్వీపంలో ఝింగ్‌హువో పేరిట ఈ వినూత్న అణు విద్యుత్కేంద్రాన్ని కేంద్రాన్ని చైనా నిర్మిస్తోంది. చైనా భాషలో ఝింగ్‌హువో అంటే మెరుపు. కేంద్రక విచ్ఛిత్తిలో యురేనియం వంటి బరువైన అణువులోని కేంద్రకం రెండు చిన్న కేంద్రకాలుగా విడిపోతుంది. ఆ క్రమంలో అత్యధిక స్థాయిలో ఉష్ణశక్తి వెలువడుతుంది. అణుబాంబు తయారీలో ఉండేది ఈ సూత్రమే. అణు రియాక్టర్లలో నూ దీన్నే వాడతారు. అదే కేంద్రక సంలీన ప్రక్రియలో రెండు కేంద్రకాలు కలిసిపోయి ఒక్కటిగా మారతాయి. విచ్ఛిత్తితో పోలిస్తే సంలీన చర్యతోనే అత్యధిక విద్యుదుత్పత్తి సాధ్యం. ఝింగ్‌హువో రియాక్టర్‌లో తొలుత సంలీన చర్యలు జరిపి వాటి ద్వారా వచ్చే భారయుత కేంద్రకాల సాయంతో విచ్ఛిత్తి జరుపుతారు. తద్వారా మరింత ఎక్కువ విద్యుత్ ఉత్పత్తి సాధ్యమవుతుందని చైనా శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఐదేళ్లలో లక్ష్యాన్ని సాధించాలని భావిస్తున్నారు.

అత్యధిక 'క్యూ వాల్యూ'

అత్యధిక అణు విద్యుదుత్పత్తి జరగాలంటే కేంద్రక సంలీన చర్యలో అత్యధిక శక్తి ఉద్గారం జరగాలి. సంలీన ప్రక్రియలో విడుదలయ్యే అత్యధిక ఉష్ణశక్తిని రియాక్టర్ విద్యుత్ రూపంలోకి మారుస్తుంది. సంలీన ప్రక్రియకు వెచ్చించాల్సిన శక్తి కంటే దాన్నుంచి ఉత్పన్నమయ్యే శక్తి ఎక్కువగా ఉండటాన్ని 'నికర శక్తి లాభం'గా పిలుస్తారు. దాన్నే 'క్యూ వాల్యూ'గా చెప్తారు. సంలీన ప్రక్రియలో అత్యధికంగా ఏకంగా 30 క్యూ వాల్యూను సాధించాలని చైనా లక్ష్యంగా పెట్టుకున్నట్టు సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్ కథనం పేర్కొంది. మూడేళ్ల క్రితం అమెరికాలో కాలిఫోర్నియాలోని నేషనల్ ఇగ్నిషన్ ఫెసిలిటీ కేంద్రం 1.5 క్యూ వాల్యూను సాధించింది. ఫ్రాన్స్‌లోని ఇంటర్నేషనల్ థర్మో న్యూక్లియర్ ఎక్స్‌పరిమెంటల్ రియాక్టర్ (ఐటీఈఆర్) 10 క్యూ వాల్యూను సాధించే ప్రయత్నంలో ఉంది. అమెరికా, ఫ్రాన్స్ ఇప్పటికే కేంద్రక సంలీనం ద్వారా అణువిద్యుత్‌ను ఉత్పత్తి చేసేందుకు శ్రమిస్తున్నాయి. చైనా తాజా యత్నాలు ఫలిస్తే అది ఏకంగా 20 ఏళ్లు ముందుకు దూసుకెళ్లగలదని ఆంట్రప్రెన్యూర్ ఇన్‌ఫ్లుయెన్సర్ ఆర్నాడ్ బెర్‌ట్రెండ్ అభిప్రాయపడ్డారు.

- సాక్షి, నేషనల్ డెస్క్



భారతీయ కుటుంబ వ్యవస్థలో అనూహ్య మార్పులు

పెరుగుతున్న విడాకుల సంస్కృతి

- చిన్న కారణాలకూ కోర్టు కేసులు
- సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.వి.నాగరత్న ఆవేదన
- అమ్మాయిల వల్లేననడం సరికాదు
- సమాజం తీరు మారాలని హితవు

బెంగళూరు: భారత సమాజంలో కుటుంబ వ్యవస్థ అనూహ్య మార్పులకు లోనవుతోందని సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీవీ నాగరత్న అన్నారు. విడాకుల సంఖ్య కొంతకాలంగా క్రమంగా పెరిగిపోతోందంటూ ఆందోళన వెలిబుచ్చారు. ''రెండు దశాబ్దాలుగా 25–29 ఏళ్ల మధ్య వయసున్న యువతుల్లో అవివాహితుల సంఖ్య పెరుగుతోంది. మొత్తంగా అమ్మాయిల్లో సగటు వివాహ వయసు కూడా పెరుగుతోంది'' అని నేషనల్ జ్యుడీషియల్ డేటా గ్రిడ్ సమాచారాన్ని ఉటంకించారు. సుప్రీంకోర్టులో ఫ్యామిలీ కోర్టుల కమిటీకి చైర్‌పర్సన్ అయిన ఆమె 'కుటుంబం: భారతీయ సమాజానికి పునాది' పేరిట బెంగళూరులో జరిగిన దక్షిణాది ప్రాంతీయ సదస్సులో మాట్లాడారు. 'పట్టణీకరణ, మహిళల్లో పెరిగిన ఆర్థిక స్వేచ్ఛ, అందరికీ విద్య అందుబాటులో రావడం వంటి కారణాలతో కుటుంబాల్లో మార్పులొస్తున్నాయి. విద్య, సాధికారతతో మహిళలు సాధించిన సామాజిక, ఆర్థిక స్వాతంత్ర్యాన్ని సానుకూల దృక్పథంతోనే చూడాలి. వారు తమ కుటుంబానికి గాక దేశానికీ ఎనలేని సేవ చేస్తున్నారు'' అని ఆమె అన్నారు.

40 శాతం పెళ్లిళ్లు విచ్ఛిన్నం

కుటుంబ తగాదాల కేసులు పెరిగిపోతుండటం పట్ల జస్టిస్ నాగరత్న ఆవేదన వెలిబుచ్చారు. అందుకు మహిళలే కారణమన్న వాదనను ఆమె తోసిపుచ్చారు. సమాజ ధోరణి మారకపోవడం వంటివే అందుకు ప్రధానంగా కారణమని అభిప్రాయపడ్డారు. ''సామాజిక, ఆర్థిక పరిస్థితులకు తగ్గట్టు మారనప్పుడే వైవాహిక వివాదాలు తలెత్తుతాయి. గత పదేళ్లుగా జరిగిన పెళ్లిళ్లలో 40 శాతం దాకా విచ్ఛిన్నమయ్యాయి. ఇంతగా కుటుంబ కలహాల కేసులు వచ్చిపడుతుండటం ఫ్యామిలీ కోర్టులకు తలకు మించిన భారం అవుతోంది. బ్రేక్‌ఫాస్ట్ సరిగా చేయలేదనో, ఫంక్షన్‌కు త్వరగా ముస్తాబు కాలేదనో కూడా కోర్టు దాకా వస్తున్నారు. ఇలాంటి గొడవల వల్ల అంతిమంగా అందరికంటే ఎక్కువగా నష్టపోయేది పిల్లలే. కుటుంబ వివాదాలకు ఫ్యామిలీ కోర్టుల కంటే కౌన్సిలింగ్, మధ్యవర్తిత్వం ఉత్తమం. ఇరుపక్షాలూ సంయమనంతో ప్రయత్నిస్తే సమస్య పరిష్కారమవుతుంది. ముందు భార్యాభర్తలు పరస్పరం అర్థం చేసుకుని గౌరవించుకోవాలి. భాగస్వామి అవసరాలను అర్థం చేసుకోవాలి. సమస్యను అవతలి వ్యక్తి దృక్కోణం నుంచి చూడాలి. ''భార్య ఏమీ ఆశించకుండా ఇంటిల్లిపాది పనులూ ఒంటిచేత్తో చక్కబెడుతుందని భర్త గుర్తుంచుకోవాలి. ఆమెకు తగిన విలువ ఇస్తే పిల్లలూ మంచి వాతావరణంలో పెరుగుతారు'' అంటూ హితవు పలికారు.

రష్యా గ్యాస్ పైప్‌లైన్ మాకిచ్చేయండి

ఉక్రెయిన్‌కు అమెరికా ప్రతిపాదన

వాషింగ్టన్: 'మినరల్స్ ఫర్ వెపన్స్' ఒప్పందంలో భాగంగా ఉక్రెయిన్‌పై మరింత నియంత్రణకు అమెరికా ప్రయత్నిస్తోంది. ఉక్రెయిన్ భూభాగం నుంచి వెళ్లే రష్యా పైప్‌లైన్‌ను తమకు అప్పగించాలనే కొత్త డిమాండ్ ముందుకు తెచ్చింది. అరుదైన ఖనిజాలు, ఆయిల్, గ్యాస్ సహా ఉక్రెయిన్ విస్తారమైన వనరులను అమెరికా కంపెనీలకు అప్పగించాలని.. అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఒత్తిడి నేపథ్యంలో తాజా పరిణామాలు చోటు చేసుకున్నాయి. అమెరికా వైఖరిని ఉక్రెయిన్‌కు చెందిన సెంటర్ ఫర్ ఎకనామిక్ స్ట్రాటజీకి చెందిన సీనియర్ ఎకనమిస్ట్ వోలోదిమిర్ లాండా తప్పుబట్టారు. ఈ డిమాండ్లు వలసవాద తరహా ఒత్తిడిని తలపిస్తున్నాయని, వాటిని అంగీకరించే అవకాశం లేదని ఆయన చెప్పారు. సోవియట్ కాలం నాటి సహజ వాయువు పైప్‌లైన్ ఉక్రెయిన్ భూభాగం గుండా వెళ్తోంది. పశ్చిమ రష్యాలోని సుద్జా నుంచి స్లొవేకియా సరిహద్దుకు సమీపంలోని ఉక్రెయిన్ నగరం ఉజ్‌హోరోడ్ వరకు ఈ పైప్‌లైన్ ఉంది. ఇది యూరప్‌కు రష్యన్ గ్యాసు సరఫరా చేయడంలో కీలకంగా పనిచేస్తుంది. దీన్ని నియంత్రణలోకి తీసుకోవాలని యూఎస్ ప్రభుత్వ సంస్థ అయిన ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చూస్తోంది. రష్యా ప్రభుత్వ ఇంధన సంస్థ గాజ్‌ప్రోమ్‌తో ఉక్రెయిన్ ఐదేళ్ల ఒప్పందం గడువు ఈ ఏడాది జనవరితో ముగిసింది.

బెర్లిన్ తరహాలో విభజిద్దాం...

ఉక్రెయిన్‌ను బెర్లిన్‌లాగా విభజించవచ్చని అమెరికా ప్రత్యేక రాయబారి కీత్ కెల్లాగ్ సూచించారు. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత బెర్లిన్‌లో రష్యన్ జోన్, ఫ్రెంచ్ జోన్, బ్రిటీష్ జోన్, యూఎస్ జోన్ తరహాలో.. ఉక్రెయిన్‌లో యూకే, ఫ్రాన్స్ దళాలు పశ్చిమ ప్రాంతంలో భరోసాగా ఉంటాయన్నారు. ఆక్రమిత తూర్పు ప్రాంతంలో రష్యా సైన్యం ఉండవచ్చని, రెండింటి మధ్య ఉక్రెయిన్ దళాలతో సైనిక రహిత ప్రాంతం ఉంటుందని వెల్లడించారు. దీనిపై తీవ్ర వ్యతిరేకత రావడంతో తన మాటలను వక్రీకరించారన్నారు. ఉక్రెయిన్ సార్వభౌమత్వాన్ని కాపాడటమే తన లక్ష్యమన్నారు.

30 రోజుల్లో వెళ్లిపొండి

అక్రమ వలసదారులకు అమెరికా అల్టిమేటం ● లేదా భారీ జరిమానా, శిక్ష తప్పదని హెచ్చరిక

వాషింగ్టన్: అక్రమ వలసదారులకు ట్రంప్ సర్కారు మరోసారి తీవ్ర హెచ్చరికలు చేసింది. 30 రోజుల్లో దేశం విడిచి వెళ్లాలని అల్టిమేటమిచ్చింది. లేదంటే భారీ జరిమానాలు, జైలు శిక్షలు తప్పవని స్పష్టం చేసింది. బలవంతంగా స్వదేశానికి సాగనంపుతామని పేర్కొంది. 'అక్రమ విదేశీయులకు హెచ్చరిక' అంటూ హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం 'ఎక్స్'లో ఒక ప్రకటనను పోస్ట్ చేసింది. ''అక్రమ వలసదారులకు అధ్యక్షుడు ట్రంప్, హోమ్‌ల్యాండ్ విభాగం కార్యదర్శి క్రిస్టీ నోయెమ్ స్పష్టమైన సూచనలు చేశారు. తక్షణం అమెరికాను వీడండి. స్వీయ బహిష్కరణను సద్వినియోగం చేసుకోండి'' అంటూ ఆ సందేశాన్ని ట్రంప్, నోయెమ్ 'ఎక్స్' ఖాతాలకు ట్యాగ్ చేసింది. వెంటనే వెళ్లిపోతే వారికి కలిగే ప్రయోజనాలు, వెళ్లకుంటే ఎదుర్కోవాల్సిన విపరిణామాలను అందులో పేర్కొంది. అమెరికా గడ్డపై 30 రోజులకు మించి ఉన్న విదేశీయులంతా తక్షణం పేర్లను నమోదు చేసుకోవాలని ప్రభుత్వం ఇప్పటికే సూచించడం తెలిసిందే.

వెళితే ప్రయోజనాలెన్నో..

''ఇమిగ్రేషన్స్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బలవంతంగా పంపడం కంటే స్వీయ బహిష్కరణ అత్యంత ఉత్తమ మార్గం. సొంత ఖర్చులతో ఎంచక్కా విమానమెక్కి వెళ్లిపొండి. అప్పుడు మీపై ఎలాంటి నేరాభియోగాలూ ఉండవు. నేరచరిత్ర నమోదు కాదు. ఇన్నాళ్లూ మీరు సక్రమంగా సంపాదించిన సొమ్మును వెంట తీసుకెళ్లొచ్చు. మున్ముందు చట్టబద్ధంగా అమెరికాకు తిరిగొచ్చే అవకాశాలూ ఉంటాయి. విమానం టికెట్లు కొనే స్తోమత కూడా లేకుంటే మేమే రాయితీపై ఇప్పిస్తాం'' అంటూ స్వీయబహిష్కరణ ప్రయోజనాలను ప్రభుత్వం వెల్లడించింది.

లేదంటే కష్టాలే...

అమెరికాలోనే ఉంటే ఎలాంటి పరిస్థితులుంటాయో కూడా ప్రభుత్వం వెల్లడించింది. ''మీ జాడ తెలియగానే హోమ్‌ల్యాండ్ విభాగం మిమ్మల్ని అరెస్ట్ చేస్తుంది. తక్షణం వెళ్లిపోవాలని నోటీస్ అందుకున్న నాటి నుంచి రోజూ 998 డాలర్ల జరిమానా విధిస్తాం. వెళ్లిపోతామని చెప్పి కూడా వెళ్లని పక్షంలో రోజుకు 1,000 నుంచి 5,000 డాలర్ల వరకు జరిమానా విధిస్తాం. స్వీయబ హిష్కరణకు ఒప్పుకోకపోతే జైళ్లో పడేస్తాం. వీలైనంత ఎక్కువ శిక్ష పడేలా చేస్తాం. బలవంతంగా విమానాల్లో మీ దేశానికి తరిమేస్తాం. మరోసారి అమెరికా గడ్డపై కాలు మోపకుండా నిషేధం విధిస్తాం'' అని పేర్కొంది




హెచ్1బీ, విద్యార్థి వీసాదారులకు పెరగనున్న కష్టాలు

చిన్నపాటి ట్రాఫిక్ ఉల్లంఘన, విదేశీ డ్రైవింగ్ లైసెన్స్, గృహహింస తదితర కేసులను బయటకు తీసి విదేశీ విద్యార్థులను ఇప్పటికే అమెరికా నుంచి తిప్పి పంపేస్తుండటం తెలిసిందే. ఈ నేపథ్యంలో అక్రమ వలసదారులంతా 30 రోజుల్లోగా వెళ్లిపోవాలన్న తాజా అల్టిమేటంతో భారత హెచ్–1బీ వీసాదారులు, అంతర్జాతీయ విద్యార్థుల్లో భయాందోళనలు మరింత పెరిగాయి. ఏ కారణంతోనైనా హెచ్–1బీ, స్టూడెంట్ వీసాలు రద్దయితే కొత్త నిబంధన ప్రకారం 30 రోజుల్లోపు అమెరికాను వీడాలి. అలా ఉన్నపళంగా వెళ్లిపొమ్మంటే ఎలాగంటూ వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థులూ, జై శ్రీరామ్ అనండి

- మరో వివాదంలో తమిళనాడు గవర్నర్
- ఆరెస్సెస్ ప్రతినిధంటూ డీఎంకే, కాంగ్రెస్ ధ్వజం



చెన్నై: తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్.రవి మరోసారి వివాదాస్పదమయ్యారు. మదురైలోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం జరిగిన ఓ కార్యక్రమంలో ప్రసంగించిన గవర్నర్.. 'జై శ్రీరామ్' నినాదం చేయాలంటూ విద్యార్థులను ఆదేశించారు. కంబ రామాయణం రాసిన ప్రాచీన కవిని సన్మానించే కార్యక్రమంలో భాగంగా 'ఈ రోజున శ్రీరాముని భక్తుడైన వ్యక్తికి నివాళులు అర్పిద్దాం. నేను 'జై శ్రీరామ్' అంటాను. మీరూ చెప్పండి' అంటూ విద్యార్థులకు సూచించారు. దీనిపై అధికార డీఎంకే, కాంగ్రెస్ గవర్నర్ వ్యాఖ్యలపై మండిపడ్డారు. డీఎంకే ఆయనను ఆరెస్సెస్ అధికార ప్రతినిధిగా అభివర్ణించింది. గవర్నర్ మత నాయకుడిలా మాట్లాడుతున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్యే అసన్ మౌలానా విమర్శించారు. ఆర్ఎస్ఎస్, బీజేపీలకు ప్రచార మాస్టర్‌గా మారారని ఆరోపించారు.

బూట్లలో 6.7 కేజీల బంగారం

ముంబై విమానాశ్రయంలో ప్రయాణికుడి అరెస్టు

ముంబై: రూ.6.3 కోట్ల విలువైన 6.7 కేజీల బంగారాన్ని బూట్లలో దాచి తరలిస్తున్న ప్రయాణికుడిని ముంబై విమానాశ్రయంలో డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అరెస్టు చేసింది. బంగారాన్ని స్వాధీనం చేసుకుంది. శనివారం బ్యాంకాక్ నుంచి ఛత్రపతి శివాజీ మహారాజ్ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్న ఓ ప్రయాణికుడిని సాధారణ తనిఖీల్లో భాగంగా అధికారులు అడ్డుకున్నారు. పరిశీలించగా అతను ధరించిన బూట్లలో రూ.6.3 కోట్ల విలువైన 6.7 కిలోల బంగారు కడ్డీలు బయటపడ్డాయి. విచారణలో స్మగ్లింగ్ చేసిన బంగారాన్ని కొనుగోలు చేసే వ్యక్తి పేరు బయటకు వచ్చింది. అతన్ని కూడా డీఆర్ఐ అధికారులు అరెస్టు చేశారు.

ఆస్పత్రిపై బాంబుల వర్షం

గాజాపై కొనసాగిన ఇజ్రాయెల్ దాడులు

డెయిర్ అల్–బలాహ్: గాజాపై క్షేత్రస్థాయి దాడులను తీవ్రతరం చేసిన ఇజ్రాయెల్.. ఆదివారం మరో దారుణానికి ఒడిగట్టింది. గాజాలో పూర్తిస్థాయిలో పనిచేస్తున్న అతి పెద్ద, చిట్టచివరి ఆస్పత్రి అల్–అహ్లిపై ఇజ్రాయెల్ ఆదివారం ఉదయం క్షిపణులతో దాడి చేసింది. రెండు క్షిపణి దాడుల్లో ఆక్సిజన్‌పై ఉన్న ముగ్గురు రోగులు మరణించారు. ఆసుపత్రిలోని రెండంతస్తుల ప్రయోగశాల కూలిపోయింది. ఫార్మసీ, అత్యవసర విభాగ భవనాలు దెబ్బతిన్నాయి. సెయింట్ ఫిలిప్స్ చర్చి భవనం సహా చుట్టుపక్కల భవనాలకు కూడా నష్టం వాటిల్లింది. ఆస్పత్రిపై దాడి చేస్తామని ఇజ్రాయెల్ భద్రతా దళాల నుంచి కాల్ రావడంతో రోగులను ఖాళీ చేయిస్తుండగానే ఘటన జరిగింది. భయాందోళనకు గురైన రోగులు వీధుల్లోకి పరుగెత్తారు. క్రైస్తవులకు అత్యంత పవిత్రమైన వారమైన పామ్ సండే నాడు ఇజ్రాయెల్ చేసిన దాడిని ఆస్పత్రిని నిర్వహిస్తున్న జెరూసలేం డయోసిస్ ఖండించింది. దాడి సమయంలో వందలాది మంది రోగులున్నారని తెలిపింది. రోగులకు ఆక్సిజన్ కూడా లేకుండా పోయిందని, వారు చనిపోతారనే ఆందోళనగా ఉందని తెలిపింది.

మరో దాడిలో ఏడుగురు సోదరులు మృతి

కొన్ని గంటల తరువాత, సెంట్రల్ గాజాలోని డెయిర్ అల్–బలాహ్‌లో కారుపై జరిపిన ప్రత్యేక దాడిలో ఆరుగురు సోదరులు, వారి స్నేహితుడు మరణించారు. వారిలో 10 ఏళ్ల బాలుడు ఉన్నాడు. గాజాలోని పాలస్తీనియన్లకు ఆహారాన్ని పంపిణీ చేసే స్వచ్ఛంద సంస్థలో పనిచేస్తున్న తన కొడుకులను చంపారని వారి తండ్రి ఇబ్రహీం అబూ మహదీ వాపోయారు. ఏం పాపం చేశారని తనపిల్లలను చంపారంటూ రక్తసిక్తమైన కారులో ఉన్న మృతదేహాలపై పడి కన్నీరుమున్నీరుగా విలపించారు. గత 24 గంటల్లో 11 మంది చనిపోయారని, 100 మందికి పైగా గాయపడ్డారని గాజా ఆరోగ్య శాఖ తెలిపింది.



ధ్వంసమైన అల్–అహ్లి ఆస్పత్రి భవనం

హమాస్ కేంద్రంగా ఉపయోగిస్తున్నందుకే..

ఉగ్రవాద సంస్థ హమాస్ కమాండ్ అండ్ కంట్రోల్ కేంద్రాలుగా ఉపయోగిస్తున్నందునే ఆయా ప్రాంతాలపై దాడి చేశామని ఇజ్రాయెల్ సైన్యం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ ప్రాంతంలో ముందస్తు హెచ్చరికలు అందించడం సహా పౌరులకు, ఆసుపత్రికి హాని కలిగించే అవకాశాలను తగ్గించడానికి చర్యలు తీసుకున్నట్లు ఎక్స్‌లో పేర్కొంది. హమాస్‌ను తుదముట్టించాలంటే ఆస్పత్రులతో సహా పౌర మౌలిక సదుపాయాలపై దాడులు అవసరమని ఇజ్రాయెల్ గతంలో పేర్కొంది. అయితే, తన వాదనలకు మద్దతు ఇచ్చే ఆధారాలను మాత్రం చూపలేదు.

మనువుతో మతిమరుపే!

ఒంటరివాళ్లకు ఆ ముప్పు తక్కువ ● తాజా అధ్యయనంలో వెల్లడి


వేల మందిపై అధ్యయనం తర్వాత..

అమెరికాలోని ఫ్లోరిడా రాష్ట్ర విశ్వవిద్యాలయం ఈ పరిశోధన జరిపింది. ఇందుకోసం అమెరికాలో 24,000 మందిని ఎంపికచేశారు. వాళ్లందరినీ 18 ఏళ్లపాటు అధ్యయనం చేశారు. పెళ్లయిన వాళ్లు, విడాకులైన వాళ్లు, బ్రహ్మచారులు, జీవితభాగస్వామి అనారోగ్యంతో కన్నుమూసిన వారిని పరిశోధనకు ఎంచుకున్నారు. మతిమరుపు లక్షణాలు లేని వాళ్లను మాత్రమే అధ్యయనం కోసం ఎంపికచేశారు. పెళ్లికాని వాళ్లను మూడు గ్రూప్‌లుగా విభజించి ఆరోగ్య పరిస్థితిని అంచనావేశారు. పెళ్లయిన వాళ్లతో పోలిస్తే వారికి మతిమరుపు ముప్పు తక్కువగా ఉన్నట్లు పరిశోధనలో తేలింది. పొగ తాగడం, కుంగుబాటు వంటివి ఫలితాలను తీవ్రంగా ప్రభావితం చేస్తాయని పరిశోధకులు చెప్పారు. పెళ్లయిన వాళ్లతో పోలి స్తే పెళ్లయి విడాకులు తీసుకున్న వాళ్లు, అస్సలు పెళ్లిచేసుకోని వాళ్లలో మతిభ్రంశం ముప్పు తక్కువగా ఉందని బయటపడింది. పెళ్లికాని వ్యక్తుల్లో అల్జీమర్స్ తరహా డిమెన్షియా ముప్పు తక్కువగా ఉంది. అయితే డిమెన్షియాలోఅరుదైన రకమైన వాస్కులర్ చిత్తవైకల్యం ముప్పు వివరాలు వెల్లడికాలేదు.

ఒంటరితనంతో బాధపడేవారు కొన్ని విషయాలనే పదేపదే ఆలోచిస్తూ మిగతా వాటిని మర్చిపోతారనే వాదన ఉంది. కానీ అందులో అస్సలు నిజం లేదని తాజా అధ్యయనం ఒకటి బల్లగుద్ది చెబుతోంది. సోలో బతుకే సో బెటరు అంటోంది. పెళ్లకాని ప్రసాదుల్లో మతిమరుపు లక్షణాలు తక్కువని చెబుతోంది. వైవాహిక బంధానికి బీటలు పడి మళ్లీ ఒంటరయ్యే వాళ్లలో కూడా మతిమరుపు బారిన పడే అవకాశాలు బాగా తగ్గుతున్నట్టు కూడా ఈ పరిశోధనలో వెల్లడైంది.

విడాకులు తీసుకున్న వాళ్లలో

విడాకులు తీసుకున్న వాళ్లు, అస్సలు పెళ్లిచేసుకోని వాళ్లలో అభిజ్ఞానవికాసం క్షీణించి డిమెన్షియా బారినపడే అవకాశాలు తక్కువగా ఉంటాయని వెల్లడైంది. అధ్యయనకాలంలో జీవిత భాగస్వామి చనిపోవడంతో ఒంటరిగా మారిన వ్యక్తుల్లోనూ మనోభ్రంశం ముప్పు తక్కువగా ఉండటం విశేషం.



మెదడు పనితీరు ఎంత కీలకమైందో ఈ పరిశోధనలో మరోసారి స్పష్టమైంది. వైవాహిక జీవితంలో ఎదురయ్యే అనూహ్య పరిణామాలు, కష్టాలు, రాజీపడటం, కీలకమైన నిర్ణయాలు అనేవి మెదడు ఆరోగ్యంపై ప్రభావం చూపిస్తాయి. పెళ్లిచేసుకుంటే హాయిగా ఉంటాం అనేది నిజం కాదని, పెళ్లాయ్యాక కూడా హాయిగా ఉండగల్గితేనే మెదడు ఆరోగ్యం బాగుంటుందని పరిశోధన పునరుద్ఘాటించింది. జీవితభాగస్వామిని కోల్పోయిన వాళ్లు, విడాకులు తీసుకున్న వాళ్లు ఎంతో వేదనకు గురవుతారన్న అభిప్రాయాన్ని సవాల్ చేసేలా ఈ పరిశోధనా ఫలితాలు రావడం గమనార్హం.

- సాక్షి, నేషనల్ డెస్క్

సహకారోద్యమాన్ని దెబ్బ తీసింది

కాంగ్రెస్‌పై అమిత్ షా విమర్శలు



భోపాల్: గత కాంగ్రెస్ ప్రభుత్వాల నిష్క్రియాపరత్వం కారణంగా దేశంలో సహకార ఉద్యమం తీవ్రంగా దెబ్బతిందని హోం మంత్రి అమిత్ షా వ్యాఖ్యానించారు. మోదీ ప్రభుత్వం నిర్ణయాత్మక చర్యలు తీసుకునే సమయానికి సహకార ఉద్యమం దాదాపు మృతదశలో ఉందన్నారు. సహకార రంగాన్ని బలోపేతం చేసేందుకు గత ప్రభుత్వాలు ఎన్నడూ ప్రయత్నించలేదని ఆరోపించారు. అవసరమైన చట్టాలు చేయలేదని తెలిపారు. భోపాల్‌లో ఆదివారం జరిగిన ఓ సదస్సులో అమిత్ షా ప్రసంగించారు. ఈ రంగంలో సానుకూల మార్పును తీసుకువచ్చేందుకు ప్రధాని మోదీ సహకార శాఖను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారన్నారు.

రష్యా క్షిపణి దాడుల్లో 34 మంది మృతి

కీవ్: ఉక్రెయిన్‌పై రష్యా మరోసారి భీకర క్షిపణి దాడులకు పాల్పడింది. సుమీ నగరం నడిబొడ్డున ఆదివారం జరిపిన వరుస దాడుల్లో కనీసం 34 మంది మృత్యువాత పడగా 117 మంది క్షతగాత్రులయ్యారు. ఉదయం 10.15 గంటల సమయంలో జనావాసాలున్న ప్రాంతంలో పామ్ సండే వేడుకల్లో పాల్గొన్న వారిపై పడ్డాయి. వీటి పేలుడు తీవ్రతకు ఆ ప్రాంతం మొత్తం దట్టమైన పొగకమ్ముకుని భీతావహంగా మారింది. ఇద్దరు చిన్నారులు సహా 34 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 15 మంది చిన్నారులు సహా 117 మంది గాయపడ్డారు. భవనాలు శిథిలాల దిబ్బగా మారింది. నుజ్జయిన వాహనాల నుంచి మంటలు చెలరేగాయి. ఇందుకు సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో ప్రత్యక్షమయ్యాయి. ఈ దాడులపై ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ మండిపడ్డారు. రష్యాను ఉగ్రవాదిగా పరిగణిస్తూ చర్యలు తీసుకోవాలని పశ్చిమ దేశాలకు విజ్ఞప్తి చేశారు. కాల్పుల విరమణకు తూట్లు పొడుస్తున్నారంటూ రష్యా, ఉక్రెయిన్ పరస్పరం ఆరోపణలు చేసుకున్న మరునాడే ఈ ఘటన చోటుచేసుకోవడం గమనార్హం.

సాక్షి
హైదరాబాద్
సోమవారం । 14 । ఏప్రిల్ । 2025



సిటీలో జోనల్ సైబర్ సెల్స్

సైబర్ బాధితులకు మరింత ఊరట ఇచ్చేలా నగర పోలీసులు కీలక నిర్ణయం తీసుకున్నారు. ప్రతి జోన్‌కూ ఒక జోనల్ సైబర్ సెల్ (జెడ్‌సీసీ) ఏర్పాటు చేస్తున్నారు. -8లో



మ్యూజిక్ థెరపీ.. జెంబే..

ఒత్తిడి నుంచి విముక్తికి ఆఫ్రికన్ డ్రమ్ 'జెంబే' దోహదపడుతోంది. మ్యూజిక్ థెరపీలో భాగంగా దీనిని నగరవాసులు ఆస్వాదించడం పెరుగుతోంది. - సిటీప్లస్‌లో

గరిష్టం/కనిష్టం
38.0/26.0

వాతావరణం

నగరంలో సోమవారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్టంగా 38, కనిష్టంగా 26 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముంది.

ప్రాణం తీసిన తనిఖీల భయం

- ట్రాఫిక్ పోలీసులను చూసి.. బైక్ వెనక్కి మళ్లించి వెళ్తుండగా ప్రమాదం
- ఆర్టీసీ బస్సు కిందపడి వ్యక్తి దుర్మరణం


జోషిబాబు (ఫైల్)

బాలానగర్: బాలానగర్ డివిజన్ పరిధిలోని ఐడీపీఎల్ పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా ఓ వ్యక్తి తన బైక్‌ను వేగంగా వెనక్కి మళ్లించి వేగంగా వెళ్లే క్రమంలో ఆర్టీసీ బస్సు కింద పడి మృతి చెందిన ఘటన బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. సీఐ నరసింహ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. షాపూర్ నగర్‌లో నివసించే జోషిబాబు (35) కార్పెంటర్ పని చేస్తున్నాడు. జీడిమెట్ల నుంచి బాలానగర్ వైపు వస్తున్న క్రమంలో ట్రాఫిక్ పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్నారు. వీరిని చూసి భయపడి తిరిగి వేగంగా వెనక్కి వెళ్లే క్రమంలో తన ద్విచక్ర వాహనం పడిపోయింది. దీంతో అతని తలపై నుంచి ఆర్టీసీ దూసుపోయింది. తల ఛిద్రమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తమ్ముడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు బాలానగర్ పోలీసులు తెలిపారు.

ఆద్యంతం.. ఉత్సాహభరితం..



గచ్చిబౌలి: వాక్ ఏ వే 2.0 కార్యక్రమం ఆదివారం ఆద్యంతం ఉత్సాహభరితంగా నిర్వహించారు. గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో జరిగిన ఈ కార్యక్రమంలో 3 వేల మందికి పైగా స్వచ్ఛందంగా పాల్గొన్నారు. ఆటిజంపై అవగాహన, అంగీకారం, సమగ్ర చేర్పునకు సంఘీభావంగా నిలిచారు. అందరినీ ఒక్కతాటిపై ఉంచి సమాజంలో లోతైన స్ఫూర్తిని నింపింది. మర్ఖం, రెసొనేటింగ్ రెసిలియన్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలు కుటుంబాలు, నిపుణులు, ఉపాధ్యాయులు, సోషల్ మీడియా స్టార్‌లు, సంస్కరణవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సినీనటి పాయల్ రాధాకృష్ణ, పద్మశ్రీ డాక్టర్ మంజుల అనగాని, టీఎస్ఎంసీ అధ్యక్షురాలు డా.ప్రతిభ, డా.మిన్హాజ్, డా.లోకేశ్ ఆర్జే షదాబాద్ పాల్గొని సంఘీభావం ప్రకటించారు. అంతకుముందు విజయతుపురాణి ఆధ్వర్యంలో ఎనర్జీతో నిండిన డాన్స్ హిట్ సెషన్, సుధారమణి కథ చెప్పడం, రోహిణి జయంతి చేసిన మనోహరమైన బొమ్మల షో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. రంగుల హరివిల్లులా కార్నివాల్, ఆటలు, సృజనాత్మక స్టాల్స్ అందరినీ ఆకట్టుకున్నాయి. మర్ఖం వ్యవస్థాపకుడు డాక్టర్ నవత్ లఖాని మాట్లాడుతూ.. ఎదుగుతున్న పిల్లలకు స్నేహితులు, కుటుంబం మద్దతు ఉంటుందనే భరోసాతో తల్లిదండ్రులు ఉంటారన్నారు. కానీ ఆటిజం ఉన్న పిల్లల తల్లిదండ్రులకు ఆ భరోసా సులభంగా లభించదు. సమాజం ముందుకు రావాల్సిన సమయం ఇదేనన్నారు.









ఎండలతో గాయ్ గాయ్.. నీళ్లల్లో హాయ్ హాయ్!

ఎండలు దంచికొడుతున్నాయి. వేసవి తాపం తీవ్రత పెరిగింది. ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పెరుగుతుండడంతో నగరవాసులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. సేద తీరేందుకు మార్గాలను అన్వేషిస్తున్నారు. కొద్ది రోజులుగా నగరంలోని జల విహార్‌కు క్యూ కడుతున్నారు. ఆదివారం సెలవు కావడంతో జల విహార్‌కు తాకిడి మరింత పెరిగింది. జలకాలాటలతో జరంత ఉపశమనం పొందారు.

చకచకా..

పాతబస్తీలో శరవేగంగా మెట్రో విస్తరణ పనులు

పాతబస్తీ మెట్రోరైల్ విస్తరణలో భాగంగా ఆస్తుల సేకరణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ఇప్పటి వరకు 205 ఆస్తుల సేకరణ పనులు పూర్తయ్యాయి. బాధిత కుటుంబాలకు రూ.212 కోట్ల పరిహారం చెల్లించినట్లు హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. ఇప్పటి వరకు పాత బస్తీలోని లహోటీ బిల్డింగ్, అక్బర్ ఫంక్షన్ హాళ్లను తొలగించారు. షబ్బార్ కేఫ్, మీనా ప్లాజా, పిస్తాహౌజ్, స్వాగత్ హోటల్, ఆక్వా ప్యూరిఫైర్ షాప్, అక్బర్ మెకానిక్ షాప్, లిల్లీరోజ్ స్కూల్ భవనాల కూల్చివేత పనులు కొనసాగుతున్నాయని ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు.
–సాక్షి, సిటీబ్యూరో

- కొనసాగుతున్న నిర్మాణాల కూల్చివేతలు
- ఇప్పటి వరకు 205 ఆస్తుల సేకరణ
- బాధిత కుటుంబాలకు రూ. 212 కోట్ల పరిహారం
- మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి వెల్లడి


విస్తరణలో భాగంగా కొనసాగుతున్న భవనాల కూల్చివేతలు

1,100 ఆస్తుల గుర్తింపు..

- మెట్రో రెండో దశలో భాగంగా ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 7.5 కిలోమీటర్ల మార్గంలో మెట్రో నిర్మాణం చేపట్టనున్న సంగతి తెలిసిందే. ఈ మేరకు హెచ్ఏఎంఆర్ఎల్ పనులు చేపట్టింది. గత ఏడాది క్షేత్ర స్థాయిలో భూమి సర్వే, మెట్రో కారిడార్ మార్కింగ్ అనంతరం ఆస్తుల సేకరణ, రోడ్డు విస్తరణపై అధికారులు దృష్టి సారించారు. 7.5 కిలోమీటర్ల మార్గంలో మొత్తం 1,100 ఆస్తులను గుర్తించిన సంగతి తెలిసిందే. చదరపు గజానికి రూ.8,1000 నుంచి రూ.లక్ష చొప్పున ధర నిర్ణయించి పరిహారం చెల్లించేందుకు చర్యలు చేపట్టారు. అదే క్రమంలో కూల్చివేత పనులు కూడా కొనసాగుతున్నాయి.

అత్యంత అప్రమత్తంగా..

ప్రస్తుతం వివిధ చోట్ల రోడ్లకు రెండు వైపులా చిక్కు ముడులుగా ఉన్న కొన్ని క్లిష్టమైన విద్యుత్, టెలిఫోన్ కేబుళ్లను అత్యంత అప్రమత్తంగా తొలగించి తమ ఇంజినీరింగ్ సిబ్బంది మార్గాన్ని సుగమం చేశారని మెట్రో ఎండీ వెల్లడించారు. మెట్రో అధికారులతో పాటు, రెవిన్యూ, పోలీసుల పర్యవేక్షణలో మెట్రో మార్గం విస్తరణ పనులు చురుగ్గా కొనసాగుతున్నాయన్నారు. ప్రభావిత ఆస్తుల యజమానులు స్వచ్ఛందంగా స్పందించి ముందుకు వస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన నష్ట పరిహారాన్ని ఆమోదించి తమ ఆస్తులను మెట్రో మార్గం కోసం ఇచ్చారని చెప్పారు.


విద్యుత్ తీగల పునరుద్ధరణ

7.5 కిలోమీటర్లకు రూ.2,714 కోట్లు

మెట్రో రెండో దశలో మొదటి 5 కారిడార్‌లకు రూ.24,269 కోట్లతో సమగ్రమైన ప్రాజెక్టు నివేదికలను రూపొందించారు. ఇందులో భాగంగా ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు నిర్మించనున్న 7.5 కిలోమీటర్ల మెట్రో నిర్మాణంలో భాగంగా ఆస్తులు కోల్పోయిన వారికి చెల్లించే పరిహారం కాకుండా సుమారు రూ.2,714 కోట్లు ప్రాజెక్టు ఖర్చు కానున్నట్లు అంచనా. దీంతో జూబ్లీబస్‌స్టేషన్ నుంచి నేరుగా చాంద్రాయణగుట్ట వరకు రాకపోకలు సాగించేందుకు అవకాశం లభిస్తుంది. అలాగే.. చార్మినార్‌తో పాటు వివిధ ప్రాంతాలను సందర్శించేందుకు వచ్చే జాతీయ, అంతర్జాతీయ పర్యాటకులకు మెట్రో రైల్ రవాణా సదుపాయాన్ని అందజేయనుంది. చాంద్రాయణగుట్ట నుంచి ఎయిర్‌పోర్టు వరకు మెట్రో విస్తరించనున్న సంగతి తెలిసిందే. చాంద్రాయణగుట్ట వద్ద అమీర్‌పేట్ తరహాలో అతిపెద్ద టెర్మినల్ ఏర్పాటు చేయనున్నారు. ఇటు జేబీఎస్ వద్ద అంతర్జాతీయ ప్రమాణాల మేరకు మెట్రో హబ్‌ను ఏర్పాటు చేసి రెండో దశలోనే నార్త్‌సిటీకి మెట్రో విస్తరణ చేపట్టాలనేది ప్రభుత్వ ప్రతిపాదన. నార్త్ సిటీతో పాటు, ఫోర్త్ సిటీ మెట్రో కారిడార్‌ల డీపీఆర్‌లను త్వరలోనే ప్రభుత్వానికి అందజేయనున్నట్లు అధికారులు తెలిపారు.

కేంద్రం అనుమతి రాగానే..

ఇప్పటికే రోడ్డు విస్తరణ కోసం పలు భవనాలు, కట్టడాలను కూల్చివేసి నిర్మాణ వ్యర్థాలను కూడా తొలగించినట్లు పేర్కొన్నారు. మరోవైపు సున్నితమైన కట్టడాలకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా అన్ని విధాలా జాగ్రత్తలు తీసుకున్నట్లు ఎన్వీఎస్ రెడ్డి స్పష్టం చేశారు. రంజాన్ సందర్భంగా విస్తరణ పనుల వేగం కొంత తగ్గినప్పటికీ, ప్రస్తుతం తిరిగి వేగం పుంజుకున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు త్వరితగతిన పాత నగరం విస్తరణ పనులు పూర్తి చేసి, కేంద్రం అనుమతి లభించిన వెంటనే మెట్రో నిర్మాణ పనులను ప్రారంభిస్తామన్నారు.

గుంతలో పడిన బంతి తీస్తుండగా..
పైనుంచి లిఫ్టు పడి వ్యక్తి మృతి


అక్బర్ పటేల్ (ఫైల్)


అపార్ట్‌మెంట్ ఎదుట ఆందోళన

సుభాష్‌నగర్: గుంతలో పడిన బంతిని తీసే క్రమంలో పైనుంచి లిఫ్టు పడి ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన ఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం .. సూరారం డివిజన్ శ్రీకృష్ణనగర్‌లోని శ్రీ సాయి మణికంఠ రెసిడెన్సీ మొదటి అంతస్తులో నివసించే అక్బర్ పటేల్ (39) ఆర్ఎంపీ. ఆదివారం సాయంత్రం 4 గంటల సమయంలో అపార్ట్‌మెంట్ సెల్లార్‌లో పిల్లలు ఆడుతుండగా బంతి లిఫ్ట్ గుంతలో పడిపోయింది. బంతిని తీసేందుకు అక్బర్ పటేల్ లిఫ్ట్ గుంతలో తలపెట్టి తీస్తుండగా ఈ క్రమంలో ఒక్కసారిగా లిఫ్టు అతనిపై పడి అక్కడికక్కడే మృతి చెందాడు. అక్బర్ పటేల్ స్వస్థలం కర్ణాటకలోని గుల్బర్గా. 15 ఏళ్లుగా స్థానికంగా ఆర్ఎంపీగా పని చేస్తున్నాడు. అక్బర్ పటేల్‌కు భార్య బిస్మిల్లా పటేల్, 7 ఏళ్ల లోపు ముగ్గురు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. అక్బర్ మృతికి బిల్డర్ నిర్లక్ష్యమే కారణమని ఆరోపిస్తూ అతడి కుటుంబ సభ్యులు అపార్ట్‌మెంట్ వద్ద ఆందోళనకు దిగారు. బాధిత కుటుంబానికి నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

సూరారం చౌరస్తాలో ఆందోళన..

అనంతరం సూరారం పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా చేశారు. ఆ తర్వాత రాత్రి 8.40 గంటలకు సూరారం చౌరస్తాలో గంట పాటు ధర్నాకు దిగగా రోడ్డుకు ఇరువైపులా ట్రాఫిక్ స్తంభించింది. అటు గండిమైసమ్మ చౌరస్తా, ఇటు ఐడీపీఎల్ వరకు భారీ ఎత్తున వాహనాల రాకపోకలు స్తంభించడంతో పోలీసులు రంగ ప్రవేశం చేశారు. సదరు బిల్డర్‌పై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. బాధిత కుటుంబానికి కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ మద్దతు పలికారు.



'ట్రాఫిక్ జాం'జాటం

నగరంలో ఏ మూల ఆందోళన జరిగినా ట్రాఫిక్ జాంతో వాహనదారులకు తిప్పలు తప్పడంలేదు. ఆదివారం వక్ఫ్ (సవరణ) చట్టానికి వ్యతిరేకంగా నిర్వహించిన ర్యాలీతో బషీర్‌బాగ్ నుంచి ట్యాంక్‌బండ్ అంబేడ్కర్ విగ్రహం వరకు వాహనాల రాకపోకలు స్తంభించిపోయాయి.



మోటారు బిగిస్తే బాదుడే

మొబైల్ యాప్‌తో రేపటి నుంచే రంగంలోకి

మూడు రోజుల క్రితం నగరంలోని మూసారం బాగ్ సెక్షన్ పరిధిలోని శాలివాహన నగర్ రోడ్ నంబర్ 12,13,14 ప్రాంతాల్లో నల్లా పైపులైన్‌కు విద్యుత్ మోటార్లు బిగించి నీటిని అక్రమంగా తోడుతున్న వినియోగదారులను జలమండలి విజిలెన్స్ సిబ్బంది గుర్తించారు. వెంటనే ఆ మోటార్లను సీజ్ చేశారు. మంగళవారం నుంచి జరిమానాలు కూడా విధించనున్నారు.

- సమ్మర్‌లో ట్యాప్ వాటర్ లోప్రెషర్‌కు చెక్
- స్పెషల్ డ్రైవ్‌కు జలమండలి చర్యలు

సాక్షి, సిటీబ్యూరో: తాగునీటి నల్లాకు మోటార్ బిగిస్తే.. పెనాల్టీ బాదుడు తప్పదు. మంగళవారం నుంచి మోటార్ ఫ్రీ ట్యాప్ వాటర్ లక్ష్యంగా కనెక్షన్ టు కనెక్షన్ సర్వేకు జలమండలి సిద్ధమైంది. క్షేత్ర స్థాయిలో నల్లా నీటి సరఫరా సమయంలో జనరల్ మేనేజర్ నుంచి వాటర్ లైన్‌మన్ వరకు ప్రత్యేక మొబైల్ యాప్‌తో పర్యటిస్తారు. నల్లాకు విద్యుత్ మోటార్లు బిగించినట్లు గుర్తిస్తే.. ఫొటో తీసి మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ చేయనున్నారు. తక్షణమే ఆటోమెటిక్‌గా ఆ కన్స్యూమర్ కనెక్షన్ (క్యాన్ నంబర్) అకౌంట్‌లో పెనాల్టీ రూ.5 వేలు జమ కానుంది. మరోవైపు జలమండలి విజిలెన్స్ బృందం దాడులు నిర్వహించి మోటార్ సీజ్ చేసే విధంగా జలమండలి చర్యలు చేపట్టింది. మరోవైపు నల్లా నీటిని తాగడానికి కాకుండా ఫ్లోర్లు కడగడం, వాహనాలు శుభ్రం చేయడం, గార్డెనింగ్, ఓవర్ హెడ్ ట్యాంక్ నుంచి ఓవర్ ఫ్లో, నిర్మాణ పనుల కోసం వృథా చేస్తూ గుర్తించినా ఫొటో తీసి మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ చేసే విధంగా జలమండలి ఆదేశాలు జారీ చేసింది. క్యాన్ నంబర్ అకౌంట్‌లో జమ జరిగే పెనాల్టీని తదుపరి నెల బిల్లులో చెల్లించాల్సి ఉంటుంది. లేకుంటే జరిమానా మొత్తంపై వడ్డీ బాదుడు తప్పదని జలమండలి వర్గాలు హెచ్చరిస్తున్నాయి.

లోప్రెషర్ ఫిర్యాదులతో..

తాగునీటి సరఫరాలో ఎలాంటి కొరత లేనప్పటికి కొందరు వినియోగదారులకు లో ప్రెషర్‌తో నీటి సరఫరా ప్రధాన సమస్యగా తయారైంది. రోజురోజుకూ మెట్రో కస్టమర్ సెంటర్ (ఎంసీసీ)కు ఫిర్యాదుల తాకిడి పెరగడంతో ఇటీవల జలమండలి వాస్తవ పరిస్థితిని థర్డ్ పార్టీ ద్వారా ఆరా తీసింది. నీటి సరఫరా సమయంలో నల్లాలకు మోటార్లు బిగిస్తున్నట్లు గుర్తించింది. నీటి ప్రెషర్ కోసం కోసం వినియోగించే సాధారణ మోటార్లతో పాటు తాజాగా మార్కెట్‌లో వచ్చిన ఆటోమేటిక్ మోటార్లు కూడా వినియోగిస్తుండటంతో హైస్పీడ్ ప్రెషర్ పెరిగి దిగువ, చివరి కనెక్షన్‌దారులకు నీటి సరఫరా అంతంత మాత్రంగా వస్తున్నట్లు బయటపడింది. నల్లాలకు బిగించే సాధారణ మోటార్లు ఆన్ చేస్తే పని చేస్తుండగా, ఆటోమెటిక్ మోటర్లు నల్లా సరఫరా సమయంలో ఆటోమేటిక్‌గా పని చేస్తుండటంతో మిగతా కనెక్షన్లకు సరఫరాలో ఒత్తిడి తగ్గినట్లు గుర్తించింది.

మోటార్లకు చెక్

సాధారణ స్థాయి ఒత్తిడితో నీటి సరఫరా జరిగే విధంగా మోటార్ ఫ్రీ ట్యాప్ వాటర్‌కు జలమండలి సిద్ధమైంది. అందులో భాగంగా ఈ నెల 15 నుంచి 45 రోజులు వాటర్ స్పెషల్ డ్రైవ్ అమలుకు సంసిద్ధమైంది. నీటి నల్లాలకు విద్యుత్ మోటార్లను బిగించి అక్రమంగా నీటిని తోడుతున్న వారికి జరిమానా విధించడానికి ప్రత్యేక మొబైల్ యాప్‌ను రూపొందించింది. ఈ యాప్‌ని జీఎం నుంచి క్షేత్ర స్థాయిలోని లైన్‌మెన్ల వరకు అందుబాటులోకి తెచ్చింది. అక్రమంగా మోటార్లను బిగించినా.. నీటి వృథా చేస్తున్న వినియోగదారులను గుర్తించి ఫొటోతో సహా యాప్‌లో అప్‌లోడ్ చేసి సదరు కనెక్షన్‌కు ట్యాగ్ చేస్తే చాలు.. కన్స్యూమర్ ఖాతాలో పెనాల్టీ పడుతుంది. దీంతో నల్లాకు విద్యుత్ మోటార్లు బిగించడం తగ్గుతుందని జలమండలి భావిస్తోంది.



జలమండలి పరిధిలో నీటి సరఫరా ఇలా..

ప్రాంతం	ఎంజీడీ
కోర్‌సిటీ	235.05
జీహెచ్ఎంసీ శివారు	203.98
ఓఆర్ఆర్	61.26
ట్రాన్స్‌మిషన్ డివిజన్	41.80

మహనీయుల జీవితాలపై చర్చ జరగాలి

మంత్రి పొన్నం ప్రభాకర్



మహనీయుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

ఉస్మానియా యూనివర్సిటీ: మహనీయుల జీవితాలు, ఆశయాలు, ఆలోచనలపై లోతైన చర్చ, మేధోమథనం జరగాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఓయూలో నాలుగు రోజులుగా జరుగుతున్న మహాత్మ జ్యోతిబా పూలే, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మాజీ ప్రధాని డా.బాబుజగ్జీవన్‌రామ్ జయంతి ఉత్సవాలు ఆదివారం ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్యఅతిథిగా హాజరై మహనీయుల చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ సామాజిక స్ఫూర్తితో రాష్ట్రంలో ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లు ఆమోదించామన్నారు. విశ్వవిద్యాలయాల్లో విద్యార్థి సంఘాల ఎన్నికలు జరగాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆకాంక్షించారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని, త్వరలో జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయనున్నట్లు చెప్పారు. ఓయూ ఎస్సీ ఎస్టీ సెల్, బీసీ సెల్, మైనార్టీ సెల్, యూజీసీ వ్యవహారాల డీన్ కార్యాలయం ఆధ్వర్యంలో గత నాలుగు రోజులుగా జరిగిన కార్యక్రమాలను వీసీ ప్రొ.కుమార్ వివరించారు.

ఉప్పల్ స్టేడియంలో సెల్‌ఫోన్ దొంగల చేతివాటం

ఉప్పల్: ఉప్పల్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో శనివారం అభిమానులు ఆనందంలో మునిగి తేలగా సెల్‌ఫోన్ దొంగలు చేతి వాటం చూపించారు. స్టేడియం భద్రతలో దాదాపుగా 3 వేలకు పైగా పోలీసులు పహారా కాస్తున్నా వారిని లెక్క చేయకుండా సెల్‌ఫోన్ దొంగలు హాల్‌చల్ సృష్టించారు. వందలాది సెల్ ఫోన్‌లను దొంగిలించడంతో బాధితులు లబోదిబో మంటూ ఉప్పల్ పోలీసులను ఆశ్రయించినట్లు తెలిసింది. హైదరాబాద్ సన్ రైజర్స్ ఆటగాడు అభిషేక్ శర్మ పరుగుల వరద సృష్టించిన ఆనందంలో ప్రేక్షకులుండగా..దొంగలు చేతి వాటం చూపించినట్లు తెలిసింది. ఐపీఎల్ చరిత్రలోనే ఇంతగా సెల్‌ఫోన్లు దొంగిలించిన సంఘటన బహుశా ఇదే మొదటి సారి కావచ్చంటున్నారు. ఈ విషయంలో ఉప్పల్ సిఐ ఎలక్షన్ రెడ్డిని వివరణ కోరగా దాదాపుగా 15 నుంచి 20 మంది మాత్రం ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

సిటీలో జోనల్ సైబర్ సెల్స్

ఏడింటిని ఏర్పాటు చేయాలని నిర్ణయం
- ఠాణాల్లో నమోదైన కేసుల దర్యాప్తు కోసమే
- సిబ్బందికి శిక్షణనిచ్చిన సైబర్ పోలీసులు
- త్వరలో ప్రారంభించడానికి సీపీ సన్నాహాలు



సాక్షి, సిటీబ్యూరో: సైబర్ బాధితులకు మరింత ఊరట ఇచ్చేలా హైదరాబాద్ పోలీసులు కీలక నిర్ణయం తీసుకున్నారు. నగరంలోని ప్రతి జోన్‌కూ ఒక జోనల్ సైబర్ సెల్ (జెడ్‌సీసీ) ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో పని చేసే అధికారులు, సిబ్బందికి శిక్షణ పూర్తయింది. కొన్ని కీలకాంశాలకు సంబంధించిన ఫైలు ప్రభుత్వానికి చేరింది. దానికి ఆమోదముద్ర పడిన వెంటనే ఈ జెడ్‌సీసీలు పని చేయడం ప్రారంభించనున్నాయి.

పెను సవాల్‌గా సైబర్ నేరాలు...

నానాటికీ పెరిగిపోతూ దర్యాప్తు అధికారులకు సవాల్ విసురుతున్న సైబర్ నేరాలు పోలీసులకు పెద్ద తలనొప్పిగా మారాయి. ఆర్థికాంశాలతో ముడిపడి ఉన్న కేసుల్లో నిందితులుగా బయటి రాష్ట్రాలకు చెందిన వాళ్లే ఎక్కువగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో సైబర్ క్రైమ్ ఠాణాకు చెందిన ఓ బృందం అనునిత్యం బయటి రాష్ట్రాల్లో ఉంటోంది. ఎన్ని వ్యయప్రయాసలకోర్చినా పాత్రధారులు, దళారులు తప్ప సూత్రధారులు చిక్కట్లేదు. ఈ కారణంగానే ఇటీవల సైబర్ క్రైమ్ పోలీసులు బాధితులు కోల్పోయిన నగదు ఫ్రీజ్ చేయడానికి, రీఫండ్ చేయించడానికి ప్రాధన్యం ఇస్తున్నారు. దీని కోసమూ బ్యాంకు అధికారులు, నోడల్ ఆఫీసర్లతో సంప్రదింపులు పెద్ద ప్రహసనంగా మారింది.

సైబర్ ఠాణాపై తీవ్రమైన పని ఒత్తిడి...

ఇలాంటి అనేక కారణాల నేపథ్యంలో సైబర్ క్రైమ్ ఠాణాలో పని చేస్తున్న అధికారులు, సిబ్బందిపై తీవ్రమైన పని ఒత్తిడి ఉంటోంది. దీంతో రూ.లక్ష కంటే తక్కువ మొత్తంతో ముడిపడి ఉన్న కేసుల్ని స్థానిక పోలీసుస్టేషన్లలో నమోదు చేసేలా ఆదేశాలు జారీ చేశారు. ఇలాంటి కేసులు నమోదు అవుతున్నా... ఆ అధికారులకు ఉండే దైనందిన విధులు, బందోబస్తు డ్యూటీల కారణంగా సైబర్ క్రైమ్ కేసుల దర్యాప్తుపై పూర్తి స్థాయిలో దృష్టి పెట్టలేకపోతున్నారు. మరోపక్క అక్కడి అధికారులకు ఈ కేసుల్ని దర్యాప్తు చేసే పరిజ్ఞానం, తీరుతెన్నులపై అవగాహన ఉండట్లేదు. ఈ పరిణామాలను పరిగణనలోకి తీసుకున్న నగర కొత్వాల్ సీవీ ఆనంద్ జెడ్‌సీసీల ఏర్పాటు నిర్ణయం తీసుకున్నారు.

దర్యాప్తు అంశాలపై శిక్షణ పూర్తి...

నగర కమిషనరేట్ పరిధిలో ఉన్న ఏడు జోన్లలోనూ ఒక్కోటి చొప్పున ఈ జెడ్‌సీసీలను ఏర్పాటు చేస్తున్నారు. డీసీపీ కార్యాలయాల కేంద్రంగా పని చేసే వీటిలో ఇన్‌స్పెక్టర్, ఎస్సైలు, ఇతర సిబ్బంది ఉంటారు. ఇప్పటికే ఈ సిబ్బందికి సైబర్ క్రైమ్ ఠాణా అధికారులు శిక్షణ ఇచ్చారు. ఆయా జోన్లలోని స్థానిక పోలీసుస్టేషన్లలో నమోదయ్యే సైబర్ క్రైమ్ కేసుల్ని ఈ జెడ్‌సీసీలు దర్యాప్తు చేస్తాయి. అభియోగపత్రాలను మాత్రం స్థానిక పోలీసుస్టేషన్ అధికారులే దాఖలు చేస్తారు. జెడ్‌సీసీల ఏర్పాటుకు సంబంధించిన సమగ్ర ప్రతిపాదనలతో కూడిన దస్త్రం ప్రస్తుతం ప్రభుత్వానికి చేరింది. దీనికి ఆమోదముద్ర పడిన తర్వాత జోనల్ సైబర్ సెల్స్ పని చేయడం ప్రారంభించనున్నాయి. వీలున్నంత వరకు సైబర్ క్రైమ్ కేసుల్లో బాధితులకు న్యాయం చేయాలనే ఉద్దేశంతో ఉన్నతాధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు.

నగరంలో సైబర్ నేరాలు ఇలా...

ఏడాది	కేసులు	అరెస్టైన నిందితులు	నష్టపోయిన మొత్తం
2023	2984	413	రూ.147,22,92,649
2024	2868	418	రూ.301,42,73,986

అంబేడ్కర్ జయంతి సందర్భంగా హెచ్ఎండీఏ భారీ ఏర్పాట్లు

సాక్షి, సిటీబ్యూరో: రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా హెచ్ఎండీఏ ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టింది. నెక్లెస్ రోడ్డులోని 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహ పరిసరాలను శోభాయమానంగా తీర్చిదిద్దారు. రంగురంగుల విద్యుద్దీపాలను ఏర్పాటు చేశారు. జయంతి ఉత్సవాల్లో భాగంగా అంబేడ్కర్ సిద్ధాంతాలను, ఆలోచనలను భావితరాలకు పరిచయం చేసేలా వినూత్నమైన కళా ప్రదర్శన నిర్వహించనున్నారు. హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో రూపొందిన ఈ ప్రదర్శనలో యువత తన కళాత్మకతను, సృజనాత్మకతను సమున్నతంగా ఆవిష్కరించనుంది. అంబేడ్కర్ జయంతి వేడుకల సందర్భంగా సమానత్వం, సామాజిక న్యాయం, సాధికారత వంటి అంశాలను ప్రతిబింబించేలా ప్రముఖ ఫైన్ ఆర్ట్స్, ఆర్కిటెక్చర్ విద్యా సంస్థలకు చెందిన 90 మంది విద్యార్థులు రూపొందించిన అనేక రకాల కళాకృతులను ప్రదర్శించనున్నారు.

19 నుంచి వర్సిటీల కాంట్రాక్టు అధ్యాపకుల సమ్మె



ఓయూలో మాట్లాడుతున్న అధ్యాపకులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఉద్యోగాలను పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 19 నుంచి రాష్ట్రంలోని 12 విశ్వవిద్యాలయాల కాంట్రాక్టు అధ్యాపకులు నిరవధిక సమ్మెకు పిలుపునిచ్చారు. ఆదివారం నిజాం కాలేజీ అధ్యాపకుడు డా.వేల్పుల కుమార్ అధ్యక్షతన సమావేశమైన కాంట్రాక్టు అధ్యాపకులు అనేక సమస్యలపై చర్చించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ వర్సిటీల కాంట్రాక్టు అధ్యాపకుల పర్మనెంట్ విషయంతో గత ప్రభుత్వం తీరని అన్యాయం చేసిందన్నారు. వర్సిటీలలో అధ్యాపకుల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్‌కు ముందే కాంట్రాక్టు అధ్యాపకులను పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేశారు. తక్కువ వేతనానికి 27 ఏళ్లుగా పని చేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల హామీల్లో పేర్కొన్నట్లు కాంగ్రెస్ ప్రభుత్వం కాంట్రాక్టు అధ్యాపకులను పర్మనెంట్ చేయాలని, లేని పక్షంలో నిరవధికంగా ఆందోళన కార్యక్రమాలను చేపట్టనున్నట్లు హెచ్చరించారు. అనంతరం భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణను ప్రకటించారు. వర్సిటీలలో 15న సమ్మె నోటీసు సమర్పించి ధర్నా, 16, 17 తేదీలలో ఇందిరా పార్కు వద్ద మహాధర్నా, 19 నుంచి నిరవధిక సమ్మెతో సమస్యలను ప్రజలు, ప్రభుత్వం దృష్టికి తీసుకవెళ్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టు అధ్యాపకులు ధర్మతేజ, ఉపేందర్, విజేందర్ రెడ్డి, వెంకటేష్, రమేశ్వర్, శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెండి బిస్కెట్లకు బంగారం పూత!

- అవి కార్ఖానాలో ఉంచి అసలు బిస్కెట్లు తస్కరణ
- ఓ జ్యువెలరీ కార్ఖానా మేనేజర్ వ్యవహారమిది
- ఇలా మూడు నెలల్లో రూ.1.5 కోట్ల సొత్తు స్వాహా
- యజమాని ఫిర్యాదుతో సీసీఎస్‌లో కేసు నమోదు



సాక్షి, సిటీబ్యూరో: బషీర్‌బాగ్ కేంద్రంగా పని చేసే ఓ జ్యువెలరీ కార్ఖానాలో భారీ స్కామ్ చోటు చేసుకుంది. ఇందులో పని చేసే ఉద్యోగి రూ.1.59 కోట్ల విలువైన బంగారం బిస్కెట్లు స్వాహా చేశాడు. ఎవరికీ అనుమానం రాకుండా వాటి స్థానంలో వెండి బిస్కెట్లకు పసిడి పూత పూయించి ఉంచాడు. ఇటీవల నిర్వహించిన ఆడిటింగ్‌లో ఈ విషయం గుర్తించిన యాజమాన్యం హైదరాబాద్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్‌లో (సీసీఎస్) ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. బషీర్‌బాగ్ నుంచి కార్యకలాపాలు సాగిస్తున్న భగవత్ శాంతి జ్యువెలర్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ దేశ వ్యాప్తంగా వివిధ జ్యువెలరీ షోరూమ్‌లకు అనుబంధంగా పని చేస్తుంది. ఆయా షోరూమ్‌లు ఇచ్చే ఆర్డర్ల మేరకు ఆభరణాలు తయారు చేసి సరఫరా చేస్తుంటుంది. ఈ సంస్థలో సేల్స్, అకౌంట్స్, ఆభరణాల తయారీ, సెక్యూరిటీ విభాగాల్లో కలిపి దాదాపు 150 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. భగవత్ శాంతి జ్యువెలర్స్‌లో నగరానికి చెందిన నితిన్ దాదాపు పదేళ్లుగా ప్రొడక్షన్ మేనేజర్‌గా పని చేస్తున్నాడు. స్ట్రాంగ్ రూమ్ నుంచి బంగారం బిస్కెట్లు తీసుకురావడం, వాటిని కార్మికులతో 24, 22, 18 క్యారెట్ల ముడి బంగారంగా మార్పించడం, ఆభరణాలు తయారు చేసే వారికి ఈ బంగారం అందించడం ఇతడి విధులు. ఈ బంగారం బిస్కెట్లు ఉండే చెస్ట్ ప్రాంతాన్ని ఘాట్ సెక్షన్‌గా పరిగణిస్తుంటారు. ఈ సంస్థలో ప్రతి మూడు నెలలకు బంగారం, ఆభరణాల నిల్వలపై ఆడిటింగ్ జరుగుతుంది. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆఖరి త్రైమాసిక ఘాట్ సెక్షన్ ఆడిటింగ్‌ను సంస్థ నిర్వాహకులు ఈ నెల ఒకటో తేదీన నిర్వహించాలని భావించారు. ఘాట్ సెక్షన్ ఇన్‌చార్జి అయిన నితిన్‌ను ఆ రోజు ఉదయం 10 గంటలకు కార్యాలయానికి రమ్మని స్పష్టం చేశారు. అయితే అతడు హాజరుకాకపోవడంతో ఫోన్ ద్వారా సంప్రదించడానికి ప్రయత్నించారు. తాను నగరంలో లేనని, త్వరలోనే వస్తానని చెప్పిన నితిన్ తన ఫోన్ స్విచ్ఛాఫ్ చేసుకుని అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. దీంతో అనుమానం వచ్చిన భగవత్ శాంతి జ్యువెలర్స్ యాజమాన్యం ఘాట్ సెక్షన్‌లో ఆడిటింగ్ నిర్వహించింది. ఈ నేపథ్యంలో అక్కడ ఉండాల్సిన కొన్ని బంగారం బిస్కెట్ల స్థానంలో వెండి బిస్కెట్లు ఉన్నట్లు తేలింది. బంగారం కోటింగ్ వేసిన, బంగారం ఫాయిల్స్‌లో చుట్టిన వెండి బిస్కెట్లను చెస్ట్‌లో ఉంచిన నితిన్ బంగారం బిస్కెట్లు స్వాహా చేసినట్లు గుర్తించారు. ఆద్యంతం తనిఖీ చేసిన ఆడిటింగ్ సిబ్బంది రికార్డుల్లో ఉన్న 24 క్యారెట్ల ముడి బంగారం 616.53 గ్రాములు, 22 క్యారెట్ల ముడి బంగారం 1106.73 గ్రాములు, 18 క్యారెట్ల ముడి బంగారం 72.27 గ్రాములు ఉండాల్సిన స్థానంలో లేదని తేల్చారు. నితిన్ స్వాహా చేసిన మొత్తం 1795.53 గ్రాముల బంగారం విలువ రూ.1.59 కోట్లుగా నిర్ధారించారు. ఈ మేరకు సంస్థ అకౌంట్స్ మేనేజర్ కె.రమేష్ సీసీఎస్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. పరారీలో ఉన్న నిందితుడి కోసం పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు.



అశ్వ వాహనంపై బాలాజీ

వైభవంగా రథోత్సవం ● పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులు

మొయినాబాద్: చిలుకూరు బాలాజీ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం చిలుకూరు బాలాజీ అశ్వ వాహనంపై ఊరేగారు. స్వామివారికి మహాభిషేకం, ఆస్థాన సేవ, దోప్‌సేవ, పుష్పాంజలి సేవలు అందించారు. వేదపండితుల మంత్రోశ్చరణలు.. భక్తుల గోవింద నామస్మరణలు.. డోలు, డప్పు వాయిద్యాల మధ్య చిలుకూరు బాలాజీ దివ్యరథోత్సవం నేత్రపర్వంగా సాగింది. చిలుకూరు బాలాజీ బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన స్వామివారి దివ్యరథోత్సవం శనివారం అర్ధరాత్రి కనుల పండువగా సాగింది. వేంకటేశ్వరస్వామి, శ్రీదేవి, భూదేవి సమేతంగా రథంపై ఆసీనులై దేవాలయం చుట్టూ ఊరేగారు. శ్రీదేవి, భూదేవిలను వివాహం చేసుకున్న స్వామివారు వారిని గ్రామస్తులకు చూపించే క్రమంలోనే రథోత్సవం జరుగుతుందని ఆలయ అర్చకుడు రంగరాజన్ భక్తులకు వివరించారు. రాత్రి 11 గంటలకు స్వామివారు, అమ్మవార్లకు అద్దాలమహల్‌లో ప్రత్యేక పూజలు నిర్వహించి ఊరేగింపుగా తీసుకొచ్చారు. రథం చుట్టూ ప్రదక్షిణలు చేయించి మొదటి అంతస్తులో ఆసీనులను చేశారు. రథం ముందు అర్చకులు హోమం నిర్వహించారు. అనంతరం అర్చకులు, భక్తులు పెద్ద ఎత్తున గోవిందనామస్మరణ చేస్తూ రథాన్ని ముందుకు కదిలించారు. స్వామి వారి రథోత్సవంలో పాల్గొనటంతోపాటు రథాన్ని తాకితే అంతామంచి జరుగుతుందన్న విశ్వాసంతో భక్తులు పోటీ పడ్డారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులను సన్మానించారు. కార్యక్రమంలో కన్వీనర్ గోపాలకృష్ణస్వామి, తిరుమల కిరణాచారి, పరావస్తు రామాచారి, నరసింహంకన్నయ్య, కిట్టు, మురళి తదితులు పాల్గొన్నారు.

జై భీమ్ పాదయాత్ర ప్రారంభించిన గవర్నర్

సాక్షి, సిటీబ్యూరో: భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 134వ జయంతిని పురస్కరించుకుని తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ఆదివారం రాజ్ భవన్ నుండి 'జై భీమ్ పాదయాత్ర'ను జెండా ఊపి ప్రారంభించారు. యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ అన్ని రాష్ట్రాలలో దేశవ్యాప్తంగా జై భీమ్ పాదయాత్ర నిర్వహించాలని నిర్ణయించిన మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. భారత రాజ్యాంగ నిర్మాత, సామాజిక న్యాయం కోసం పోరాడిన మహోన్నత వ్యక్తి అయిన అంబేడ్కర్‌కు నివాళులర్పించేందుకు ఎన్‌సీసీ కేడెట్లు, స్కౌట్స్ అండ్ గైడ్స్, రాజ్ భవన్ సిబ్బంది ఈ పాదయాత్రలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ మార్చ్ నెక్లెస్ రోడ్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ముగిసింది. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ..యువత డాక్టర్ అంబేడ్కర్ ఆదర్శాలను స్వీకరించి, మరింత సమ్మిళితమైన, సమానమైన సమాజాన్ని నిర్మించడానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రటరీ కల్నల్ సమీర్ శర్మ, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ రాష్ట్ర కార్యదర్శి వేణుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో ఢీకొని మెకానిక్ మృతి

చిక్కడపల్లి: ఆటో ఢీకొని ఒకరు మృతి చెందిన ఘటన చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ అభిలాష్ తెలిపిన వివరాల ప్రకారం.. బాగ్‌లింగంపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ ఆవరణలో మహమ్మద్ నజీర్ ఖాన్ (42) ఆటో మెకానిక్ షెడ్ నిర్వహిస్తున్నాడు. ఆదివారం రాత్రి 7 గంటల ప్రాంతంలో రోడ్డుపై నజీర్ ఆటో రిపేర్ చేస్తుండగా మద్యం మత్తులో మరోవ్యక్తి ఆటోతో నజీర్‌ను ఢీకొట్టాడు. దీంతో తలకు తీవ్ర గాయాలు కాగా, ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న చిక్కడపల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గాంధీ మార్చురీకి తరలించారు. చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ రాజునాయక్ పర్యవేక్షణలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి కారణమైన ఆటో డ్రైవర్‌ను పోలీసుల అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

విద్యారంగ పరిరక్షణకు కృషి

యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జంగయ్య

ఇబ్రహీంపట్నం రూరల్: విద్యారంగం అభివృద్ధి, పరిరక్షణ కోసం టీఎస్ యూటీఎఫ్ నిరంతరం కృషి చేస్తుందని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జంగయ్య పేర్కొన్నారు. సంఘం 12వ ఆవిర్భావ వేడుకలను ఆదివారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సెమినార్‌లో మాట్లాడారు. ఉపాధ్యాయుల సంక్షేమానికి నిరంతరం పోరాడుతున్న సంఘం యూటీఎఫ్ మాత్రమేనని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని వచ్చే జూన్ లో బడిబాట, కళాజాత నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆదరణ లభించేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి బి.రాములయ్య, కోశాధికారి జగన్నాథ శర్మ, ఎఫ్‌డబ్ల్యూఎఫ్ కన్వీనర్ కిషన్ చౌహాన్, రాష్ట్ర కమిటీ సభ్యురాలు సుగంధ, సీనియర్ నాయకులు నాగేంద్రం, ఆయా మండలాల మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

చెరువుల పరిరక్షణ అందరి బాధ్యత

తుర్కయంజాల్: చెరువులు, కుంటలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిదని పురపాలక సంఘం పరిధి బ్రాహ్మణపల్లికి చెందిన హనుమాన్ యూత్ అసోసియేషన్ సభ్యులు బాలు, ప్రవీణ్, ఆకాష్‌లు అన్నారు. మన ఊరు మన చెరువు కార్యక్రమంలో భాగంగా ఆదివారం బ్రాహ్మణపల్లిలోని చెరువులో ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తను మున్సిపల్ కార్మికులతో కలిసి తొలగించారు. నీటి వనరుల్లో వ్యర్థాలను వేసి పర్యావరణ కాలుష్యం చేయొద్దన్నారు. కార్యక్రమంలో పలువురు యూత్ సభ్యులు పాల్గొన్నారు.

రైతులను ఇబ్బంది పెడితే ఊరుకోం

- ఇచ్చిన మాట ప్రకారం ఫార్మాసిటీ రద్దు చేశాం
- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: పేదల భూములు తీసుకుని రైతులను ఇబ్బందులకు గురిచేస్తే ఊరుకునేది లేదని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఆదివారం యాచారం మండల పరిధిలోని మల్కీజ్‌గూడ, ధర్మన్నగూడ, నందివనపర్తి గ్రామాల్లో రూ.75 లక్షల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. అనంతరం నందివనపర్తిలో జ్యోతి ఎడ్యుకేటర్ యూత్ అసోసియషన్ ఆధ్వర్యంలో ప్రముఖ సంఘ సేవకులు సంగం సత్తయ్య విగ్రహ ఆవిష్కరణ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ఇచ్చిన మేరకు పార్టీ అధికారంలోకి వచ్చిన మూడు రోజుల్లోనే ఫార్మా రద్దు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైతే మార్కెట్ ధర చెల్లించి రైతులను ఒప్పించాలని.. ఇబ్బంది పెడితే చూస్తూ ఊరుకోమన్నారు. ఈ ప్రాంత అభివృద్ధి కోసమే ఫోర్త్ సిటీ తీసుకొచ్చామన్నారు. ఈ ప్రాంత నిరుద్యోగులకు ఉపాధి కల్పించడానికి వేల కోట్ల రూపాయలు పెట్టుబడులతో స్కిల్ యూనివర్సిటీ నిర్మాణం చేపడుతున్నమన్నారు. బీఆర్ఎస్ హయాంలో ఈ ప్రాంతం అభివృద్ధిలో వెనకబడిపోయిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్యగౌడ్, మాజీ ఎమ్మెల్యే కొండిగారి రాములు, మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్లు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మహిపాల్, నాయకులు శేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్, పాండు రంగారెడ్డి, అమృతాసాగర్, ధనుంజయ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సన్నబియ్యం పథకం నిరుపేదలకు వరం

బడంగ్‌పేట్: సన్నబియ్యం పథకం నిరుపేదలకు వరమని పలువురు నాయకులు పేర్కొన్నారు. కార్పొరేషన్ పరిధిలోని మల్లాపూర్ గ్రామంలో ప్రభుత్వం అందిస్తున్న సన్నబియ్యం అందుకున్న లబ్ధిదారురాలు బల్గురి విజయమ్మ ఇంట్లో ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ నాయకులు భోజనం చేశారు. టీయూఎఫ్ఐడీసీ చైర్మన్, జిల్లా అధ్యక్షుడు చల్ల నర్సింహారెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట కార్పొరేషన్ మాజీ మేయర్ చిగురింత పారిజాత, మాజీ వైస్ చైర్మన్ నర్సింహారెడ్డి, తదితరులు ముఖ్యులుగా విచ్చేసి విజయమ్మ ఇంట్లో సన్నబియ్యంతో వండిన భోజనం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పేదలు సైతం సన్నబియ్యం తినాలనే సంకల్పంతో సీఎం రేవంత్‌రెడ్డి ఈ పథకాన్ని తీసుకొచ్చారన్నారు. ఈ నిర్ణయాన్ని తెలంగాణ ప్రజలు హర్షిస్తున్నారన్నారు. దరఖాస్తు చేసుకున్న ప్రతీ అబ్ధిదారుడికి తెల్లరేషన్‌కార్డులు త్వరలో జారీ చేస్తారన్నారు. ప్రతి ఒక్కరూ కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోయపల్లి గోవర్ధన్ రెడ్డి, హైదరాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పన్నాల రాజేందర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు వంగేటి ప్రభాకర్‌రెడ్డి, పి.దర్శన్‌రెడ్డి, బాలునాయక్, మాజీ సర్పంచ్ బోర్ర జగన్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుభాన్‌యాదవ్ తదితరులు ఉన్నారు.

నేడు.. తుది గడువు

రాజీవ్ యువ వికాసం పథకానికి నేడు కూడా దరఖాస్తులు

- ఆదాయ ధ్రువీకరణ పత్రమే అతి పెద్ద సమస్య
- అర్హత ఉన్నా దరఖాస్తు చేసుకోలేని యువత


దరఖాస్తులను స్వీకరిస్తున్న అధికారులు

బంజారాహిల్స్: ప్రభుత్వం నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు రాజీవ్ యువ వికాసం పథకానికి శ్రీకారం చుట్టింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కార్పొరేషన్ల ద్వారా ఆర్థిక సహకారం అందించాలన్నది ఈ పథకం ముఖ్య ఉద్దేశ్యం. దరఖాస్తుకు సోమవారంతో గడువు ముగియనుంది. అంబేడ్కర్ జయంతి సందర్భంగా సోమవారం సెలవు రోజైనా ఈ పథకానికి దరఖాస్తు చేసుకునేవారికి అవకాశం కల్పిస్తూ నేడు కౌంటర్లను తెరిచే ఉంటాయన్నారు. గడువు ఒక్క రోజు ఉన్న నేపథ్యంలో అర్హత ఉన్న యువకులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఎందుకంటే దరఖాస్తుకు జత చేయాల్సిన పత్రాల్లో అతి కీలకమైన ఆదాయ ధ్రువీకరణ పత్రం తీసుకోవడం పెద్ద సవాల్‌గా మారింది. దరఖాస్తు చేసుకున్న తర్వాత మూడు, నాలుగు రోజుల తర్వాత ఇవి అందుతున్నాయి. మరోవైపు కుల ధ్రువీకరణ పత్రం కూడా ఓ సమస్యగా మారింది. ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు తీసుకుని దరఖాస్తుకు జత చేయడమే అతి పెద్ద సవాల్‌గా మారిందని అర్హులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎలాగోలా దరఖాస్తు చేసుకుందామని ప్రయత్నిస్తున్న వారికి ఈ పత్రాల గోల తప్పడం లేదు. అయితే ఎక్కడికక్కడ వార్డు కార్యాలయాల్లో దరఖాస్తులు తీసుకుంటుండటంతో యువతకు కొంత ఊరట లభిస్తోంది. అందుబాటులో సెలవు రోజుల్లో కూడా ఈ కేంద్రాల్లో అధికారులు అందుబాటులో ఉంటుండటంతో ఆలస్యంగానైనా అందజేసేందుకు అవకాశం ఏర్పడుతోంది. రూ.50 వేల నుంచి రూ.4 లక్షల వరకు రుణం ఇచ్చేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చింది. ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల పరిధిలో వార్డు కార్యాలయాల్లో దరఖాస్తుల స్వీకరణకు ప్రత్యేక కేంద్రాలు అందుబాటులోకి తేవడమే కాకుండా ఏవైనా సమస్యలు ఉంటే అక్కడికక్కడే పరిష్కరిస్తున్నారు. ఇప్పటి వరకు ఖైరతాబాద్ నియోజకవర్గంలో 10 వేలకు పైగా దరఖాస్తులు స్వీకరించారు. వీటిని స్క్రూట్నీ చేయనున్నారు. అనంతరం ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. మరోవైపు గడువు పెంచాలని దరఖాస్తుదారులు ఇప్పటికే డిమాండ్ చేస్తున్నా ప్రభుత్వం ఇంకా స్పందించలేదు. అర్హులైన వారంతా తమ దరఖాస్తులను వార్డు కార్యాలయాల్లో అందజేయాలని ఉప కమిషనర్లు సూచిస్తున్నారు.

ప్రస్తుతం జానపద పాటల ట్రెండ్

– రచయిత, దర్శకుడు శ్రవణ్ నల్లా



బంజారాహిల్స్: సోషల్ మీడియాలో ప్రస్తుతం జానపద పాటల ట్రెండ్ కొనసాగుతోందని, భాషతో సంబంధం లేకుండా పాట, సంగీతం బాగుంటే ప్రతి ఒక్కరూ ఆదరిస్తున్నారని రచయిత, దర్శకుడు శ్రవణ్ నల్లా అన్నారు. ఆయన రూపొందించిన ఓ సిటీ బావ అనే జానపద పాటను సంగీత దర్శకుడు పవన్ శేషా, కొరియోగ్రాఫర్ విశాల్, నటీ నటులు సంస్కృతితో కలిసి జూబ్లీహిల్స్‌లో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మధ్య కాలంలో జానపద గేయాలకు సోషల్ మీడియా మంచి ప్లాట్‌ఫాంగా మారిందని అన్నారు. యువత ఈ సాంగ్స్‌పై అధిక ఆసక్తి కనబరుస్తోందని అన్నారు. కార్యక్రమంలో ప్రొడ్యూసర్ కల్లూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

స్వరకర్త 'ఉషాకాంత్'కు ఘన నివాళి



బంజారాహిల్స్: స్వరమే ఆయుధంగా, సాహిత్యమే సాధనగా, సంగీతమే జీవనసారంగా గడిపిన ఉషాకాంత్ గొప్ప సంగీతకారుడని పలువురు కొనియాడారు. మహతి మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం బంజారాహిల్స్‌లోని అలా లిబర్టీలో ఉషాకాంత్ సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఉషాకాంత్ పాటలు తరతరాల కళాకారులను నడిపిస్తూనే ఉంటాయన్నారు. ఉషాకాంత్ కుమారుడు డాక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ ఉషాకాంత్ సంగీత మేధావి అన్నారు. ఆయన ఎన్నో ప్రైవేట్ పాటలు పాడారన్నారు. మ్యూజిక్ కంపోజ్ చేశారన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే తమ ముందున్న కర్తవ్యమన్నారు. 'పంచమ్' అనే సాంస్కృతిక సంస్థను స్థాపించి ఎనలేని సేవలందించారన్నారు. 1970ల ప్రారంభంలోనే ఆయన అనేక సంగీత ప్రదర్శనలు ఇచ్చారన్నారు.

క్రైస్తవుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

– ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్



క్రైస్తవులతో కలిసి ప్రార్థనలో పాల్గొన్న ప్రభుత్వ విప్

హిమాయత్‌నగర్: రాష్ట్రంలోని క్రైస్తవుల సమస్యలను పరిష్కరించి వారి అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తుందని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో క్రైస్తవుల సమస్యలను ప్రస్తావించి సభ దృష్టికి తీసుకువెళ్లిన నేపథ్యంలో ఆదివారం నారాయణగూడలోని బాప్టిస్ట్ చర్చి, రాంకోఠిలోని సీఎస్ఐ వెస్లీ చర్చిలో వారికి సత్కారం నిర్వహించారు. ఈ సందర్భంగా అడ్లూరి లక్ష్మణ్, సత్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని క్రైస్తవులు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలన్నారు. కార్యక్రమంలో బాప్టిస్ట్ చర్చి సీనియర్ పాస్టర్ రెవరెండ్ డాక్టర్ జి.శామ్యూల్, రేవరెండ్ డేవిడ్ ప్రశాంత్, రెవరెండ్ టి.సోలమన్ రాజ్, రెవరెండ్ డానియేలు, అధ్యక్షుడు టి.సుధీర్ జాన్సన్, కోశాధికారి ఎ.విజయ్ కుమార్, టీయూసీపీఏ ప్రధాన కార్యదర్శి గోనే సోలమన్ రాజ్, సీఎస్ఐ వెస్లీ చర్చి పాస్టర్ రెవరెండ్ టి.భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే లక్ష్యం

తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పద్మ

హిమాయత్‌నగర్: రైతు సంక్షేమమే లక్ష్యంగా అమలు కావాల్సిన అన్ని చట్టాలను సాధించుకునే వరకు కష్టపడతామని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ అన్నారు. అఖిల భారత కిసాన్ సభ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా హిమాయత్‌నగర్ అమృత ఎస్టేట్స్ రాష్ట్ర కార్యాలయం వద్ద ఆదివారం ఏఐకేఎస్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం తమిళనాడులోని నాగపట్నంలో ఈ నెల 15 నుంచి 17 తేదీ వరకు మూడు రోజుల పాటు జరగనున్న అఖిల భారత కిసాన్ మహాసభ 30వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో ప్రచారజాత బయలుదేరి వెళ్లింది. రైతులు మాధవరెడ్డి, శ్రీశైలం ప్రారంభించారు. ఎం.ప్రభులింగం, సంధ్య, నరేంద్ర ప్రసాద్, జంగయ్య యాదవ్, నిమ్మల నరసింహ, కొంతం మాధవరెడ్డి, చల్లా నారాయణరెడ్డి, విష్ణువర్ధన్, సుధాకర్‌గౌడ్ పాల్గొన్నారు.

బీపీ మండల్‌కు భారతరత్న ఇవ్వాలి

రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య


మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

హిమాయత్‌నగర్: బీసీల ఆశాజ్యోతి బీపీ మండల్‌కు భారతరత్న ఇచ్చి గౌరవించాలని రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మండల్ కమిషన్ సిఫార్సులను పూర్తిస్థాయిలో అమలు చేయాలని కోరారు. బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో యాదవ రాజ్యాధికార సమితి, బీసీ ఐక్యవేదిక సంయుక్త ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో రాణిస్తున్న వారికి బిందేశ్వర్ మండల్ అవార్డులను ఆదివారం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ పార్లమెంటులో బీసీ బిల్లు పెట్టి చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో గురుకుల పాఠశాలలను నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. బీపీ మండల్ మనవడు ప్రొఫెసర్ సూరజ్ మండల్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కులగణన చేపట్టి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడం అభినందనీయం అన్నారు. అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ బీసీలు ముఖ్యంగా యాదవ కులస్తులకు రాజకీయంగా రాణించేందుకు త్వరలో రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం పలువురికి బీపీ మండల్ అవార్డులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రి సి.కృష్ణయాదవ్, బీమా రాంచందర్ యాదవ్, చిన్న శ్రీశైలం యాదవ్, యాదవ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బడుగుల నాగార్జున యాదవ్, బీసీ ఐక్యవేదిక అధ్యక్షుడు బేరి రాంచందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బీపీ మండల్ సిఫారసులను అమలు చేయాలి

డాక్టర్ దాసరి అజయ్ కుమార్ యాదవ్


మాట్లాడుతున్న అజయ్ కుమార్ యాదవ్

హిమాయత్‌నగర్: బీసీ రిజర్వేషన్ల పితామహుడు బీపీ మండల్(బిందెశ్వర ప్రసాద్) మండల్ సూచించిన 40 సిఫారసులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే అమలు చేయాలని బీసీ జన చైతన్య వేదిక, మండల ఆశయ సాధన సమితి(మాస్) వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ దాసరి అజయ్ కుమార్ యాదవ్ డిమాండ్ చేశారు. బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో బీసీ జన చైతన్య వేదిక, మాస్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన బీపీ మండల్ 43వ వర్ధంతి సభకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీపీ మండల్ జయంతిని పురస్కరించుకొని ఆగస్ట్ 25 నుంచి రాష్ట్రవ్యాప్తంగా మండల్ రథయాత్ర ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో మరో మండల్ ఉద్యమం రాబోతుందన్నారు. కాంగ్రెస్ పార్టీకి బీసీల పట్ల నిజమైన ప్రేమ ఉంటే రాష్ట్రంలో బీసీలకు 9 మంత్రి పదవులు, సీఎం పదవి ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీపీ మండల్ వర్ధంతి, జయంతిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహించాలన్నారు. బీపీ మండల్‌కు భారతరత్న ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దాసు రామ్ నాయక్, బక్కన్న యాదవ్, పెంట రమేష్, అనిల్, శివ శంకర్ యాదవ్, సుబ్బయ్య, శోభా యాదవ్, రాములు యాదవ్, శ్రీనివాస్ యాదవ్, పెద్దన్న యాదవ్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

కృత్రిమ మేధతో వ్యవసాయ రంగానికి ఎన్నో లాభాలు

పంజాబ్‌లోని గురు కాశీ విశ్వవిద్యాలయం డైరెక్టర్ డాక్టర్ అశ్విన్ సేతి


మాట్లాడుతున్న గురుకాశీ యూనివర్సిటీ డైరెక్టర్ డాక్టర్ అశ్విని సేతి

బంజారాహిల్స్: వ్యవసాయంలో కృత్రిమ మేధను ఉపయోగిస్తే అధిక దిగుబడి రాబట్టే అవకాశం ఉందని గురుకాశీ విశ్వ విద్యాలయం డైరెక్టర్ డాక్టర్ అశోక్ సేతీ అన్నారు. జూబ్లీహిల్స్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రైతులకు ఏఐపై అవగాహన కల్పిస్తే అధిక దిగుబడి పెంచుకొని వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవచ్చని ఆయన తెలిపారు. పంజాబ్‌లోని గురుకాశీ విశ్వవిద్యాలయంలో ఏఐ ఆధారంగా అగ్రికల్చర్ బీఎస్సీతో పాటు బీటెక్ కోర్సులు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. దేశంలో ఉత్తమ విశ్వవిద్యాలయాల్లో గురుకాశీ విశ్వవిద్యాలయం ఒకటని, న్యాక్ ఏ ప్లస్ ప్లస్ గుర్తింపు ఉందని అన్నారు. ఏ సమయంలో విత్తనాలు వేయాలి.. ఎంత మోతాదులో ఎరువులు వాడాలి.. చీడ పురుగుల నివారణకు మందుల పిచికారీ ఎప్పుడు చేయాలనే అంశాలపై రైతులకు అవగాహన కల్పిస్తే దాని ఆధారంగా అధిక దిగుబడి సాధించవచ్చని ఆయన అన్నారు. ఏఐకి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉందని, దానికి అనుగుణంగా పాఠ్యాంశాలను రూపొందించి విద్యార్థులకు ఆధునిక శిక్షణ ఇస్తున్నట్లు మ్యాస్ట్రో డైనమిక్ సీఈఓ భావన్‌రెడ్డి తెలిపారు. విద్యార్థులకు ప్లేస్‌మెంట్ వచ్చేలా పలు కంపెనీలతో ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు గురుకాశీ విశ్వవిద్యాలయం ప్రతినిధులు సింధుజ, కృష్ణారెడ్డి తెలిపారు.

ట్రేడింగ్ పేరుతో మోసపోయిన సినీ రచయిత

బంజారాహిల్స్: కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ ప్రసంగానికి ఆకర్షితుడై ఓ వ్యక్తి బొక్కబోర్లా పడ్డాడు. ట్రేడింగ్‌లో పెట్టుబడి పెట్టడంపై ఆమె చేసిన ప్రసంగ వీడియో తిలకిస్తున్న సమయంలో స్క్రీన్‌పై వచ్చిన ఓ యాప్ అతడి కొంపముంచింది. పెట్టుబడి పెడితే రెండు వారాల్లోపు మంచి రాబడి వస్తుందని ఇచ్చిన హామీ మేరకు రూ.39,694లు చెల్లించి మోసపోయిన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. యూసుఫ్‌గూడ ప్రగతినగర్‌లో నివసించే జనార్దన్‌రెడ్డి(44) సినీ రచయిత. ఈ నెల 11న ఉదయం ఫేస్‌బుక్‌లో వీడియోలు తిలకిస్తున్న సమయంలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ట్రేడింగ్, పెట్టుబడి గురించి వివరించే వీడియో కనిపించింది. అది నిజమైనదిగా భావించి వీడియో ఓపెన్ చేశాడు. ట్రేడింగ్ ప్రయోజనాల కోసం రూ.21 వేలు పెట్టుబడి పెట్టడం గురించి మాట్లాడుతుండగా ఆకర్షితుడై, అక్కడ ఉన్న లింక్‌పై క్లిక్ చేశాడు. మరిన్ని వివరాల కోసం జీపీడీ అడిపెక్స్ అనే యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించడంతో యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, తన పేరు, ఈమెయిల్ ఐడీ, ఫోన్ నంబర్ వంటి సమాచారాన్ని నమోదు చేశారు. పెట్టుబడి పెడితే రెండు వారాల్లో రాబడి వస్తుందని నమ్మబలికారు. దీంతో ఆయన తన క్రెడిట్ కార్డును ఉపయోగించి రూ.39,694లను చెల్లించాడు. ఆ వీడియోను కుటుంబ సభ్యులకు చూపించగా అది నకిలీదిగా గుర్తించారు. వెంటనే బ్యాంక్‌కు సమాచారం ఇచ్చి ఆ మొత్తాన్ని తిరిగి పొందడానికి ప్రయత్నించారు. అనంతరం 1930కు ఫిర్యాదు చేశారు. తనను మోసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎర్రగడ్డ రైతుబజార్ కూరగాయల ధరలు



శ్రీనగర్‌కాలనీ: కిలో టమాటా రూపాయలు.15, నల్లవంకాయ రూ.18, పొడుగువంకాయ 18, బెండకాయ 40, పచ్చిమిర్చి 40, బజ్జిమిర్చి 28, క్యాప్సికం 40, పచ్చికాకరకాయ 35, పందిరిబీర 40, క్యాబేజీ 08, క్యారెట్ 19, దొండకాయ 18, గుండు బిన్నీస్ 65, గింజచిక్కుడు 55, గోకరకాయ 40, కీర 20, దోసకాయ 18, బీట్‌రూట్ 15, ఉల్లిగడ్డ 16, ఆలుగడ్డ 25, చామగడ్డ 35, మొరంగడ్డ 23, కందగడ్డ 85, క్యాలీఫ్లవర్ 18, సొరకాయ 09, పొట్లకాయ 18, అరటికాయ 10, మునగకాయ 4, మామిడికాయ 35, ముల్లంగి 4-5, ఉల్లిపొరక 28 ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకూ అందుబాటులో ఉంటాయి.

మిల్క్ డెలివరీ బాయ్‌పై దాడి చేసి బైక్ చోరీ

బంజారాహిల్స్: దారికాసిన ముగ్గురు ఆగంతకులు ఓ మిల్క్ డెలివరీ బాయ్‌ని కర్రలతో కొట్టి బైక్ చోరీ చేసిన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. బంజారాహిల్స్ రోడ్డు నంబర్-12లోని ఎన్‌బీటీనగర్ బస్తీకి చెందిన రేపాక సాయికృష్ణ(19) డిగ్రీ చదువుకుంటూనే ప్రతిరోజూ ఉదయం ఇంటింటికీ వెళ్లి పాల ప్యాకెట్లు అందజేస్తుంటాడు. ఆదివారం తెల్లవారుజామున 5 గంటల ప్రాంతంలో బంజారాహిల్స్ రోడ్డు నంబర్-14లోని నందినగర్‌లో ఓ ఇంటికి మిల్క్ ప్యాకెట్లు డెలివరీ చేసేందుకు వెళ్తుండగా బైక్‌పై వచ్చిన ముగ్గురు వ్యక్తులు యాక్టివాపై వెళ్తున్న సాయికృష్ణను అడ్డగించారు. ముందస్తు పథకం ప్రకారం కర్రలతో సాయికృష్ణపై దాడి చేసి బైక్‌పై అక్కడి నుంచి ఉడాయించారు. ఈ ఘటనలో బాధితుడికి తీవ్ర గాయాలయ్యాయి. ముగ్గురు ఆగంతకులు బైక్‌పై వచ్చారని, కొట్టి బైక్ లాక్కొని వెళ్లారని బాధితుడి ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. నిందితుల కోసం గాలిస్తున్నారు. సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. పాత నేరస్తులపై కదలికలపై దృష్టిపెట్టారు. బంజారాహిల్స్ క్రైమ్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం షాపు యజమానిపై కేసు

వెంగళరావునగర్: ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొగ్గి నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తున్న మద్యం షాపు యజమానిపై మధురానగర్ పీఎస్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం హనుమాన్ జయంతి సందర్భంగా నగరంలో మద్యం విక్రయించవద్దని పోలీసులు ఆదేశాలు జారీ చేశారు. మధురానగర్ కాలనీ సమీపంలోని మధురా వైన్స్ సమీపంలో ద్విచక్ర వాహనంలో 13 మద్యం బాటిల్స్ ఏర్పాటు చేసి విక్రయిస్తున్నారని పలువురు మధురానగర్ పీఎస్‌కు ఫిర్యాదు చేశారు. దాంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎస్ఐ అవినాష్‌బాబు తన సిబ్బందితో ఆ ప్రాంతంలో తనిఖీలు నిర్వహించారు. మధురా వైన్స్‌కు సమీపంలో ద్విచక్ర వాహనంలో ఉన్న మద్యం బాటిల్స్ కనిపించాయి. అంతేగాకుండా ఆ ప్రాంతంలోనే మధురా వైన్స్ ఓనర్ భూపాల్‌రెడ్డితో పాటు క్యాషియర్ ఎం.రఘు, వర్కర్ యు.రఘు ఉన్నారు. నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తున్న మధురానగర్ వైన్స్ యజమాని, క్యాషియర్, వర్కర్లపై కేసులు నమోదు చేసుకుని మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకున్నారు. కేసును దర్యాప్తు చేస్తున్నారు.

వరంగల్ సభను విజయవంతం చేయాలి


రజతోత్సవ సభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ తదితరులు

బంజారాహిల్స్: వరంగల్‌లో ఈ నెల 27న నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని పలువురు వక్తలు అన్నారు. బంజారాహిల్స్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ ఖైరతాబాద్ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. బీఆర్ఎస్ ఖైరతాబాద్ నియోజకవర్గ నేతలు మన్నె గోవర్ధన్‌రెడ్డి, విష్ణుకుమార్, వెల్దండ వెంకటేష్, మన్నె కవితారెడ్డి, జీజోళ్ల రాజుముదిరాజ్‌తో పాటు పెద్ద సంఖ్యలో నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. దాసోజు శ్రవణ్ మాట్లాడుతూ 27వ తేదీన చలో వరంగల్ సభకు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు తరలిరావాలని సూచించారు. ఉదయం 10 గంటలకు అన్ని డివిజన్లలో తోరణాలు, జెండాలతో సుందరంగా అలంకరించారు. అభివృద్ధిలో రాష్ట్రాన్ని దేశంలోనే ఆదర్శంగా నిలిపిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వ్యతిరేక విధానాలతో జనం విసిగిపోతున్నారని, ప్రతిఒక్కరూ కేసీఆర్ పాలనను గుర్తుచేసుకుంటున్నారన్నారు.

ఘనంగా మట్టల ఆదివారం వేడుకలు


ఎమ్మెల్యే కాలనీ షారోన్ చర్చిలో మట్టల ఆదివారం ర్యాలీని ప్రారంభిస్తున్న పాస్టర్ ఎం.ప్రభుదాస్

బంజారాహిల్స్: గుడ్‌ఫ్రైడేకు ముందు వచ్చే ఆదివారాన్ని మట్టల ఆదివారంగా క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు. బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని ఎమ్మెల్యే కాలనీ షారోన్ ఫుల్ గాస్పెల్ చర్చిలో జరిగిన మట్టల ఆదివారం ర్యాలీని చర్చి రెవరెండ్ పాస్టర్ ఎం.ప్రభుదాస్ ప్రారంభించారు. జెరూసలేంకు మొదటిసారి ఏసుక్రీస్తు అడుగు పెట్టిన రోజుగా, అదేవిధంగా ఆయనను రాజుగా ప్రజలు అంగీకరించిన రోజుగా క్రైస్తవులు భావిస్తారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలనీ చర్చి నుంచి ఎన్బీటీనగర్, కమాన్, మినిస్టర్ క్వార్టర్స్ మీదుగా ఈ ర్యాలీ చర్చికి చేరుకుంది. బంజారాహిల్స్ రోడ్ నెం.9లోని సెయింట్ ఆల్ఫోన్సస్ చర్చిలో సైతం పెద్ద ఎత్తున మట్టల ఆదివారం వేడుకలను క్రైస్తవులు జరుపుకున్నారు.

బీజేపీకి దళితుల పట్ల చిత్తశుద్ధి లేదు


అంబేడ్కర్ విగ్రహాన్ని పసుపు నీళ్లతో కడుగుతున్న కాంగ్రెస్ నేతలు

బంజారాహిల్స్: దళితుల పట్ల చిత్తశుద్ధి లోపించిన బీజేపీ అంబేడ్కర్ విగ్రహాన్ని శుద్ధి చేస్తున్న కార్యక్రమాన్ని తాము ఖండిస్తున్నామని కాంగ్రెస్ పార్టీ జూబ్లీహిల్స్ డివిజన్ అధ్యక్షుడు కాటూరి రమేష్ అన్నారు. బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని జీవీకే వన్ ఎదురుగా ఉన్న అంబేడ్కర్ విగ్రహాన్ని ఆదివారం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి శుద్ధిచేసి వెళ్లిన తర్వాత కాంగ్రెస్ నేతలు అక్కడికి వచ్చి పసుపు నీళ్లతో అంబేడ్కర్ విగ్రహాన్ని కడిగారు. ఈ సందర్భంగా కాటూరి రమేష్ మాట్లాడుతూ బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఒక పక్క దళితులను అవమానపరుస్తూ, వారిని పట్టించుకోకుండా వ్యవహరిస్తున్న బీజేపీ నేతలు అంబేడ్కర్ విగ్రహాన్ని శుద్ధి చేయడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. రాష్ట్రంలోని వనపర్తి జిల్లా పాలెం గ్రామంలో దళితులను గుడిలోకి రానివ్వకుండా వారిని బహిష్కరించినప్పుడు ఈ బీజేపీ నేతలు ఎక్కడికి పోయారని అన్నారు. అవేవీ పట్టించుకోకుండా ఇప్పుడొచ్చి విగ్రహాలను శుద్ధి చేస్తున్నామని చెప్పడం సబబు కాదన్నారు. అందుకే తాము బీజేపీ నేతలు తాకిన విగ్రహాలను పసుపు నీళ్లతో కడిగి శుద్ధి చేస్తున్నామని చెప్పారు. విష్ణు, ధర్మేందర్, సురేష్, గుంజ ఆంజనేయులు, నాగార్జున, విశ్వనాథ్, జగదీష్, శివ కుమార్, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

నిమ్స్ నర్స్‌కు చిరు ఉద్యోగుల సత్కారం

లక్డీకాపూల్: నిమ్స్‌లో రోగులకు సుదీర్ఘకాలం సేవలు అందించిన నర్సింగ్ సూపరింటెండెంట్ ఊర్మిళ చిరు ఉద్యోగులను కూడా ప్రోత్సహించే వారు అంటూ పలువురు నిమ్స్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు కొనియాడారు. ఇటీవల ఉద్యోగ విమరణ చెందిన ఊర్మిళను నిమ్స్‌లోని ఔట్‌సోర్సింగ్ కార్మికులు ఘనంగా సత్కరించారు. నర్సింగ్ విభాగాల్లో ఆమె అందించిన సేవలు హెల్త్ సిబ్బందికి స్ఫూర్తిదాయకమంటూ పలువురు ఆమెను అభినందించారు. నల్ల పోచమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో భాగంగా పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. నిమ్స్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఏ.బాలయ్య, ప్రధాన కార్యదర్శి వీ.ప్రవీణ్ కుమార్, కోశాధికారి ఎం.వెంకటేష్, నిమ్స్ నర్సెస్ యూనియన్ అధ్యక్షురాలు ఆశలత తదితరులు పాల్గొన్నారు.

ఇందిరానగర్‌లో రక్తదాన శిబిరం


రక్తదానం చేస్తున్న కార్యకర్తలు

బంజారాహిల్స్: నేషనల్ యూత్ ప్రాజెక్ట్ నేషనల్ ఇంటిగ్రేటెడ్ ఫోరం ఆఫ్ ఆర్టిస్ట్ అండ్ యాక్టివిటీస్ ప్రెసిడెంట్ కే.యాదవరాజు, వీ.ప్రభాకర్, కోడిచెర్ల రమేష్ ఆధ్వర్యంలో ఆదివారం బంజారాహిల్స్‌లోని ఇందిరానగర్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ హైదరాబాద్ జిల్లా చైర్మన్ మామిడి భీంరెడ్డి, మేనేజింగ్ కమిటీ సభ్యులు ఏవీ రావు ముఖ్యఅతిథిగా విచ్చేసి ఈ శిబిరాన్ని ప్రారంభించారు. 'రక్తదానం–మహాదానం' అనే థీమ్‌తో నిర్వహించిన ఈ శిబిరంలో ప్రతిఒక్కరూ రక్తదానం చేస్తే ఎంతోమంది జీవితాలను కాపాడవచ్చని వారు పేర్కొన్నారు. పాల్గొన్న వారికి సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో షేక్‌పేట మండల రెడ్‌క్రాస్ సొసైటీ కన్వీనర్ కోడిచెర్ల రమేష్, మేకల లింగరాజు, వీఎస్ రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల గుండె చప్పుడు పాలకులు వినాలి

ప్రొఫెసర్ హరగోపాల్

హిమాయత్‌నగర్: ప్రజాస్వామ్య తెలంగాణ కోసం పాలకులు ప్రజల గుండె చప్పుడు విని, వారి నాడి తెలుసుకోవాలని పౌరహక్కుల నేత ప్రొఫెసర్ హరగోపాల్ సూచించారు. చారిత్రాత్మకంగా తెలంగాణ ఉద్యమం గొప్ప అనుభవం అని, కానీ తెలంగాణ ఆకాంక్షలకు అనుభవానికి చాలా అంతరం కనిపిస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. అభివృద్ధి నమూనా మార్పుతో ప్రపంచ వ్యాప్తంగా భయంకర వాతావరణం నెలకొని ఉందని ఆవేదన వెలిబుచ్చారు. ఆదివారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో సీనియర్ పాత్రికేయులు కందుకూరి రమేష్ బాబు రచించిన 'విను తెలంగాణ' పుస్తకావిష్కరణ జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రొఫెసర్ హరగోపాల్ ఈ పుస్తకాన్ని ఆవిష్కరించి ప్రసంగించారు. గత పదేళ్ల ప్రభుత్వానికి ఖాళీగా వున్న భూములు మాత్రమే కనిపించాయని, భూమిపై వుండే మనుషులు కనిపించలేదని తీవ్రంగా విమర్శించారు. ప్రాణ త్యాగాలు చేసిన యువత స్ఫూర్తి ఏమయ్యిందని, మానవీయ తెలంగాణ కావాలనే స్వప్నాన్ని యువతకు అందించ లేకపోయారని హరగోపాల్ అన్నారు. తెలంగాణ పునర్నిర్మాణ బాధ్యతను ఉద్యమనేత కోదండరాంకు అప్పగించాల్సిన ఆవశ్యకత కనిపిస్తున్నదని హరగోపాల్ అన్నారు. సభాధ్యక్షత వహించిన రచయిత, కవి, దర్శకుడు బి.నరసింగరావు మాట్లాడుతూ సమైక్య పాలనలో తెలంగాణకు అన్యాయం జరిగిందని ఉద్యమిస్తే, తెలంగాణ వచ్చాక గత పదేళ్లలో ముఖ్యమంత్రిని కలిసే అవకాశం గద్దర్‌తో పాటు తనకు కూడా లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం.కోదండరాం మాట్లాడుతూ జన ఆలోచనలకు సమస్యలకు 'విను తెలంగాణ' పుస్తకం దర్పణం అని, వర్తమాన తెలంగాణను అర్థం చేసుకోవడానికి ఇది దోహద పడతుందని ఆయన వివరించారు. భవిష్యత్ తెలంగాణ చిత్రపటం పట్ల ప్రజలకు స్పష్టత ఉందని, పాలకులకే స్పష్టత లేదన్నారు. వీక్షణం సంపాదకులు ఎన్.వేణుగోపాల్ పాల్గొన్నారు.

సాక్షి
సోమవారం । 14 । ఏప్రిల్ । 2025

బడుగులకు బీజేపీతోనే మేలు

● ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు లక్ష్మణ్


నార్సింగిలో అంబేడ్కర్ విగ్రహాన్ని శుభ్రం చేసి మాట్లాడిన డాక్టర్ లక్ష్మణ్

మణికొండ: దేశంలోని బడుగు, బలహీన వర్గాలు, దళితులకు గడచిన దశాబ్దకాలంలో ప్రధాని నరేంద్రమోదీ పాలనలో ఎనలేని మేలు జరిగిందని, అది రాబోయే రోజుల్లోనూ కొనసాగుతుందని ఆ పార్టీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వారోత్సవాల సందర్భంగా ఆదివారం నార్సింగి మున్సిపల్ కేంద్రంలో అంబేడ్కర్, మహాత్మాగాంధీ విగ్రహాలను శుభ్రపరిచి, పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బడుగు, బలహీన వర్గాలు, దళితులు, అంబేడ్కర్ పేరును ఓటు బ్యాంకుగానే వాడుకుందని ఆరోపించారు. 50 ఏళ్లకుపైగా అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ సరైన పాలన అందిస్తే దేశంలో పేదరికం ఉండేది కాదన్నారు. దేశ మొదటి ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ అడుగడుగునా అంబేడ్కర్‌ను అవమానించారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాహుల్ గాంధీ రాజ్యాంగాన్ని చేతిలో పట్టుకుని తిరుగుతూ మొసలి కన్నీరు కారుస్తున్నారని విమర్శించారు. ఈ నెల 10వ తేదీన ప్రారంభమైన బీజేపీ గావ్ చలో.. బస్తీ చలో అభియాన్ కార్యక్రమాలతో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలు, విధానాలను ఇంటింటికీ పార్టీ నాయకులు వెళ్లి వివరించాలన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు పి.రాజ్‌భూపాల్ గౌడ్, చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కె.ఎస్.రత్నం, రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోకల శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా నాయకులు ప్రతాప్, శ్రీరాములు యాదవ్, వై శ్రీధర్, పి.విష్ణువర్ధన్‌రెడ్డి, బాబయ్య తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు కాంగ్రెస్ అన్యాయం

బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలి | బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్


సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్


కాంగ్రెస్, బీజేపీ నేతలకు పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న కేటీఆర్

గౌతంనగర్: కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో అన్ని వర్గాల ప్రజలకు అన్యాయం జరిగిందని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఈ నెల 27న వరంగల్‌లో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ మహా సభను విజయవంతం చేయడంలో భాగంగా ఆదివారం మల్కాజిగిరి నియోజకవర్గంలోని గౌతంనగర్ డివిజన్ లక్ష్మీ గార్డెన్స్‌లో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అబద్ధపు పునాదుల మీద నిర్మించిన కాంగ్రెస్ పార్టీ వచ్చే ఎన్నికల్లో కుప్పకూలిపోతుందన్నారు. ప్రజలు కాంగ్రెస్‌ను నమ్మొద్దని అన్నారు. ఎన్నికల హామీలను విస్మరించిందని విమర్శించారు. మల్కాజిగిరిలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మనసున్న నాయకుడని, ప్రతిక్షణం ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరిస్తున్నారని పేర్కొన్నారు. ఆరోగ్యాన్ని లెక్కచేయకుండా డ్రైనేజీ కాలువలో కూర్చొని నిరసన తెలిపారన్నారు. మచ్చబొల్లారం శ్మశానవాటికలో డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా ప్రజలతో చెత్తలోనే కూర్చొని ధర్నా చేసి సమస్యను రాష్ట్ర వ్యాప్తంగా తెలియచేసి, చివరికి అక్రమ నిర్మాణాలను నిలిపి వేసే విధంగా పోరాటం చేసిన మంచి నాయకుడన్నారు. ఈ నెల 27న వరంగల్‌లో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు మల్కాజిగిరి నియోజకవర్గం నుంచి భారీ ఎత్తున హాజరై విజయవంతం చేయాలన్నారు. అనంతరం కేటీఆర్ సమక్షంలో పలువురు కాంగ్రెస్, బీజేపీల నుంచి బీఆర్ఎస్ పార్టీలో చేరినవారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు, మాజీ ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ నందికంటి శ్రీధర్, రాగిడి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్లు మేకల సునీతరాముయాదవ్, శాంతిశ్రీనివాస్‌రెడ్డి, సబితఅనిల్‌కిషోర్, మాజీ కార్పొరేటర్ జగదీష్‌గౌడ్, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కృత్రిమ అవయవాలు దానం


కృత్రిమ అవయవాలను దానం చేస్తున్న దృశ్యం

నాంపల్లి: జేసీఐ బంజారా హైదరాబాద్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం రెడ్‌హిల్స్‌లోని ఫెడరేషన్ హౌస్‌లో 104 మంది అంగవైకల్యం కలిగిన వికలాంగులకు కృత్రిమ అవయవాలను దానం చేశారు. జేసీఐ హైదరాబాద్ అధ్యక్షుడు సర్వేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జేసీఐ జాతీయ అధ్యక్షుడు జేఎఫ్ఎస్ అన్కూర్ కృత్రిమ అవయవాలను అందజేసి ప్రసంగించారు. జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్(జేసీఐ) 125 దేశాల్లో విస్తరించిందని, దాదాపు ఐదు లక్షల మంది క్రియాశీలక సభ్యులు ఉన్నారని వివరించారు. నాలుగు దశాబ్దాలుగా ఎన్నో కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో బాలికలకు మరుగుదొడ్ల నిర్మాణం కూడా చేపడుతున్నట్లు వివరించారు. విద్యార్థులు శుభ్రమైన నీటిని తాగే విధంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఆర్.ఓ. వాటర్ ప్లాంట్లను స్థాపించామని తెలియజేశారు. కార్యక్రమంలో చతుర్వేది, వినయ్ మెహతా పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి



సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి అన్నారు. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నిర్వహించిన రైతు మహోత్సవం–2025 కార్యక్రమంలో ఆదివారం స్టాల్స్‌ను సందర్శించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన రైతులతో మాట్లాడారు. వారి సాగు పద్ధతులు, పంటల వివరాలు, వాతావరణ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. రేవంత్ సర్కార్ రైతులకు అండగా ఉంటుందని తెలిపారు. ప్రభుత్వ పథకాల్లో రైతులకు అగ్ర తాంబూలం వేస్తోందని, రూ.2 లక్షల రుణ మాఫీ, సన్నాలకు రూ.500 బోనస్, రైతు భరోసా లాంటి పథకాల గురించి వివరించారు. సాగులో పురుగు మందులు, రసాయనాల వాడకం తగ్గించి సేంద్రియ పద్ధతులను ఆచరించాలని సూచించారు. వ్యవసాయ యాంత్రీకరణ రైతుకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. వాణిజ్య, ఉద్యాన పంటలు రైతులను ఆర్థికంగా ఆదుకుంటాయని తెలిపారు.

ఉర్దూ పరిరక్షణే ప్రభుత్వ ధ్యేయం

సాక్షి, సిటీబ్యూరో: ఉర్దూ భాషా, సాహిత్యం, సంస్కృతిని కాపాడేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం రాత్రి న్యూ మల్లేపల్లిలోని అన్వర్–ఉల్–ఉలూమ్ కళాశాలలో జరిగిన నవాబ్ ఆలంఖాన్ స్మారక ముషాయిరాలో ఆయన మాట్లాడారు. ఉర్దూ భాషను కాపాడుకోవడానికి ప్రభుత్వం నిబద్ధతతో పనిచేస్తోందన్నారు. ఉర్దూ మీడియంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ ఉద్యోగాలను భర్తీ చేస్తామని తెలిపారు. తన తల్లిదండ్రులు ఉర్దూ మీడియంలో విద్యను అభ్యసించడమే కాకుండా ఇంట్లో కూడా ఉర్దూలో మాట్లాడుకునేవారని గుర్తుకు తెచ్చుకున్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో ఉర్దూ భాష ముఖ్య భూమిక పోషించిందన్నారు మైనారిటీల హక్కుల పరిరక్షణలో, మైనారిటీ విద్యా సంస్థలకు చేయూతనివ్వడంతోపాటు సంక్షేమానికి కేటాయిస్తున్న బడ్జెట్‌ను రెండింతలు చేశామని చెప్పారు. ముస్లిం మైనారిటీల 4 శాతం రిజర్వేషన్లను కాపాడతామని, ఇది రాజ్యాంగ హక్కు అని ఆయన చెప్పారు. ఆ రిజర్వేషన్లను కాపాడేందుకు న్యాయస్థానాల్లో పోరాడుతామన్నారు.


నవాబ్ ఆలం ఖాన్ స్మారక ముషాయిరాలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

రాజ్యాంగం పదిలంగా ఉంటేనే హక్కులకు రక్షణ

● మంత్రి పొన్నం ప్రభాకర్


సామాజిక సాధికారత ఉత్సవాల్లో పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్

బంజారాహిల్స్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో సామాజిక సాధికారత ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ నెల 5న ప్రారంభమైన ఉత్సవాలు సోమవారం ముగియనున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం జరిగిన కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్యఅతిథిగా హాజరై అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ ప్రజలు స్వేచ్ఛగా అన్ని హక్కులను యథావిధిగా పొందాలంటే భారత రాజ్యాంగం పది కాలాల పాటు నిలవాలన్నారు. ఏప్రిల్‌లో మహానుభావులు బాబూ జగ్జీవన్‌రామ్, జ్యోతిబా పూలే, బాబా సాహెబ్ అంబేడ్కర్ జన్మించిన నెల అని, ఈ ముగ్గురూ సామాజిక న్యాయానికి సంబంధించి దేశంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారన్నారు. అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఘంటా చక్రపాణి అనేక కార్యక్రమాలు నిర్వహిస్తూ యూనివర్సిటీ స్ఫూర్తిని యావత్ తెలంగాణలోని విద్యార్థి లోకానికి, సమాజానికి చాటుతున్నారని పేర్కొన్నారు. అంబేడ్కర్ యూనివర్సిటీ అనేక మంది పట్టభద్రులు కావడానికి ఉపయోగపడిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి యూనివర్సిటీ అభివృద్ధికి నిధులు కేటాయించారని తెలిపారు. భారత పౌరుడిగా రాజ్యాంగంపై అవగాహన కలిగి ఉండాలన్నారు.

టేబుల్ టెన్నిస్‌లో తెలంగాణ పోలీసుల సత్తా


పతకాలతో తెలంగాణ పోలీసులు

బంజారాహిల్స్: ఆలిండియా పోలీసు బ్యాడ్మింటన్ క్లస్టర్ 2024–25 పోటీలు కేరళ రాష్ట్రంలోని కొచ్చిలో ఉన్న రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంలో జరుగుతున్నాయి. ఈ పోటీల్లో తెలంగాణ పోలీసు జట్టు టేబుల్ టెన్నిస్‌లో కాంస్య పతకాలు సాధించింది. టేబుల్ టెన్నిస్ డబుల్స్‌లో వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరిప్రసాద్, సైబరాబాద్ సీసీఎస్ ఏసీపీ ఆర్.కళింగరావు జట్టు కాంస్య పతకం సాధించింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో కరీంనగర్ ఏసీపీ మాధవి, సీబీడీ ఏసీపీ సీతారెడ్డి రజత పతకం సాధించారు. ఈ పోటీల్లో దేశవ్యాప్తంగా 29 రాష్ట్రాలకు చెందిన పోలీసులు టేబుల్ టెన్నిస్, బ్యాడ్మింటన్‌లో పోటీ పడుతున్నారు. ఈ నెల 11న ప్రారంభమైన ఫస్ట్ ఆలిండియా పోలీస్ బ్యాడ్మింటన్ క్లస్టర్ పోటీల్లో టేబుల్ టెన్నిస్‌లో తెలంగాణ పోలీసులు అద్భుత ప్రదర్శన కనబర్చారు. తెలంగాణ పోలీసులు రజత, కాంస్య పతకాలు సాధించి పెట్టడంతో తెలంగాణ పోలీసు కీర్తి దేశవ్యాప్తంగా కనిపించింది. పోటీల్లో నేషనల్ సెక్యూరిటీ గార్డ్, ఐబీ, సీఐఎస్ఎఫ్ పోలీసులు కూడా పాల్గొన్నారు.

ఆటిజంపై అవగాహన ఉండాలి

● డీవీస్ ఎం.డి.డాక్టర్ మురళి


కేబీఆర్ పార్కు వద్ద ఆటిజంపై అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న దివీస్ ఉద్యోగులు

బంజారాహిల్స్: ఆటిజం(బుద్ధి మాంద్యం) వ్యాధిపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని, సరైన సమయంలో గుర్తించడం, సరైన చికిత్స అందించడం ద్వారా దీన్ని అధిగమించవచ్చని దివీస్ లెబోరేటరీస్ సంస్థ ఎం.డి. డాక్టర్ మురళి కె.దివీ అన్నారు. ఆదివారం బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు వద్ద దివీస్ ఫౌండేషన్ ఫర్ గిఫ్టెడ్ చిల్డ్రన్, ఫెర్నాండెజ్ చైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్ సంయుక్తంగా ఆటిజంపై అవేర్‌నెస్ రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆటిజంతో బాధపడుతున్న చిన్నారులను గుర్తించి వారిని సాధారణ పిల్లల మాదిరిగా మార్చేందుకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఏప్రిల్ నెలను ఆటిజంపై అవగాహన మాసంగా జరుపుకుంటున్నారని దివీస్ డైరెక్టర్ నీలిమా దివి అన్నారు. తాజా అధ్యయనాల ప్రకారం ప్రతి 68 మంది పిల్లల్లో ఒకరికి ఆటిజం లక్షణాలు కనిపించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోందని ఫెర్నాండెజ్ డాక్టర్ ప్రమోద్ తెలిపారు. ఆటిజంపై గత ఐదేళ్లుగా వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో దివీస్ సంస్థకు చెందిన సుమారు 200 మంది ఉద్యోగులు పాల్గొన్నారు. కార్యక్రమంలో దివీస్ ఉపాధ్యక్షులు ప్రకాశ్ దివీ, మధు బాబు, జీఎంలు సుబ్బారావు, బి. వరప్రసాద్, జె.మనోరంజన్ తదితరులు పాల్గొన్నారు.

అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కు కల్పించాలి

● 19న ఇందిరాపార్క్ వద్ద మహాధర్నా


రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కును కల్పించడంతోపాటు 1977 పీఓటీ చట్టాన్ని రద్దు చేయాలని ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ అసైన్డ్ ల్యాండ్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథి వినోద్ కుమార్ మాట్లాడుతూ జీహెచ్‌ఎంసీ పరిధిలో ఉన్న బస్తీల్లోని ఇళ్లను పర్మనెంట్ చేయాలని, అసైన్డ్ భూములన్నింటినీ వెంటనే ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేయాలని, అన్యాక్రాంతమైన అసైన్డ్ భూములను తిరిగి అసైన్డ్‌దారులకు ఇవ్వాలని, మురికివాడల్లో నివసిస్తున్న పేదల ఇళ్లకు యాజమాన్య హక్కును కల్పించాలని డిమాండ్ చేశారు. అసైన్డ్ భూముల హక్కులకై ఈ నెల 19న ఇందిరాపార్కు వద్ద మహాధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ అసైన్డ్ ల్యాండ్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎర్రోళ్ల శివయ్య, ప్రధాన కార్యదర్శి శ్యామ్, సీపీఎం నాయకులు ఆర్.వెంకట్రాములు, పద్మ, సుదర్శన్ రావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌లో మంచి డిమాండ్

బ్లూ రిబ్బన్ ఫెయిర్‌కు విశేష స్పందన

లక్డీకాపూల్: ప్రస్తుతం మార్కెట్లో ఏఐకి మంచి డిమాండ్ ఉందని బ్లూ రిబ్బన్ వ్యవస్థాపకులు సంతోష్ కుమార్ తెలిపారు. సోమాజిగూడలోని కత్రియా హోటల్‌లో ఆదివారం నిర్వహించిన ఎడ్యుకేషన్ ఫెయిర్‌లో 32 యూనివర్సిటీల ప్రతినిధులు పాల్గొన్నారన్నారు. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న కోర్సులను ఎంపిక చేసుకోవడం ద్వారా విదేశాలలో మంచి ఉద్యోగ అవకాశాలు పొందవచ్చన్నారు. ఈ క్రమంలో విదేశీ యూనిర్సిటీలకి సంబంధించిన పూర్తి సమాచారాన్ని తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ ఫెయిర్ ద్వారా విదేశాల్లోని ఆయా యూనివర్సిటీలలో విద్యార్థులకు ఏ ఏ కోర్సులకు ఎంత స్కాలర్‌షిప్ వస్తుందనే విషయాలతోపాటు వర్సిటీలో ఉన్న సౌకర్యాల పూర్తి సమాచారం తెలుసుకుని అవకాశాన్ని విద్యార్థులకు కల్పించామన్నారు.

జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సాధనే లక్ష్యంగా పనిచేస్తాం

● ది జర్నలిస్ట్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ కార్యవర్గం

సాక్షి, సిటీబ్యూరో: ఖైరతాబాద్ విశ్వేశ్వరయ్య భవన్‌లో ది జర్నలిస్ట్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లిమిటెడ్ జనరల్ బాడీ సమావేశం ఆదివారం సొసైటీ అధ్యక్షుడు బ్రహ్మాండభేరి గోపరాజు అధ్యక్షతన జరిగింది. నాలుగున్న సంవత్సరాలు పర్సన్ ఇన్‌చార్జి ఆధీనంలో ఉన్న సొసైటీకి ఇటీవల ఎన్నికలు జరగడం, కొత్త కార్యవర్గం ఏర్పాటు కావడంతో ఐదేళ్ల తర్వాత జనరల్ బాడీ సమావేశం జరిగింది. ప్రభుత్వం వెంటనే స్పందించి సొసైటీకి ఇళ్ల స్థలాలు మంజూరు చేసే విషయంలో చొరవ చూపాలని సభ్యులు కోరారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సాధన కోసం ప్రభుత్వంతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరపాలని సమావేశంలో తీర్మానించారు. మరోవైపు సొసైటీ ఆస్తుల పరిరక్షణతోపాటు జర్నలిస్టుల కాలనీల సంక్షేమం, అభివృద్ధికి మరింత కట్టుబడి మెరుగ్గా పనిచేయాలని నిర్ణయించింది. ఐదు సంవత్సరాల ఆడిట్ రిపోర్ట్‌ను సభ్యుల ముందు పెట్టి ఆమోదం తీసుకున్నారు. సమావేశంలో కార్యదర్శి మిక్కిలినేని రవీంద్రబాబు, ఉపాధ్యక్షుడు మాసాదే లక్ష్మీనారాయణ, జాయింట్ సెక్రెటరీ డా.చల్లా భాగ్యలక్ష్మి, ట్రెజరర్ భీమగాని మహేశ్వర్ గౌడ్, డైరెక్టర్లు డి.కమలాకరాచార్య, హష్మీ, డి. వెంకటాచారి, స్వేచ్ఛతో పాటు సొసైటీ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



కాకరేపుతున్న కామెంట్స్

● పదవులు దక్కిన తర్వాత దూరంగా ఉండటంపై బీజేపీ అధినాయకుల ఆగ్రహం?
● కష్టపడే వారే పార్టీ పదవుల్లో కొనసాగాలనే వాదన
● డివిజన్ అధ్యక్షుల తీరుపై అసంతృప్తి



సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్రవ్యాప్తంగా సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేసేందుకు బీజేపీ అధినాయకత్వం ప్రయత్నిస్తుండగా, మరోవైపు కొందరు పదవులు దక్కిన తర్వాత పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారనే అసంతృప్తి శ్రేణుల్లో నెలకొంది. గ్రేటర్ పరిధిలో కొత్తగా ఎన్నికైన డివిజన్ అధ్యక్షుల వ్యవహార శైలిపై పార్టీ పెద్దలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరో ఏడాదిలో గ్రేటర్ ఎన్నికలు ఉన్నాయి. అప్పటి వరకు పార్టీ పరంగా గ్రౌండ్ వర్క్ చేసుకోవాలని దిశానిర్దేశం చేస్తున్నారు. డివిజన్, జిల్లాల వారీగా విస్తృత స్థాయి సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. పార్టీ బలాబలాలు, సరిదిద్దుకోవాల్సిన అంశాలపైనా చర్చిస్తున్నారు. ఇలాంటి సమంలో పార్టీ పదవుల్లో ఉన్నవారు సమావేశాలకు గైర్హాజర్ కావడమేంటని నేతలు ప్రశ్నిస్తున్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారే పార్టీ పదవుల్లో కొనసాగాలని, అలా కుదరదంటే స్వచ్ఛందంగా తప్పుకోవాలనే వాదలు గట్టిగా వినిపిస్తున్నారు. ఇటీవల కాషాయ పార్టీ మీటింగ్‌లో స్థానిక ఎంపీ ఈటల రాజేందర్ సైతం ఇదే స్వరాన్ని వినిపించారు. మేడ్చల్ అర్బన్ జిల్లాలో బీజేపీ 25 డివిజన్లుగా విభజించింది. కొత్తగా డివిజన్ అధ్యక్షులను ఎంపిక చేసింది. అనంతరం జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో ఏర్పాటు చేసింది. ఈ సమావేశానికి కొత్తగా ఏర్పాటైన వారిలో 9 మంది డివిజన్ అధ్యక్షులు హాజరు కాలేదు. దీంతో ఒకింత ఆగ్రహానికి గురైన ఈటల 70 వేల మందికి ప్రాతినిధ్యం వహించే డివిజన్ అధ్యక్షుడు పార్టీ సమావేశాలకు హాజరు కాకుంటే ఎలా, అత్యవసర పరిస్థితుల్లో రాలేనివారిని మినహాయిస్తే, మిగతావారిని ఉపేక్షించేది లేదంటూ వార్నింగ్ ఇచ్చారు. దీంతో పార్టీలో ఆ 9 మంది డివిజన్ అధ్యక్షుల భవితవ్యం ఏంటనే చర్చ జరుగుతోంది. భాగ్యనగరంలోని మిగతా డివిజన్ల పరిస్థితిపైనా నిశితంగా పరిశీలించి పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్నవారిని పక్కన పెట్టి పార్టీకి పనిచేసే వారికి పట్టం గట్టాలని పార్టీ అధిష్టానం భావిస్తోందని నేతలు పేర్కొంటున్నారు. నేతలు సొంత పార్టీ వారే అయినా కొన్ని దఫాలు కఠినంగా వ్యవహరించాల్సి వస్తుందంటున్నారు. పదవి పొందేటప్పుడు ఉన్న ఆరాటం ఆ తర్వాత ఉండటం లేదని, పార్టీ కోసం 24 గంటలు పని చేయాల్సిందేనని పార్టీ అధిష్టానం స్పష్టం చేస్తోంది.

మిద్దెతోటల ప్రాముఖ్యత తెలుసుకోవాలి

గన్‌ఫౌండ్రీ: పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రతి ఒక్కరూ మిద్దె తోటల సాగుబడి సమూహం ప్రాముఖ్యత తెలుసుకోవాలని హెచ్‌ఎండీఏ జాయింట్ కమిషనర్ శ్రీవాత్సవ అన్నారు. ఆదివారం నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో అగ్రి హార్టీ సొసైటీ, ఎగ్జిబిషన్ ఎకనామిక్ కమిటీల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రైతుమేళాలో సిటీ ఆఫ్ టెర్రస్ గార్డెన్ ఆధ్వర్యంలో సేంద్రియ ఇంటి పంటలపై సర్వే నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నగరంలో కాలుష్య నియంత్రణకు మిద్దెతోటల సాగుబడి దోహదపడుతుందని చెప్పారు. కేంద్రీయ పద్ధతిలో కూరగాయల మొక్కలు పెంచడం అభినందనీయమన్నారు. డిప్యూటీ డైరెక్టర్ చక్రపాణి మాట్లాడుతూ ప్రతి ఇంటికి ఐదు మొక్కలను అందించే విధంగా ప్రణాళికలను సిద్ధం చేసినట్లు వెల్లడించారు. సంవత్సరానికి 4 వేల మొక్కలను పెంచుతున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలను పెంచాలని పిలుపునిచ్చారు. సంస్థ వ్యవస్థాపకులు హెచ్.శ్రీనివాస్ మాట్లాడుతూ కాలుష్య, రసాయన రహితాలతో కూడిన మొక్కలు, పండ్లు, కూరగాయల నుంచి విముక్తిని పొందవచ్చని వెల్లడించారు.

ఉచితంగా మొక్కల పంపిణీ

సిటీ ఆఫ్ టెర్రస్ గార్డెన్స్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున మొక్కలను ఉచితంగా పంపిణీ చేశారు. భవనాలపై మిద్దెతోటల పెంపకం వంటి అంశాలపై సందర్శకులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్‌సీఎఫ్ శాస్త్రవేత్త ప్రవీణ్‌కుమార్, హెచ్‌ఎండీఏ డిప్యూటీ ఏడీ విజయబాబు, సినీనటుడు రఘు, ఎకనామిక్ కమిటీ కార్యదర్శి రంగారెడ్డి, సంస్థ సహ వ్యవస్థాపకురాలు సరోజ, సలహాదారులు రూపినేని క్రాంతి పాల్గొన్నారు.

మున్నూరు కాపు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

● ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద మహాధర్నా


మున్నూరు కాపు ఆత్మగౌరవ మహాధర్నాలో పాల్గొన్న ఉగ్గే శ్రీనివాస్ పటేల్ తదితరులు

కవాడిగూడ: రేవంత్‌రెడ్డి ప్రభుత్వ మున్నూరు కాపులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మున్నూరు కాపు ఆత్మగౌరవ మహాధర్నా సేన ఆధ్వర్యంలో ఆదివారం ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద మున్నూరు కాపులు మహాధర్నా నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాలు, గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో మున్నూరు కాపులు, రైతులు తీసుకువచ్చిన వరిధాన్యం, మొక్కజొన్న, కర్రలు, ఇతర వ్యవసాయ పనిముట్లకు మున్నూరు కాపు ఆత్మగౌరవ మహాధర్నా సేన రాష్ట్ర కన్వీనర్ ఉగ్గే శ్రీనివాస్ పటేల్ పూజలు చేసి దీక్షను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మున్నూరు కాపులకు ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ. 5 వేల కోట్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. మున్నూరు కాపులకు మంత్రివర్గ విస్తరణలో అవకాశం కల్పించాలని, లేనిపక్షంలో మున్నూరు కాపుల సంఘటితశక్తిని ప్రభుత్వం చూడాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కోకాపేటలో మున్నూరు కాపులకు కేటాయించిన 5 ఎకరాలు, రూ. 5 కోట్లు భవన నిర్మాణానికి సరిపోవని, మరో రూ. 20 కోట్లు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. కాచిగూడలోని మున్నూరు కాపు విద్యార్థి వసతి గృహాన్ని ఎండోమెంట్ పరిధి నుంచి తొలగించాలని, మున్నూరు కాపుల పేరు చివరన పటేల్ అని ప్రభుత్వమే గెజిట్ చేసి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేసిన తర్వాతే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలన్నారు. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ రాజ్యాధికార సాధనే మున్నూరు కాపుల అంతిమ లక్ష్యం కావాలని, అందరూ సంఘటితంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ పీఎల్ఎన్ పటేల్, అర్జున్ తడబోయిన, బాలశ్రీనివాస్, చామకూర సుజాత, మామిండ్ల అశోక్, రోజారాణి, గుంటి మంజుల, బిల్ల కంటి శ్రీనివాస్, కటికం మహేష్, బత్తుల రాములు, అనిల్, శ్రీనివాస్, పిడికిలి రాజు తదితరులు పాల్గొన్నారు.

26 బీసీ కులాలను చేర్చడం తగదు

● ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

హిమాయత్‌నగర్: ఏపీకి చెందిన 26 బీసీ కులాలను తెలంగాణలో చేర్చే నిర్ణయాన్ని బీసీ కమిషన్ పున సమీక్షించాలని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. ఆదివారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో బీసీ–ఏ కులాల హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు ఎమ్మెస్ నరహరి ఆధ్వర్యంలో జరిగిన మీడియా సమావేశంలో ముఖ్యఅతిథిగా విచ్చేసి మల్లన్న మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా వెనుకబడిన బీసీ కులాలు ఇప్పుడిప్పుడే తేరుకుంటున్న సమయంలో ఆంధ్రా బీసీ కులాలను తీసుకొచ్చి తెలంగాణ బీసీ కులాల్లో కలపడం సమంజసం కాదన్నారు. ఏపీకి చెందిన కొంతమంది పనిగట్టుకొని తెలంగాణ రాష్ట్ర బీసీ–ఏ కులాల్లోకి రావడానికి ప్రయత్నించడం బాధాకరమన్నారు. ఇక్కడ ఉన్న తెలంగాణ బీసీ కులాలను ఏపీలోని బీసీ కులాల్లో చేర్చేందుకు ఆ రాష్ట్ర ప్రభుత్వం ఒప్పుకుంటుందా? అని ఎదురు ప్రశ్నించారు. ఒకవేళ ఈ 26 బీసీ కులాలను తెలంగాణ ప్రభుత్వం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లలో చేర్చితే తమకు అభ్యంతరం లేదని మల్లన్న అన్నారు. హైకోర్టు తీర్పును ప్రభుత్వం ఉల్లంఘించడం మంచిది కాదని, బీసీ కులాల మధ్య పంచాయితీ పెడితే ఊరుకునే ప్రసక్తే లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో బీసీ నేతలు ప్రొఫెసర్ భాగయ్య, కె.రామచందర్, ప్రొఫెసర్ సాంబయ్య, ప్రొఫెసర్ సాంబమూర్తి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు దుర్గారాణి, పరమేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, సోమవారం, 14, ఏప్రిల్, 2025





ఉరుకుల పరుగుల జీవనంలో ఉల్లాసం కావాలి. వారంలో ఒక్కరోజైనా, ఒక్క పూటైనా ఒత్తిడి నుంచి విముక్తి కావాలి. అందుకే నగరవాసులు ఎల్లప్పుడూ ఆసక్తికరమైన ప్రత్యామ్నాయ చికిత్సల కోసం అన్వేషిస్తూ ఉంటారు. అలాంటి అన్వేషణ ఫలాల్లో ఇప్పుడు, ఆఫ్రికన్ డ్రమ్ అయిన జెంబే ఒకటిగా నిలిచింది. మ్యూజిక్ థెరపీలో భాగంగా దీనిని నగరవాసులు ఆస్వాదించడం పెరుగుతోంది. - సాక్షి, సిటీబ్యూరో

మ్యూజిక్ థెరపీ.. జెంబే..

- నగరవాసులకు ఒత్తిడి చికిత్సగా సంగీత సాధన
- ఆఫ్రికన్ సంగీత పరికరం జెంబేకు ఆదరణ
- ముంబై వంటి నగరాల్లో జెంబేకి జై కొడుతున్న జనం
- మ్యూజిక్ థెరపీలో భాగంగా ఉపయోగిస్తున్న వైనం

చక్కని సంగీతం వినడం మనసుకు ఆహ్లాదాన్ని అందిస్తుందని కొత్తగా చెప్పనక్కర్లేదు. అయితే సంగీత వాయిద్యాన్ని పలికించడం కూడా అంతకు మించిన ఆహ్లాదాన్ని ఆరోగ్యాన్ని అందిస్తుంది అని జెంబే నిరూపిస్తోంది. ఇప్పటికే ముంబై వంటి నగరాల్లో బహిరంగ ప్రదేశాల్లో, ముఖ్యంగా మాల్స్‌లో సర్వసాధారణంగా జెంబే సంగీత కార్యక్రమం ఇప్పుడిప్పుడే నగరంలోనూ ప్రాచుర్యం పెంచుకుంటోంది.

డ్రమ్ మారో డ్రమ్..

సంగీత పరికరమైన డ్రమ్ – దాని అంతర్గత లయ స్వభావం కారణంగా – దానిని పలికించే వారికి ఆరోగ్య ప్రయోజనం చేకూరుస్తుందని నిపుణులు చెబుతున్నారు. నిజానికి గిటార్ లేదా హార్మోనికాతో పోలిస్తే సరళమైన సంగీత వాయిద్యం డ్రమ్స్. దీనిని పలికించడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి సైకోథెరపిస్ట్ నీతా మాట్లాడుతూ, 'డ్రమ్ శిక్షణ స్ట్రోక్ పేషెంట్లకు పార్కిన్సన్స్ వ్యాధి ఉన్నవారికి సైతం ఉపయుక్తం. నడక, చేయి నియంత్రణ ద్వారా వారికి ప్రయోజనం చేకూరుస్తుంది. వారి కదలికల్లో ఖచ్చితత్వం, వేగం, సున్నితత్వాన్ని మెరుగుపరుస్తుంది' అంటున్నారు. 'ఇది మెదడులో డోపమైన్ స్థాయిలను పెంచుతుంది. అయితే అధికంగా డ్రమ్మింగ్ మీద ఆధారపడితే మాత్రం ప్రయోజనకరంగా ఉండకపోవచ్చు' అని కూడా నీతా చెబుతున్నారు.







ఎవరికి నప్పదు.. అంటే..

పెద్దపెద్ద శబ్దాలకు వ్యతిరేకంగా స్పందించే స్వభావం కలిగినవారు.. అలాగే.. భుజం కీళ్లు, మోచేతులు లేదా మణికట్టుకు గాయాలు, లేదా ఇతర సమస్యలు ఉన్నవారికి ఈ జెంబే నప్పదు. అలాగే కార్డియో యాక్టివిటీని తక్కువగా మాత్రమే చేయాలని వైద్య సలహా పొందిన వారు కూడా దీని జోలికి వెళ్లకపోవడమే మంచిది.

పెర్కుషన్ వాయిద్యం.. ఆరోగ్యమార్గం..

'దక్షిణాఫ్రికా నుంచి వచ్చిన జెంబే ఒక పెర్కుషన్ వాయిద్యం. జాజ్, తబలా మృదంగం పెర్కుషన్ రంగంలో బాగా తెలిసిన ఎంపికలు అయితే, జెంబే నన్ను ఆకర్షించింది. అప్పటికే దీనిలో రాణిస్తున్న ఓ దక్షిణాఫ్రికా స్నేహితుడి ప్రోద్బలంతో దీన్ని సాధన చేశాను. సంగీతంలో పీహెచ్‌డీ చేశాను. మన శరీరంలోని ఏడు చక్రాల ప్రాముఖ్యతను నేను గుర్తించాను. నగరంలో తొలిసారి జెంబే ద్వారా మ్యూజికల్ థెరపీని పరిచయం చేశాను. ఇది మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించడానికి, ఒత్తిడి నిర్వహణలోనూ ఉపకరిస్తుంది. లయ ఆనందం ద్వారా ప్రజలను కనెక్ట్ చేసే అద్భుతమైన వాయిద్యం జెంబే. అన్ని వయసుల వారికీ సంగీతం తాలూకు మ్యాజిక్‌ను అందించడాన్ని లక్ష్యంగా పెట్టుకుని కొంతకాలంగా నగరంలోని పాఠశాలలు కళాశాలల్లో ప్రదర్శనలు, వర్క్‌షాపులు నిర్వహిస్తున్నాం.

– సాయి కుమార్, ది జెంబే సర్కిల్ వ్యవస్థాపకుడు

ఆఫ్రికాలో సందేశాలు పంపే సంగీతం..

జెంబే పశ్చిమ ఆఫ్రికాలో, ముఖ్యంగా మాలి, గినియా ఐవరీ కోస్ట్ ప్రాంత మూలాలను కలిగి ఉంది. వివాహాలు, దీక్షా ఆచారాల వంటి ఉత్సవ సందర్భాల్లో ఈ డ్రమ్ వాయించడం సంప్రదాయం. వీటి ధ్వని మైళ్ల దూరం వినబడుతుందట. అందుకని, సుదూర ప్రాంతాల్లో ముఖ్యమైన సందేశాలను చేరవేయడానికి కూడా ఉపయోగిస్తారట. కాలక్రమేణా, జెంబే ఆఫ్రికా ను దాటి ప్రపంచంలోని ఇతర ప్రాంతాలకూ వ్యాపించింది. పశ్చిమ ఆఫ్రికాలో ప్రాచుర్యం పొందిన వాయిద్యాల్లో జెంబే ఒకటి. గోబ్లెట్ ఆకారపు ఈ డ్రమ్ ఆఫ్రికాలోని డిజాలా/లెంకె చెట్టుకు చెందిన సింగిల్ పీస్ హార్డ్ వుడ్‌తో తయారవుతుంది. పైభాగం.. అంటే డ్రమ్‌హెడ్ గొర్రె/జంతు చర్మంతో రూపొందుతుంది.

ఒంటరిగా.. గ్రూప్‌గా..

ఒంటరిగా డ్రమ్మింగ్ చేయడం ఏకాగ్రతను పెంచుతుంది, లోతైన శ్వాస ద్వారా మెరుగైన ఆక్సిజన్ ప్రవాహాన్ని ప్రోత్సహిస్తుంది. ఒత్తిడి, ఆందోళనను తగ్గిస్తుంది. సమన్వయ శక్తిని పెంచుతుంది. ప్రస్తుతంలో జీవించడం (మైండ్ ఫుల్ నెస్) సాధనలో సహాయపడుతుంది. స్నేహితులు లేదా ఇతరులతో కలిసి ప్లే చేయడం ఉత్తమ మార్గం. ఇందులో పాల్గొనేవారు అతని/ఆమె సౌలభ్యం, నైపుణ్యం ప్రకారం వాయిద్యాన్ని పలకిస్తారు కాబట్టి ఇది బంధాలను బలపరుస్తుంది, సహనాన్ని అలవరుస్తుంది. అపరిచితులను ఒకచోట చేర్చడం ద్వారా నలుగురిలో కలవడానికి ఇబ్బంది పడే వ్యక్తులకు ఆ ఫీలింగ్ పోయేలా చేస్తుంది.



రన్ ఫర్ హెల్త్..





- అత్యవసర ఆరోగ్యరక్షణపై అవగాహన
- గచ్చిబౌలి స్టేడియంలో 10కే రన్ నిర్వహణ

గచ్చిబౌలి : అత్యవసర ఆరోగ్య సంరక్షణ, ప్రాముఖ్యతను చాటిచెప్పేందుకు హోండా బిగ్‌వింగ్ డీలర్ షిప్‌లు, ఆటోఫిన్ హోండా, జేఎస్‌పీ హోండా, ఫార్చ్యూన్ హోండా బిగ్‌వింగ్ సంయుక్తంగా 10కే రన్ విజయవంతంగా నిర్వహించారు. గచ్చిబౌలి స్టేడియంలో ఆదివారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు ఔత్సాహికులు పాల్గొన్నారు. రన్నర్స్ నుంచి విశేష స్పందన వచ్చింది. ఫార్చ్యూన్ హోండా నీరవ్‌మోడి మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ అత్యవసర ఆరోగ్య సంసరక్షణపై అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు. హోండా బిగ్‌వింగ్ ప్రయత్నంలో భాగంగా దీనిని ఏర్పాటు చేశామన్నారు. దీనిని యేటా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమం ద్వారా వచ్చిన నిధులను మొత్తం ఆరోగ్య సంరక్షణకు ఉపయోగించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆయా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

హైటెక్‌సిటీలో 5 కె రన్..

మాదాపూర్ : ఐటీ ఉద్యోగులు 5 కె రన్‌లో పలువురు రన్నర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. మాదాపూర్‌లోని హైటెక్‌సిటీ యశోధహాస్పిటల్ వద్ద ఆదివారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా 5 కె రన్ నిర్వహించారు. టీసీఎస్ ఉద్యోగులు 8500 మంది పాల్గొని కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐటీ ఉద్యోగుల ఆరోగ్యంపై ప్రముఖ డాక్టర్లు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అభినవ్, టీసీఎస్ అధ్యక్షుడు వి.రాజన్న, ఐటీ ఉద్యోగులు పాల్గొన్నారు.



నగరంలో ప్రవాసీ ఒడియా ఫెస్టివల్

- ఉత్కళ ఒడియా యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహణ
- 'పత్ ఉత్సవాలకు' వేదికైన ఖాజాగూడ పెద్ద చెరువు





రాయదుర్గం : ఒడిశా వాసులు గచ్చిబౌలి డివిజన్‌లోని ఖాజాగూడ పెద్ద చెరువు వద్ద సందడి చేశారు. ఉత్కళ ఒడియా యూత్ అసోసియేషన్ హైదరాబాద్ ఆధ్వర్యంలో హైదరాబాద్ ప్రవాసీ ఒడియా ఫెస్టివల్ 'పత్ ఉత్సవం' పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. నగరంలో నివాసముండే ఒడిశా వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ఉత్సాహాన్ని ప్రకటించారు. మొదట ఇస్కాన్ బృందం వారిచే కృష్ణ పరమాత్మ, రామ లీలలపై గానామృతం నిర్వహించగా అందరినీ ఆకట్టుకుంది. అనంతరం రోడ్ రంగోలి మురుజా, ఆతోంటిక్, ఒడియా క్యూసిన్, డిస్‌ప్లే, ఆర్ట్, పైకా ఆర్ట్, టైగర్ నృత్యాలు వంటివి నిర్వహించి తమ సంప్రదాయాన్ని చాటుకున్నారు. అనంతరం శంఖనాథాలతో కూడిన నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఓడ్రా, దేహం జుంబా నృత్యాలతోపాటు పిల్లల గ్లోబల్ ఆర్ట్స్ డ్రాయింగ్ పోటీలను నిర్వహించగా ఒడిశా వాసులు ఆసక్తిగా తిలకించారు. ప్రత్యేక ఆహ్వానితులుగా ఐపీఎస్ అధికారి సౌమ్యామిశ్రా, సుప్రసిద్ధ గైనకాలజిస్ట్ డాక్టర్ అనురాధ పాండ్యా పాల్గొని అందరినీ మరింత ఉత్సాహపరిచారు. అనంతరం అసోసియేషన్ ఆధ్వర్యంలో అతిథులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో నగరంలోని ఒడిశా వాసులు పాల్గొన్నారు.

తెలంగాణ రగ్బీ

జాతీయ స్థాయి సభ్యత్వం

- ఇండియన్ ఫుట్‌బాల్ యూనియన్ నుంచి తెలంగాణ అసోసియేషన్‌కు సభ్యత్వం
- అధికారికంగా ప్రకటించిన ఐఆర్‌ఎఫ్‌యు

సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణలో బ్యాడ్మింటన్, టెన్నిస్, క్రికెట్ తరహాలో రగ్బీ క్రీడ కూడా అభివృద్ధి చెందనుందని తెలంగాణ రగ్బీ అసోసియేషన్ వెల్లడించింది. ఇండియన్ రగ్బీ ఫుట్‌బాల్ యూనియన్ నుంచి శాశ్వత సభ్యత్వం కోసం అధికారికంగా గుర్తింపు లభించిందని సంస్థ ప్రకటించింది. ఈ నూతన అనుబంధంతో తెలంగాణ రగ్బీ అసోసియేషన్ 'ఆర్టికల్స్ ఆఫ్ అసోసియేషన్' కింద శాశ్వత సభ్యులకు అందాల్సిన అన్ని ప్రయోజనాలనూ అందించనున్నట్లు నూతన అధ్యక్షులు, లైఫ్ స్పాన్ ఇండస్ట్రీస్ వ్యవస్థాపకులు డాక్టర్ నరేంద్ర రామ్ తెలిపారు. ఈ అధికారిక గుర్తింపు రాష్ట్ర వ్యాప్తంగా రగ్బీని మెరుగుపరచడానికి, జాతీయ పాలక సంస్థతో సన్నిహితంగా సహకరించడానికి అసోసియేషన్ అనుమతిస్తుందని పేర్కొన్నారు. నూతన అధ్యక్షునిగా 2028 వరకూ మూడేళ్ల పాటు భవిష్యత్ తరాలకు స్ఫూర్తినిచ్చే శక్తివంతమైన రగ్బీ సంఘాన్ని సృష్టించడానికి కలిసి పనిచేయనున్నామని తెలిపారు.






ఆకట్టుకున్న మార్షల్ ఆర్ట్స్ విన్యాసాలు

అమీర్‌పేట : వైశాఖీ ఉత్సవాల సందర్భంగా సాయంత్రం నగర కీర్తన్ పేరిట ఊరేగింపు నిర్వహించారు. అమీర్‌పేట గురుద్వారా నుంచి ప్రారంభమైన ఊరేగింపు గ్రీన్‌ల్యాండ్స్, క్యాంపు కార్యాలయం, పంజాగుట్ట, అమీర్‌పేట మీదుగా గురుగ్రంథాన్ని, సిక్కు సంప్రదాయ ఆయుధాలను ప్రదర్శనంగా ఊరేగింపు నిర్వహించారు. సిక్కు యువతీ, యువకులు చేసిన మార్షల్ ఆర్ట్స్ కత్తి యుద్ధం, గుర్రపు స్వారీ వంటి విన్యాసాలు ఆకట్టుకున్నాయి. గురుగోవింద్‌సింగ్ వంశపారంపర్యంగా వస్తున్న ఐదు అరుదైన గుర్రాలు ఊరేగింపులో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. దారి పొడవునా గురుగ్రంథానికి పూజలు చేశారు. ఊరేగింపు మార్గంలో ట్రాఫిక్‌ను దారి మళ్లించారు. ఈ సందర్భంగా ఎస్ఆర్ నగర్ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

హెచ్ఐసీసీలో తెలంగాణ పంజాబీ సభ

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



మాదాపూర్ : ప్రముఖ పంజాబీ గాయకుడు గురుదాస్ మాన్ తన సంగీత ప్రదర్శనతో ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నారు. మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో తెలంగాణ పంజాబీ సభను ఆదివారం నిర్వహించారు. తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి నోవోటెల్ భాగస్వామిగా వ్యవహరించింది. చండీగఢ్‌కు చెందిన శశిధీమాన్ హస్య ప్రదర్శన ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించింది. ఈ సందర్భంగా తెలంగాణ పంజాబీ సభ అధ్యక్షుడు రవీందర్ సింగ్ సర్నా మాట్లాడుతూ కేవలం ఉత్సవాలకే పరిమితం కాకుండా సమాజ సంక్షేమానికి కట్టుబడి ఉన్నామన్నారు. విపత్తుల సమయంలో సహాయపడడం, ఆరోగ్య శిబిరాలు నిర్వహించడం తదితర సామాజిక కార్యక్రమాల్లో పాల్గొంటున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి హైదరాబాద్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల పంజాబీయులు హాజరయ్యారు. వంశీరామ్ బిల్డర్స్ ఎండీ సుబ్బారెడ్డి, ప్రీమియర్ ఎనర్జీస్ లిమిటెడ్ చైర్మన్ సురేందర్‌పాల్ సింగ్, నీరూస్ చైర్మన్ అవినాష్ కుమార్ పాల్గొన్నారు.

ఉమెన్ ఆఫ్ ఇంపాక్ట్ అవార్డులు స్ఫూర్తిదాయకం

- ట్రంప్స్ ఆఫ్ టాలెంట్ ఆధ్వర్యంలో ప్రదానం
- అవార్డులను అందించిన ఫ్యాషన్ ఐకాన్ శిల్పారెడ్డి

సాక్షి, సిటీ బ్యూరో : వ్యాపారం, సాంకేతికత, కళలు, సామాజిక సేవతో పాటు విభిన్న రంగాల్లో స్ఫూర్తిదాయకంగా నిలిచిన మహిళలను ట్రంప్స్ ఆఫ్ టాలెంట్ (టీఓటీ) ఆధ్వర్యంలో 'ఉమెన్ ఆఫ్ ఇంపాక్ట్ -2025' అవార్డులతో గౌరవించింది. హైటెక్ సిటీలోని అవసా హోటల్ వేదిక జరిగిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్, వెల్నెస్ అంబాసిడర్ శిల్పారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మహిళలకు అవార్డులను అందించారు. ఈ వేదిక ద్వారా మహిళల ప్రయాణాన్ని స్ఫూర్తివంతమైన కథలుగా ప్రదర్శించామని ట్రంప్స్ ఆఫ్ టాలెంట్ వ్యవస్థాపకులు మహమ్మద్ ఫయాజ్ తెలిపారు. అవార్డుల జ్యూరీలో లాయిడ్స్ టెక్నాలజీ సెంటర్ ఇండియా సీఈవో శిరీష వోరుగంటి, వీహబ్ సీఈవో సీతా పల్లచోల్ల, ఐబీఎం ఎగ్జిక్యూటివ్ భాగస్వామి అనురాధ ఏ, నోవార్టిస్ కంట్రీ హెడ్ దివ్య బాల్‌రాజ్, తెలంగాణ తొలి గిరిజన మహిళా వాణిజ్య పైలట్ కెప్టెన్ బాబీ ఉన్నారు. ప్రముఖ టాలీవుడ్ నటుడు పృథ్వీరాజ్, ఇన్ఫోసిస్ ఫౌండేషన్ అధిపతి మనీషా సాబూ, అబైరో క్యాపిటల్ సలహాదారు మహంకాళి శ్రీనివాసరావు, ఎడ్యు గ్లోబల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఫిరోజ్ సైట్ పాల్గొన్నారు.



అకాల వర్షాన్ని ఒడిసిపడితే..

బోరులోనూ జలహోరు!



ఎవరు?

బోరుబావి ద్వారా వాననీటిని నేలలోకి ఇంకించి భూగర్భ నీటిని మరింతగా రీచార్జ్ చేసే సాంకేతిక ప్రక్రియలో ఆర్వీ.రాంమోహన్‌ది అందెవేసిన చేయి. 2012 నుంచి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో నీటి కష్టాలకు పరిష్కారంగా బోరుబావుల చుట్టూ రాళ్ల రప్పలు, గులక రాళ్లు, ఇసుకతో ఇంకుడు గుంతలు నిర్మించుకోవటంలో రైతులకు, పట్టణవాసులకు చేదోడుగా ఉంటున్నారు. ఇప్పటికి వెయ్యి బోర్ల రీచార్జ్‌కు ఇంకుడుగుంతలను నిర్మించటంలో ప్రత్యక్షంగా తోడ్పాటునందించారు. మరో మూడు, నాలుగు వేల బోరు రీచార్జ్ పిట్ల నిర్మాణానికి పరోక్షంగా సాంకేతికతంగా సాయపడ్డారు. ఈ క్రమంలో రైతుల అభిప్రాయాలు, సలహాలు సూచనల మేరకు ఈ సాంకేతికతలో ఎప్పటికప్పుడు అవసరమైన మార్పులు చేశారు. ఈ అనుభవ జ్ఞానంతో 'గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో బోరుబావుల పునరుద్ధరణ (అక్విఫెర్ రీచార్జ్)'పేరిట శిక్షణ కరదీపికను ప్రచురించారు.

తెలుగు రాష్ట్రాల్లో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. బోర్లు నోరెళ్ల బెడుతున్నాయి. పంటలు, తోటలు కళ్లు తేలేస్తున్నాయి. మరో మూడు నెలలు ఎండల తీవ్రత ఎక్కువగానే ఉంటుందని వాతావరణ శాఖ చెబుతూనే ఉంది. ఈ కష్టకాలంలో అడపాదడపా పలకరించే అకాల వర్షాలు రైతులకు కొంత మేరకు ఉపశమనం కలిగిస్తున్నాయి. రెండు రోజులు గడిస్తే నీటికష్టాలు షరా మామూలే. అయితే, ఈ అకాల వర్షపు నీటిని పొలాల్లో ఎక్కడికక్కడే ఒడిసిపట్టి భూమిలోకి ఇంకింపజేసుకుంటే సమస్యకు పరిష్కారం దొరుకుతుంది. ఎండిపోయిన /ఎండిపోతున్న బోర్ల చుట్టూ ఇంకుడు గుంతలు కట్టుకుంటే ఆ బోర్లు ఎండిపోకుండా ఉంటాయి. అవి తిరిగి జలకళను సంతరించుకుంటాయి. వర్షం కురిసిన రోజే ఆ బోర్లలో అప్పటికప్పుడే నీటిలభ్యత పెరుగుతుందని సీనియర్ హైడ్రాలజిస్ట్, సికింద్రాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న వాటర్ అండ్ లైవ్‌లీహుడ్స్ ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆర్వీ.రాంమోహన్‌అనుభవపూర్వకంగా చెబుతున్నారు. పన్నెండేళ్లుగా తెలుగు రాష్ట్రాల్లో వేలాది బోర్లను రీచార్జ్ చేసిన అనుభవంతో ఆయన 'సాక్షి సాగుబడి'కి అనేక విషయాలు చెప్పారు.

- సాక్షి, స్పెషల్ డెస్క్

బోర్ల చుట్టూ వాననీటి రీచార్జ్ కట్టడాలతో రైతుల నీటికష్టాలకు చెల్లు



ఏమిటి?

గ్రామీణ ప్రాంతాల్లో వేలాది వ్యవసాయబోర్లు ఎండిపోయి ఉన్నాయి. కొన్నిచోట్ల తక్కువ నీటిని పోస్తూ ఉన్నాయి. కొత్త బోర్లు తవ్వకుండా ఇప్పటికే ఉన్న ఎండిపోయిన లేదా ఎండిపోతున్న బోరుబావుల చుట్టూ వాననీటి రీచార్జ్ కట్టడాలు నిర్మించాలి. తద్వారా చిన్న, సన్నకారు రైతులకు అందుబాటు ఖర్చుతోనే నీటి భద్రత కల్పించొచ్చు.

ఎప్పుడు?

బోరు లోపలికి ట్యాంకర్‌తో తెచ్చిన నీటిని పోసి.. దానికి వాననీటిని ఇంకింపజేసుకునే సామర్థ్యం ఉందో లేదో టెస్ట్ చేయాలి. దీన్నే ట్యాంకర్ టెస్ట్ అంటారు. కేవలం కొన్ని వందల రూపాయల ఖర్చుతో రైతులు సొంతంగా తమ బోరుబావులను పరీక్షించుకోవచ్చు. వానాకాలం ప్రారంభం కాక ముందు ఫిబ్రవరి–మే నెలల మధ్య రోజులు ఇందుకు అనువైన కాలం.

ఎక్కడ?


కొన్ని పొలాల్లో ఒకటి కన్నా ఎక్కువ బోర్లు ఉండొచ్చు. అలాంటప్పుడు అన్ని బోర్లకు 'ట్యాంకరు టెస్ట్'చేయాలి. వాటి వాస్తవిక రీచార్జ్ సామర్థ్యం ఎంత అనేది కచ్చితంగా తెలుస్తుంది. లోతు తక్కువ ఉన్న బోరుబావిని రీచార్జ్ కోసం ఎంపిక చేసుకుంటే రీచార్జ్ కట్టడం ద్వారా ఆ పక్కనున్న ఇతర బోరుబావుల్లో కూడా నీరు పెరిగే అవకాశం ఉంటుంది.

ఎందుకు?

వర్షాధార వ్యవసాయ ప్రాంతాల్లో బోర్లు ఎండిపోయిన ప్రతిసారీ కొత్త బోర్లు వేయటం ఆర్థికంగా కష్టంతో కూడుకున్న పని. అందుకని బోరుబావులకే వాననీటిని తాపే పనిచేయడం ఉత్తమం. ఇందుకోసం బోరుబావుల చుట్టూ వాన నీటి రీచార్జ్ కట్టడాలు నిర్మించుకోవాలి. ఇవి దీర్ఘకాలం (కనీసం 8–10 ఏళ్లు) పాటు రైతులకు ప్రయోజనాలు అందించగలుగుతాయి. బోరు రీచార్జ్ సాంకేతికతను ఉపయోగించి, రెండు వానాకాలపు సీజన్లలోనే ఎండిపోయిన బోరు బావులను పునరుద్ధరించుకోవచ్చు.

ఎలా?

బోరు రీచార్జ్ నిర్మాణానికి స్థానికంగా దొరికే రాళ్లు, ఇసుక, సిమెంట్ వంటి సామగ్రిని వాడుకొని 7–10 రోజుల్లోనే నిర్మాణాన్ని పూర్తి చేయొచ్చు. కొత్తగా బోరుబావి తవ్వడానికి అయ్యే ఖర్చుతో పోలిస్తే.. తక్కువ ఖర్చులోనే ఎండిన బోరుబావులను పునరుద్ధరించొచ్చు. కొత్తగా తవ్వే బోరు పడకపోతే ఆ ఖర్చు అంతా వ్యర్థమే. ఎగువన ఉండే నీటి పరీవాహక ప్రాంతాల నుంచి సంగ్రహించే వాననీటిలో గరిష్ఠంగా 50% నీరు రీచార్జ్ అవుతుంది (చెక్‌డ్యాం, నీటికుంటల ద్వారా 10–15% నీరు మాత్రమే భూమిలోకి ఇంకుతుంది). ఈ పద్ధతిలో వాననీటిని రీచార్జ్ చేస్తూనే ఆ బోరుబావి నుంచి నీటిని పంటలకు వాడుకునే వెసులుబాటు ఉంది.



అవకాశ లౌకికవాది చంద్రబాబు

- సిద్ధాంతాలు, విలువలు లేవు
- 2019 ఎన్నికల్లో ప్రధాని మోదీని ఉగ్రవాది అన్న నోటితో ఇప్పుడు పొగుడుతున్నారు
- బీజేపీతో ఉన్నప్పుడు ఒకలా.. లేనప్పుడు మరోలా లౌకిక వాదానికి అర్థం మారుస్తారు
- వివాదాస్పద వక్ఫ్ బిల్లుకు మద్దతు ఇస్తూ బీజేపీ వైపు దృఢంగా నిలబడ్డారు
- రాజకీయ ప్రయోజనాలు, పదవులే తప్ప రాజకీయాల్లో విలుల్లేవని మరోసారి నిరూపించారు
- ప్రముఖ జర్నలిస్ట్ రాజ్‌దీప్ సర్దేశాయ్



సాక్షి, అమరావతి: ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు రాజకీయ ప్రయోజనాలు తప్ప సిద్ధాంతాలు, విలువలు లేవని ప్రముఖ జర్నలిస్ట్ రాజ్‌దీప్ సర్దేశాయ్ పేర్కొన్నారు. తన యూట్యూబ్ ఛానల్‌లో తాజాగా ఈ మేరకు వీడియో అప్‌లోడ్ చేశారు. ఆ వీడియోలో ఆయన ఏమన్నారంటే.. '2019 ఎన్నికల్లో బీజేపీపై ఆధారపడే అవసరం లేదని, మతతత్వ బీజేపీ నుంచి దేశాన్ని రక్షించాలని పిలుపునిచ్చిన చంద్రబాబు.. ఒకానొక సందర్భంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీని ఉగ్రవాదిగా పేర్కొన్నారు. చంద్రబాబు రాజకీయాలు ఎప్పుడూ కేంద్రంతో లావాదేవీల చుట్టూనే తిరుగుతాయి. రాజకీయ మనుగడ మాత్రమే చంద్రబాబు ఏకైక ప్రాధాన్యత. లౌకిక వాదం విషయంలోనూ ఆయన అంతే. తన రాజకీయ ప్రయోజనాలకు వాడుకోవడానికి దానిని ఒక కళారూపంగా మార్చుకున్నారు. లౌకిక వాదానికి అర్థం చంద్రబాబు బీజేపీతో కలిసి ఉన్నప్పుడు ఒక రకంగా, లేనప్పుడు మరో రకంగా మారిపోతుంది. రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగా.. వారి పదవులు కాపాడుకునే అంశంగా లౌకిక వాదాన్ని చంద్రబాబు మార్చేశారు. అవకాశ లౌకిక వాదిగా చంద్రబాబు చరిత్రలో మిగిలిపోతారు. లౌకిక వాదానికి, మత స్వేచ్ఛకు భంగం కలిగించే వివాదాస్పద వక్ఫ్ బిల్లును పార్లమెంట్‌లో మోదీ ప్రభుత్వం తీసుకొచ్చినప్పుడు బీజేపీకి దృఢమైన మద్దతుదారుగా చంద్రబాబు నిలబడ్డారు. బిల్లులో కొన్ని సవరణలు సూచించడం ద్వారా ముస్లిం సమాజానికి తాము మంచి చేశామని చంద్రబాబు, బిహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ చెప్పుకున్నారు. చంద్రబాబుది ట్రికీ కేస్‌స్టడీ. రాజకీయాల్లో సుదీర్ఘంగా కొనసాగడానికి ఎన్ని రంగులు మార్చడానికైనా ఆయన వెనకాడరు. లౌకిక వాదం విషయంలో ఆయన విధానం ఎప్పుడూ ప్రశ్నార్థకమే. రాజకీయాల్లో నిబద్ధత స్థానంలో అవకాశ వాదం, అవసరం వచ్చి చేరాయి. రాజకీయ విధానాల్లో నిబద్ధత అత్యంత ముఖ్యమనే విషయాన్ని ఎప్పుడో మర్చిపోయారు. వారు అనుభవించే పదవులను బట్టి లౌకిక వాదానికి అర్థం మారిపోతుంది' అని చంద్రబాబు తీరును ఎండగట్టారు.

బాణసంచా తయారీ కేంద్రంలో

భారీ విస్ఫోటం

అనకాపల్లి జిల్లా కోటరవుట్ల మండలం కైలాసపట్నంలో ఘోర ప్రమాదం

అగ్ని కీలల్లో 8 మంది సజీవ దహనం | మరో 8 మందికి తీవ్ర గాయాలు

పర్వతాలు పేలినట్టు.. భూమి కంపించినట్టు భారీ విస్ఫోటం.. అగ్నికీలలు ఎగసిపడ్డాయి.. 8 మంది కూలీలు సజీవ దహనం కాగా.. క్షతగాత్రులు దిక్కులు పిక్కటిల్లేలా అరిచిన అరుపులతో అక్కడి ప్రాంతమంతా దద్దరిల్లింది. భోజనానికి వెళదామని సిద్ధమవుతున్న సమయంలో అన్నం ముద్ద నోటికి చేరకుండానే మరుభూమికి తరలిపోవడం అందరినీ కంటతడి పెట్టించింది.

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం/అమరావతి: అనకాపల్లి జిల్లా కోటరవుట్ల మండలం కై లాసపట్నంలోని బాణసంచా తయారీ కేంద్రంలో ఆదివారం మధ్యాహ్నం విస్ఫోటం సంభవించింది. ఈ ఘోర ప్రమాదంలో కూలీల శరీరాలు ఛిద్రమై 8 మంది సజీవ దహనమయ్యారు. మరో 8మంది తీవ్రంగా గాయపడగా.. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. కాలిన గాయాలతో బాధితుల హాహాకారాలు చేయగా.. తల లేకుండా కేవలం మొండెంతో దర్శనమిచ్చి భీతిగొల్పే హృదయ విదారక దృశ్యాలు కనిపించాయి. కై లాసపట్నం సమీపంలోని విజయలక్ష్మి ఫైర్ వర్క్స్‌లో సంభవించిన ఈ ఘోర ప్రమాదం అగ్నిమాపక సిబ్బంది 4 గంటలకుపైగా శ్రమిస్తే తప్ప అదుపులోకి రాలేదు. క్షతగాత్రుల్లో ఆరుగుర్ని మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నంలోని కేజీహెచ్‌కు తరలించగా.. మరో ఇద్దరికి నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. మృతుల కుటుంబాలకు రూ.15 లక్షల చొప్పున పరిహారం చెల్లిస్తామని, క్షతగాత్రుల వైద్యానికి అయ్యే ఖర్చును ప్రభుత్వమే భరిస్తుందని హోం మంత్రి వి.అనిత ప్రకటించారు.

మృతుల్లో నలుగురు స్థానికేతరులు

ప్రమాదంలో కై లాసపట్నం గ్రామానికి చెందిన వారితోపాటు అనకాపల్లి జిల్లా రాజుపేట, చౌడువాడ, విశాఖపట్నం, తూర్పు గోదావరి జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెం ప్రాంతాలకు చెందిన 8 మంది మృత్యువాత పడ్డారు. మృతుల్లో విజయలక్ష్మి ఫైర్ వర్క్స్ యజమాని తాతబ్బాయి కూడా ఉన్నారు.

ఇద్దరి పరిస్థితి విషమం

విశాఖ కేజీహెచ్‌లో తీవ్ర గాయాలతో ఆరుగురు చికిత్స పొందుతున్నారు. వీరిలో జల్లూరు నాగరాజు (52)కు 90 శాతం కాలిన గాయాలు కాగా, జానకిరామ్‌కు 60 శాతం గాయాలయ్యాయి. వీరిద్దరి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.

ప్రమాదం జరిగిందిలా!

భోజన విరామం తీసుకుందామనుకునే సయమంలో మనోహర్ అనే వ్యక్తి బాణసంచాను వేగంగా దంచడం మొదలుపెట్టాడు. ఎక్కువ బలం ఉపయోగించి దంచడం వల్ల అధిక ఉష్ణోగ్రత ఉత్పత్తి అయి మంటలు చెలరేగినట్టు.. ఆ రేణువులు వారం రోజులపాటు తయారుచేసిన మందుగుండు సామగ్రిపై పడటంతో భారీ ప్రమాదం వాటిల్లినట్టు తెలుస్తోంది. భారీ పేలుడు సంభవించడంతో భూమి అదిరిందని.. ట్రాన్స్‌ఫార్మర్లు పేలిపోయామేనని కైలాసపట్నం గ్రామ ప్రజలు మొదట్లో భావించారు. అగ్నికీలలు ఎగసిపడటంతో హుటాహుటిన ప్రమాద స్థలానికి తరలివచ్చారు. సాధారణంగా ఈ కేంద్రంలో నిత్యం 20 నుంచి 30 మంది వరకూ పనిచేస్తుంటారు. ఆదివారం కావడంతో ప్రమాదం జరిగిన సమయంలో కేవలం 16 మంది మాత్రమే పనిచేస్తున్నారు. లేదంటే బాధితుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని గ్రామస్తులు చెబుతున్నారు. మధ్యాహ్నం 12.45 గంటలకు ప్రమాదం జరగ్గా.. ఒంటిగంట సమయంలో వరహాలు అనే వ్యక్తి ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. నర్సీపట్నం, నక్కపల్లి, యలమంచిలి ఫైర్‌స్టేషన్ల నుంచి ఫైర్ ఇంజన్లు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. మంటల్ని నిలువరించేందుకు సుమారు 4 గంటలకుపైగా సమయం పట్టింది. మందుగుండు సామగ్రి దంచుతున్న మనోహర్ అనే వ్యక్తి తల, కుడి చేయి ఆచూకీ ఇప్పటికీ లభించలేదు. భారీ పేలుడుకు తల, కుడి చేయి ఎగిరిపోయినట్టు తెలుస్తోంది. మిగిలిన ఏడుగురి శరీరాలు పూర్తిగా కాలిపోయాయి. గతంలో ఇక్కడి బాణసంచా తయారీ కేంద్రం పాయకరావుపేట నియోజకవర్గం ఎస్.రాయవరంలోని గోకులపాడు ఉండేది. అక్కడ 2015 మార్చి 29న పేలుడు సంభవించడంతో ఆ ప్రమాదంలోనూ 8 మంది మరణించారు. అనంతరం దీనిని మూసివేశారు.



క్షతగాత్రులను ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

సీఎం చంద్రబాబు ఆరా

బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన అగ్ని ప్రమాదంపై సీఎం చంద్రబాబు ఆరా తీశారు. ఘటనపై జిల్లా కలెక్టర్, ఎస్పీ, హోం మంత్రి అనితతో ఫోన్‌లో మాట్లాడారు. గాయపడిన వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. బాధిత కుటుంబాలను ఆదుకుంటామని, ధైర్యంగా ఉండాలన్నారు. ఘటనపై విచారణ జరిపి నివేదిక అందించాలని ఆదేశించారు. కాగా.. డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ హోం మంత్రి అనితతో ఫోన్‌లో మాట్లాడి ప్రమాద వివరాలను తెలుసుకున్నారు. అనంతం ఒక ప్రకటన చేస్తూ.. అధికార యంత్రాంగం సత్వరమే స్పందించిందని, క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలందించే బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటుందని పేర్కొన్నారు. పేలుడు ఘటనలో బాధిత కుటుంబాలను ప్రభుత్వం తక్షణం ఆదుకోవాలి. గాయపడిన వారందరికీ మెరుగైన వైద్య సేవలు అందించాలని రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ఒక ప్రకటనలో కోరారు.

మృతుల వివరాలివీ

1. దాడి రామలక్ష్మి (35), రాజుపేట, అనకాపల్లి జిల్లా
2. పురం పాప (40), కైలాసపట్నం, అనకాపల్లి జిల్లా
3. గుంపిన వేణుబాబు (34), కైలాసపట్నం, అనకాపల్లి జిల్లా
4. సంగరాతి గోవిందు (40), కైలాసపట్నం, అనకాపల్లి జిల్లా
5. సేనాపతి బాబూరావు (55), చౌడువాడ, అనకాపల్లి జిల్లా
6. అప్పికొండ పల్లయ్య అలియాస్ తాతబ్బాయి (50), కైలాసపట్నం, అనకాపల్లి జిల్లా
7. దేవర నిర్మల (38), వేట్లపాలెం, తూర్పు గోదావరి
8. హేమంత్ మనోహర్ (20), భీమిలి

క్షతగాత్రుల వివరాలు

జల్లూరు నాగరాజు (50), రాట్నాలపాలెం, అనకాపల్లి జిల్లా
సియాద్రి గోవింద్ (38), కైలాసపట్నం, అనకాపల్లి జిల్లా
వేలంగి సంతోషి (44), సామర్లకోట, తూర్పు గోదావరి
వేలంగి సారోని (19), సామర్లకోట, తూర్పు గోదావరి
మడగల జానకిరామ్(55), కైలాసపట్నం, అనకాపల్లి జిల్లా
వేలంగి రాజు (19), సామర్లకోట, తూర్పు గోదావరి
గంపెన సూరిబాబు (40), కైలాసపట్నం, అనకాపల్లి జిల్లా
సంగరాతి. శ్రీను(35), కైలాసపట్నం, అనకాపల్లి జిల్లా

మాజీ సీఎం వైఎస్ జగన్ దిగ్భ్రాంతి

బాణాసంచా తయారీ కేంద్రంలో విస్ఫోటనం సంభవించడంపై మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటనలో 8 మంది మరణించడం, మరో 8మంది తీవ్రంగా గాయపడటం విచారకరమన్నారు. మరణించిన వారి కుటుంబాలకు ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. మరణించిన, గాయపడ్డ వారి కుటుంబాలకు తోడుగా నిలవాలని వైఎస్సార్‌సీపీ నాయకులను ఆదేశించడంతో వారు సహాయక చర్యల్లో పాలుపంచుకుంటున్నారు. క్షతగాత్రులకు మంచి వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబాలు తిరిగి కోలుకునేలా అన్నిరకాలుగా ఆదుకోవాలని వైఎస్ జగన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

రూ.కోటి చొప్పున పరిహారం చెల్లించాలి

బాణసంచా పేలుడులో మృతి చెందిన కూలీల కుటుంబాలకు తక్షణమే రూ.కోటి చొప్పున, క్షతగాత్రులకు రూ.50 లక్షల చొప్పున ఆర్థిక సాయం ప్రకటించాలని వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు డిమాండ్ చేశారు. కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను ఆయన పరామర్శించారు. ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. కాగా.. మృతి చెందిన 8 మంది కార్మికుల కుటుంబాలతో పాటు తీవ్రంగా గాయపడిన వారిని అన్ని విధాలుగా ఆదుకోవాలని సీపీఎం రాష్ట్ర కమిటీ కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఆదివారం ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. అనకాపల్లి జిల్లాలోని పరిశ్రమల్లో తరుచూ ప్రమాదాలు సంభవిస్తున్నా అరికట్టడంలో ప్రభుత్వం విఫలమవుతోందన్నారు. బాణసంచా తయారీ కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించి భద్రతా లోపాలు లేకుండా చూడాలన్నారు.

ఆఖరిశ్వాస వరకు అంబేడ్కర్‌కు కాంగ్రెస్ వేధింపులు

- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



బంజారాహిల్స్ రోడ్ నంబర్ 1లో అంబేడ్కర్ విగ్రహాన్ని శుద్ధి చేస్తున్న కిషన్‌రెడ్డి

బంజారాహిల్స్ (హైదరాబాద్): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ చివరి శ్వాస వరకు ఆయనపై కాంగ్రెస్ పార్టీ కక్షపూరిత ధోరణితో వేధించిందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆరోపించారు. ఏప్రిల్ 14న అంబేడ్కర్ జయంతి సందర్భంగా.. బీజేపీ ఆధ్వర్యంలో నగరంలోని అంబేడ్కర్ విగ్రహాలన్నింటినీ శుద్ధి చేస్తున్నామన్నారు. ఆయన ఆదివారం బంజారాహిల్స్ రోడ్ నంబర్ 1లోని జీవీకే వన్ ఎదురుగా అంబేడ్కర్ విగ్రహాన్ని ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డితో కలిసి పాలు, పంచామృతాలతో శుద్ధి చేశారు. అనంతరం మాట్లాడుతూ ఒక దశలో అంబేడ్కర్‌ను ఓడించేందుకు నెహ్రూ సైతం ఎన్నికల ప్రచారం చేశారని ఆరోపించారు. ప్రధాని మోదీ నేతృత్వంలో అంబేడ్కర్ ఆశయ స్ఫూర్తితో ముందుకెళ్తున్నామని చెప్పారు.

అంబేడ్కర్‌ను అవమానించిన చరిత్ర కాంగ్రెస్‌ది

- కేంద్ర మంత్రి బండి సంజయ్



అంబేడ్కర్ విగ్రహాన్ని శుద్ధి చేస్తున్న కేంద్ర మంత్రి సంజయ్

కరీంనగర్‌టౌన్: అణగారిన వర్గాల్లో వెలుగులు నింపడంతోపాటు ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా నిలిచేలా రాజ్యాంగాన్ని రచించిన అంబేడ్కర్‌ను అడుగడుగునా అవమానించిన నీచమైన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మండిపడ్డారు. ఆయన అంత్యక్రియలు ఢిల్లీలో జరగనీయకుండా ముంబైకి తరలించారని పేర్కొన్నారు. అంతేకాక ఆయన పార్థివ దేహాన్ని తరలించడానికి అయిన విమాన చార్జీలు చెల్లించాలంటూ అంబేడ్కర్ సతీమణికి బిల్లు పంపిన చరిత్ర ఆ పార్టీదని విమర్శించారు. అంబేడ్కర్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ఆదివారం కరీంనగర్‌లో నిర్వహించి బైక్ ర్యాలీలో మంత్రి పాల్గొన్నారు. కోర్టు చౌరస్తా వద్ద బీజేపీ నాయకులతో కలసి అంబేడ్కర్ విగ్రహాన్ని నీటితో శుద్ధిచేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. దేశ విభజన, జమ్మూ,కశ్మీర్‌కు స్వయం ప్రతిపత్తిని అంబేడ్కర్ వ్యతిరేకించారని గుర్తుచేశారు. అంబేడ్కర్ ఆశయాల సాధనకు ప్రధాని మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం కృషిచేస్తోందని అన్నారు. బీజేపీ కృషితోనే అంబేడ్కర్‌కు భారతరత్న అవార్డు దక్కిందన్నారు.

మా సహనాన్ని చేతగానితనంగా తీసుకోవద్దు

- కిషన్‌రెడ్డి, సంజయ్‌ల తీరు సరికాదు
- టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్



సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్, బీజేపీలు అనైతిక పొత్తు పెట్టుకున్న కారణంగానే రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ దుష్ప్రచారం చేస్తున్నారని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ మండిపడ్డారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం కోసం కేంద్ర మంత్రుల హోదాలో పనిచేయాల్సిన బండి సంజయ్, కిషన్‌రెడ్డిలు అడుగడుగునా అడ్డుపడుతున్నారని, వీరి వైఖరి సిగ్గుచేటని ఆదివారం ఆయన ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. ప్రతి అంశంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించడం సరైంది కాదని, తమ సహనాన్ని చేతగాని తనంగా తీసుకోవద్దని హెచ్చరించారు. బండి సంజయ్‌కి దమ్ముంటే కేంద్రం నుంచి రాష్ట్రానికి ఎన్ని నిధులు వస్తున్నాయనే అంశంపై చర్చకు సిద్ధమా? అని ప్రశ్నించారు. తెలంగాణలో అమలవుతున్న సన్న బియ్యం పథకాన్ని బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనూ అమలు చేయాలని మోదీకి లేఖ రాయగలరా? అని నిలదీశారు. పేదల కడుపుకొట్టి కార్పొరేట్లకు దోచిపెట్టడం బీజేపీ విధానమైతే, ఏడాదికి రూ.13 వేల కోట్లు ఖర్చు పెట్టి పేదలకు సన్నబియ్యంతో బువ్వ పెట్టే విధానం కాంగ్రెస్‌దని మహేశ్‌గౌడ్ పేర్కొన్నారు.

'అంబేడ్కర్' భవనానికి కాంగ్రెస్ సర్కార్ తాళాలు

- బీఆర్ఎస్ నేతల ఆరోపణ

సాక్షి, హైదరాబాద్: 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహ భవనానికి వేసిన తాళాలు తీయడం లేదని బీఆర్ఎస్ నేతలు ఎర్రోళ్ల శ్రీనివాస్, మన్నె గోవర్ధన్, రాజీవ్ సాగర్ ఆరోపించారు. వారు ఆదివారం తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. గతేడాది ఏప్రిల్‌లో ఎన్నికల కోడ్ ఉందని రాష్ట్ర ప్రభుత్వం అంబేడ్కర్‌కు నివాళులర్పించలేదన్నారు. సచివాలయం ముందున్న అమరవీరుల స్తూపం భవనానికి కూడా తాళాలు తీయడం లేదని తెలిపారు. కేసీఆర్ మీద కోపంతో అంబేడ్కర్ విగ్రహ భవనానికి తాళాలు తీయడం లేదా? అని వారు ప్రశ్నించారు. అంబేడ్కర్ అంటే కాంగ్రెస్ పార్టీకి ఎందుకంత అలుసని ప్రశ్నించారు.

అన్నదాతను ముంచిన అకాల వర్షం

పలు జిల్లాల్లో వడగళ్ల వాన, ఈదురు గాలులు

- దెబ్బతిన్న వరి, మామిడి పంటలు
- మార్కెట్లలో కొట్టుకుపోయిన ధాన్యం
- నల్లగొండ జిల్లాలో పిడుగు పడి రైతు మృతి



యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం) మండలం పల్లెపహాడ్‌లో కొట్టుకుపోయిన ధాన్యం



జనగామ జిల్లా మార్కెట్‌లో వర్షపు నీటిని తొలగిస్తున్న మహిళా రైతు

నల్లగొండ/జనగామ రూరల్/వేములపల్లి: రాష్ట్రంలోని పలు జిల్లాలో ఆదివారం ఈదురు గాలులు, వడగళ్ల వాన బీభత్సం సృష్టించింది. దీంతో మామిడి, వరి వంటి పంటలు దెబ్బతిన్నాయి. నల్లగొండ జిల్లాలో పిడుగుపాటుతో ఓ రైతు మరణించాడు. జనగామ, ములుగు జిల్లాల్లో ఆదివారం సాయంత్రం కురిసిన వడగళ్ల వానతో భారీ పంట నష్టం జరిగింది. మామిడి తోటల్లో కాయలు రాలిపోయాయి. జనగామ మండలంలోని పెంబర్తి, సిద్దెంకి, ఎల్లంల, గానుగుపహాడ్.. చిల్పూర్ మండలం ఫత్తేపూర్.. జఫర్‌గఢ్ మండలం ఓబులాపూర్.. పాలకుర్తి మండలం వావిలాల, నారబోయినగూడెంలో వరి పంట దెబ్బతింది. జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కాటన్ యార్డులోని ఐకేపీ సెంటర్‌లో సుమారు 20 వేల బస్తాల ధాన్యం తడిసిపోయింది. ములుగు జిల్లా ఏటూరునాగారం, కన్నాయిగూడెం మండలాల్లో 150 ఎకరాల్లో వరిపంట దెబ్బతింది. నల్లగొండ జిల్లా నకిరేకల్ మండలంలోని పలు గ్రామాల్లో ఈదురు గాలులకు వందల ఏళ్ల నాటి మామిడి వృక్షాలు నేలకూలాయి. శాలిగౌరారం మండల కేంద్రంలోని మార్కెట్ యార్డు ఆవరణలో ధాన్యం కొట్టుకుపోయింది. సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలంలోని అనంతారం, తొండ.. జాజిరెడ్డిగూడెం మండలం అర్వపల్లి, కోడూరు తదితర గ్రామాల్లో వరి పంటకు నష్టం వాటిల్లింది. జాజిరెడ్డిగూడెంలో నోముల నరేష్ ఇంట్లో చెట్టుకొమ్మ విరిగి గేదెపై పడటంతో అది మృత్యువాత పడింది. యాదాద్రి భువనగిరి జిల్లాని పలు మండలాల్లో మామిడి తోటలకు నష్టం వాటిల్లింది. నల్లగొండ జిల్లా వేములపల్లి మండలంలోని సల్కునూరు గ్రామంలో గోపు సుధాకర్‌రెడ్డి (63) అనే రైతు తన పొలం వద్ద పనిచేస్తుండగా పిడుగు పడటంతో అక్కడికక్కడే మృతిచెందాడు.

సన్నిధి




తాత్త్వికథ

జీవిత పరమార్థం

ఒక యువకుడు జీవిత పరమార్థం ఏమిటో తెలుసుకోవాలనుకున్నాడు. దానికోసం ఎంత ఖర్చు అయినా భరించాలనుకున్నాడు. అనేక దూరప్రాంతాలకు వెళ్ళి పెద్దపెద్ద గ్రంథాలయాల్లోని పుస్తకాలు తిరగేశాడు. మేధావులుగా గుర్తింపబడిన పెద్దలను కలిశాడు. చర్చల్లో పాల్గొన్నాడు. ఎన్నో సమావేశాలకు హాజరయ్యాడు. ఎక్కడా సరైన సమాధానం దొరకలేదు.

ఏ గురువునైనా ఆశ్రయిస్తే సమాధానం దొరుకుతుందని కొందరు మిత్రులు సలహా ఇచ్చారు. ఎక్కడైనా మంచి గురువు దొరుకుతాడేమోనని వెదుక్కుంటూ అడవిలోకి వెళ్ళాడు. వెదకగా వెదకగా నదీ తీరాన ఒక ఆధ్యాత్మిక గురువు కూర్చుని ఉండటం కనిపించింది. ఆ గురువు ముఖంలో తేజస్సు కనిపించింది. తనకి సరైన సమాధానం ఆ గురువు వద్ద దొరుకుతుందని చాలా సంతోషపడ్డాడు. దగ్గరికి వెళ్ళి నమస్కరించి తన మనసులోని భావం చెప్పాడు. తనను శిష్యుడిగా గుర్తించమన్నాడు. దానికోసం ఎంత మూల్యమైనా చెల్లిస్తానని చెప్పాడు.



చిరునవ్వుతో గురువు ''మొదట నేను చెప్పినట్లు చేయి. తర్వాత ఆలోచిద్దాం'' అన్నాడు. చిన్న బిందెను చేత పట్టుకున్న గురువు ఆ యువకుడిని నది దగ్గరకు తీసుకెళ్ళాడు. నదిలోని నీళ్ళను బిందెతో తీసుకుని యువకుడికి ఇస్తూ '' ఈ నీళ్ళకు నువ్వు డబ్బు చెల్లించాలి'' అన్నాడు. ఆ యువకుడు వింతగా చూస్తూ ''నది ఎవ్వరికీ స్వంతం కాదు కదా. అది ప్రకృతిలో ఒక భాగం కదా, దానికి డబ్బులు ఇవ్వమంటున్నారేమిటి?'' అని ఆశ్చర్యంగా అడిగాడు.

గురువు ఆ యువకుడిని దగ్గరికి పిలిచి ''నదిలోని నీళ్ళు నేనైనా నువ్వైనా... ఎవ్వరైనా తీసుకోవచ్చు. అది అందరికీ స్వంతం. ఓపికగా కూర్చుని ప్రశాంతంగా ఆలోచించు. జీవిత పరమార్థం తెలుసుకోవడానికి మాత్రం నా అవసరం ఏముంది? అది నీకు నీవుగా లోతుకు వెళ్ళి తెలుసుకునేది. అది ఒకరు ఇచ్చేదీ కాదు, మరొకరు తీసుకునేదీ కాదు. ఎవరికి వారు అనుభూతి చెందేది. దాని ఖరీదు అమూల్యం'' అన్నాడు. 'నిజమే... అది ఎక్కడో దొరికేది కాదు. డబ్బు ఖర్చు చేస్తే వచ్చేది కాదు. శోధించడం ద్వారా మనకు మనం తెలుసుకొనేది' అని అవగాహన చేసుకున్న ఆ యువకుడు అక్కడినుంచి కదిలాడు.

– ఆర్.సి. కృష్ణస్వామి రాజు

మంచిమాట

నీ భావికి విధాతవు నీవే..

వ్యక్తి అస్థిత్వాన్నీ, గుర్తింపును నిర్వచించే వాటిలో మొదటిది అతనికి తనపై తనకున్న అవగాహన. వర్తమానంలో తానే స్థితిలో ఉన్నాడు, భవిష్యత్తులో తాను చేరాలనుకునే ఉన్నత స్థానం ఏమిటి అన్నది స్థిరంగా నిర్ణయించుకుని ముందుకు సాగాలి. ఆవిధంగా తనను తాను ముందుగా అంచనా వేసుకోవడం ప్రతివారికీ అవసరం. స్వీయ పరిశీలన చేసుకుని తన భవిష్యత్తును నిర్ణయించుకోవడం వ్యక్తి పురోగతి సాధించడంలో తీసుకోవవలసిన అత్యంత సమంజసమైన విధి.

విద్యలోనూ, విషయగ్రాహ్యతలోనూ అంతగా రాణించే శక్తిలేని మనిషి, తాను ఎంత దృఢమైన రీతిలో ఉన్నతస్థానాన్ని అధిరోహించాలని భావించినా, సాధారణ పరిస్థితుల్లో అది కుదరకపోవచ్చు. ఎందుకంటే, అతనికున్న మానసిక బలం, శారీరిక బలం కార్యసాధనకు సహకరించాలి కదా..!! అయితే, ఇది దుస్సాధ్యమైన విషయంగా పరిగణించ వలసిన పనిలేదు. మనం అనుకున్న దానికంటే, మన అవగాహన గుర్తించినదానికంటే, ఎంతో అధికమైన శక్తి ప్రతి మనిషిలో దాగి ఉంటుంది. కృతనిశ్చయంతో ''నేను నా రంగంలో ఉన్నత స్థానాన్ని సాధించగలను'' అని భావించి, ఉద్యమిస్తే, ఉత్తమ ఫలితాలను సాధించడం కష్టమైన విషయమేమీ కాదు. అంతే కాదు.. అదే కృషిని త్రికరణశుద్ధిగా కొనసాగిస్తే, ఉన్నతస్థానంలో నిలకడను సాధించి నిలబడ గలగడమూ కష్టమైన పనేమీ కాదు.

స్వీయనియంత్రణ అనుకున్నప్పుడు ప్రతివ్యక్తీ తాను రోజుకు ఎంత సమయాన్ని కార్యసాధన కోసం సద్వినియోగం చేసుకోగలుగుతున్నాడనేది ముఖ్యమైన భూమికను పోషిస్తుంది. కాసేపు మొక్కుబడిగా పనిచేసి, అనుకున్న ఫలితం రాలేదని భావించడంవల్ల ప్రయోజనం లేదుకదా..!! ఉన్నతలక్ష్యాలను నిర్దేశించుకున్న వ్యక్తి ఎటువంటి దురలవాట్లకూ బానిసకాకుండా ఉండడమూ స్వీయనియంత్రణలో అంతర్భాగమే..!!

భరతజాతి ముద్దుబిడ్డల్లో ఒకరై ప్రకాశించిన రామకృష్ణ పరమహంస వ్యక్తిత్వవికాసానికి సంబంధించిన అంశాల్లో అందరికీ ప్రయోజనకరంగా భాసించేలా ప్రబోధించిన అద్భుతమైన వాక్యం ''ముందుగా నిన్ను నీవు తెలుసుకో''. భవిష్యత్తు బంగరుబాటకావాలంటే, ఎవరైనా సరే, ముందుగా తనలో ఉన్న లోపాలమీద, బలహీనతలమీద, చేసే తప్పులమీద దృష్టి పెట్టాలి. ఆ తప్పులను లేదా లోపాలను సరిదిద్దుకునే క్రమాన్ని గుర్తెరిగి, అత్యంత శీఘ్రంగా వాటిని తొలగించుకుని, అప్పుడు భావి కార్యాచరణకు నడుం బిగించాలి.

తనను తాను సరిచేసుకుని ముందుకు సాగే విధానంలో సాధకుడు సానుకూలమైన ఆలోచనా ధోరణిని అలవరచుకోవాలి. మనసులో ఎటువంటి వ్యతిరేక భావాలకూ చోటు యివ్వకూడదు. ప్రతిమనిషీ తన లక్ష్యాన్ని సాధించడానికి కొందరినుంచి స్ఫూర్తిని పొందుతూ ముందుకు సాగుతాడు. తనకు స్ఫూర్తిదాతయైన వ్యక్తి ఆధ్యాత్మికంగా శక్తిమంతుడు కావచ్చు, లేదా ఒక జనహితం కోసం కృషి చేసే నాయకుడో, సమాజ సేవకుడో లేక క్రీడాకారుడో కావచ్చు. అపూర్వమైన విజయాలను సొంతం చేసుకున్న వారో, తమ చేతల ద్వారా చరిత్రలో నిలిచిపోయిన ఏ వ్యక్తి నుంచైనా స్ఫూర్తిని పొందవచ్చు. తాను పొందిన అమేయమైన స్ఫూర్తిని, అమలుపరచడంలో ఎడతెగని ఆర్తిని కనబరచి, త్రికరణశుద్ధిగా కృషి చేస్తే, భవిత సాధకునికి తప్పనిసరిగా దీప్తివంతమవుతుంది.

తన భవిష్యత్తును తీర్చిదిద్దుకునే క్రమంలో ప్రతివ్యక్తీ స్వీయ క్రమశిక్షణ పాటించడం అత్యంత అవసరం. ఆత్మనియతితో తమపై తాము విధించుకుని అమలుపరచే జీవన విధానమే స్వీయ క్రమశిక్షణ. జీవితంలో అనుకున్న రీతిలో విజయం సాధించాలంటే నియమబద్ధమైన, క్రమబద్ధమైన జీవితాన్ని అనుసరించాలి. జీవితంలో లక్ష్యాన్ని సాధించే క్రమంలో ఎంతోమంది ఓటమి పాలవ్వడం లేదా ఆశించిన గమ్యాన్ని అందుకోకపోవడానికి కారణం స్వీయ క్రమశిక్షణ లేకపోవడమే అని నిస్సందేహంగా చెప్పవచ్చు. జనించినప్పుడు జీవులందరూ ఒకేరకమైన రీతిలో జనించినా, అందులో కొంతమంది వ్యక్తులు మాత్రమే అసాధారణమైన విజయాలను సాధించడానికి, తాము అనుకున్న ఎత్తుకు ఎదగడానికి కారణం వారు నిత్యమూ పాటించే స్వీయ నియంత్రణ లేక క్రమశిక్షణ అని చెప్పవచ్చు.

– వ్యాఖ్యాన విశారద, వెంకట్ గరికపాటి

ఆత్మదర్శిని

సత్యాన్వేషణ

నీలోని ఆత్మ చైతన్యమే సత్యం. నేను వ్యక్తిని అనే భావన పూర్తిగా నీ మనస్సు కల్పితం. నీకు కనిపించే వ్యక్తులు, పాత్రలు, బంధాలు, సమాజం మొదలైనవన్నీ మనస్సు కల్పనలేగాని సత్యాలు కావు. భార్య, పిల్లలు, ఉద్యోగం, లక్ష్యాలు, అన్వేషణ మొదలైనవన్నీ నిజాలని నమ్ముతూ వాటిలో చిక్కుకొనిపోయి ఒక దుఃఖ ప్రపంచంలోకి వెళ్ళిపోతున్నాం. ఇవన్నీ అసత్యాలు కదా అని వీటిని వదిలేయటం కూడా పరిష్కారం కాదు. సత్యాన్ని తెలుసుకునే మార్గం, అనందాన్ని పొందే మార్గం ఉంది. నీనుండి విడివడలేనంత దగ్గరగా ఉంది. ప్రశాంతత, అనందం అనేవి నీ ఆత్మలోనే ఉన్నాయి. అవి దైవత్వ పరిమళాలు. ఇది బయటి ప్రపంచంలో కనిపించే ప్రశాంతత కాదు. అది అంతం లేనిది నీ అంతర్గత ప్రశాంతత. అది విషయ సంబంధమే కాదు. కాలానికి, స్థలానికి అతీతమైనది. ఆ నిగూఢమైన ప్రశాంతతే నీ ఆత్మ, నీ నిజతత్వం. నేను వ్యక్తిని అనే భావన పుట్టుకతో నీలో లేదు. నీ చుట్టూ ఉన్న వ్యక్తుల వల్ల, సమాజం వల్ల క్రమంగా నేను అనే భావనలో చిక్కుకుని కాలంతో కలిసిపోయాం. నీ నిజస్థితి దివ్యచైతన్య స్థితి. అద్వైతస్థితి. మాయవల్ల ఆ చైతన్యం నుండి విడివడి నేను శరీరాన్ని, మనస్సును అనే పరిమితిలో చిక్కుకుని పోయావు. నీ కలలో నీవు చిక్కుకు పోయావు. అసలు చైతన్యం అనేది ఒక వ్యక్తికి, ఒక రూపానికి పరిమితమైనదే కాదు. అది అనంతం, నిర్గుణం. అది దేనికీ అంటదు. కేవలం సాక్షితత్వమే ఉంటుంది. నేను అనే భావన క్రమంగా బలపడి ఇష్టాయిష్టాలతో, నమ్మకాలతో, కోరికలతో బందీ ఐపోతాము. నిజానికి అందరిలో ఉన్న ఆత్మ ఒక్కటే. నేను సాక్షీ చైతన్యాన్ని అనే సత్యాన్ని తెలుసుకున్నప్పుడే ఈ దుఃఖ ప్రపంచం నుండి బయటపడగలవు.

నీ మనస్సుకు కూడా మూలం ఆత్మనే. ఈ విషయ ప్రపంచం, ఈ భిన్నత్వం అంతా కూడా ఆత్మ నుంచి ఉద్భవించినవే. కానీ వీటిని 'నేను' అనుకుని ఒక పరిమితి కల్పించుకుని, విశ్వ చైతన్యం నుండి వేరుపడిపోయాము, నమ్మకాలను సృష్టించుకున్నాం. వ్యక్తి అనే వాడు కూడా దైవత్వ వ్యక్తీకరణే. విశ్వ చైతన్యంలో భాగమే. మాయ వల్లనే నేను వేరు అనే భావన కల్పించుకొని, భద్రతను సృష్టించుకుని, అభద్రతను కూడా సృష్టించుకుని దుఃఖంలో ఉన్నాము. ఈ నాటకమంతా నీ సృష్టే. ఇందులోని పాత్రలన్నీ పరస్పర సంబంధమైనవే. సృష్టికర్త సృజనాత్మక వ్యక్తీకరణే ఈ నాటకం. ఆ రచయిత నీవే. ఆత్మతత్వాన్ని తెలుసుకున్నప్పుడు నీవే ఆ దివ్యచైతన్యమని, సృష్టికర్తవని తెలుస్తుంది. వీటన్నింటికీ ఒక సాక్షిగా ఉంటావు, వేటికీ అంటకుండా.

కలలో ఉన్నప్పుడు నీవు కలలో ఉన్నట్టు తెలియదు. కలలో గెంతుతాము, అరుస్తాము, భయపడతాము... ఇది కల అని తెలియగానే కల మాయమైపోతుంది. ఇప్పటి మన జీవితమంతా ఈ కల లాంటిదే. సత్యాన్ని తెలుసుకున్నప్పుడే ఈ కలల నుండి బయటపడతావు. ఎల్లప్పుడూ నీ నిజతత్వాన్ని తెలుసుకునే దిశగానే ప్రయాణించు. ఈ జీవితం నాటకమైనప్పటికీ ఇందులో జీవించడం అవసరం. శరీరం, మనస్సులకు సాక్షిగా ఉంటూ జీవించు. నీలోని ఆత్మచైతన్యం బలపడినప్పుడే ఈ కలల నుండి బయటపడతావు. మనస్సుకు స్వతహాగా బలం ఉండదు. అది నీ ఆత్మశక్తిని లాక్కుని జీవిస్తుంది. నీవు సాక్షిగా గమనించినప్పుడు అది బలహీనమైపోతుంది. నీలోని నమ్మకాలకు, కోరికలకు, సంవేదనలకు అన్నింటికీ సాక్షిగా ఉంటూపో! వేటితోనూ అంటకు.





– స్వామి మైత్రేయ
ఆధ్యాత్మిక బోధకులు

సాక్షి సినిమా

ఆ విజువల్స్‌ని మర్చిపోలేను – నిర్మాత నవీన్ ఎర్నేని



• అధిక్ రవిచంద్రన్, జీవీ ప్రకాశ్ కుమార్, ప్రియా ప్రకాశ్ వారియర్, సునీల్, నవీన్ ఎర్నేని

''గుడ్ బ్యాడ్ అగ్లీ' సినిమాను ప్రేక్షకులు ఎంజాయ్ చేస్తూ, ఉత్సాహంతో కేరింతలు కొడుతున్నారు. ఈ విజువల్స్‌ని మర్చిపోలేను. తమిళనాడు, ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, ఓవర్సీస్ అన్ని చోట్ల నుంచి ఈ సినిమాకు అద్భుతమైన స్పందన లభిస్తోంది. ఈ సినిమా హ్యాజ్ బ్లాక్ బస్టర్. అజిత్‌గారు చాలా సింపుల్ పర్సన్. ఆయన మనసుతో మాట్లాడే వ్యక్తి. అధిక్ ఈ సినిమాను 95 రోజుల్లోనే పూర్తి చేశాడు. అధిక్‌లాంటి దర్శకులు ఇండస్ట్రీకి కావాలి'' అని నిర్మాత నవీన్ ఎర్నేని అన్నారు. అజిత్ హీరోగా నటించిన తాజా చిత్రం 'గుడ్ బ్యాడ్ అగ్లీ'. ఈ చిత్రంలో త్రిష హీరోయిన్‌గా నటించారు. టీ–సిరీస్ గుల్షన్ కుమార్, భూషణ్ కుమార్ సమర్పణలో అధిక్ రవిచంద్రన్ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 10న విడుదలైంది. ఈ సందర్భంగా ఆదివారం నిర్వహించిన సక్సెస్ మీట్‌లో అధిక్ రవిచంద్రన్ మాట్లాడుతూ– ''మైత్రీ నిర్మాతలకు తమిళంలో తొలి సినిమా ఇది. ఈ సినిమాతో తమిళనాడులో మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ హిస్టరీ క్రియేట్ చేసింది'' అని తెలిపారు. ''తమిళంలో తొలిసారి సినిమా తీసి, మంచి హిట్ సాధించిన మైత్రీ మూవీ మేకర్స్‌కు కంగ్రాట్స్'' అని పేర్కొన్నారు సునీల్. ''18 నెలల తర్వాత అజిత్‌గారితో కలిసి మళ్లీ ఈ సినిమా చేశాను. దర్శకుడు అధిక్‌తో ఇది నా మూడో చిత్రం'' అని తెలిపారు జీవీ ప్రకాశ్ కుమార్. ''ఈ మూవీలో నేను చేసిన పాత్రకి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. చాలా రోజుల తర్వాత మళ్లీ వైరల్ అయ్యింది'' అన్నారు ప్రియా ప్రకాశ్ వారియర్.



• రామ్‌చరణ్



• ప్రభాస్

అక్టోబరులో ఆన్ డ్యూటీ

అక్టోబరులో పోలీసాఫీసర్‌గా ప్రభాస్ చార్జ్ తీసుకోనున్నారట. ప్రభాస్ హీరోగా సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వంలో రూపొందనున్న చిత్రం 'స్పిరిట్'. ప్రభాస్ తొలిసారి పోలీసాఫీసర్ పాత్రలో కనిపించనున్న చిత్రం ఇది. ఈ సినిమా చిత్రీకరణను ఈ ఏడాది అక్టోబరులో ప్రారంభించడానికి సందీప్ రెడ్డి వంగా సన్నాహాలు చేస్తున్నారని సమాచారం. సో... పోలీస్ ఆఫీసర్‌గా అక్టోబరు నుంచి ప్రభాస్ ఆన్ డ్యూటీ అన్నమాట. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి. ఒకవైపు ఈ చిత్రం సంగీత దర్శకుడు హర్షవర్ధన్ రామేశ్వర్‌తో మ్యూజిక్ సిట్టింగ్స్ జరుపుతూనే, మరోవైపు 'స్పిరిట్' సినిమా లొకేషన్స్‌ను ఫైనలైజ్ చేసే పనిలో ఉన్నారు సందీప్ రెడ్డి. ఇందులో భాగంగా ఆయన ఇటీవల మెక్సికో వెళ్లొచ్చారు. అక్కడ ఓ మేజర్ షూటింగ్ షెడ్యూల్‌ను కూడా ప్లాన్ చేస్తున్నట్లుగా సందీప్ ఓ సందర్భంలో పేర్కొన్నారు. భూషణ్ కుమార్, ప్రణయ్‌రెడ్డి వంగా నిర్మించనున్న 'స్పిరిట్' చిత్రం 2027లో ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశం ఉంది.

పెద్ది ఫైట్

పెద్ది (రామ్‌చరణ్ పాత్ర పేరు)క్రికెట్ గ్రౌండ్‌లో బ్యాటింగ్‌కు దిగితే ఎలా ఉంటుందో ఇటీవల 'పెద్ది' సినిమా ఫస్ట్ షాట్ గ్లింప్స్‌లో యూనిట్ చూపించింది. అదే పెద్ది ఫైట్ చేస్తే ఎలా ఉంటుందో చూడాలంటే మరికొన్ని రోజులు ఎదురు చూడాల్సిందే. రామ్‌చరణ్ హీరోగా బుచ్చిబాబు సాన దర్శకత్వంలో 'పెద్ది' సినిమా తెరకెక్కుతోంది. ఈ పీరియాడికల్ మల్టీస్పోర్ట్స్ డ్రామాలో జాన్వీ కపూర్ హీరోయిన్. ఈ సినిమాలో రామ్‌చరణ్ క్రికెటర్‌గా కనిపిస్తారు. ఈ సినిమా కొత్త షెడ్యూల్ ఇటీవల హైదరాబాద్‌లోని శివార్లల్లో ప్రారంభమైందని తెలిసింది. రామ్‌చరణ్ పాల్గొంటుండగా ఓ ఫైట్ చిత్రీకరిస్తున్నారట. రైల్వేస్టేషన్ బ్యాక్‌డ్రాప్‌లో వచ్చే ఈ యాక్షన్ సీక్వెన్స్ సినిమాలో కీలకంగా ఉంటుందట. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్న 'పెద్ది' చిత్రం వచ్చే ఏడాది మార్చి 27న విడుదల కానుంది.

నవ్వుల పాంచ్ మినార్



• రమేశ్ కడుముల, రాజ్ తరుణ్, రాశీ సింగ్, మారుతి

''పాంచ్ మినార్' టీజర్ చాలా ఆసక్తిగా ఉంది. చూడగానే ఈ సినిమా మంచి సక్సెస్ సాధిస్తుందనే నమ్మకం కలిగింది. ఈ సినిమా రాజ్ తరుణ్‌కి కూడా మళ్లీ బెస్ట్ స్టార్ట్ అవుతుందని నమ్ముతున్నాను. గోవింద రాజుగారు విజయం సాధించాలనే పట్టుదలతో ఈ సినిమా తీశారు. ఇలాంటి మంచి సినిమాలను ప్రోత్సహించండి'' అని దర్శకుడు మారుతి అన్నారు. రాజ్ తరుణ్ హీరోగా రాశీ సింగ్ హీరోయిన్‌గా రామ్ కడుముల దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'పాంచ్ మినార్'. మాధవి, ఎమ్ఎస్ఎమ్ రెడ్డి ఈ సినిమాను నిర్మించారు. ఈ సినిమా టీజర్ లాంచ్ ఈవెంట్‌కు దర్శక–నిర్మాతలు మారుతి, సాయి రాజేశ్, ఎస్‌కేఎన్, రైటర్ 'డార్లింగ్' స్వామి అతిథులుగా హాజరై, ఈ సినిమా విజయం సాధించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాజ్ తరుణ్ మాట్లాడుతూ– ''ఈ సినిమా కచ్చితంగా ఆడుతుందని చెప్పడానికి కారణం మా దర్శకుడి కష్టం... ఆయన విజన్'' అని తెలిపారు. ''రాజ్ తరుణ్‌కు మంచి కమ్‌బ్యాక్ ఫిల్మ్ అవుతుంది'' అని తెలిపారు రామ్ కడుముల. ''పూర్తి వినోదాత్మక చిత్రం ఇది'' అన్నారు చిత్రనిర్మాత ఎమ్ఎస్ఎం రెడ్డి, సమర్పకుడు గోవిందరాజు. ''కష్టాల్ని కామిక్‌గా చెప్పే ఏ కథ కూడా నిరుత్సాహపరచదని 'పాంచ్ మినార్' నిరూపించబోతోంది'' అన్నారు రచయిత అనంత శ్రీరామ్.

సమాజానికి ఉపయోగపడేలా...

సన్నీ అఖిల్, అజయ్ ఘోష్, రవి కాలే, గిద్దేష్, 'శుభలేఖ' సుధాకర్, 'శంకరాభరణం' తులసి, షాయాజీ షిండే ముఖ్య పాత్రల్లో నటించిన చిత్రం 'పోలీస్‌వారి హెచ్చరిక'. బాబ్జీ దర్శకత్వంలో బెల్లి జనార్ధన్ నిర్మించిన ఈ చిత్రం ఆడియో లాంచ్ వేడుకకు తనికెళ్ల భరణి, తమ్మారెడ్డి భరద్వాజ, ఆర్. నారాయణమూర్తి, జయసుధ తదితర ప్రముఖులు హాజరై... సమాజానికి ఉపయోగపడే ఇలాంటి సందేశాత్మక చిత్రాలు రావాలని, ఈ చిత్రం విజయం సాధించాలని పేర్కొన్నారు. ''ఒక గొప్ప సామాజిక లక్ష్యంతో మా ప్రజా నాట్యమండలి బాబ్జీ తీసిన ఈ సినిమాను విజయవంతం చేయాలని, ఇటువంటి చిత్రాలు మరిన్ని రావడానికి రెండు రాష్ట్రాల్లోని మా పార్టీల, ప్రజా సంఘాల సభ్యులు, అభిమానులు కృషి చేయాలని ఈ వేదిక నుంచి పిలుపునిస్తున్నాం'' అన్నారు సీపీఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాన్ వెస్లీ. ఈ వేడుకలో వివిధ వామపక్ష పార్టీల నేతలు, శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, ఎమ్ఎల్‌సీ సత్యం తదితర ప్రముఖులు పాల్గొన్నారు.



• బెల్లి జనార్ధన్, జయసుధ, బాబ్జీ

వినోదాల పురుష



• విషిక, వైష్ణవి, పవన్ కల్యాణ్, హాసిని

నూతన నటుడు పవన్ కల్యాణ్ హీరోగా నటిస్తున్న సినిమాకు 'పురుష' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ వినోదాత్మక చిత్రంలో వైష్ణవి కొక్కుర, విషిక, హాసిని సుధీర్‌లు కథానాయికలుగా నటిస్తున్నారు. బత్తుల సరస్వతి సమర్పణలో బత్తుల కోటేశ్వర రావు నిర్మిస్తున్నారు. వీరు ఉలవల ఈ మూవీతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. విజయవాడ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో ఈ చిత్రాన్ని ప్రారంభించారు. తొలి సీన్‌కి బీబీ ఏముల ధరణి కెమెరా స్విచ్చాన్ చేయగా, వడ్డవల్లి వెంకటేశ్వర రావు (బుల్లబ్బాయ్) క్లాప్ ఇచ్చారు. ఈ సినిమా టైటిల్ లోగో, పోస్టర్‌ను దర్శకుడు గౌతమ్ తిన్ననూరి విడుదల చేశారు.

ఓటీటీ
ఇది చూడొచ్చు

వీడి జాతకంలో పెళ్లి లేదా?

ఓటీటీలో 'ఇది చూడొచ్చు' అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో మలయాళ చిత్రం ఒరు జాతి జాతకం ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.

కల్యాణమొచ్చినా కక్కొచ్చినా ఆగదంటారు. కానీ పెళ్లి యోగమే లేని మన కథానాయకుడు తన పెళ్లి కోసం చేసే ప్రయత్నాల హడావిడే ఈ 'ఒరు జాతి జాతకమ్' సినిమా. గతంలో ఇదే కథాంశం మీద ఎన్నో సినిమాలు వచ్చి ఉండొచ్చు గాని ఈ సినిమా మాత్రం డిఫరెంట్. ఇంకా చెప్పాలంటే... ఇదో హైబ్రిడ్ పీస్. మోహనన్ దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమాలో వినీత్ శ్రీనివాసన్ కథానాయకుడు. ఇక ఈ సినిమా కథాంశానికొస్తే... జయేష్‌కు 30 సంవత్సరాలు వచ్చినా ఏ సంబంధం కుదరదు. పెళ్లి కోసం జయేష్ పరితపిస్తుంటాడు. అంతేనా ఏకంగా మ్యారేజ్ ఏజెన్సీకి లైఫ్ టైమ్ మెంబర్రై వాళ్లని వేధిస్తుంటాడు. ఈ కోవలోనే శినిత అనే అమ్మాయి సంబంధం తెలుస్తుంది. శినిత తాను పామిస్ట్రీ చదివానని, జయేష్ చేయి చూస్తానని చెబుతుంది. ఇక అక్కడి నుంచి అసలు కథ మొదలవుతుంది.



జయేష్ చేయి చూసిన శినిత... జయేష్ జీవితంలో అనుకోని సంఘటనలు చాలా జరుగుతాయని, ఓ వ్యక్తి జయేష్ జీవితాన్ని పూర్తిగా మార్చేస్తుందని అలాగే జయేష్‌కి వివాహం విచిత్రంగా అయ్యే అవకాశం కనబడుతోందని, అంతేకాదు... ఆ వివాహం వల్ల కొన్ని వర్గాల మధ్య కొట్లాటలు కూడా జరుగుతాయని చెబుతుంది. అయితే జయేష్‌కు తనతో వివాహం చేసుకునే రాత కనిపించలేదని చెప్పి వెళ్లిపోతుంది శినిత. ఈ శినిత క్యారెక్టర్ ఆఖర్లో కడుపుబ్బా నవ్విస్తుంది. ఈలోపు జయేష్‌కు తన కుటుంబం నుండి అనుకోని సమస్యలు చాలానే వచ్చి పడతాయి. మరి... జయేష్‌కు పెళ్లవుతుందా? లేదా అన్నది మాత్రం ప్రైమ్ వీడియోలో స్ట్రీమ్ అవుతున్న 'ఒరు జాతి జాతకమ్' సినిమాలో చూడాలి. ఈ సినిమా మాత్రం ఆద్యంతం కామెడీతో కడుపుబ్బా నవ్విస్తుంది. ఇది వేరే లెవెల్ కామెడీ అని చెప్పవచ్చు. దర్శకుడు తన కథానాయకుడు ఎలా నటించాలని అనుకున్నారో అంతకు వేయి రెట్లు వినీత్ వినూత్నంగా నటించారు. ఇట్స్ ఎ మస్ట్ వాచబుల్ కామెడీ ఫిల్మ్.

– హరికృష్ణ ఇంటూరు




ప్రపంచకప్ ఆర్చరీ టోర్నమెంట్: ధీరజ్ బృందానికి రజత పతకం

సెంట్రల్ ఫ్లోరిడా (అమెరికా): ప్రపంచకప్ ఆర్చరీ స్టేజ్-1 టోర్నమెంట్‌లో పురుషుల రికర్వ్ టీమ్ విభాగంలో భారత జట్టుకు రజత పతకం లభించింది. ఆదివారం జరిగిన ఫైనల్లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బొమ్మదేవర ధీరజ్, అతాను దాస్, తరుణ్‌దీప్ రాయ్‌లతో కూడిన భారత జట్టు 1-5 సెట్ల తేడాతో లీ జాంగ్‌యువాన్, కావో వెన్‌చావో, వాంగ్ యాన్‌లతో కూడిన చైనా జట్టు చేతిలో ఓడిపోయింది. తొలి సెట్‌లో రెండు జట్లు 54-54తో సమంగా నిలిచి చెరో పాయింట్ దక్కించుకున్నాయి. రెండో సెట్‌ను చైనా 58-55తో నెగ్గి 3-1తో ఆధిక్యంలోకి వెళ్లింది. ఆ తర్వాత మూడో సెట్‌ను చైనా 55-54తో సొంతం చేసుకొని 5-1తో స్వర్ణ పతకాన్ని ఖరారు చేసుకుంది. ఆర్చరీ సీజన్ తొలి టోర్నీలో ఇప్పటి వరకు భారత్‌కు మూడు పతకాలు లభించాయి.

భళా బెంగళూరు

- ఆర్‌సీబీ ఖాతాలో నాలుగో విజయం
- తొమ్మిది వికెట్ల తేడాతో రాజస్తాన్ రాయల్స్ ఓటమి
- మెరిసిన సాల్ట్, విరాట్ కోహ్లి



కోహ్లి



సాల్ట్

జైపూర్: అందని ద్రాక్షగా ఉన్న ఐపీఎల్ ట్రోఫీని 18వ సీజన్‌లోనైనా అందుకోవాలనే లక్ష్యంతో బరిలోకి దిగిన రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) జట్టు నిలకడైన ప్రదర్శనతో ముందుకు దూసుకుపోతోంది. పర్యావరణంపై అవగాహన కల్పించేందుకు గ్రీన్ జెర్సీతో బరిలోకి దిగిన ఆర్‌సీబీ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టి తమ ఖాతాలో నాలుగో విజయం జమ చేసుకుంది. ఆదివారం జరిగిన ఈ పోరులో ఆర్‌సీబీ 9 వికెట్ల తేడాతో మాజీ చాంపియన్ రాజస్తాన్ రాయల్స్‌పై గెలిచింది. మొదట రాజస్తాన్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 173 పరుగులు చేసింది. యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ (47 బంతుల్లో 75; 10 ఫోర్లు, 2 సిక్స్‌లు) క్లిష్టమైన పిచ్‌పై నాణ్యమైన ఇన్నింగ్స్‌తో ఆకట్టుకోగా... రియాన్ పరాగ్ (22 బంతుల్లో 30; 3 ఫోర్లు, ఒక సిక్స్), ధ్రువ్ జురేల్ (23 బంతుల్లో 35 నాటౌట్; 2 ఫోర్లు, 2 ఫోర్లు) ఫర్వాలేదనిపించారు. అనంతరం లక్ష్యఛేదనలో బెంగళూరు 17.3 ఓవర్లలో 1 వికెట్ కోల్పోయి 175 పరుగులు చేసి గెలిచింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ఫిల్ సాల్ట్ (33 బంతుల్లో 65; 5 ఫోర్లు, 6 సిక్స్‌లు), విరాట్ కోహ్లి (45 బంతుల్లో 62 నాటౌట్; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) హాఫ్‌సెంచరీలతో రాణించగా... దేవదత్ పడిక్కల్ (28 బంతుల్లో 40 నాటౌట్; 5 ఫోర్లు, 1 సిక్స్) ఆకట్టుకున్నాడు. ఈ మ్యాచ్‌లో ఇరు జట్లు సులువైన క్యాచ్‌లు సైతం వదిలేసి... పేలవ ఫీల్డింగ్ ప్రదర్శన కనబర్చాయి.

స్కోరు వివరాలు

రాజస్తాన్ రాయల్స్ ఇన్నింగ్స్: జైస్వాల్ (ఎల్బీ) (బి) హాజల్‌వుడ్ 75; సామ్సన్ (స్టంప్డ్) జితేశ్ (బి) కృనాల్ 15; పరాగ్ (సి) కోహ్లి (బి) యశ్ దయాళ్ 30; ధ్రువ్ జురేల్ (నాటౌట్) 35; హెట్‌మైర్ (సి) పడిక్కల్ (బి) భువనేశ్వర్ 9; రాణా (నాటౌట్) 4; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం (20 ఓవర్లలో 4 వికెట్లకు) 173. వికెట్ల పతనం:** 1-49, 2-105, 3-126, 4-169. **బౌలింగ్:** భువనేశ్వర్ 4-0-32-1; యశ్ దయాళ్ 4-0-36-1; హాజల్‌వుడ్ 3-0-26-1; కృనాల్ పాండ్యా 4-0-29-1; లివింగ్‌స్టోన్ 1-0-8-0; సుయాశ్ శర్మ 4-0-39-0.

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఇన్నింగ్స్: సాల్ట్ (సి) జైస్వాల్ (బి) కార్తికేయ 65; కోహ్లి (నాటౌట్) 62; పడిక్కల్ (నాటౌట్) 40; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (17.3 ఓవర్లలో 1 వికెట్ నష్టానికి) 175. వికెట్ల పతనం:** 1-92. **బౌలింగ్:** ఆర్చర్ 4-0-36-0; తుషార్ దేశ్‌పాండే 2-0-21-0; సందీప్ శర్మ 2.3-0-29-0; తీక్షణ 2-0-21-0; కుమార్ కార్తికేయ 3-0-25-1; హసరంగ 3-0-33-1; పరాగ్ 1-0-10-0.

పరుగుల వేటలో ఢిల్లీ 'రనౌట్'



అశుతోష్ శర్మ రనౌట్ అయిన వేళ...

వరుస విజయాలతో జోరుమీదున్న ఢిల్లీ క్యాపిటల్స్‌కు బ్రేక్ పడింది. ఐదుసార్లు చాంపియన్ ముంబై ఇండియన్స్ 12 పరుగుల తేడాతో ఢిల్లీ క్యాపిటల్స్‌ను ఓడించింది. మొదట తిలక్ వర్మ, సూర్యకుమార్ రాణించడంతో మంచి స్కోరు చేసిన ముంబై... అనంతరం చివరి వరకు పట్టు వదలకుండా ప్రయత్నించి సీజన్‌లో రెండో విజయం ఖాతాలో వేసుకుంది. చాలా రోజుల తర్వాత ఐపీఎల్‌లో బరిలోకి దిగిన కరుణ్ నాయర్ ఒంటిచేత్తో ఢిల్లీని గెలిపించేలా కనిపించినా... చివర్లో వెంటవెంటనే వికెట్లు కోల్పోయి విజయానికి దూరమైంది.

- ఐపీఎల్ 18వ సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌కు తొలి ఓటమి
- మూడు బంతుల్లో ముగ్గురు బ్యాటర్లు రనౌట్
- కరుణ్ నాయర్ మెరుపులు వృథా
- 12 పరుగులతో ముంబై గెలుపు

న్యూఢిల్లీ: ముంబై ఇండియన్స్ ఫీల్డర్ల గురికి ఢిల్లీ క్యాపిటల్స్‌కు ఐపీఎల్ 18వ సీజన్‌లో తొలి ఓటమి ఎదురైంది. ఆదివారం జరిగిన ఈ పోరులో ముంబై జట్టు 12 పరుగుల తేడాతో ఢిల్లీపై గెలుపొందింది. మొదట ముంబై ఇండియన్స్ 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 205 పరుగులు చేసింది. తిలక్ వర్మ (33 బంతుల్లో 59; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధశతకంతో ఆకట్టుకోగా... సూర్యకుమార్ యాదవ్ (28 బంతుల్లో 40; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు), రికెల్టన్ (25 బంతుల్లో 40; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించారు. ఆఖర్లో నమన్ ధీర్ (17 బంతుల్లో 38 నాటౌట్; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) మెరుపులు మెరిపించాడు. ఢిల్లీ బౌలర్లలో కుల్దీప్, విప్రాజ్ నిగమ్ చెరో 2 వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనలో ఢిల్లీ 19 ఓవర్లలో 193 పరుగులకు ఆలౌటైంది. సీనియర్ బ్యాటర్ కరుణ్ నాయర్ (40 బంతుల్లో 89; 12 ఫోర్లు, 5 సిక్స్‌లు) ఆకాశమే హద్దుగా చెలరేగగా... అభిషేక్ పొరెల్ (33; 3 ఫోర్లు, 1 సిక్స్) ఫర్వాలేదనిపించాడు. ఇన్నింగ్స్ 19వ ఓవర్లో ఢిల్లీ జట్టు వరుసగా మూడు బంతుల్లో అశుతోష్ శర్మ, కుల్దీప్, మోహిత్ శర్మ వికెట్లను కోల్పోయి ఓటమిని ఖరారు చేసుకుంది. ఈ ముగ్గురూ రనౌట్ కావడం గమనార్హం. ముంబై బౌలర్లలో 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' కరణ్ శర్మ 3 వికెట్లు, సాంట్నర్ 2 వికెట్లు పడగొట్టారు.

తిలక్ తడాఖా...

గత కొన్ని మ్యాచ్‌ల్లో పెద్దగా ఆకట్టుకోలేకపోయిన ముంబై మిడిలార్డర్ బ్యాటర్ తిలక్ వర్మ... ఢిల్లీపై చక్కటి ప్రదర్శన కనబర్చాడు. ఫలితంగా పాండ్యా బృందం మంచి స్కోరు చేయగలిగింది. తొలి ఓవర్‌లో రెండు ఫోర్లు కొట్టిన రికెల్టన్ రెండో ఓవర్‌లో సిక్సర్‌తో జట్టుకు మెరుపు ఆరంభాన్నిచ్చాడు. మూడో ఓవర్‌లో రికెల్టన్ 2 ఫోర్లు, రోహిత్ శర్మ 6, 4 బాదడంతో 19 పరుగులు వచ్చాయి. మంచి టచ్‌లో కనిపించిన రోహిత్ (12 బంతుల్లో 18)ను లెగ్‌స్పిన్నర్ విప్రాజ్ వికెట్ల ముందు దొరకబుచ్చుకోవడంతో ముంబై తొలి వికెట్ కోల్పోగా... సూర్యకుమార్ బాధ్యతాయుతంగా ఆడాడు. మరికొన్ని మెరుపుల అనంతరం రికెల్టన్ కూడా ఔట్ కాగా... తిలక్ ఆరంభం నుంచే ధాటిగా ఆడాడు. ఫలితంగా ముంబై 10 ఓవర్లలో 104/2తో నిలిచింది. సూర్యకుమార్, కెప్టెన్ హార్దిక్ పాండ్యా (2) వరుస ఓవర్లలో ఔట్ కాగా... తిలక్‌కు నమన్ జత కలవడంతో స్కోరు బోర్డు పరుగులు పెట్టింది. ఈ క్రమంలో తిలక్ 26 బంతుల్లో ఈ సీజన్‌లో రెండో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు.

కదంతొక్కిన కరుణ్..

దేశవాళీ టోర్నీల్లో దుమ్మురేపుతున్న కరుణ్ నాయర్ ఈ మ్యాచ్‌లో విశ్వరూపం చూపాడు. ఏడేళ్లుగా ఐపీఎల్‌లో హాఫ్‌సెంచరీ చేయని నాయర్ ముంబై బౌలర్లపై విరుచుకుపడ్డాడు. ఇన్నింగ్స్ తొలి బంతికే మెక్‌గుర్క్ (0) ఔట్ కావడంతో ఇంపాక్ట్ ప్లేయర్‌గా అడుగుపెట్టిన నాయర్... క్రీజులో ఉన్నంతసేపు బౌండరీల మోత మోగించాడు. రెండో ఓవర్‌లో 3 ఫోర్లు కొట్టిన అతడు... ఐదో ఓవర్‌లో మరో రెండు ఫోర్లు బాదాడు. స్టార్ పేసర్ బుమ్రా వేసిన ఆరో ఓవర్‌లో 6, 4, 6తో కరుణ్ 22 బంతుల్లో హాఫ్‌సెంచరీ పూర్తి చేసుకున్నాడు. పాండ్యా ఓవర్‌లో 6, 4 కొట్టిన నాయర్... కరణ్ శర్మ ఓవర్‌లో రెండు ఫోర్లతో సెంచరీకి సమీపించాడు. ఈ క్రమంలో రెండో వికెట్‌కు 61 బంతుల్లో 119 పరుగులు జోడించిన అనంతరం పొరెల్ ఔట్ కాగా... మరో ఫోర్ కొట్టిన అనంతరం కరుణ్ వెనుదిరిగాడు. కెప్టెన్ అక్షర్ పటేల్ (9), స్టబ్స్ (1) విఫలం కాగా... కేఎల్ రాహుల్ (15), అశుతోష్ శర్మ (17), విప్రాజ్ (14) పోరాటం జట్టును గెలిపించలేకపోయింది. నాయర్ మెరుపులతో 11 ఓవర్లు ముగిసేసరికి 128/2తో అలవోకగా విజయం సాధించేలా కనిపించిన ఢిల్లీ... ఆ తర్వాత వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయి మూల్యం చెల్లించుకుంది.

స్కోరు వివరాలు

ముంబై ఇండియన్స్ ఇన్నింగ్స్: రోహిత్ (ఎల్బీ) (బి) విప్రాజ్ 18; రికెల్టన్ (బి) కుల్దీప్ 41; సూర్యకుమార్ (సి) స్టార్క్ (బి) కుల్దీప్ 40; తిలక్ (సి) పొరెల్ (బి) ముకేశ్ 59; హార్దిక్ (సి) స్టబ్స్ (బి) విప్రాజ్ 2; నమన్ (నాటౌట్) 38; జాక్స్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (20 ఓవర్లలో 5 వికెట్లకు) 205. వికెట్ల పతనం:** 1-47, 2-75, 3-135, 4-138, 5-200; **బౌలింగ్:** స్టార్క్ 3-0-43-0; ముకేశ్ 4-0-38-1; విప్రాజ్ నిగమ్ 4-0-41-2; కుల్దీప్ 4-0-23-2; అక్షర్ 2-0-19-0; మోహిత్ 3-0-40-0.

ఢిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్: మెక్‌గుర్క్ (సి) జాక్స్ (బి) దీపక్ చహర్ 0; పొరెల్ (సి) నమన్ (బి) కరణ్ శర్మ 33; కరుణ్ నాయర్ (బి) సాంట్నర్ 89; రాహుల్ (సి అండ్ బి) కరణ్ శర్మ 15; అక్షర్ (సి) సూర్యకుమార్ (బి) బుమ్రా 9; స్టబ్స్ (సి) నమన్ (బి) కరణ్ శర్మ 1; అశుతోష్ (రనౌట్) 17; విప్రాజ్ నిగమ్ (స్టంప్డ్) రికెల్టన్ (బి) సాంట్నర్ 14; స్టార్క్ (నాటౌట్) 1; కుల్దీప్ (రనౌట్) 1; మోహిత్ (రనౌట్) 0; ఎక్స్‌ట్రాలు 13; **మొత్తం (19 ఓవర్లలో ఆలౌట్) 193. వికెట్ల పతనం:** 1-0, 2-119, 3-135, 4-144, 5-145, 6-160, 7-180, 8-192, 9-193, 10-193. **బౌలింగ్:** దీపక్ చహర్ 3-0-24-1; బౌల్ట్ 2-0-21-0; బుమ్రా 4-0-44-1; సాంట్నర్ 4-0-43-2; హార్దిక్ పాండ్యా 2-0-21-0; కరణ్ శర్మ 4-0-36-3.

ఐపీఎల్-2025 పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే
గుజరాత్	6	4	2	8	1.081
ఢిల్లీ	5	4	1	8	0.899
బెంగళూరు	6	4	2	8	0.672
లక్నో	6	4	2	8	0.162
కోల్‌కతా	6	3	3	6	0.803
పంజాబ్	5	3	2	6	0.065
ముంబై	6	2	4	4	0.104
రాజస్తాన్	6	2	4	4	-0.838
హైదరాబాద్	6	2	4	4	-1.245
చెన్నై	6	1	5	2	-1.554

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

లక్నో × చెన్నై
వేదిక: లక్నో
రాత్రి 7: 30 గంటల నుంచి
స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

విద్య, ఉద్యోగ సమాచారం

ఏపీ ఎడ్‌సెట్-2025

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఏపీ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్.. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి బీఈడీ, బీఈడీ(స్పెషల్) కోర్సుల్లో ప్రవేశాలకు ఎడ్‌సెట్-2025 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది. ఈ ఏడాది పరీక్షను ఆచార్య నాగార్జున యూనివర్శిటీ నిర్వహిస్తుంది.

» **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి ఏదైనా బ్యాచిలర్ డిగ్రీలో 50% మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలి.ప్రస్తుతం చివరి సంవత్సరం చదువుతున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు.
» **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ ప్రవేశ పరీక్ష ద్వారా .
» **పరీక్ష విధానం:** మొత్తం 150 మార్కులకు ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 14.05.2025.
» **ప్రవేశ పరీక్ష తేది:** 05.06.2025.
» **వెబ్‌సైట్:** https://cets.apsche.ap.gov.in

ఆర్ఆర్‌బీలో 9,970 అసిస్టెంట్ లోకో పైలట్ పోస్టులు

రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు(ఆర్ఆర్‌బీ) దేశవ్యాప్తంగా అన్ని రైల్వే రీజియన్లలో అసిస్టెంట్ లోకో పైలట్(ఏఎల్‌పీ) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 9,970.
» **ఆర్ఆర్‌బీ రీజియన్లు:** అహ్మదాబాద్, అజ్మేర్, బెంగళూరు,భోపాల్, భువనేశ్వర్, బిలాస్‌పూర్, చండీఘడ్,చెన్నై,గువాహటి, జమ్మూ-శ్రీనగర్, కోల్‌కతా, మాల్డా, ముంబై, ముజఫర్‌పూర్, పాట్నా, ప్రయాగ్‌రాజ్, రాంచీ, సికింద్రాబాద్, సిలిగురి, తిరువనంతపురం, గోరఖ్‌పూర్.
» **రీజియన్ల వారీగా ఖాళీలు:** అహ్మదాబాద్-497, అజ్మేర్-820, ప్రయాగ్‌రాజ్-588, భోపాల్-664, భువనేశ్వర్-928, బిలాస్‌పూర్-568, చండీఘడ్-433, చెన్నై-362, గువాహటి-30, జమ్మూ-శ్రీనగర్-08, కోల్‌కతా-720, మాల్డా-432, ముంబై-740, ముజఫర్‌పూర్-89, పాట్నా-33, ప్రయాగ్‌రాజ్-286, రాంచీ-1,213, సికింద్రాబాద్-1500, సిలిగురి-95, తిరువనంతపురం-148, గోరఖ్‌పూర్-100.
» **అర్హత:** మెట్రిక్యులేషన్‌తో పాటు ఐటీఐ పూర్తి చేసి ఉండాలి. లేదా సంబంధిత విభాగంలో మూడేళ్ల ఇంజనీరింగ్ డిప్లొమా, ఇంజనీరింగ్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి.
» **వయసు:** 01.07.2025 నాటికి 18 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్ల సడలింపు ఉంటుంది.
» **ఎంపిక విధానం:** మొదటి దశ సీబీటీ-1, రెండో దశ సీబీటీ-2, కంప్యూటర్ బేస్డ్ ఆప్టిట్యూడ్ టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా .
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 12.04.2025.
» **దరఖాస్తు సవరణ తేదీలు:** 14.05.2025 నుంచి 23.05.2025
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 11.05.2025.
» **వెబ్‌సైట్:** https://indianrailways.gov.in

యూనివర్శిటీ ఆఫ్ హైదరాబాద్‌లో నాన్ టీచింగ్ పోస్టులు

యూనివర్శిటీ ఆఫ్ హైదరాబాద్‌లో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్/డిప్యుటేషన్ ప్రాతిపదికన నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 07.
» **పోస్టుల వివరాలు:** లైబ్రేరియన్-01, ఇంజనీర్-01,డిప్యూటీ రిజిస్ట్రార్-03, ఇంటర్నల్ ఆడిట్ ఆఫీసర్-01, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-01.
» **అర్హత:** లైబ్రేరియన్ పోస్టుకు మాస్టర్ డిగ్రీ(లైబ్రేరియన్ సైన్స్) ఉత్తీర్ణులవ్వాలి. మిగతా పోస్టులకు పని అనుభవం తప్పనిసరిగా ఉండాలి.
» **వయసు:** లైబ్రేరియన్ పోస్టుకు 62 ఏళ్లు, ఇంజనీర్ పోస్టుకు 56 ఏళ్లు ఉండాలి.
» **వేతనం:** లైబ్రేరియన్ పోస్టుకు రూ.1,44,200 నుంచి రూ.2,18,200, ఇంజనీర్ పోస్టుకు రూ. 1,23,100 నుంచి రూ.2,15,900, డిప్యూటీ రిజిస్ట్రార్ పోస్టుకు రూ.78,800 నుంచి రూ.2,09, 200, ఇంటర్నల్ ఆడిట్ ఆఫీసర్ పోస్టుకు రూ.78,800 నుంచి రూ.2,09,200, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పోస్టుకు రూ.67,700 నుంచి రూ.2,08,700.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 28.04.2025.
» **వెబ్‌సైట్:** https://uohyd.ac.in

డిగ్రీతో.. కెరీర్ వెలుగులు!



ఆఫ్టర్ డిగ్రీ

» బ్యాచిలర్ డిగ్రీ పట్టాతో అవకాశాలు
» అనేక ఉన్నత విద్య, ఉద్యోగ మార్గాలు
» అదనపు నైపుణ్యాలతో వెలుగులీనే కెరీర్స్

మరికొద్ది రోజుల్లో ముగియనున్న విద్యా సంవత్సరం! లక్షల మంది సంప్రదాయ బ్యాచిలర్ డిగ్రీ విద్యార్థులు కోర్సులు పూర్తిచేసుకొని కాలేజీ నుంచి బయటికి రానున్నారు! మరి వారి ముందున్న అవకాశాలేంటి.. ఉన్నత విద్య మార్గాలు.. జాబ్ మార్కెట్ ట్రెండ్స్ ఎలా ఉన్నాయి. నేటి ఏఐ యుగంలో డిగ్రీతో కొలువు అందుకోవడం ఎలా! ఇలా.. ఎన్నో సందేహాలు!! ఈ నేపథ్యంలో.. బ్యాచిలర్ డిగ్రీతో అందుబాటులో ఉన్న కెరీర్ మార్గాలపై ప్రత్యేక కథనం..

బ్యాచిలర్ డిగ్రీ అభ్యర్థులకు అనేక కెరీర్ మార్గాలు అందుబాటులో ఉన్నాయి. వాటిలో దేన్ని ఎంచుకోవాలనేది వారి ఆసక్తి, వ్యక్తిగత పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది. అందుబాటులో ఉన్న అవకాశాలపై అవగాహన పెంచుకుంటే.. భవిష్యత్ కెరీర్ ప్రణాళికలపై స్పష్టత వస్తుంది.

మూడు మార్గాలు

సైన్స్,ఆర్ట్స్, సోషల్ సైన్స్, కామర్స్.. ఇలా.. నేపథ్యం ఏదైనా.. బ్యాచిలర్ డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులకు ముఖ్యంగా మూడు మార్గాలు అందుబాటులో ఉన్నాయి.అవి.. ✦ ఉన్నత విద్య ✦ ఉద్యోగం ✦ స్వయం ఉపాధి. సంప్రదాయ ఆర్ట్స్, హ్యుమానిటీస్, సోషల్ సైన్సెస్, కామర్స్ విద్యార్థులకు క్యాంపస్ డ్రైవ్స్ దాదాపు ఉండవనే చెప్పొచ్చు. కాబట్టి వీరు ఉద్యోగాల కోసం స్వీయ అన్వేషణ మార్గాలను అనుసరించాల్సి ఉంటుంది. మరోవైపు వీరికి విస్తృతమైన ఉన్నత విద్య అవకాశాలు అందుబాటులో ఉన్నాయి.

బీఎస్సీ(ఎంపీసీ)

ఉన్నత విద్య: సంప్రదాయ డిగ్రీ కోర్సుల్లో కొంత క్రేజ్ ఎక్కువగా ఉండే కోర్సు బీఎస్సీ ఎంపీసీ. ముఖ్యంగా మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీలు కోర్ సబ్జెక్ట్‌లుగా ఉండే బీఎస్సీలో.. ఇప్పుడు అనేక కొత్త స్పెషలైజేషన్లు అందుబాటులోకి వచ్చి ఇటు ఉన్నత విద్య, అటు ఉద్యోగావకాశాలను విస్తృతం చేస్తున్నాయి. ఉన్నత విద్య పరంగా.. వినూత్న స్పెషలైజేషన్లు అందుబాటులోకి వస్తున్నాయి. పీజీ స్థాయిలో అప్లయిడ్ మ్యాథ్స్ మొదలు.. మ్యాథమెటిక్స్ విత్ కంప్యూటర్ అప్లికేషన్స్ వంటి కోర్సులు ఉన్నాయి. అదే విధంగా పలు యూనివర్సిటీలు, ఇన్‌స్టిట్యూట్‌లు కెరీర్ ఓరియెంటెడ్ స్పెషలైజేషన్స్ (**ఉదాహరణకు:** ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్, మెరైన్ జియాలజీ తదితర)ను అందుబాటులోకి తెస్తున్నాయి. ఐఐటీల్లో పీజీ చేసే అవకాశం కూడా బీఎస్సీ విద్యార్థులకు లభిస్తోంది. ఇందుకోసం ఐఐటీ-జామ్(జాయింట్ అడ్మిషన్ ఫర్ ఎమ్మెస్సీ) పరీక్షలో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది.

ఉద్యోగావకాశాలు: బీఎస్సీ (ఎంపీసీ) పూర్తి చేసిన విద్యార్థులకు తయారీ రంగంలో ఎక్కువ అవకాశాలు లభిస్తున్నాయి. ప్రధానంగా బేసిక్ సైన్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీల అప్లికేషన్స్ అవసరమయ్యే కెమికల్ ఇండస్ట్రీస్‌లో ఇవి ఎక్కువగా ఉన్నాయి. ఎమ్మెస్సీ పూర్తి చేస్తే అవకాశాలు మరింత మెరుగవుతాయి. అభ్యర్థులు ఎమ్మెస్సీలో ఎంపిక చేసుకున్న స్పెషలైజేషన్ ఆధారంగా డీఆర్‌డీఓ, ఇస్రో తదితర కీలక విభాగాలతోపాటు సాఫ్ట్‌వేర్ రంగంలో సైతం ఉద్యోగాలు సొంతం చేసుకోవచ్చు.

బీఎస్సీ లైఫ్ సైన్సెస్

ఉన్నత విద్య: బీఎస్సీ ఎంపీసీ తర్వాత విద్యార్థుల్లో ఎక్కువ ఆదరణ ఉన్న డిగ్రీ కోర్సు.. బీఎస్సీ లైఫ్ సైన్సెస్. బీఎస్సీ(బీజెడ్‌సీ)గా దశాబ్దాలుగా తెలిసిన ఈ కోర్సులో ఇప్పుడు కొత్త స్పెషలైజేషన్లు రూపుదిద్దుకుంటున్నాయి. బయో కెమిస్ట్రీ, మైక్రో బయాలజీ, బయో ఇన్ఫర్మాటిక్స్ వంటి వినూత్న కాంబినేషన్లు ఆవిష్కృతమవుతున్నాయి. దీనికి తగినట్లుగానే ఉన్నత విద్య, ఉద్యోగావకాశాలు అందుబాటులోకి వస్తున్నాయి. ఉన్నత విద్య పరంగా ఎమ్మెస్సీ స్థాయిలో మెరైన్ బయాలజీ అండ్ ఫిషరీస్ సైన్స్, మెరైన్ బయో టెక్నాలజీ, హ్యూమన్ జెనెటిక్స్, మాలిక్యులర్ జెనెటిక్స్, ఆక్వాకల్చర్ వంటి కొత్త స్పెషలైజేషన్లు ఉన్నాయి.

ఉద్యోగాలు: బీఎస్సీ(బీజెడ్‌సీ) విద్యార్థులకు ప్రధానంగా ఫార్మాస్యుటికల్ సంస్థలు, విత్తన ఉత్పత్తి సంస్థలు, పౌల్ట్రీ ఫీడ్ ప్రొడక్షన్ సంస్థల్లో అవకాశాలు లభిస్తున్నాయి. అదే విధంగా పీజీ పూర్తి చేసిన అభ్యర్థులు డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయో టెక్నాలజీ, జెనెటిక్ టెక్నాలజీ ఆధ్వర్యంలోని లేబొరేటరీల్లో కొలువులు సొంతం చేసుకోవచ్చు. ప్రైవేటు రంగంలో హాస్పిటల్స్, హెల్త్‌కేర్ సంస్థల్లో ఉద్యోగాలు దక్కించుకోవచ్చు.

బీకాం.. కార్పొరేట్ రూపు

ఉన్నత విద్య: బ్యాచిలర్ ఆఫ్ కామర్స్(బీకాం) కార్పొరేట్ రూపు సంతరించుకుంటోంది. బీకాం ఉత్తీర్ణులకు కార్పొరేట్ కొలువులు ఖాయమవుతున్నాయి. ఒకప్పుడు అకౌంటింగ్, ట్యాక్సేషన్, కామర్స్ సబ్జెక్ట్‌లకే పరిమితమైన బీకాంలో.. ఇప్పుడు కార్పొరేట్ అవసరాలకు సరితూగే విధంగా కొత్త కొత్త స్పెషలైజేషన్లు అందుబాటులోకి వస్తున్నాయి. ఈ-కామర్స్, ఈ-బిజినెస్ మేనేజ్‌మెంట్, అడ్వర్టయిజింగ్ అండ్ మార్కెటింగ్, పోర్ట్‌ఫోలియో మేనేజ్‌మెంట్, ఈఆర్‌పీ సొల్యూషన్స్ వంటి సబ్జెక్ట్‌లతో ఇంటర్‌డిసిప్లినరీ కోర్సులను అందిస్తున్నాయి. ఉన్నత విద్య కోణంలో బీకాం విద్యార్థులకు అందుబాటులో ఉన్న ఎంకాంలోనూ వినూత్న స్పెషలైజేషన్లు ఆవిష్కృతమవుతున్నాయి. కార్పొరేట్ సెక్రటరీషిప్, ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్, ఈ-బిజినెస్ మేనేజ్‌మెంట్, సేల్స్ అండ్ మేనేజ్‌మెంట్ వంటి జాబ్ మార్కెట్ అవసరాలకు సరితూగే స్పెషలైజేషన్లు ప్రస్తుతం దాదాపు అన్ని యూనివర్సిటీలు అందిస్తున్నాయి. వీటిని పూర్తి చేసిన విద్యార్థులకు కార్పొరేట్ రంగంలో మేనేజ్‌మెంట్ పీజీ విద్యార్థులతో సమానంగా పోటీ పడే సత్తా లభిస్తోంది.

ఉద్యోగాలు: కామర్స్ విద్యార్థులకు ఉద్యోగాలు విస్తృతమవుతున్నాయి. అకౌంట్స్ అసిస్టెంట్ వంటి ఎంట్రీ లెవల్ ఉద్యోగాలు మొదలు అకౌంట్స్ ఎగ్జిక్యూటివ్ తదితర మిడ్ లెవల్ కొలువుల వరకూ.. కెరీర్ ప్రారంభించేందుకు ఇప్పుడు ఎన్నో మార్గాలు. పీజీ అర్హతతో అకౌంట్స్ ఆఫీసర్, ఫైనాన్స్ మేనేజర్, ఇంటర్నల్ ఆడిటర్ వంటి ఉద్యోగాలు లభిస్తాయి. కామర్స్‌లో అకౌంటింగ్, ట్యాక్సేషన్ పరంగా ఈఆర్‌పీ సొల్యూషన్స్‌గా పేరొందిన ట్యాలీ, వింగ్స్, పీచ్‌ట్రీ వంటి అకౌంటింగ్ సాఫ్ట్‌వేర్ కోర్సులను పూర్తి చేస్తే అవకాశాల పరంగా ఢోకా ఉండదు.

ఆర్ట్స్.. అదనపు అర్హతలతో అవకాశాలు

ఉన్నత విద్య: బ్యాచిలర్ ఆఫ్ ఆర్ట్స్. బీఏగా సుపరిచితం. బీఏ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులు కొద్దిపాటి అదనపు అర్హతలతో అవకాశాలు అందుకునే వీలుంది. కారణం.. ఈ కోర్సులో అందుబాటులోకి వస్తున్న కొత్త స్పెషలైజేషన్లే. మార్కెటింగ్ అండ్ అడ్వర్టయిజింగ్, పబ్లిక్ రిలేషన్స్, సోషల్ వర్క్, ఎన్‌జీఓ మేనేజ్‌మెంట్ సబ్జెక్ట్‌లతో బీఏలో గ్రూప్ సబ్జెక్ట్‌లు రూపొందుతున్నాయి. ఉన్నత విద్య కోణంలో బీఏ విద్యార్థులకు ఎంఏ స్థాయిలో కొత్త స్పెషలైజేషన్లు అందుబాటులోకి వస్తున్నాయి. సోషల్‌వర్క్, ఆంత్రోపాలజీ, మ్యూజియాలజీ, టూరిజం అండ్ హాస్పిటాలిటీ, లాంగ్వేజెస్ తదితర స్పెషలైజేషన్లు ఉన్నాయి.

ఉద్యోగాలు: బీఏ విద్యార్థులకు అనేక ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయని చెప్పొచ్చు. ముఖ్యంగా పీజీ స్థాయిలో ఎంపిక చేసుకున్న స్పెషలైజేషన్ల ఆధారంగా.. ఎన్‌జీఓ సంస్థలు, పురావస్తు శాఖలోని విభాగాలు,మ్యూజియంలు,విదేశీ రాయబార కార్యాలయాల్లో ఉద్యోగాలు లభిస్తున్నాయి. టూరిజం సంస్థలు, ట్రావెల్ ఏజెన్సీలు, ఎయిర్‌లైన్స్‌లలోనూ వీరు కొలువులు సొంతం చేసుకోవచ్చు.

ప్రభుత్వ ఉద్యోగాలు

బ్యాచిలర్ డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల స్థాయిలోని పలు ఉద్యోగాలకు పోటీ పడే అర్హత లభిస్తోంది. యూపీఎస్సీ నిర్వహించే సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్ ద్వారా ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ తదితర 23 కేంద్ర ఉన్నత సర్వీసులకు ఎంపికయ్యే అవకాశం ఉంది.

సీడీఎస్ఈ: త్రివిధ దళాల్లో పర్మనెంట్ కమిషన్డ్ హోదాలో కెరీర్ ప్రారంభించేందుకు మార్గం వేసే పరీక్ష.. కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ ఎగ్జామినేషన్. యూపీఎస్సీ నిర్వహించే ఈ పరీక్ష ద్వారా ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్, ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీల్లో కెరీర్ ప్రారంభం దిశగా అడుగులు వేయొచ్చు.

ఆర్ఆర్‌బీ-నాన్ టెక్నికల్: రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డ్ నిర్వహించే నాన్-టెక్నికల్ ఉద్యోగాలు(ఏఎస్ఎం, ట్రాఫిక్ అప్రెంటీస్, కమర్షియల్ అప్రెంటీస్) తదితరాలకు పోటీ పడొచ్చు.

ఎస్ఎస్‌సీ-సీజీఎల్: స్టాఫ్ సెలక్షన్ కమిషన్.. బ్యాచిలర్ డిగ్రీ అర్హతగా నిర్వహించే కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవల్ ఎగ్జామినేషన్‌కు అర్హత లభిస్తుంది. ఈ పరీక్ష ద్వారా కేంద్ర ప్రభుత్వ శాఖల్లో గ్రూప్-బి కేడర్ ఉద్యోగాలు సొంతం చేసుకోవచ్చు.

ఐబీపీఎస్, ఎస్‌బీఐ-పీఓ/క్లర్క్: బ్యాచిలర్ డిగ్రీ విద్యార్థుల కోసం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలక్షన్(ఐబీపీఎస్).. ప్రొబేషనరీ ఆఫీసర్స్, క్లరికల్ కేడర్ పోస్ట్‌లకు ఉమ్మడి పరీక్ష నిర్వహిస్తోంది. వీటిలో విజయం సాధిస్తే జాతీయ బ్యాంకుల్లో కొలువు ఖాయం. అదే విధంగా ఎస్‌బీఐ కూడా పీఓ, క్లరికల్ పోస్ట్‌లకు నియామకం చేపడుతోంది.

రాష్ట్రాల స్థాయిలో.. పబ్లిక్ సర్వీస్ కమిషన్లు నిర్వహించే గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3, గ్రూప్-4 ఉద్యోగాలకు డిగ్రీతో అర్హత లభిస్తుంది. అదే విధంగా బీజెడ్‌సీ అర్హతగా నిర్వహించే డ్రగ్ ఇన్‌స్పెక్టర్ వంటి పోస్ట్‌లకు సైతం పోటీ పడొచ్చు. పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్‌లు నిర్వహించే సబ్ ఇన్‌స్పెక్టర్ పోస్ట్‌లకు కూడా అర్హత లభిస్తుంది.

స్వయం ఉపాధి

బ్యాచిలర్ డిగ్రీ విద్యార్థులకు భవిష్యత్తు పరంగా ఉన్న మరో ముఖ్యమైన మార్గం.. స్వయం ఉపాధి. చక్కటి వ్యాపార ఆలోచన.. దానికి మార్కెట్ పరంగా డిమాండ్ ఉంటే చాలు.. వెన్నుతట్టి ప్రోత్సహించేందుకు ఎందరో ఏంజెల్ ఇన్వెస్టర్లు ముందుకొస్తున్నారు. ప్రభుత్వ స్థాయిలోనూ స్వయం ఉపాధి ఔత్సాహికులకు పలు ప్రోత్సాహకాలు అందుబాటులో ఉన్నాయి. మేక్ ఇన్ ఇండియా, స్కిల్ ఇండియా, డిజిటల్ ఇండియా వంటి పథకాల నేపథ్యంలో ఎంఎస్ఎంఈ, ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన, ముద్ర పథకం వంటి పథకాల ద్వారా స్వయం ఉపాధి కోసం ఆర్థిక ప్రోత్సాహకాలు అందుకోవచ్చు.

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం-ఇండియన్ హిస్టరీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం- సోషల్ మెథడ్స్
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం-జనరల్ స్టడీస్- కెమిస్ట్రీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం-జనరల్ ఇంగ్లిష్

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	1,310	75,157
నిఫ్టీ ▲	429	22,829

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	16,724	▲	337
డోజోన్స్	40,213	▲	619
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,964	▲	51
డాక్స్	20,374	▼	189
షాంఘై	3,238	▲	15
నికాయ్	33,585	▼	1,023

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	84.21	87.89
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	110.43	115.19
€	యూరో	ఎస్‌బీఐ	95.56	9.93
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	49.00	71.00
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	51.40	56.22
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	62.90	67.53
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	22.04	23.58
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.54	24.32
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.91	12.74

బీమాతో సైబర్ మోసాలకు చెక్!

- గణనీయంగా పెరిగిన డిజిటల్ చెల్లింపులు
- స్మార్ట్‌ఫోన్ నుంచే ఆర్థిక లావాదేవీలు
- భిన్న మార్గాల్లో విరుచుకుపడుతున్న సైబర్ నేరగాళ్లు
- ఫోన్‌కాల్స్, ఎస్ఎంఎస్‌లు, లింక్‌లతో మోసాలు
- ఆర్థికంగా కోలుకోలేని నష్టం
- సైబర్ ఇన్సూరెన్స్‌తో వీటి నుంచి రక్షణ

ఐటీ ఉద్యోగి వంశీరామ్ (32) మొబైల్‌కు ఒక సందేశం వచ్చింది. విద్యుత్ బిల్లు గడువు ముగిసిపోయిందని.. వెంటనే చెల్లించకపోతే కనెక్షన్ నిలిపివేస్తామని అందులో ఉంది. వెంటనే లింక్‌పై క్లిక్ చేసి చెల్లించేశాడు వంశీ. కానీ, ఖాతా నుంచి రూ.80,000 డెబిట్ అయిపోవడం చూసి నిర్ఘాంతపోయాడు. ఇలాంటివి రోజుకు వేలాది ఘటనలు జరుగుతున్నాయి. గ్రోసరీ షాపింగ్, సోషల్ మీడియా ముచ్చట్లు, వర్తకులకు క్యూఆర్ కోడ్ చెల్లింపులు, యుటిలిటీ బిల్లులు, బ్యాంకింగ్ సేవలు.. నేడు లావాదేవీలన్నీ మొబైల్ ఫోన్ల నుంచే. దాదాపు అన్ని ఆర్థిక లావాదేవీలు డిజిటల్ రూపంలోకి మళ్లాయి. సౌకర్యంగా ఉండడంతో అందరూ స్మార్ట్‌ఫోన్ నుంచే కానిచ్చేస్తున్నారు. ఫలితంగా ఇది సైబర్ మోసాలకు అడ్డాగా మారిపోయింది. ఏటా 15 లక్షల సైబర్ మోసాలు ఇప్పుడు నమోదవుతున్నాయి. ఫలితంగా సామాన్యులు ఆర్థికంగా కుదేలవుతున్నారు. అందుకే ప్రతి ఒక్కరూ సైబర్ మోసాల నుంచి రక్షణ కల్పించుకోవడంపై తప్పకుండా దృష్టి సారించాలి. దీని గురించి అవగాహన కల్పించే కథనం ఇది...

– సాక్షి, బిజినెస్ డెస్క్

2018లో సైబర్ నేరాలు 2.08 లక్షలు కాగా, ఇప్పుడు ఏటా 15 లక్షలకు చేరాయని ఇండియన్ కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ (సీఈఆర్‌టీ) గణాంకాలు తెలియజేస్తున్నాయి. బాధితులు అందరూ బయటకు చెప్పుకోలేరు. కనుక, ఇలాంటి మోసాలు ఇంకా ఎక్కువే ఉండొచ్చన్నది నిపుణుల అంచనా. సైబర్ నేరాలతో ఆర్థికంగా నష్టపోవడమే కాదు, మానసికంగా ఎంతో వేదనకు గురికావాల్సి వస్తుంది. ఈ ఇబ్బందుల నుంచి ఆదుకునేదే సైబర్ ఇన్సూరెన్స్. దేశంలో 84 శాతం ఇంటర్నెట్ యూజర్లు ఆన్‌లైన్ ఆర్థిక లావాదేవీలు నిర్వహిస్తున్నట్టు గణాంకాలు తెలియజేస్తున్నాయి. షాపింగ్, బ్యాంకింగ్ లేదా సోషల్ మీడియా చాటింగ్, ఆన్‌లైన్ కార్యకలాపాలు ఏవైనా సరే... ఇంటర్నెట్‌తో అనుసంధానమైన ప్రతి ఒక్కరికీ డేటా లీకేజీ, సైబర్ దాడులు, మోసాల రిస్క్ ఉంటుంది. సైబర్ నేరస్థులు డీప్‌ఫేక్ టెక్నాలజీ, ఏఐ తదితర అత్యాధునిక టెక్నాలజీలతో దాడులకు దిగుతున్నారు. ఆన్‌లైన్‌లో డాక్టర్ అపాయింట్‌మెంట్ బుకింగ్‌ను సైతం తప్పుదోవ పట్టించి.. నకిలీ లింక్ ద్వారా బ్యాంక్ ఖాతా ఊడ్చేస్తున్న ఘటనలు వింటున్నాం. టెక్నాలజీ గురించి పెద్దగా పరిచయం లేని విశ్రాంత జీవుల నుంచి జీవితకాల పొదుపు నిధులను మాయం చేస్తున్నారు. నేడు ప్రపంచం మొత్తం డిజిటల్‌గా అనుసంధానమై ఉంది. దీంతో నేరగాళ్లు ఏదో ఒక దేశంలో ఉండి, మరో దేశంలోని వారిని సులభంగా మోసం చేయగలుగుతున్నారు. ఒకవైపు సైబర్ నేరాలు గణనీయంగా పెరుగుతుంటే.. మరోవైపు సైబర్ ఇన్సూరెన్స్ తీసుకుంటున్న వారి సంఖ్య అతి స్వల్పంగా ఉంటోంది. చాలా మందికి దీని గురించి అవగాహన లేకపోవడం ఒకటి అయితే, తాము జాగ్రత్తగా ఉంటామన్న ధీమా కొందరిని బీమాకు దూరంగా ఉంచుతోంది.

ఎంత కవరేజీ అవసరం?



కంపెనీలు రూ.కోట్లు ఖర్చు పెట్టి ఫైర్‌వాల్స్ వంటి సాఫ్ట్‌వేర్ టూల్స్‌తో సైబర్ దాడుల నిరోధానికి చర్యలు తీసుకుంటూ ఉంటాయి. అదే మాదిరి వ్యక్తులు సైతం తమ వంతుగా సైబర్ బీమా రక్షణను తీసుకోవడం మంచి ఆలోచన అవుతుంది. ముందుగా బ్యాంక్ ఖాతాల్లో బ్యాలెన్స్, క్రెడిట్ కార్డ్ లిమిట్, ఈ–వ్యాలెట్ ఇలా సైబర్ దాడుల రిస్క్ ఉన్న పెట్టుబడుల విలువను ఒకసారి పరిశీలించాలి. మీ లిక్విడ్ అసెట్స్ విలువకు సరిపడా కవరేజీ తీసుకోవాలన్నది నిపుణుల సూచన. తరచూ, అధిక మొత్తంలో ఆర్థిక లావాదేవీలు నిర్వహించే వారికి అధిక కవరేజీ అవసరం.

వీటికి కవరేజీ రాదు..



సైబర్ ఇన్సూరెన్స్‌లో మినహాయింపులు కూడా ఉంటాయి. వీటి గురించి పాలసీదారులు ముందుగానే సమగ్రంగా తెలుసుకోవాలి., చట్టంలోని నిబంధనలకు విరుద్ధంగా చేసే వ్యవహారాలు, లావాదేవీలు, ఉద్దేశపూర్వక ఉల్లంఘనల కారణంగా జరిగే నష్టానికి ఇందులో పరిహారం రాదు. వాణిజ్య రహస్యాలు, సెలబ్రిటీలు, రాజకీయ నాయకులకు సంబంధించి ఎదురయ్యే చెల్లింపుల బాధ్యతలకూ ఇందులో మినహాయింపులు ఉన్నాయి. యుద్ధం, సైబర్ యుద్ధం, సహజ ప్రమాదాల కారణంగా వాటిల్లే నష్టానికీ రక్షణ ఉండదు. క్రిప్టో పెట్టుబడులు, గ్యాంబ్లింగ్, మోసపూరిత చర్యలు, అనధికారికంగా డేటా సమీకరించడం, నిషేధిత సైట్లలోకి ప్రవేశించడం వల్ల వాటిల్లే నష్టం తదితర వాటికి సైబర్ బీమాలో కవరేజీ ఉండదు.

వెంటనే రిపోర్ట్ చేయాలి..



మోసపూరిత లావాదేవీలు జరిగాయంటే వెంటనే బ్యాంక్ కస్టమర్ కేర్‌కు కాల్ చేసి వాటి ఖాతా/క్రెడిట్/డెబిట్‌కార్డుల యాక్సెస్‌ను తాత్కాలికంగా బ్లాక్ చేయించాలి. వెంటనే బ్యాంక్ అధికారులకు సమాచారం అందించాలి. 1930కు కాల్ చేసి సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేయాలి. తర్వాత బీమా కంపెనీకి సమాచారం అందించాలి. పోలీసుల వద్ద ఎఫ్ఐఆర్ నమోదు చేసిన అనంతరం, ఆ కాపీ తీసుకుని బీమా కంపెనీ వద్ద నిబంధనల మేరకు క్లెయిమ్ దాఖలు చేయాలి. బ్యాంక్/ఎన్‌బీఎఫ్‌సీ వద్ద ఫిర్యాదుకు సంబంధించి రుజువులను జత చేయాలి. జరిగిన నష్టానికి సంబంధించి ఆధారాలూ సమర్పించాలి.



సైబర్ రక్షణ...

సైబర్ మోసాల వల్ల జరిగే నష్టాన్ని పాలసీదారులకు సైబర్ ఇన్సూరెన్స్ చెల్లిస్తుంది. రూ.లక్ష నుంచి రూ.5 కోట్ల వరకు సమ్ అష్యూర్డ్ (బీమా) తీసుకోవచ్చు. రూ.లక్ష కవరేజీకి ప్రీమియం సుమారు రూ.600 వరకు.. రూ.కోటి కవరేజీకి రూ.25,000 వరకు ఉంటుంది. సోషల్ మీడియా ఖాతాలను హ్యాక్ చేసి దుర్వినియోగం చేయడం, సైబర్ వేధింపులు, బెదిరింపులు, వ్యక్తిగత ప్రతిష్ఠకు నష్టం వంటి కేసుల్లో.. చట్టపరమైన చర్యలకు అయ్యే వ్యయాలను బీమా కంపెనీ చెల్లిస్తుంది. మాల్వేర్, రాన్సమ్‌వేర్ రక్షణ కూడా ఉంటుంది. మాల్వేర్ దాడుల కారణంగా సర్వర్, నెట్‌వర్క్, కంప్యూటర్లకు వాటిల్లే నష్టానికి పరిహారం లభిస్తుంది. సైబర్ నేరస్థులు డివైజ్‌ను (మొబైల్ లేదా పీసీ/ల్యాప్‌టాప్) హ్యాక్ చేసి డబ్బులు డిమాండ్ చేయొచ్చు. అలాంటి సందర్భాల్లో డేటా రికవరీకి, డివైజ్ రిపేర్ వ్యయాలను బీమా కంపెనీ భరిస్తుంది. డేటా చోరీతో వాటిల్లే నష్టాన్ని భర్తీ చేస్తుంది. ఆన్‌లైన్ బ్లాక్ మెయిల్, సైబర్ బుల్లీయింగ్ తదితర ఘటనల్లో న్యాయపరమైన చర్యలకు, సాంకేతిక సాయానికి అయ్యే వ్యయాలను బీమా సంస్థ చెల్లిస్తుంది. సైబర్ ఇన్సూరెన్స్‌లోనూ విభిన్న ప్లాన్లు ఉన్నాయి. ఆన్‌లైన్ షాపింగ్ మోసాలకు సంబంధించి కూడా ప్రత్యేక ప్లాన్లు ఉన్నాయి. మొబైల్ వాలెట్లకూ రక్షణ కల్పించుకోవచ్చు. ఈమెయిల్ స్పూఫింగ్ దాడి వల్ల ఎదురయ్యే ఆర్థిక నష్టం, నేరస్థులపై చర్యలకు అయ్యే వ్యయాలకూ చెల్లింపులు ఉంటాయి. సందేశాలు పంపడం, ఫోన్ కాల్స్, నకిలీ వెబ్‌సైట్‌ల ద్వారా సున్నితమైన డేటాను పొందడం ద్వారా ఆర్థికంగా నష్టం కలిగించడం వంటి ఫిషింగ్ దాడుల నుంచి రక్షణ పొందొచ్చు.

సైబర్ టిప్స్..

- చాలా మంది ఆన్‌లైన్ లావాదేవీల సమయంలో జాగ్రత్తలు తీసుకోకుండా, నిర్లక్ష్యంగా వ్యవహరించడం సైబర్ దాడులకు అవకాశం ఇచ్చినట్టు అవుతోంది. ప్రతి ఒక్కరూ తమవంతు రక్షణ చర్యలు తీసుకోవడంపై దృష్టి పెట్టాలి.
- స్మార్ట్ ఫోన్లు, కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు, టాబ్లెట్‌లలో సైబర్ సెక్యూరిటీ సాఫ్ట్‌వేర్ ఇన్‌స్టాల్ చేసుకోవాలి.
- తెలియని వెబ్‌సైట్లను యాక్సెస్ చేయకుండా ఉండాలి.
- గూగుల్ సెర్చ్‌లో శోధించే క్రమంలో ఎదురయ్యే వెబ్ పోర్టళ్లు, కాంటాక్టుల వివరాలు, చిరునామాలు నిజమైనవేనా? అన్న పరిశీలన తర్వాతే ముందుకు వెళ్లాలి.
- డొమైన్ చిరునామాలో హెచ్‌టీటీపీఎస్ లేకపోతే యాక్సెస్‌కు దూరంగా ఉండాలి.
- బలహీన పాస్‌వర్డ్‌లు కాకుండా.. స్మాల్, క్యాపిటల్ లెటర్లు, స్పెషల్ క్యారెక్టర్లు, నంబర్లతో కూడిన పటిష్ఠ పాస్‌వర్డ్‌లు ఏర్పాటు చేసుకోవాలి.
- పబ్లిక్ వైఫై, ఉచిత నెట్‌వర్క్‌ల యాక్సెస్‌కు దూరంగా ఉండాలి.
- టూ ఫ్యాక్టర్ అథెంటికేషన్ (2ఎఫ్ఏ)ను ఎనేబుల్ చేసుకోవాలి.
- ఫోన్‌లో ఆపరేటింగ్ సిస్టమ్, యాప్‌లు, యాంటీవైరస్ సాఫ్ట్‌వేర్ ఎప్పుడూ అప్‌డేటెడ్‌గా ఉంచుకోవాలి.
- సోషల్ మీడియాలో వ్యక్తిగత వివరాలను కొత్తవారు యాక్సెస్ చేయకుండా నియంత్రణలు పెట్టుకోవాలి.
- మెయిల్, వాట్సాప్, ఎస్ఎంఎస్ రూపంలో వచ్చే యూఆర్ఎల్ లింక్‌లపై క్లిక్ చేయొద్దు. అవి విశ్వసనీయ సంస్థల నుంచి వచ్చినవేనా అన్నది ధ్రువీకరించుకోవాలి.
- పేమెంట్ యాప్‌లు సహా అన్ని ముఖ్యమైన యాప్‌లకు ఫింగర్ ప్రింట్ లాగిన్ ఎనేబుల్ చేసుకోవాలి.
- ఎప్పటికప్పుడు ముఖ్యమైన డేటాను క్లౌడ్ ప్లాట్‌ఫామ్‌లోకి బ్యాకప్ తీసుకోవాలి.
- ఓటీపీలు, ఆధార్, పాన్, బ్యాంక్ ఖాతా, చిరునామా, ఫోన్ నంబర్లు ఇలా కీలక వివరాలను ఫోన్‌లో, ఆన్‌లైన్‌లో ఎవరితోనూ పంచుకోరాదు.
- ఈ జాగ్రత్తలతోపాటు తగినంత రక్షణ కవరేజీతో సైబర్ బీమా తీసుకోవడం మరవొద్దు.

హెచ్‌ఏఎల్‌కు నేరగాళ్ల బురిడీ

ప్రభుత్వరంగ రక్షణ ఉత్పత్తుల కంపెనీ హిందుస్థాన్ ఏరోనాటిక్స్‌ను సైతం సైబర్ నేరగాళ్లు బురిడీ కొట్టించడం గమనార్హం. కంపెనీ కాన్పూర్ శాఖను తప్పుదోవ పట్టించి రూ.55 లక్షలు కాజేశారు. యూఎస్‌కు చెందిన పీఎస్ ఇంజనీరింగ్ ఐఎన్‌సీ నుంచి హెచ్‌ఏఎల్ విడిభాగాలు కొనుగోలు చేయాలనుకుంది. కంపెనీ అధికారిక ఈ మెయిల్‌తో సంప్రదింపులు మొదలుపెట్టింది. ఈ రెండు సంస్థల మధ్యలో సైబర్ నేరగాళ్లు ప్రవేశించారు. యూఎస్ కంపెనీ పీఎస్ ఇంజనీరింగ్ అధికారిక ఈమెయిల్ చిరునామాలో ఒక ఇంగ్లిష్ 'ఇ' తొలగించి, మిగిలిన అక్షరాలన్నీ ఉండేలా ఈమెయిల్ ఐడీ సృష్టించి హెచ్‌ఏఎల్‌తో సంప్రదింపులు చేశారు. రూ.55 లక్షల అడ్వాన్స్‌ను తమ ఖాతాలోకి బదిలీ చేయించుకున్నారు. జరిగిన మోసాన్ని హెచ్‌ఏఎల్ ఆలస్యంగా గుర్తించింది. అలాగే, ఆ మధ్య ఓ ప్రముఖ హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీకి చెందిన కీలక డేటా లీక్ అయ్యింది. 68,000 డాలర్లు చెల్లించాలంటూ హ్యాకర్ డిమాండ్ చేశాడు.



డాక్టర్ అగర్వాల్స్	బ్రోకరేజ్: మోతీలాల్ ఓస్వాల్	కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 415 టార్గెట్: రూ. 518




ఎందుకంటే: సమీకృత కంటి పరిరక్షణ సంబంధ సర్వీసులందించడంలో మూడు తరాలుగా ప్రమోటర్ కుటుంబం కీలకపాత్ర పోషిస్తున్న సంస్థ డాక్టర్ అగర్వాల్స్ హెల్త్‌కేర్(డీఏహెచ్‌సీ). ఈ బాటలో 2024 డిసెంబర్‌కల్లా దేశవ్యాప్తంగా అతిఎక్కువ ఐకేర్ ఫ్రాంచైజీలు కలిగిన దిగ్గజాలలో ఒకటిగా అవతరించింది. 221 ఆసుపత్రులతో సేవలు అందిస్తోంది. తద్వారా సర్జరీలతోపాటు సమీకృత కంటి పరిరక్షణ సర్వీసులు సమకూర్చుతోంది. ఆదాయంలో సర్జరీలు 65 శాతం వాటా ఆక్రమిస్తున్నాయి. ఇతర విభాగాలలో కన్సల్టేషన్ 14 శాతం, ఆప్టికల్స్ 13 శాతం, ఫార్మాస్యూటికల్స్ 8 శాతం(ప్రొడక్టులు) చొప్పున వాటా కలిగి ఉన్నాయి. ఐ కేర్ సర్వీసులకు 2024–28 మధ్య కాలంలో వార్షిక ప్రాతిపదికన 12–14 శాతం డిమాండ్ నమోదయ్యే అవకాశముంది. ప్రస్తుత ఆసుపత్రులతోపాటు.. కొత్తగా నెలకొల్పనున్న సౌకర్యాల ద్వారా మరింతమంది రోగులకు సంస్థ కంటి చికిత్సలు అందించనుంది. వెరసి రానున్న ఐదేళ్లలో పరిశ్రమను మించి ఫలితాలు సాధించవచ్చని అంచనా. 2022–24 మధ్య కాలంలో సంస్థ ఆదాయం వార్షికంగా 38 శాతం చొప్పున ఎగసింది. నిర్వహణ లాభం(ఇబిటా) మరింత అధికంగా 41 శాతం చొప్పున జంప్‌చేసింది. ఇందుకు సొంత, ఇతర సంస్థల కొనుగోళ్ల ద్వారా సాధించిన వృద్ధి సహకరించింది. ఈ బాటలో 2025–27 మధ్య కాలంలో ఆదాయం 21 శాతం, ఇబిటా 23 శాతం చొప్పున పుంజుకోగలవని అంచనా వేస్తున్నాం. ఫలితంగా రూ. 2,490 కోట్ల ఆదాయం, రూ. 690 కోట్ల ఇబిటా సాధించే వీలుంది. ఇందుకు సర్జికల్ విభాగ పరిమాణం 19 శాతం, ఫార్మసీ ఆదాయంలో 20 శాతం, నిర్వహణ లాభాల్లో నిలకడ వంటి అంశాలు తోడ్పాటు నివ్వగలవని భావిస్తున్నాం.

స్టాక్ స్కోప్

శ్యామ్ మెటాలిక్స్	బ్రోకరేజ్: యూబీఎస్	కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 843 టార్గెట్: రూ. 1,175



ఎందుకంటే: అల్యూమినియం ఫాయిల్ తయారీలో దేశీయంగా శ్యామ్ మెటాలిక్స్ అండ్ ఎనర్జీ(ఎస్ఎంఈఎల్) రెండో అతిపెద్ద తయారీదారుగా నిలుస్తోంది. చైనీస్ అల్యూమినియం ఫాయిల్ దిగుమతులపై యాంటీ డంపింగ్ డ్యూటీ(ఏడీడీ) విధించడంతో కంపెనీ కీలక లబ్ధిదారుకానుంది. అదనపు అల్యూమినియం ఫాయిల్ సామర్థ్యం అందుబాటులోకి రానుండటం దీనికి జత కలవనుంది. దీంతో రానున్న రెండేళ్లలో రూ. 1–1.25 కోట్ల నిర్వహణ లాభం(ఇబిటా) అదనంగా ఆర్జించే అవకాశముంది. స్టీల్ ప్రొడక్టులపై 12 శాతం సేఫ్‌గార్డ్ డ్యూటీ కారణంగా కలర్ కోటెడ్ షీట్స్ బిజినెస్‌పై ఇబిటా మెరుగుపడనుంది. ఈ సానుకూలతల నేపథ్యంలో రెండేళ్ల(2025–26, 2026–27)లో టన్నుకి ఇబిటా రూ. 1,175 బలపడే వీలుంది. గతంలో వేసిన రూ. 1,150 అంచనాకంటే మెరుగుపడనుంది. కంపెనీ ప్రస్తుతం వార్షికంగా 26,400 మిలియన్ టన్నుల అల్యూమినియం ఫాయిల్ సామర్థ్యాన్ని కలిగి ఉంది. మరో 18,000 టన్నులమేర సామర్థ్యాన్ని జత చేసుకుంటోంది. ప్రస్తుతం టన్నుకి ఇబిటా రూ. 35,000కాగా.. ఈడీడీ తదుపరి రూ. 20,000 అదనంగా మెరుగుపడవచ్చని అంచనా. మెటల్ రంగ కంపెనీలలో శ్యామ్ మెటాలిక్స్‌ను అత్యంత డైవర్సిఫైడ్ సంస్థగా పేర్కొనవచ్చు. పటిష్ఠ ఎగ్జిక్యూషన్ ట్రాక్ రికార్డ్‌ను కలిగి ఉంది. 2023లో ఆవిష్కరించిన ఐదేళ్ల పెట్టుబడి వ్యయ ప్రణాళికల్లో భాగంగా 2024–25 తొలి 9 నెలల్లో రూ. 5,900 కోట్ల పెట్టుబడులను వినియోగించింది. చివరి త్రైమాసికంలోనూ రూ. 410 కోట్లు వెచ్చించింది. రానున్న త్రైమాసికాలలో ఆక్సిజన్ యూనిట్, సొంత వినియోగ విద్యుత్ ప్లాంట్, బెనిఫిసియేషన్‌తోపాటు.. చిన్నస్థాయి స్టెయిన్‌లెస్ స్టీల్ యూనిట్లు అందుబాటులోకి రానున్నాయి.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

మహిళలకు బజాజ్ అలయంజ్ లైఫ్ ప్రత్యేక బీమా పాలసీ



క్యాన్సర్ సహా 60 క్రిటికల్ అనారోగ్యాలకు కూడా కవరేజీ లభించేలా మహిళల కోసం బజాజ్ అలయంజ్ లైఫ్ ఇన్సూరెన్స్ ప్రత్యేక పాలసీని ప్రవేశపెట్టింది. దీని పేరు 'బజాజ్ అలయంజ్ లైఫ్ సూపర్‌ఉమన్ టర్మ్ (ఎస్‌డబ్ల్యూటీ) ప్లాన్'. ఇది సంప్రదాయ జీవిత బీమా పరిధికి మించి టర్మ్ ఇన్సూరెన్స్ ప్రయోజనాలను, మహిళలకు మాత్రమే పరిమితమయ్యే తీవ్రమైన అనారోగ్యాలకు సంబంధించిన బెనిఫిట్స్, ఆప్షనల్ చైల్డ్ కేర్ బెనిఫిట్ మొదలైన వాటితో ఆర్థిక భద్రతను అందిస్తుంది. అలాగే, సమగ్ర హెల్త్ చెకప్‌లు, ఓపీడీ కన్సల్టేషన్లు, ఎమోషనల్ వెల్‌నెస్ ప్రోగ్రాంలు, న్యూట్రిషనిస్ట్ గైడెన్స్ మొదలైనవన్నీ కవర్ అయ్యేలా ఈ పథకం, హెల్త్ మేనేజ్‌మెంట్ సర్వీసులను కాంప్లిమెంటరీగా అందిస్తుందని సంస్థ ఎండీ తరుణ్ చుగ్ తెలిపారు.

రుణ రేట్లను తగ్గించిన ఐవోబీ




చెన్నై: రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా రెపో రేటు పావుశాతం తగ్గించిన నేపథ్యంలో బ్యాంకులూ ఆ ప్రయోజనాన్ని కస్టమర్లకు బదలాయిస్తున్నాయి. తాజాగా ప్రభుత్వ రంగ ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు (ఐవోబీ) రెపో ఆధారిత రుణాలపై వడ్డీరేటు 25 బేసిస్ పాయింట్లు (0.25%) తగ్గించినట్లు ప్రకటించింది. ఈ ఏప్రిల్ 12 (శనివారం) నుంచి రెపో ఆధారిత రుణాలపై రేటును 9.10% నుంచి 8.85 శాతానికి కుదించినట్లు బ్యాంకు తెలిపింది. ప్రతీకార సుంకాల్లో భాగంగా ట్రంప్ భారత్‌పై 26% టారిఫ్ వడ్డనతో తలెత్తిన ఆర్థిక అనిశ్చితి పరిస్థితుల్లో వృద్ధికి దన్నుగా నిలిచేందుకు ఆర్‌బీఐ రెపో రేటును 6.25% నుంచి 6 శాతానికి తగ్గించింది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
ఆటో విడిభాగాల తయారీకి ఆర్థిక ప్రోత్సాహకాలివ్వాలి
పోర్ట్‌ఫోలియోకి అనువైనది.. కోటక్ ఫ్లెక్సీక్యాప్ ఫండ్

అంబేడ్కర్ జయంతి సందర్భంగా నేడు స్టాక్ మార్కెట్లకు సెలవు

వారసత్వంగా వచ్చిన ఫండ్స్‌పై పన్ను ఎలా?



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

మ్యూచువల్ ఫండ్స్‌లో నా పెట్టుబడులను విక్రయించేందుకు గత ఆర్థిక సంవత్సరం చివరి రోజైన 2025 మార్చి 31న ఆర్డర్ పెట్టాను. నాకు చెల్లింపులు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్‌లో వచ్చాయి. ఇక్కడ ఆర్థిక సంవత్సరం మారిపోయింది. అప్పుడు ఏ ఆర్థిక సంవత్సరంలో నా మూలధన లాభాలను పరిగణనలోకి తీసుకుంటారు? – చరణ్‌దాస్

ఇన్వెస్టర్లలో ఆర్థిక సంవత్సరం చివర్లో సాధారణంగా కనిపించే అయోమయమే ఇది. పెట్టుబడుల ఉపసంహరణ జరిగిన తేదీ ఆధారంగానే మూలధన లాభాలపై పన్నును పరిగణనలోకి తీసుకుంటారు. అంతేకానీ, మీరు విక్రయ అభ్యర్థన ఎప్పుడు పెట్టారన్నది కాదు. సెబీ నిబంధనల ప్రకారం ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ ఉపసంహరణకు కటాఫ్ టైమ్ పనిదినాల్లో మధ్యాహ్నం 3 గంటలు. మధ్యాహ్నం 3 గంటల్లోపు అభ్యర్థన సమర్పించినట్టయితే అదే రోజు నెట్ అసెట్ వ్యాల్యూ (ఎన్ఏవీ) ఆధారంగా ఆ లావాదేవీ ప్రాసెస్ అవుతుంది. ఒకవేళ మధ్యాహ్నం 3 గంటల తర్వాత సమర్పించినట్టయితే తర్వాతి పనిదినం రోజు ఎన్ఏవీ ఆధారంగా ప్రాసెస్ చేస్తారు. మీరు 2025 మార్చి 31న సెల్ ఆర్డర్ పెట్టారు. ఆ రోజు మార్కెట్లకు సెలవు. కనుక మీ అభ్యర్థనను ఏప్రిల్ 1న ప్రాసెస్ చేయనున్నారు. కనుక పెట్టుబడుల విక్రయంపై వచ్చిన లాభాన్ని 2025–26 ఆర్థిక సంవత్సరం మూలధన లాభాలు కింద పరిగణనలోకి తీసుకుంటారు.

మ్యూచువల్ ఫండ్స్ యూనిట్లు వారసత్వంగా వచ్చినప్పుడు వాటిపై పన్ను ఎలా అమలవుతుంది? మూలధన లాభాల లెక్కింపునకు వాటి అసలు కొనుగోలు తేదీని పరిగణనలోకి తీసుకుంటారా లేక వారసులకు బదిలీ అయిన తేదీని పరిగణనలోకి తీసుకుంటారా? – జి.తిరుమలరావు

అసలు పెట్టుబడిదారు మరణించిన సందర్భాల్లో మ్యూచువల్ ఫండ్స్ యూనిట్లు వారసులకు బదిలీ అయితే.. అప్పుడు ఎలాంటి పన్ను చెల్లించాల్సిన అవసరం లేదు. ఎందుకంటే ఆ పెట్టుబడులు మరొకరి పేరిట బదిలీ అయ్యాయే కానీ, విక్రయించలేదు. ఇక మూలధన లాభాలపై పన్ను లెక్కింపునకు మొదట పెట్టుబడి పెట్టిన తేదీని పరిగణనలోకి తీసుకుంటారు. బదిలీ అయిన రోజును కాదు.

ఈక్విటీ ఫండ్స్: ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.1.25 లక్షల దీర్ఘకాల మూలధన లాభంపై (ఏడాదికి మించిన పెట్టుబడులు) పన్ను లేదు. అంతకుమించిన మొత్తంపై 12.5 శాతం చెల్లించాలి.



అదే స్వల్పకాల మూలధన లాభాలపై (ఏడాదిలోపు విక్రయించినవి) 20 శాతం పన్ను చెల్లించాల్సి ఉంటుంది.

డెట్ ఫండ్స్: 2023 ఏప్రిల్ 1 తర్వాత పెట్టుబడి పెట్టి.. విక్రయించగా వచ్చిన లాభం ఇన్వెస్టర్ లేదా వారి వారసుల వార్షిక ఆదాయానికి కలుస్తుంది. వారికి వర్తించే శ్లాబు రేటు ప్రకారం పన్ను చెల్లించాలి. ఒకవేళ అసలు పెట్టుబడిని 2023 ఏప్రిల్ 1లోపు చేసి.. వాటిని రెండేళ్లలోపు విక్రయిస్తే లాభం మొత్తం ఇన్వెస్టర్ వార్షిక ఆదాయానికి కలుస్తుంది. ఆ ప్రకారం పన్ను చెల్లించాలి. రెండేళ్ల తర్వాత విక్రయిస్తే వచ్చిన లాభంపై నికరంగా 12.5 శాతం పన్ను చెల్లించాలి. ఉదాహరణకు 2019 జనవరి 1న ఈక్విటీ ఫండ్స్‌లో రూ.5 లక్షలు పెట్టుబడి పెట్టారని అనుకుందాం. 2024 జనవరిలో ఇన్వెస్టర్ కాలం చేశారు. ఈ పెట్టుబడులను వారి వారసులు 2025 మార్చిలో రూ.12 లక్షలకు విక్రయించారు. ఏడాదికి మించిన పెట్టుబడి కనుక దీర్ఘకాల మూలధన లాభం కిందకు వస్తుంది. అసలు పెట్టుబడి రూ.5 లక్షలు మినహాయించగా నికర లాభం రూ.7 లక్షలు అవుతుంది. ఇందులో రూ.1.25 లక్షలపై పన్ను లేదు. రూ.5.75 లక్షలపై 12.5 శాతం ప్రకారం రూ.71,875 పన్ను చెల్లించాల్సి ఉంటుంది.



2,586 మంది పట్టివేత

ఆకతాయిల పనిపడుతున్న షీ టీమ్స్

15,249	703
హాట్ స్పాట్లు గుర్తించి ప్రత్యేక నిఘా	మంది మైనర్లకు కౌన్సెలింగ్

సాక్షి, హైదరాబాద్: వెకిలిచేష్టలతో అమ్మాయిలను వేధించే ఆకతాయిల భరతం పడుతున్నాయి షీ టీమ్స్. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 331 షీ టీమ్స్ బృందాలు పనిచేస్తున్నాయి. ఈ ఏడాది జనవరి నుంచి మార్చి 31 వరకు రాష్ట్రవ్యాప్తంగా మొదటి త్రైమాసికంలో మొత్తం 2,586 మంది ఆకతాయిలను షీ టీమ్స్ బృందాలు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్టు మహిళా భద్రతా విభాగం అధికారులు 'ఎక్స్'లో తెలిపారు. అదేవిధంగా 703 మంది మైనర్లకు కౌన్సెలింగ్ చేసినట్టు పేర్కొన్నారు. మహిళలు, యువతులను వేధిస్తున్న పోకిరీలు ఎక్కువగా ఉంటున్న హాట్ స్పాట్స్‌పై ప్రత్యేకంగా నిఘా పెడుతున్నట్టు అధికారులు వెల్లడించారు. గత మూడు నెలల్లో ఇలాంటి 15,249 హాట్‌స్పాట్లను గుర్తించి షీ టీమ్స్ బృందాలతో నిఘా పెట్టినట్టు వివరించారు. అదేవిధంగా షీ టీమ్స్‌పై ప్రజల్లో అవగాహన పెంచేలా మొత్తం 3,080 అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్టు తెలిపారు. ఆకతాయిల వేధింపులపై మహిళలు ధైర్యంగా ఫిర్యాదు చేయాలని షీ టీమ్స్ అధికారులు సూచించారు. బాధితులు వాట్సాప్ నంబర్ 8712656856లో ఫిర్యాదు చేయవచ్చని లేదా డయల్ 100కు కూడా సమాచారం ఇవ్వవచ్చని తెలిపారు. బాధితుల వివరాలను గోప్యంగా ఉంచుతామని, ఆకతాయిలపై తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

16న జపాన్‌కు సీఎం రేవంత్

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఈ నెల 16న జపాన్ పర్యటనకు బయ ల్దేరి వెళ్లనున్నారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబుతో పాటు రాష్ట్ర అధికారుల ప్రతినిధి బృందం సీఎం వెంట ఉంటారు. ఏప్రిల్ 16 నుండి 22 వరకు పర్యటన కొనసాగనుంది. టోక్యో, మౌంట్ ఫుజి, ఓసాకా, హిరోషిమాలో ముఖ్యమంత్రి బృందం పర్యటించనుంది. ఓసాకా వరల్డ్ ఎక్స్‌పో-2025లో తెలంగాణ పెవిలియన్‌ను సీఎం ప్రారంభించనున్నారు. ఆ దేశానికి చెందిన ప్రముఖ సంస్థలు, పారిశ్రామికవేత్తలు, పలువురు ప్రతినిధులతో ముఖ్యమంత్రి బృందం సమావేశం కానుంది. రాష్ట్రంలో పెట్టుబడులు, పారిశ్రామిక, సాంకేతిక సహకారంపై ప్రధానంగా చర్చలు జరపనుంది.

మీ గురించి ఎవరికి బాగా తెలుసు అని ఎవరైనా అడిగితే ఏం చెబుతారు? అమ్మకో, నాన్నకో, జీవిత భాగస్వామికో, ఆప్త మిత్రుడికో అని చెబితే.. అది కచ్చితంగా అబద్ధమే. ఎందుకంటే.. ఇప్పుడు మీ గురించి అందరికన్నా మీరు వాడే ఫోన్‌కు లేదంటే ల్యాప్‌టాప్‌కే బాగా తెలుసు. మీరు కాదన్నా అదే నిజం. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ద్వారా మీకు ఇష్టమైన రంగు.. ఇష్టమైన చిరుతిళ్లు.. ఇష్టమైన బట్టలు.. ఇలా అన్నింటిని గురించి ముందే తెలుసుకుంటున్నాయి సోషల్‌మీడియా సంస్థలు. ఇది గతంలోనూ ఉన్నప్పటికీ ఏఐ వచ్చాక వాణిజ్య ప్రకటనల స్వరూపమే మారిపోతోంది. ఈ రంగంలో ఫేస్‌బుక్ మాతృ సంస్థ మెటా తీసుకొచ్చిన 'ఆంద్రోమెడా'ఇప్పుడు సరికొత్త సంచలనం.

- సాక్షి స్పెషల్ డెస్క్



మనసు మాట మెటాకు తెలుసు!

ఫేస్‌బుక్, ఇన్‌స్టాలో 'ప్రకటన'ల విప్లవం తెస్తున్న మెటా

- ఆంద్రోమెడా అనే ఏఐ టెక్నాలజీతో మీ మనసు చదివే ప్రయత్నం
- మీ అభిరుచిని ముందే ఎరిగి యాడ్స్ ప్రమోట్
- దీని వల్ల పర్సనల్ యాడ్స్‌తో 14% లాభాల పెరుగుదల
- రిటైల్ స్టోర్స్‌లోనూ 12% పెరిగిన అమ్మకాలు

ఫేస్‌బుక్ ఓపెన్ చేస్తే మీకు కావాల్సిన ప్రొడక్టులే ముందుగా కనిపిస్తున్నాయా? ఇన్‌స్టాగామ్‌లో స్క్రోల్ చేస్తుంటే.. మీకు నచ్చే డ్రెస్ యాడ్ టెంప్ట్ చేస్తుందా? ఇదేమీ యాదృచ్ఛికం కాదు. మీకు ఎలాంటి ప్రకటనలు చూపించాలో ముందే మెటా సంస్థ నిర్ణయిస్తోంది. మన 'సోషల్'లైఫ్‌లో యాడ్స్ తీరును పూర్తిగా మార్చేస్తోంది. మనల్ని ఏఐ పూర్తిగా చదివేస్తోంది. దీంతో మనకు నచ్చే ఉత్పత్తులే మన ముందు ప్రత్యక్షమవుతున్నాయి. మెటా అభివృద్ధి చేసిన ఆంద్రోమెడా అనే కొత్త ఏఐ టెక్నాలజీనే ఇందుకు కారణం. ఈ సిస్టమ్ రోజుకు కోట్ల యాడ్స్‌ను విశ్లేషిస్తుంది. యూజర్‌కు ఏ ప్రకటన చూపించాలో నిర్ణయిస్తుంది. నిజానికి ఇది కొత్తదేమీ కాదు. గతంలోనూ మనం ఫోన్ ద్వారా నెట్‌లో ఏదైనా వెదికితే.. దానికి సంబంధించిన అంశాలు మన సోషల్‌మీడియా ప్లాట్‌ఫామ్‌పై వరుసగా వచ్చేవి. ఇప్పుడు ఆ విధానం మరింత కొత్తరూపు సంతరించుకుంది.

అంతా మార్చేసిన ఏఐ

కంపెనీలు తమ ఉత్పత్తుల్ని ఇన్‌ఫ్లుయెన్సర్లతో ప్రమోట్ చేయడం చూస్తున్నాం. వీడియో మొత్తం చూశాక.. వీడియోల డిస్క్రిప్షన్‌లోని లింకులను ఓపెన్‌చేసి నచ్చితే ఆర్డర్ పెట్టేస్తున్నాం. ఇకపై అంత కష్టపడక్కర్లేదు. యూట్యూబర్, ఇన్‌స్టాగ్రామ్ స్టార్ ఓ ప్రొడక్ట్ గురించి చెప్తే.. వెంటనే దానికి సంబంధించిన యాడ్ మీకు కనిపిస్తుంది. పాపులర్ క్రియేటర్లతో కలసి బ్రాండ్లు తమ ఉత్పత్తులను కొత్తగా ప్రాచుర్యంలోకి తెచ్చేందుకు ఇదో చక్కని అవకాశమని కంపెనీలు చెబుతున్నాయి. ఇన్‌ఫ్లుయెన్సర్ వీడియోను చూస్తూనే.. కింద కనిపించే సంబంధిత పాపప్స్‌ను సెలక్ట్ చేసుకుని ఆర్డర్ పెట్టేయొచ్చన్నమాట. ఒకే ప్రకటనలో యూజర్‌కు నచ్చే మరొక ఉత్పత్తిని కూడా చూపించే అవకాశం ఇవ్వనుంది మెటా. అంటే.. ఒక కంపెనీ సమ్మర్ స్పెషల్ కలెక్షన్స్‌ను చూపిస్తూనే.. వచ్చే వర్షాకాలం సీజన్‌కు సరిపడే జాకెట్లను కూడా ప్రమోట్ చేస్తుంది. ఇలా యాడ్స్ ప్రదర్శించినప్పుడు విక్రయాల్లో 14 శాతం పెరుగుదల కనిపించిందని మెటా చెబుతోంది.

ఇన్‌ఫ్లుయెన్సర్లతో కలిసి యాడ్స్

మీరే మోడల్

ఆన్‌లైన్‌లో డ్రెస్సులు కొనడం మామూలే. కానీ, మీరే మోడల్‌గా మారి ఆయా డ్రస్సులను ధరించి చూసుకుని కొనుగోలు చేయటం ఇప్పుడు కొత్త ట్రెండ్. ఏఐ ఆధారంగా వర్చువల్ మోడల్స్‌ను చూపించే ఫీచర్‌ను మెటా పరీక్షిస్తోంది. యూజర్ శరీరాకృతికి తగిన డ్రెస్సులను ఎలా ధరించాలో చూపించే ప్రయత్నమిది. ఈ విధానం ఇప్పటికే ఆస్ట్రేలియా, తైవాన్‌లో ప్రయోగాత్మకంగా పరిశీలనలో ఉంది. అంతా బాగానే ఉందిగానీ.. నాకు ఆఫ్‌లైన్‌లో షాపింగ్ చేయడం ఇష్టం అంటారా? అలాంటి వారి కోసం చుట్టు పక్కల మాల్స్‌లోని షాపింగ్ అనుభవాన్ని దగ్గర చేసే ప్రయత్నం చేస్తోంది మెటా. అందుకు తగిన యాడ్స్‌ను వినియోగదారులకు పరిచయం చేస్తోంది. అవే 'ఓమ్ని చానల్'యాడ్స్. మీరు ఆన్‌లైన్‌లో చూసిన వస్తువు.. మీ సమీపంలోని షాపుల్లో ఉందా? ఎంత ధర? ఎక్కడ కొనాలి? ఇలా అన్నీ చూపించే విధంగా ప్రాంతీయ యాడ్స్ వస్తున్నాయి. దుకాణాల లొకేషన్, డిస్కౌంట్ కోడ్స్ వంటి వివరాలను ఆ యాడ్స్‌లో కనిపిస్తాయి. ఈ యాడ్స్ వాడిన బ్రాండ్లకు 12 శాతం విక్రయాలు పెరిగినట్లు మెటా తెలిపింది.

నోటిఫికేషన్‌లోనూ యాడ్స్



ఇదో సరికొత్త ప్రయోగం. ఫేస్‌బుక్, ఇన్‌స్టాను ఓపెన్ చేయగానే నోటిఫికేషన్స్ కనిపిస్తాయి. వాటిలో ఇప్పటివరకు ఏ ఫ్రెండ్ రిక్వెస్ట్ లేదంటే కామెంట్స్, లైక్‌లు కనిపిస్తున్నాయి. ఇకపై ఆ నోటిఫికేషన్స్‌లో యాడ్స్ కూడా ఉండొచ్చు. ఆ యాడ్స్ గతంలో మీరు వెతికిన ఉత్పత్తులవే అయి ఉంటాయి. మీరు మళ్లీమళ్లీ వెతికే పని లేకుండా మీ నోటిఫికేషన్‌కు తీసుకొచ్చేస్తోంది మెటా. కొన్ని డిస్కౌంట్ యాడ్స్‌ను కొత్తగా మార్చేస్తోంది. 'డిస్కౌంట్ పొందాలంటే మీ ఈమెయిల్ ఇవ్వండి'అని నేరుగా అడుగుతుంది. మీరు మెయిల్ అడ్రస్ ఇచ్చి డిస్కౌంట్ ఆఫర్ పొందొచ్చు. దీంతో బ్రాండ్లు తమ కస్టమర్ల లిస్టును పెంచుకోగలుగుతాయి. ఈ మార్పుల ద్వారా మెటా వాణిజ్య ప్రకటనలకు సరికొత్త నిర్వచనం ఇస్తోంది. యాడ్స్‌ను చూడడం టైమ్‌పాస్ కాదు.. టైమ్‌ను సేవ్ చేయడం అని చెబుతోంది.



ఎండలు మండుతాయి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రానున్న రెండ్రోజులు సాధారణం కంటే అధికంగా ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. ఒకటి నుంచి మూడు డిగ్రీల మేర అధికంగా గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదు కావొచ్చని పేర్కొంది. కోస్తాంధ్ర తీరం, యానాం పరిసరాలలో ఉపరితల ఆవర్తనం ఏర్పడిందని, ఇది సముద్రమట్టం నుంచి సగటున 0.9 కిలోమీటర్ల ఎత్తులో కొనసాగుతోందని వాతావరణ శాఖ తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో రానున్న రెండ్రోజులు అక్కడక్కడా తేలికపాటి వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు వివరించారు. రాష్ట్రానికి తూర్పు ప్రాంతంలోని జిల్లాల్లో వడగాలులు వీచేఅవకాశం ఉందని తెలిపారు.

రెండ్రోజులు సాధారణం కంటే అధికంగా ఉష్ణోగ్రతలు

ఆదివారం రాష్ట్రంలోని ప్రధాన కేంద్రాల్లో నమోదైన ఉష్ణోగ్రతలు.. (సెల్సియస్‌లలో)

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం	కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	41.3	22.7	భద్రాచలం	39.4	26.2
నిజామాబాద్	41.1	24.3	నల్లగొండ	38.5	24.0
మెదక్	40.8	23.8	హనుమకొండ	37.5	25.0
మహబూబ్‌నగర్	40.3	26.1	హైదరాబాద్	37.3	23.7
ఖమ్మం	40.0	27.6	హకీంపేట్	37.2	24.0
రామగుండం	40.0	24.4	దుండిగల్	37.2	23.8

వీళ్లు మృత్యుంజయులు!

తెలంగాణ

తాండూరు రూరల్: అర్ధరాత్రి ఆస్పత్రికి తరలిస్తుండగా అంబులెన్స్‌లోనే ఓ మహిళ ప్రసవించింది. అరగంట అయినా శిశువులో కదలిక లేకపోవడంతో కుటుంబ సభ్యులు ఆ శిశువు చనిపోయాడని భావించారు. ఏడాది క్రితం కూడా ఇలాగే జరిగిందని ఆ తల్లి బోరున విలపించింది. కానీ అంబులెన్స్ వైద్య సిబ్బంది సమయస్ఫూర్తితో చనిపోయాడని భావించిన శిశువు బ్రతికాడు. ఈ ఘటన వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండలం బండమీదిపల్లి గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మాల కృష్ణ, నాగమ్మ దంపతులు. నాగమ్మకు శనివారం రాత్రి పురిటి నొప్పులు రావటంతో కుటుంబసభ్యులు 108లో తాండూరులోని మాతాశిశు ఆస్పత్రికి బయలుదేరారు. మార్గమధ్యలో నాగమ్మకు నొప్పులు ఎక్కువ కావటంతో అంబులెన్స్ ఈఎంటీ నర్సింహులు చికిత్స ప్రారంభించాడు. ఫోన్‌లో వైద్యులను సంప్రదించి అంబులెన్స్‌లోనే ప్రసవం చేశాడు. నాగమ్మ మగ బిడ్డకు జన్మనిచ్చింది. అయితే, పుట్టిన అరగంట వరకు శిశువులో కదలిక లేకపోవడంతో అందరూ ఆందోళన చెందారు. కానీ, ఈఎంటీ నర్సింహులు అలా వదిలేయకుండా శిశువుకు సీపీఆర్ చేశాడు. దీంతో బాలుడు ఏడవడం ప్రారంభించడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. నర్సింహులు దేవుడి రూపంలో వచ్చి తన బిడ్డను కాపాడాడని నాగమ్మ సంతోషం వ్యక్తం చేసింది. తల్లి, బిడ్డను తాండూరు ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఇద్దరూ ఆరోగ్యంగా ఉన్నారని వైద్యులు తెలిపారు. నర్సింలు, పైలట్ మహేష్ కుమార్‌ను ఉన్నతాధికారులు అభినందించారు.


శిశువుకు సీపీఆర్ చేస్తున్న దృశ్యం


రుగ్విగాశ్రీ

ఆంధ్రప్రదేశ్

పెందుర్తి: విశాఖలోని జీవీఎంసీ 95వ వార్డు గొల్లవిల్లివానిపాలెంలో ఓ చిన్నారి అక్కతో ఆడుకుంటూ చెరువు ఊబిలో చిక్కుకుపోయింది. పోలీసులు గాలించగా చివరకు చెరువులో చిక్కుక్కున్నట్టు గుర్తించారు. గొల్లవిల్లివానిపాలెంలోని స్థానిక అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్న కేశవరావు, మాధవి దంపతులకు దక్షశ్రీ, రుగ్విగాశ్రీ (2) సంతానం. శనివారం సాయంత్రం 6 గంటల సమయంలో అపార్ట్‌మెంట్ కింద ఇసుకలో ఇద్దరూ ఆడుకుంటున్నారు. అక్కడే ఉన్న తండ్రి కేశవరావు బయటకు వెళ్లి వచ్చి చూసేసరికి రుగ్విగాశ్రీ కనిపించలేదు. దీంతో ఆందోళనకు గురై చుటుపక్కల గాలించారు. ఫలితం లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. వెంటనే సీఐ కె.వి. సతీశ్‌కుమార్, ఎస్ఐ అసిరితాత సిబ్బందితో రంగంలోకి దిగారు. చుట్టుపక్కల, ఇతర ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఫుటేజీలు పరిశీలించారు. ఈక్రమంలోనే కిడ్నాప్ కాలేదని, ఎక్కడో ఉందని నిర్ధారించుకున్నారు. గాలింపుకోసం డ్రోన్‌లను వినియోగించారు. అర్ధరాత్రి ఒంటిగంట దాటాక స్థానిక చెరువులో కదలికలు ఉన్నట్టు గుర్తించి, అక్కడకు వెళ్లి గాలించగా రుగ్విగాశ్రీ బురదలో మోకాళ్ల వరకు కూరుకుపోయినట్టు కనిపించింది. అనంతరం చిన్నారిని బయటకు తీసుకొచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు.



చెరువు ఇంకి.. చేపలు చిక్కి..

ఎండలకు అడుగంటిపోయిన చెరువుపై ఊరంతా పడ్డారు. చిన్నాపెద్దా తేడా లేకుండా చేపలు పట్టారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని పడిదం చెరువులో నీరు ఇంకిపోయింది. మత్స్యకారులు, గ్రామస్తులంతా ఆదివారం వలలు, బుట్టలతో చెరువులోకి దిగి చేపలు పట్టుకోవడంతో సందడి నెలకొంది.

- కాళేశ్వరం

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

సాక్షి ప్లస్
సోమవారం। 14-4-2025


ఆలయ ముఖ మండపంలో శ్రీస్వామి దర్శనానికి బారులు తీరిన భక్తులు


ఉత్తర మాడ వీధిలో భక్తుల సందడి

యాదగిరిగుట్టకు భక్తుల తాకిడి


యాదగిరిగుట్ట: వరుస సెలవులతో యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయం కిటకిటలాడింది. వివిధ ప్రాంతాల భక్తులు ఆదివారం అధికంగా శ్రీస్వామిని దర్శించుకునేందుకు క్షేత్రానికి వచ్చారు. శ్రీస్వామి వారి ధర్మ దర్శనానికి మూడున్నర గంటలకు పైగా సమయం పట్టగా, వీఐపీ దర్శనానికి గంట సమయం పట్టిందని భక్తులు తెలిపారు. శ్రీస్వామి వారికి ఆదివారం నిత్యాదాయం రూ.54,91,048 వచ్చినట్లు ఈవో భాస్కర్‌రావు వెల్లడించారు. సోమవారం అంబేడ్కర్ జయంతి సందర్భంగా సెలవు ఉండటంతో.. క్షేత్రానికి భక్తుల రద్దీ పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

ఎలక్ట్రానిక్ వ్యర్థాల నిర్వహణకు ఓ లెక్కుంది

ఎలక్ట్రానిక్ వ్యర్థాల నిర్వహణ అనేది సవాళ్లతో కూడుకున్నదిగా మారుతోంది. ఈ-వ్యర్థాల పట్ల అవగాహన, చైతన్యం తగినంతగా లేకపోవడం ..దీనికి సంబంధించిన మౌలిక సదుపాయాలు తగినంతగా అందుబాటులోకి రాకపోవడం, వీటి విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేసే నియమ నిబంధనలు సరిగ్గా అమలు కాకపోవడం పెనుసమస్యగా అవతరించింది. ఇవన్నీ కలగలిసి ఈ-వ్యర్థాలను సరైన పద్ధతుల్లో తొలగించకపోవడం వంటి కారణాలతో పర్యావరణానికి నష్టం చేస్తున్నాయి. 2021-22లోనే తెలంగాణలో 50,335.6 టన్నుల ఈ-వ్యర్థాలు ఉత్పత్తి కాగా, వాటిలో 42,297 టన్నులు మాత్రమే సరైన పద్ధతుల్లో తొలగించారని పర్యావరణ పరిరక్షణ, శిక్షణ, పరిశోధన సంస్థ (ఈపీటీఆర్ఐ) గతంలోనే వెల్లడించింది. అయితే వివిధ రకాల ఎలక్ట్రానిక్ వస్తువులు, పరికరాల వినియోగదారులతోపాటు సాధారణ ప్రజల్లోనూ బాధ్యతాయుతంగా 'ఎలక్ట్రానిక్ వేస్ట్ డిస్పోజల్' విషయంలో సరైన అవగాహన, చైతన్యం లేదని పలు సందర్భాల్లో వెల్లడైంది. ఇళ్లలోనూ నిరుపయోగంగా మారుతున్న వివిధ ఎలక్ట్రానిక్ వస్తువుల సంఖ్య కూడా రోజురోజుకూ పెరుగుతోంది. చార్జర్లు, వైర్లతో కూడిన ఇయర్‌ఫోన్లు, స్పీకర్లు, ఎలక్ట్రిక్ కెటిళ్లు, కుక్కర్లు, ఇతర పరికరాలు, వస్తువులు పోగుపడుతున్నాయి. ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్లు, ఎల్ఈడీ టీవీలు, ఇతర వస్తువులు పాడైతే స్థానికంగా అమ్మేయడమో లేక పాతపేపర్లు, పాతసామాన్లు అమ్మే షాపుల వారికి ఇచ్చేయడమో అధికంగా జరుగుతున్నాయి. అయితే ఈ వస్తువులను చివరకు సురక్షితంగా ఏ విధమైన పద్ధతుల్లో డిస్పోజ్ చేస్తున్నారనే విషయంలో మాత్రం స్పష్టత ఉండడం లేదు.

- సాక్షి,హైదరాబాద్

- ఈ-వేస్ట్ ఇన్వెంటరీపై సమగ్ర అధ్యయనం నిర్వహించనున్న తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి
- ఈ-వేస్ట్ మేనేజ్‌మెంట్‌లో ఉపాధి అవకాశాల పెంపుదలతోపాటు వ్యర్థాల నిర్వహణపై కచ్చితమైన అంచనాకు వచ్చే అవకాశం
- ఈ-వేస్ట్ జనరేషన్‌పై ట్రాకింగ్‌తోపాటు అక్రమ డంపింగ్ నివారణ, రీసైక్లింగ్ ప్రోత్సాహక చర్యలపై దృష్టి



స్టేక్ హోల్డర్స్ గ్రూపులు ఇలా...

ప్రొడ్యూసర్స్, సెల్లర్స్: దిగుమతిదారులు, తయారీదారులు, సరఫరాదారులు, వ్యాపారులు, రిటైల్, డీలర్లు

వినియోగదారులు: కుటుంబాలు, వ్యాపార సంస్థలు, ఐటీ కంపెనీలు, బీపీవోలు, విద్యాసంస్థలు, రైల్వే, ఎయిర్‌లైన్స్, డిఫెన్స్, రవాణా కార్పొరేషన్లు, ప్రభుత్వ రంగసంస్థలు

కలెక్ట్ చేసేవారు: ఈ-వేస్ట్‌ను సేకరించే స్క్రాప్ డీలర్లు, మాల్స్, ఇతర ప్రైవేట్ సంస్థలు

రీసైక్లర్స్: డిసెంబ్లర్స్, డిస్‌మాంట్లర్స్, మెటీరియల్ రికవరీ యూనిట్‌లు

ఇతర వర్గాలవారు: రోడ్డు పక్క విక్రేతలు, అధికారిక, అనధికారిక వేలం పాటలు పాడేవారు, సెకండ్ హ్యాండ్ ఎలక్ట్రానిక్ వస్తువులు అమ్మేవారు

సమగ్ర అధ్యయనంపై దృష్టి

రాష్ట్రంలో ఈ-వేస్ట్ ఏయే రూపాల్లో ఎంతెంత పరిమాణంలో పోగుపడుతున్నదనే విషయంపై సమగ్ర అధ్యయనం నిర్వహించాలని తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టీపీసీబీ) నిర్ణయించింది. ఇందులో భాగంగా ఈ-వేస్ట్ ఇన్వెంటొరైజేషన్‌ను చేపట్టి ఈ వ్యర్థాలు ఎక్కువగా ఎక్కడ, ఏ స్థాయిలో ఉత్పత్తి అవుతున్నాయి ? వాటి పరిమాణం ఎంత ? ప్రస్తుతం వాటిని ఏయే రూపాల్లో సేకరించి, సురక్షితంగా తొలగించేందుకు తీసుకుంటున్న చర్యలు తదితరాలను పరిశీలించనున్నారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన ఈ-వేస్ట్ మేనేజ్‌మెంట్ నిబంధనలు, 2022లో ఏఏ అంశాలను పొందుపరిచారు, ఆయా విషయాలను ఏ మేరకు వ్యర్థాల నియంత్రణ, నిర్వహణలో అనుసరిస్తున్నారనే దానిపై అధ్యయనం చేయనున్నారు. ఈ-వ్యర్థాలకు సంబంధించి సేకరించే సమాచారం, వివరాల ఆధారంగా...ఎలక్ట్రానిక్ వస్తువుల సేకరణ, మెటీరియల్ రికవరీ, వీటి ద్వారా ఈ-వేస్ట్ మేనేజ్‌మెంట్‌లో ఉపాధి అవకాశాల కల్పనతో ఆర్థికంగా చేదోడువాదోడుగా నిలిచేలా ఎలాంటి చర్యలు తీసుకోవాలనే దానిపై దృష్టి సారించారు. ఎలక్ట్రానిక్ వ్యర్థాలనేది ఎక్కడెక్కడ ఉత్పత్తి అవుతున్నాయో ట్రాక్ చేయడంతోపాటు ఆయా వస్తువులు, పరికరాలకు సంబంధించి కచ్చితమైన సమాచారం తెలుసుకొని అక్రమ డంపింగ్‌ను నిరోధించడంతోపాటు కచ్చితమైన విధానాల రూపకల్పనకు ఇది దోహదపడుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

ఆయా సంస్థల సేవలు వినియోగించుకునే దిశగా టీపీసీబీ

జాతీయస్థాయిలో పేరొందిన కన్సల్టెన్సీ సంస్థలు, విద్యాసంస్థలు, పరిశోధక సంస్థల సేవలను టీపీసీబీ ఉపయోగించుకోనున్నట్టు సమాచారం. మొత్తం 150 రోజుల్లో ఈ అధ్యయనాన్ని పూర్తి చేసి ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్ ఎక్విప్‌మెంట్ (ఈఈఈ) కేటగిరీలో ఎంత స్థాయిలో వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నాయో అంచనా వేస్తారు. ఇందుకోసం ఎంపిక చేసిన సంస్థ, ఉత్పత్తిదారులు, డిస్ట్రిబ్యూటర్లు, రీసైకిల్ చేసేవారు, వేర్వేరు పద్ధతులు, మార్గాల్లో వ్యర్థాలను సేకరించే వారి వివరాలను తీసుకుంటారు. వీరి నుంచి ఈ-వేస్ట్ ఉత్పత్తి అవుతున్న తీరు, పరిమాణం, వాటిని తొలగిస్తున్న తీరు, వీటి నిర్వహణలో ఎదురవుతున్న అంతరాలు, సమస్యలు వంటి వాటికి సంబంధించిన సమాచారాన్ని ఈ సంస్థలు సేకరిస్తాయి. అనంతరం ఆయా సమస్యలు, అంతరాలను అధిగమించేందుకు పలు సూచనలు, సలహాలతో సిఫార్సులు చేస్తారు. ఈ అధ్యయనంలో భాగంగా సవివర ఇన్వెంటరీ ద్వారా 'వేస్ట్ ఫ్రం ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ ఎక్విప్‌మెంట్ (డబ్ల్యూఈఈఈ) బిజినెస్ చెయిన్‌ను ఏర్పాటు చేసేందుకు అవసరమైన సలహాలు ఇవ్వనుంది.

ఎన్‌హెచ్‌ఎంలో పెరిగిన కేంద్రం వాటా

2024-25లో రూ. 1,114.91 కోట్లు విడుదల • వాటా కన్నా అధికంగా రూ.176 కోట్లు కేటాయింపు

దీంతో రాష్ట్రంలో ఆరోగ్య సేవలను మరింత మెరుగు పరిచే అవకాశం

ఎన్‌హెచ్‌ఎం కింద కేంద్రం వాటా, మంజూరు చేసిన నిధులు ఇలా.. (రూ.కోట్లలో..)

సంవత్సరం	కేంద్రం వాటా	ఇచ్చిన మొత్తం
2014-15	507.48	378.66
2015-16	498.00	448.48
2016-17	434.00	398.58
2017-18	465.31	381.53
2018-19	764.03	713.40
2019-20	1026.00	991.39
2020-21	747.88	671.87
2021-22	825.48	725.67
2022-23	856.04	683.83
2023-24	888.13	564.40
2024-25	938.42	1,114.91



సాక్షి, హైదరాబాద్: దేశంలో మెరుగైన వైద్య సేవల కోసం ఉద్దేశించిన నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) కింద రాష్ట్రానికి వచ్చే కేంద్ర నిధులు ఈసారి గణనీయంగా పెరిగాయి. జనాభాకు అనుగుణంగా రాష్ట్రానికి రావలసిన వాటా విషయంలో పదేళ్లుగా సవతి తల్లి ప్రేమ చూపిన కేంద్రం 2024-25 కింద ఇవ్వాల్సిన దానికన్నా అదనంగా రూ. 176 కోట్లు విడుదల చేయడం విశేషం. ఎన్‌హెచ్‌ఎం కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 వాటాతో నిధులను వెచ్చించాల్సి ఉంటుంది. రాష్ట్రంలో ఆరోగ్య మౌలిక సదుపాయాలు మెరుగుపరచడం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లు, జిల్లా ఆసుపత్రుల నిర్మాణం, ఆసుపత్రులను అప్‌గ్రేడ్ చేయడం, మాతా శిశు ఆరోగ్య సేవలు, వ్యాధి నియంత్రణ కార్యక్రమాలు, ఇమ్యునైజేషన్ డ్రైవ్‌ల కోసం ఈ నిధులు వినియోగిస్తారు.

రాష్ట్రం ఇవ్వాల్సింది ఇంకా రూ.56.35 కోట్లు

ఎన్‌హెచ్‌ఎం కింద కేంద్ర నిధుల పంపిణీ రాష్ట్రాల జనాభా, ఆరోగ్య సూచికలు, పనితీరు ఆధారంగా ఉంటుంది. తెలంగాణ జనాభా సుమారు 3.93 కోట్లుగా అంచనా వేస్తే భారత దేశ జనాభా సుమారు 143 కోట్లు. అంటే దేశ జనాభాలో తెలంగాణ వాటా 2.75 శాతం. 2024-25 కేంద్ర నేషనల్ హెల్త్ మిషన్ బడ్జెట్ రూ. 36,000 కోట్లు. ఇందులో 2024-25లో కేంద్రం నుంచి రూ. 938.42 కోట్లు రావలసి ఉండగా, రూ.176.49 అదనంగా కలిపి రూ.1,114.91 కోట్లను విడుదల చేసింది. ఈ మొత్తానికి రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు రూ. 743.27 కోట్లు జమచేయాల్సి ఉంటుంది. అయితే ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం 682.92 కోట్లు విడుదల చేసింది. మరో రూ.56.35 కోట్లు ఇవ్వాల్సి ఉంది. కేంద్రం అదనంగా నిధులు ఇవ్వడంతో రాష్ట్రంలో మరింత మెరుగైన ఆరోగ్య సేవలు అందించే అవకాశం ఉంది.

2014-15 నుంచి కోతలే..

రాష్ట్రానికి ఎన్‌హెచ్‌ఎం కింద కేంద్రం ఇచ్చే వాటాలో 2014-15 నుంచి 2023-24 వరకు కోతలే ఉన్నాయి. ఏటా 10 నుంచి 40 శాతం వరకు బకాయిపెట్టింది. పదేళ్లలో రూ.7012.35 కోట్లు రావాల్సి ఉండగా, రూ.5,961.81 కోట్లు వచ్చాయి. రూ.1,050.54 కోట్లకు కేంద్రం కోతలు పెట్టింది. గత 11 ఏళ్లలో 2024-25 సంవత్సరంలోనే వాటా కంటే అదనంగా రూ.176.49 కోట్లు కేటాయించడం విశేషం.

జడ్జీల నియామకాలు 2021లో ఇలా..

కేడర్	పురుషులు	మహిళలు
జిల్లా జడ్జీలు	15	6
సీనియర్ సివిల్ జడ్జీలు	05	10
జూనియర్ సివిల్ జడ్జీలు	09	30
మొత్తం	29	46

జడ్జీల నియామకాలు 2022లో ఇలా..

కేడర్	పురుషులు	మహిళలు
జిల్లా జడ్జీలు	33	12
సీనియర్ సివిల్ జడ్జీలు	04	08
మొత్తం	37	20

జడ్జీల నియామకాలు 2023లో ఇలా..

కేడర్	పురుషులు	మహిళలు
జిల్లా జడ్జీలు	07	11
సీనియర్ సివిల్ జడ్జీలు	22	11
జూనియర్ సివిల్ జడ్జీలు	03	04
మొత్తం	32	26

జడ్జీల నియామకాలు 2024లో ఇలా..

కేడర్	పురుషులు	మహిళలు
జిల్లా జడ్జీలు	06	09
సీనియర్ సివిల్ జడ్జీలు	14	27
మొత్తం	20	36

(జూనియర్ సివిల్ జడ్జీల పోస్టుల నియామక ప్రక్రియ కొనసాగుతోంది)

తెలంగాణ నుంచి ఇస్రోకు ఫినోలిక్ ఫోం ప్యాడ్స్

యాదాద్రి భువనగిరి జిల్లా జమీలాపేట్‌లో తయారీ

- క్రయోజనిక్‌లో వేడి నియంత్రించే ఫోం ప్యాడ్స్
- మైనింగ్, రక్షణ, రైల్వేలకు సంస్థ ఉత్పత్తుల ఎగుమతి


ఎకో థెర్మ్ ఫినోలిక్ ఫోం ప్యాడ్‌లు

సాక్షి, యాదాద్రి: యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం జమీలాపేట్ నుంచి ఎకో థెర్మ్ ఫినోలిక్ ఫోం ప్యాడ్‌లు ఇస్రోకు ఎగుమతి అయ్యాయి. జీఎస్ఎల్‌వీ రాకెట్ ప్రయోగం సమయంలో క్రయోజెనిక్ సిస్టమ్స్‌లో ఉష్ణోగ్రతను నియంత్రించేందుకు ఈ ప్యాడ్‌లు వాడుతున్నారు. ఇస్రో ఈనెలలో ప్రయోగించే జీఎస్ఎల్‌వీ రాకెట్‌లో అమర్చే అగ్ని నిరోధక పదార్థం దేశంలో ఇక్కడే తయారవుతుంది. ఈ ఫోం ప్యాడ్‌లు బీబీనగర్ మండలం జమీలాపేట్‌లో వీఎన్‌డీ సెల్ ప్లాస్ట్ అనే కంపెనీ తయారు చేసి ఎగుమతి చేస్తోంది. సంస్థ తయారు చేసిన 365 ఫోం ప్యాడ్‌లను.. త్రివేండ్రంలోని విక్రమ్‌సారాభాయి స్పేస్ సెంటర్‌కు సంస్థ యాజమాన్యం ఎగుమతి చేసింది. విక్రమ్ సారాభాయి స్పేస్ సెంటర్‌లో వీటిని పరిశీలించి నెల్లూరులో ఇస్రో సెంటర్‌కు అందజేస్తారు.

ఉష్ణాన్ని నియంత్రించే ఫోం ప్యాడ్స్

ఫినోలిక్ ఫోం ప్యాడ్‌లు జీఎస్ఎల్‌వీ రాకెట్‌ను భూమి నుంచి నింగిలోకి ప్రయోగించే సమయంలో వాడతారు. ఉష్ణోగ్రత మారితే సాంకేతిక సమస్యలు వచ్చే అవకాశం ఉన్నందున ఈ ఫినోలిక్ ఫోం ప్యాడ్‌లు లేకుండా.. జీఎస్ఎల్‌వీ రాకెట్‌ను ప్రయోగించలేరు. రాకెట్‌లో వేడిని నియంత్రించడానికి థీమ్ ప్యాడ్స్ అమరుస్తారు. బయటినుంచి వచ్చే వేడిని లోపలికి రాకుండా అడ్డుకుంటుంది. లోపలినుంచి బయటికి వెళ్లి చల్లదనాన్ని అడ్డుకుంటుంది. ఉష్ణోగ్రతలు మారకుండా ఫోం ప్యాడ్‌లు అడ్డుకుంటాయి.

ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలకు సరఫరా..

దేశంలో ప్రస్తుతం ఫినోలిక్ మిశ్రమాలను ఒక్క బీబీనగర్‌లోనే తయారు చేస్తున్నారు. మైనింగ్, రక్షణ సంస్థలకు సరఫరా చేస్తున్నారు. ఇస్రోతో పాటు రైల్వేలు, డీఆర్‌డీవో, డీఆర్ఎల్, ఎయిర్‌ఫోర్స్, ఎద్దుమైలారం ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలకు వీటిని సరఫరా చేస్తున్నారు. ఎద్దుమైలారం సాయుధ ట్యాంకులలో ఆయిల్ ఉష్ణోగ్రత సమతుల్యత కోసం ఇన్సులేషన్‌కు ఫినోలిక్ ఫోం ప్యాడ్‌లను వినియోగిస్తున్నారు.

ఇస్రో నుంచి ఆర్డర్‌తో..



ఇస్రో నుంచి ఆర్డర్‌తో మాకు ఎంతో మేలు చేకూరుతుంది. జీఎస్ఎల్‌వీ రాకెట్‌కు తొలిసారిగా సరఫరా చేస్తున్నాం. పది సంవత్సరాలుగా పలు ప్రాజెక్టులకు సరఫరా చేస్తున్నాం. 2008లో ఎస్.సుఖజీవన్‌రెడ్డితో కలిసి కంపెనీని ప్రారంభించాం. మేకిన్ ఇండియా ప్రాజెక్టులో భాగంగా మా కంపెనీ ఉత్పత్తులపై సెర్చింగ్ పెరిగింది. థర్మల్ ఇన్సులిన్‌కు సంబంధించిన పదార్థాలను తయారు చేస్తున్నాం. ఇస్రో డైరెక్టర్ ఉన్నికృష్ణన్ అయ్యర్ మా ఉత్పత్తుల రవాణాను వర్చువల్‌గా ప్రారంభించారు. రూ.20 లక్షల విలువైన మెటీరియల్ పంపించాం. ఒక జీఎస్ఎల్‌వీ రాకెట్‌కు 365 ఫినోలిక్ ఫోం ప్యాడ్స్ వాడతారు. ఇప్పటికే ఒక రాకెట్‌కు సరిపడా ఫోమ్స్ పంపించాం.

– డి.చంద్రశేఖర్‌రెడ్డి, డైరెక్టర్, వీఎన్‌డీ సెల్‌ప్లాస్ట్ సంస్థ


వర్చువల్‌గా ఉత్పత్తుల రవాణాను ప్రారంభిస్తున్న ఇస్రో డైరెక్టర్ ఉన్ని కృష్ణన్ అయ్యర్

'జ్వలియన్' వాలాబాగ్

జలియన్‌వాలా బాగ్ పేరు చెబితే.. రౌలట్ చట్టం.. నిరసన తెలుపుతూ ప్రజా సమూహం సమావేశం.. బ్రిటిష్ సైన్యాధికారి హ్యారీ డయ్యర్ కాల్పులు.. వందల మంది దుర్మణం .. చరిత్రలో కనిపించేది ఇదే. ఏళ్ల తరబడి చదువుకున్నదీ ఇదే! కానీ, చరిత్ర వెనుక చెరగని గుర్తులు అమృత్‌సర్‌లోని ఆ తోటను ఆనుకుని ఉన్న గోడలపై నాటి ఘటనను గుర్తు చేస్తూనే ఉన్నాయి. స్వేచ్ఛా, స్వాతంత్ర్యాల కోసం పంజాబ్ ప్రజలు 106 ఏళ్ల క్రితం చేసిన ప్రాణ త్యాగాలను నేటి తరానికి వివరిస్తున్నాయి. ఇటుక గోడల్లో దిగిన తూటాల గుర్తులు, 120 మంది ప్రాణాలు బలితీసుకున్న బావి.. సందర్శకుల హృదయాలను బరువెక్కిస్తుంటాయి.

- సాక్షి అమరావతి

బ్రిటిష్ ప్రభుత్వ దురాగతానికి 106 ఏళ్లు..

భారతీయుల్లో జాతీయ భావాన్ని రగల్చిన ఘటన

ఇక్కడి గోడలపై కనిపించే గాయాలు చరిత్రకు ఆనవాళ్లు

ఆంగ్ల సైన్యాధికారి రాక్షస క్రీడకు చిహ్నంగా చరిత్రలో నిక్షిప్తం

13 ఏప్రిల్ 1919 బైసాఖీ ఓ రక్తచరిత్ర

ఘటనకు ముందు చరిత్ర ఇదీ..

మొదటి ప్రపంచ యుద్ధంలో సైనికులుగా పని చేసేవారికి అనేక అవకాశాలు కల్పిస్తామని, వారికి ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తామని బ్రిటిష్ ప్రభుత్వం ఆశ చూపడంతో పంజాబ్ నుంచి 3.55 లక్షల మంది బ్రిటిష్ ఇండియా సైన్యంలో చేరారు. యుద్ధం ముగిశాక ప్రభుత్వం సైనికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోగా వారిని సైన్యం నుంచి వెనక్కి పంపేసింది. దీంతో వారంతా పంజాబ్ చేరుకున్నాక నిరుద్యోగం వెంటాడింది. మరోవైపు కొన్నేళ్లుగా పంజాబ్ ప్రాంతం కరువుతో కొట్టుమిట్టాడుతోంది. మొదటి ప్రపంచయుద్ధంలో భాగంగా 1915లో బ్రిటిష్ ఇండియా ప్రభుత్వం రక్షణ చట్టం తీసుకొచ్చింది. దీని ప్రకారం ప్రజలపై నిరవధిక నిర్బంధం, విచారణ లేకుండా జైలుకు పంపడం వంటి కఠిన చర్యలను అనుసరించింది. యుద్ధం ముగిసినా ఈ చట్టాన్ని రద్దు చేయకుండా ఉద్యమకారులపై ప్రయోగించేందుకు అనువుగా మార్చుకుంది. ఇందుకోసం సర్ సిడ్నీ రౌలట్ అధ్యక్షతన 1917లో కమిటీ నియమించింది. దాని సిఫార్సుల ఆధారంగా 1919 మార్చి 18న రౌలట్ చట్టాన్ని ఆమోదించింది. రౌలట్ చట్టం ప్రకారం ఏప్రిల్ 10న పంజాబ్‌కు చెందిన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు డాక్టర్ సైపుద్దీన్ కిచ్లూ, డాక్టర్ సత్యపాల్‌ను అరెస్టు చేశారు. ఈ ఘటన ఉత్తర భారతదేశాన్ని కుదిపేసింది. ఇదే తేదీన ఇంగ్లండ్ చర్చి మిషనరీకి చెందిన మిస్ మార్సెల్లా షేర్‌వుడ్‌పై అమృత్‌సర్‌లో దాడి జరిగింది. అనంతరం బ్రిటిష్ డిప్యూటీ కమిషనర్ నివాసంపై దాడి చేసేందుకు నిరసనకారులు యత్నిస్తున్నారని చెప్పి అమృత్‌సర్‌లోని రైల్వే ఓవర్ బ్రిడ్జిపై 25 మంది నిరాయుధులైన భారతీయులను సైన్యం కాల్చి చంపేసింది. దీంతో అవిభక్త పంజాబ్ మొత్తం ప్రజలు రగిలిపోయారు.

1919 ఏప్రిల్ 13న ఏం జరిగింది?

బైశాఖీ వేడుకలను పంజాబ్‌లో అత్యంత వైభవంగా జరుపుకుంటారు. అమృత్‌సర్‌లో ఏప్రిల్ 13న జరిగే వేడుక చూసేందుకు చుట్టపక్కల పట్టణాలు, గ్రామాల నుంచి వేలాదిగా ప్రజలు తరలి వచ్చారు. మరోవైపు డాక్టర్ సైపుద్దీన్ కిచ్లూ, డాక్టర్ సత్యపాల్ అరెస్టులకు నిరసనగా అమృత్‌సర్‌లోని జలియన్‌వాలాబాగ్‌లో జాతీయవాదులు సాయంత్రం 5 గంటలకు శాంతియుత సమావేశం ఏర్పాటు చేశారు. పంజాబ్‌కు చెందిన ప్రముఖ న్యాయవాది లాలా కన్హియాలాల్ అధ్యక్షతన సాయంత్రం 5 గంటలకు కీలక ప్రసంగం ఉందని చెప్పడంతో చిన్నా, పెద్దా అంతా వేలాదిగా తరలివచ్చారు. అదే క్రమంలో రాత్రి 8 గంటల నుంచి మార్షల్ లా అమలులో ఉంటుందని చెప్పుకున్నారు కానీ దీనిపై బ్రిటిష్ ప్రభుత్వం ప్రచారం చేయలేదు.



పార్కులో బ్రిటిష్ సైన్యం తూటాలకు ప్రాణాలు కోల్పోయిన వారి గుర్తుగా స్మారక చిహ్నం

కాల్పుల్లో 2 వేల మంది దుర్మరణం!

అమృత్‌సర్‌లోని స్వర్ణ దేవాలయానికి అత్యంత సమీపంలో 6.50 ఎకరాల్లో జలియన్‌వాలా బాగ్ ఉంది. మహారాజా రంజిత్‌సింగ్ కోటలో న్యాయవాదిగా పనిచేసి మరణించిన 'హిమ్మత్‌సింగ్ జలియన్‌వాలా' పార్థివదేహాన్ని ఇక్కడ సమాధి చేశారు. ఆయన పేరుతోనే ఈ ప్రాంతానికి జలియన్‌వాలా బాగ్‌గా పేరొచ్చింది. చుట్టూ ఎత్తయిన భవనాల మధ్య ఉత్తరం వైపున 3 నుంచి 4 అడుగుల వెడల్పు మార్గం మాత్రమే ఉంది. బాగ్‌లో తూర్పు వైపున నుయ్యి, ఆపై కొద్దిగా చెట్లు ఉన్నాయి. సమావేశంపై ప్రచారంతో బైశాఖీ వేడుకకు వచ్చిన వారు సైతం ఇందులో పాల్గొనడంతో జనం దాదాపు 20 వేల వరకు హాజరైనట్టు అంచనా. సరిగ్గా సాయంత్రం 5 నుంచి 5.30 గంటల మధ్య రెజినాల్డ్ ఎడ్వర్డ్ హారీ డయ్యర్ మెషిన్ గన్ అమర్చిన వాహనాలతో 50 మంది సైనిక బగంతో అక్కడకు చేరుకున్నాడు. వస్తూనే బాగ్‌లోకి వెళ్లే మార్గాన్ని మూసివేసి కాల్పులకు ఆదేశాలిచ్చాడు. కేవలం 10 నుంచి 12 నిమిషాల వ్యవధిలో ఆ ప్రాంతం తుపాకుల మోతతో నిండిపోయింది. ప్రజలు ఏం జరుగుతుందో తెలుసుకునేలోపు పిట్టల్లా రాలిపోయారు. తప్పించుకునే మార్గం లేదు.. పదుల సంఖ్యలో తూటాలు శరీరాలను చీల్చుకుంటూ భవనాల గోడల్లో దిగబడ్డాయి. ఆందోళనతో ప్రాణాలు కాపాడుకునేందుకు కొందరు ప్రాంగణంలోని బావిలోకి దూకేశారు. ఆ రాత్రంతా జలియన్‌వాలా బాగ్ పరిసరాలు ఆర్తనాదాలతో నిండిపోయాయి. ఈ కాల్పుల్లో దాదాపు 2 వేల మంది మరణించినట్లు స్థానికులు చెబుతారు. డయ్యర్ ముందుగానే కర్ఫ్యూ విధించడంతో గాయపడ్డవారిని తరలించే ఆస్కారం లేకపోయింది.

లెక్కలోకి రాని మరణాలెన్నో..

తమవారి ఆచూకీ కోసం వెదికిన కుటుంబ సభ్యులకు మృతదేహాలను వెదికేందుకు రెండు మూడురోజులు పట్టిందని ఇక్కడి వారు చెబుతుంటారు. బ్రిటిష్ ప్రభుత్వం దుర్ఘటనపై హంటర్ కమిషన్ వేయగా 200 మంది చనిపోయినట్టు నివేదికిచ్చింది. సేవా సమితి సొసైటీ 379 మంది మరణించారని, 192 మంది తీవ్రంగా గాయపడ్డారని నివేదించింది. కానీ స్థానికులు మాత్రం 2 వేల మంది చనిపోయారని చెబుతుంటారు. చనిపోయిన 41 మంది బాలల్లో 7 నెలల వయసు వారు, ఆరువారాల శిశువు కూడా ఉన్నట్లు గుర్తించారు. ఈ మారణకాండ జరిగిన మూడు నెలలకు అంటే జూలైలో ఎవరు చనిపోయారో గుర్తించేందుకు అధికారులు నగర ప్రజలతో సమావేశం ఏర్పాటు చేశారు. అయితే, నాటి ఘనటలో పాల్గొన్న వారిని గుర్తిస్తే చనిపోయినవారి కుటుంబ సభ్యులపై కేసులు నమోదు చేస్తారన్న భయంతో ఎవరూ వాస్తవాలు చెప్పలేదు. దాంతో ఎంత మంది చనిపోయారో అధికారికంగా లెక్కలు లేవు.



బ్రిటిష్ తుపాకి గుళ్లు తగిలిన ఆనవాళ్లతో జలియన్‌వాలాబాగ్ పక్కన ఉన్న భవనం గోడ



120 మంది ప్రాణాలు కోల్పోయిన జలియన్‌వాలాబాగ్‌లోని నుయ్యి (ఇప్పుడు అద్దాలతో రక్షణ ఏర్పాటు చేశారు)

దుర్మార్గానికి నిలువుటద్దం డయ్యర్

సైనికాధికారి రెజినాల్డ్ ఎడ్వర్డ్ హారీ డయ్యర్.. దుర్ఘటన అనంతరం ప్రభుత్వం చేసిన విచారణలో అడిగిన ప్రశ్నలకు తడుముకోకుండా, ఎలాంటి అపరాధ భావం లేకుండా ఇచ్చిన సమాధానాలు అతడిలోని రాక్షసత్వానికి అద్దం పడతాయి.

- ప్రశ్న: "నువ్వు బాగ్ లోకి వెళ్లగానే, ఏం చేశావు?"
- డయ్యర్:- నేను కాల్పులు జరిపాను.
- ప్రశ్న:- "వెంటనే?"
- డయ్యర్:- వెంటనే. నేను ఆ విషయం గురించి ఆలోచించాను, నా విధి ఏంటో నిర్ణయించుకోవడానికి నాకు 30 సెకన్ల కంటే ఎక్కువ సమయం పట్టలేదు.

జనసమూహాన్ని చెదరగొట్టడానికి కాల్పులు జరపలేదు. బదులుగా, పార్కులో నుంచి తప్పించుకోవడానికి ప్రయత్నిస్తున్న వారిపైకి విచక్షణా రహితంగా కాల్చి చంపారు. వీలైనంత ఎక్కువ మందిని చంపాలని సైనికులను డయ్యర్ ఆదేశించాడు. తెచ్చిన మందుగుండు సామగ్రి అయిపోయే వరకు సైనికులు కాల్పులు ఆపలేదు. రెజినాల్డ్ డయ్యర్ కూడా తాను మిషన్ గన్‌లు అమర్చిన కార్లను బాగ్ లోకి తీసుకురాగలిగితే, వాటితో కూడా కాల్పులు జరిపేవాడినని ఒప్పుకున్నాడు. కాగా ఈ మారణకాండలో మరణించినవారి ప్రాణాలకు 5 వేల పౌండ్ల చొప్పున వెలకట్టింది. అయితే చాలామంది ఈ మొత్తాన్ని తీసుకోలేదు. "మా తాతగారు గోబింద్ రామ్ సేఠ్ సమావేశానికి హాజరై ప్రాణాలు కోల్పోయారు. చనిపోయిన వారిలో స్థానికులతో పాటు బైశాఖీ వేడుకకు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు కూడా ఉన్నట్టు మా నాన్న, పూర్వీకులు చెప్పారు. చనిపోయిన వారికి ప్రభుత్వం ఇచ్చిన 5 వేల పౌండ్లకు పంజాబీలు ఆశపడలేదు" అని చెప్పారు జలియన్‌వాలా బాగ్ ప్రభుత్వ గైడ్‌గా ఉన్న దీపక్ సేఠ్. ఇక్కడికి నిత్యం వచ్చే వారికి నాటి ఘటనను వివరిస్తూ చైతన్యులను చేస్తారీయన. తర్వాత పార్కులో ప్రభుత్వం ప్రజల ఆత్మార్పణకు చిహ్నంగా స్మారకాన్ని నిర్మించింది. 120 మంది మరణించిన బావిని అద్దాలతో మూసివేసింది. మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత ప్రపంచ చరిత్రలో అతిపెద్ద దుర్ఘటనగా నమోదైన జలియన్‌వాలా బాగ్‌లో తూటాలు దిగిన గోడలను 106 ఏళ్లుగా అలాగే కాపాడుతున్నారు.



నాడు-నేడు.. జలియన్‌వాలాబాగ్‌లోకి వెళ్లే మార్గం ఇదే..

వడ్డెర కులాన్ని ఎస్టీ జాబితాలో చేర్చాలి

ఏపీ వడ్డెర(వడియ) రాజుల సంక్షేమ సంఘం



సమావేశంలో ఐక్యత చాటుతున్న ఎమ్మెల్సీ ఏసురత్నం, వడ్డెర సంఘం నాయకులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వడ్డెర కులాన్ని ఎస్టీ జాబితాలో చేరుస్తామంటూ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆంధ్రప్రదేశ్ వడ్డెర/వడియ రాజుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముందు సంఘం రాష్ట్ర కార్యాలయాన్ని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వడ్డెర్లకు ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు.

పోలీసుల దర్యాప్తు నమ్మశక్యంగా లేదు

మాజీ ఎంపీ హర్షకుమార్


రాజమహేంద్రవరం సిటీ: పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిలో పోలీసుల దర్యాప్తు నమ్మశక్యంగా లేదని ఇప్పటికీ ప్రవీణ్ మృతి ఆక్సిడెంట్ వల్ల జరగలేదని నమ్ముతున్నానని అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ అన్నారు. ఆదివారం రాజమహేంద్రవరంలో ఆయన నివాసంలో మీడియాతో మాట్లాడుతూ పోలీసులు మొదటి నుంచి యాక్సిడెంట్ కోణంలోనే దర్యాప్తు చేశారన్నారు. ప్రవీణ్ మరణం యాక్సిడెంట్ అయితే ప్రవీణ్ బ్యాంక్ ఖాతాలు ఎందుకు సీజ్ చేశారో, ల్యాప్‌టాప్‌లు, ఐపాడ్‌లు పోలీసులు ఎందుకు పట్టుకెళ్లారో అర్థం కావడం లేదన్నారు.

'సహకారం'లో రెండంచెల విధానాన్ని అమలు చేయాలి

కృష్ణలంక (విజయవాడతూర్పు): సహకార రంగ బ్యాంకుల బలోపేతానికి, గ్రామీణ వ్యవసాయ రంగ ప్రయోజనాల కోసం రెండంచెల విధానం ప్రవేశపెట్టాలని, ఆ దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించాలని పలువురు వక్తలు ఉద్ఘాటించారు. గ్రామీణ వ్యవసాయ మౌలిక సౌకర్యాల కల్పన కోసం రూ.2.5 లక్షల కోట్లు కేటాయించాలని, సహకార సూత్రాలను కచ్చితంగా అమలుచేయాలని డిమాండ్ చేశారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ కో ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ వజ్రోత్సవాలు జరిగాయి. సంఘం జెండాను సభా ప్రాంగణంలో వ్యవస్థాపక నాయకుడు చలసాని మాధవరావు ఆవిష్కరించారు.

శ్రీవారి దర్శనానికి 20 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూలైన్ ఎంబీసీ వద్దకు చేరింది. శనివారం అర్ధరాత్రి వరకు 72,923 మంది స్వామివారిని దర్శించుకోగా 35,571 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.33 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 20 గంటల్లో దర్శనం లభిస్తోంది.



బోయకొండ..జనసందడి

చౌడేపల్లె : బోయకొండ గంగమ్మ ఆలయం భక్తులతో ఆదివారం కిటకిటలాడింది. ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి వేల మంది భక్తులు అమ్మవారి దర్శనం కోసం వివిధ వాహనాల్లో తరలి వచ్చారు. అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మహిళలు ఉపవాస దీక్షలతో ఆలయం వద్దకు చేరుకొని గంగమ్మకు పూజలు చేశారు. ఇంటర్ ఫలితాలు వెలువడడంతో విద్యార్థులు అధిక సంఖ్యలో వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.



కాణిపాకం.. భక్తజనసంద్రం

కాణిపాకం : తిరువణ్ణామలైలో గిరి ప్రదక్షిణకు వెళ్లిన భక్తులు, సెలవులతో తరలివచ్చిన భక్తులతో ఆదివారం కాణిపాక శ్రీవరసిద్ధి వినాయకస్వామి క్షేత్రం భక్తజన సంద్రంగా మారింది. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులతో ఆలయం కిటకిటలాడింది. పోటెత్తిన భక్తజనంతో ఆలయం జన సందడిని సంతరించుకుంది. దర్శన సేవకు 2 గంటల సమయం పట్టింది. వినాయకుని నామస్మరణలతో మార్మోగింది.



52 మంది ఇంటర్ విద్యార్థులకు షైనింగ్ స్టార్ అవార్డులు

రేపు విజయవాడలో ప్రదానం

సాక్షి, అమరావతి: ప్రభుత్వ యాజమాన్య జూనియర్ కాలేజీల్లో చదువుకుని ఇంటర్మీడియట్‌లో అత్యధిక మార్కులు సాధించిన 52 మంది విద్యార్థులను ప్రభుత్వం సత్కరించనుంది. వీరికి మంగళవారం (రేపు) విజయవాడలో ఆంధ్రప్రదేశ్ షైనింగ్ స్టార్ అవార్డులు ప్రదానం చేయనుంది. ఈ మేరకు ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి కృతికా శుక్లా ఆదివారం రాత్రి ఒక ప్రకటన విడుదల చేశారు.

అతడే.. ఆ నలుగురు..

అనాథ మృతదేహాలకు స్వయంగా అంత్యక్రియలు

ఇప్పటి వరకూ 1,153 దేహాలకు అంతిమ సంస్కారాలు

కాకినాడ క్రైం: జీవన గమనంలో మరణం చివరి మజిలీ. తమ వారంటూ లేని జీవితం ఎంత దుర్భరమో.. చరమాంకంలో దిక్కు లేని మరణం పొందడం అంతకు మించిన దయనీయమైనది. తమను పోషిస్తూ, తమ బాగోగులు అడిగే వారంటూ ఎవరూ లేని అనాథలు, ఒంటరివాళ్లమనే వేదనతో బతుకీడ్చి ప్రాణాలొదిలితే.. జీవాన్ని విడిచేసిన దేహాన్ని సొంత కుటుంబీకులే వివిధ కారణాలతో ఆమడ దూరాన వదిలేస్తే.. ఏ బంధమూ లేని ఆ వ్యక్తి మాత్రం తానున్నానంటూ ముందుకొస్తాడు. ఆఖరి మజిలీలో ఆత్మీయుడిగా, కాటికి చేర్చి కన్నబిడ్డకు మించి బాధ్యతను మోస్తాడు. ఆ దేహాన్ని తుది మజిలీకి సిద్ధం చేస్తాడు. పూడ్చడమైనా.. దహనమైనా తన చేతులతోనే చేస్తాడు. రెక్కాడితేనే కానీ డొక్కాడని ఆర్థిక దుస్థితిలోనూ మానవత్వానికి ప్రతిరూపంగా నిలిచే ఆ వ్యక్తి పేరు కూపర్ భాను అంబేద్కర్.



అనాథ మృతదేహాన్ని మోసుకెళుతూ..



బంధువులున్న వృద్ధురాలి మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహిస్తూ..



బంధువులున్న వృద్ధురాలి మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహిస్తూ..

ఎవరీ అంబేద్కర్..

కాకినాడ ప్రతాప్ నగర్‌కు చెందిన 49 ఏళ్ల అంబేద్కర్ నిరుపేద డ్రైవర్. భార్య లక్ష్మితో పాటు ఇద్దరు కుమారులు లోకేష్, ఆకాష్ ఉన్నారు. కొన్నేళ్ల క్రితం ఓ రాజకీయ నాయకుడి బంధువు వద్ద కారు డ్రైవర్‌గా అంబేద్కర్ పని చేశాడు. ఓ రోజు ఇంటి సమీపంలో ఓ బిచ్చగాడు చనిపోతే మున్సిపల్ సిబ్బంది చెత్త ట్రాక్టరులో ఎక్కించడం చూసి అతడి మనసు వికలమైంది. అటువంటి చావు ఎవ్వరికీ రాకూడదని తల్లడిల్లిపోయాడు. అటువంటి వారి కోసం ఏదో ఒకటి చేయాలని సంకల్పించాడు, ఉద్యోగం మానేసి అనాథ మృతదేహాల తుది మజిలీని తన చేతులతో పూర్తి చేయాలని నిర్ణయించుకున్నాడు. దీనిపై ఆలోచన సాగిస్తూనే కుటుంబ పోషణ కోసం ఉద్యోగం చేస్తూ బతుకు బండి నడిపేవాడు. కాకినాడలోని ఓ సంస్థలో అనాథ మృతదేహాల తరలింపునకు 2007లో 'ఆత్మబంధు' పేరిట ఓ వాహనం సిద్ధమైందని తెలుసుకున్న అంబేద్కర్.. అందులో పని చేస్తానంటూ అక్కడి అధికారులను సంప్రదించాడు. తాము తగిన జీతం ఇవ్వలేమని వారు చెప్పగా.. భార్యాబిడ్డలకు అన్నం పెట్టే అంత మొత్తం చాలని, తనకు సేవాభాగ్యం కల్పించాలని కోరాడు. అంబేద్కర్ సంకల్పం ముందు తల వంచిన ఆ సంస్థ ప్రతినిధులు అనాథ దేహాల తరలింపు వాహనానికి అంబేద్కర్‌ను డ్రైవర్‌గా నియమించారు. ఆ తరువాత 2017లో అతడు కాకినాడకు చెందిన కండిబోయిన ధర్మరాజు నిర్వహిస్తున్న కండిబోయిన వారి శ్రీ స్వచ్ఛంద సేవా సంస్థలో చేరాడు. అక్కడ వాహనం నడపడంతో పాటు పూర్తి స్థాయిలో అనాథ మృతదేహాలను మోసుకెళ్లడం, తరలించడం వంటి పనులు కూడా అతడికి అప్పగించారు. అది మొదలు సంస్థ ఆదర్శాలను మించి సేవా మార్గంలో అంబేద్కర్ పయనించాడు. కుళ్లి, శరీర భాగాలు తెగిపోయిన దేహాల నుంచి, గుర్తు తెలియని మృతదేహాల వరకూ.. అందరూ ఉండి అనాథలుగా మిగిలిన దేహాల నుంచి.. ఎవరూ లేని అనాథల వరకూ స్వయంగా అతడే అంత్యక్రియలు నిర్వహించేవాడు. గతంలో అంబేద్కర్ పని చేసిన సంస్థ అతడు లేక తమ సేవలనే నిలిపివేసిందంటే అతడి నిబద్ధత ఏమిటో అర్థం చేసుకోవచ్చు. 2007 నుంచి ఇప్పటి వరకూ అంబేద్కర్ మొత్తం 1,153 అనాథ మృతదేహాలను కాటికి తరలించాడు. వీరిలో తలకొరివి పెట్టినవీ ఉన్నాయి.

కోవిడ్ వేళ అసమాన సేవలు

కోవిడ్ వేళ అంబేద్కర్ అసమాన సేవలు అందించాడు. వైరస్ సోకి, మృతి చెందిన వారి దేహాలు తాకడం ప్రాణాంతకమని తెలిసినా స్వయంగా భుజాలపై మోసుకుని వెళ్లి మరీ దహన సంస్కారాలు నిర్వహించాడు. అలాగే కోవిడ్ సోకి, నడిరోడ్డు పైనే చనిపోయిన వృద్ధులు, అనాథలు, బిచ్చగాళ్లకు అంత్యక్రియలు నిర్వహించాడు.

పోలీసులకు తోడ్పాటు

అనాథ దేహాలు లేదా కుళ్లిన మృతదేహాలు లభ్యమైతే వాటిని పోస్టుమార్టానికి తరలించేందుకు, అనంతరం శ్మశానానికి తీసుకుని వెళ్లి అంతిమ సంస్కారాలు నిర్వహించేందుకు పోలీసులు అంబేద్కర్‌ను సంప్రదిస్తారు. పైసా ప్రయోజనం ఆశించకుండా వారికి తోడ్పాటునందిస్తాడు. తన సేవల ద్వారా అంబేద్కర్ గతంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ గోపాలకృష్ణ ద్వివేది, పూర్వపు రాష్ట్ర డీజీపీ గౌతమ్ సవాంగ్ తదితరుల మన్ననలు పొందాడు. ఆయా అధికారులు అతడికి మెమెంటోలు ఇచ్చి సత్కరించారు.

కళ్లు చెమ్మగిల్లుతాయి



అనాథలు చనిపోయిన తీరు చూస్తే కళ్లు చెమ్మగిల్లుతాయి. ఇటువంటి చావు ఎందుకొచ్చిందా అని వేదన పడుతూంటాను. నా చివరి శ్వాస వరకు అనాథ మృతదేహాల సేవలోనే తరిస్తాను. అనాథ దేహం కదా అని అంతిమ సంస్కారాల్లో ఏ మాత్రం వెనకడుగు వేయను. నలుగురి సహకారంతో పూర్తి స్థాయిలో నిర్వహిస్తాను. ఎవరైనా అనాథ మృతదేహాలను గుర్తిస్తే 93478 78713, 84988 74684 నంబర్లకు ఫోన్ చేస్తే దేహాన్ని ఉచితంగా శ్మశానానికి తరలించి, అంతిమ సంస్కారాలు నిర్వహిస్తాను.

- కూపర్ భాను అంబేద్కర్, కాకినాడ



సరస్వతీనది పుష్కరయాత్ర

**ఉత్తరాఖండ్‌లోనే ఇవన్నీ...
గంగానది పుట్టిన గంగోత్రి ఇక్కడే.
యమున పుట్టిన యమునోత్రీ ఇక్కడే...
సరస్వతి నేల మీద కనిపించేదీ ఇక్కడే.
సరస్వతి నదికి పుష్కరాలొస్తున్నాయి.
దారిలో రిషికేశ్... హరిద్వార్ ఉన్నాయి.
అలకనంద తీరాన బదరీనాథ్ ఉంది.
తప్తకుండ్... బ్రహ్మకపాలమూ ఉన్నాయి.
పనిలో పనిగా వీటన్నింటినీ
చూసొద్దాం.**

ఈ ఉత్తరాఖండ్ టూరిజమ్ నిర్వహిస్తున్న ప్యాకేజ్ 5 రోజులు, 4 రాత్రులు. ఈ టూర్‌లో హరిద్వార్, రిషికేశ్, విష్ణుప్రయాగ, పీపల్‌కోటి, బదరీనాథ్, కర్ణప్రయాగ, దేవ ప్రయాగ, నంద ప్రయాగ, బ్రహ్మ కపాలం, సరస్వతి నది తీరాలు, మాణా గ్రామం. ఇవన్నీ ఉత్తరాఖండ్‌లో ఉన్నాయి.

1


ఢిల్లీ నగరం కరోల్ బాగ్ నుంచి ప్రయాణం హరిద్వార్‌కు సాగుతుంది. హరిద్వార్‌లో హోటల్‌లో చెక్ ఇన్ అయ్యి, హర్ కీ పౌరీ, మానసాదేవి ఆలయం, గంగా హారతి దర్శనం, రాత్రి బస హరిద్వార్‌లో.

గంగమ్మ నేల మీదకు వచ్చింది

హరిద్వార్... ఇది గంగాతీరమే కానీ సరస్వతి నది పుష్కరాల యాత్రలో మొదట పలకరించే ప్రదేశం ఇదే. గంగానది పర్వతాల నుంచి నేల మీద అడుగు పెట్టిన ప్రదేశం ఇది. నది పీఠభూమిలో విస్తరించేసుకుంటూ ముందుకు సాగుతుంది. హిందూ పురాణాల్లో ప్రత్యేకమైన ప్రదేశాలు బదరీనాథ్, కేదార్‌నాథ్‌లకు వెళ్లడానికి ఎంట్రీ పాయింట్ కూడా ఇదే. ఇక్కడ గంగాహారతి కనువిందు చేస్తుంది.



మానసాదేవి ఆలయం శివాలిక్ పర్వత శ్రేణుల్లో బిల్వపర్వతం మీద ఉంది. అంత ఎత్తులో అంత పెద్ద ఆలయాన్ని నిర్మించిన ఇంజనీరింగ్ స్కిల్‌కి తలవంచి నమస్కరించవచ్చు.








2

ఉదయం బ్రేక్‌ఫాస్ట్ తరవాత గదిని చెక్ అవుట్ చేసి రిషికేశ్ వైపు సాగిపోవాలి. రామ్ ఝూలా, లక్ష్మణ్ ఝూలా, గీతా ఆశ్రమం చూసుకున్న తర్వాత పీపాల్‌కోటికి ప్రయాణం. దారిలో దేవ ప్రయాగ 108 దివ్య దేశ క్షేత్రం రఘునాథ్ ఆలయం). అలకనంద- భాగీరథి నదుల సంగమ స్థలి వీక్షణం. రాత్రి బస పీపల్ కోటిలో.

ప్రపంచ యోగ వేదిక

రిషికేశ్... యోగసాధన చేసిన సాధువుల పరంపరగా ఇక్కడ యోగ సాధన, ధ్యానదీక్ష కొనసాగుతోంది. ప్రధానమంత్రి కూడా తన పర్యటనలో ఇక్కడ ఒక గుహలో ధ్యానం చేశారు. ఏటా ఇక్కడ ఇంటర్నేషనల్ యోగా ఫెస్టివల్ జరుగుతుంది. గంగానది దేవప్రయాగ నుంచి నేలకు జాలువారే క్రమంలో రిషికేశ్ దగ్గర చాలా ఉధృతంగా ప్రవహిస్తుంటుంది. హరిద్వార్‌కు చేరేటప్పటికి ఉధృతి తగ్గి విశాలమవుతుంది. రిషికేశ్‌లో మద్యం, మాంసం నిషేధం. నియమాన్ని కచ్చితంగా అమలు చేస్తారు. చాటుగా కూడా ఉల్లంఘించే అవకాశం ఉండదు. శిక్షలు కఠినంగా ఉంటాయి. ఇక్కడి గీతాభవన్ వెయ్యి మంది ఏకకాలంలో బస చేయగలిగిన ఉచిత వసతి భవనం. నది ఒడ్డునే ఉంది. ఇందులో బస చేసినా, చేయకపోయినా ఈ భవనాన్ని చూడడం మర్చిపోవద్దు. లక్ష్మణ్ ఝూలా మీద నది ఈ తీరం నుంచి ఆ తీరానికి నడిచేటప్పుడు ఆగి ఒకసారి 360 డిగ్రీల్లో పరిసరాలను చూడాలి. పర్వతాల సౌందర్యం, గంగా ప్రవాహఝరి కలిసి కనువిందు, వీనుల విందులను ఏకకాలంలో ఆస్వాదించవచ్చు. రామ్‌ఝూలా రిషికేశ్ పట్టణానికి కొద్దిదూరంలో ఉంది.







పీపల్‌కోటి... ఇది అలకనంద నది తీరాన ఉన్న చిన్న గ్రామం. అలకనంద నది మాణాగ్రామాన్ని చేరేలోపు సరస్వతి నదిలో కలిసి పోతుంది. బదరీనాథ్, హేమకుండ్ సాహిబ్ పుణ్యక్షేత్రాలకు వెళ్లే పర్యాటకుల బసకు అనువైన ప్రదేశం ఇది.

3


పీపల్ కోటి నుంచి బదరీనాథ్ మధ్యలో మాణా గ్రామం సందర్శనం. యాత్రలో ముఖ్యమైన ప్రదేశం ఇదే. సరస్వతి నది తీరాన విస్తరించిన గ్రామం మాణా. ఇండియా- టిబెట్ సరిహద్దులో ఉంది. మనదేశానికి చివరి గ్రామం మాణా. ఇక్కడ నదిలో పుణ్యస్నానం చేసి, క్రతువులు ఆచరించిన తర్వాత ఈ గ్రామంలో ఉన్న వ్యాసగుహ, గణేశ గుహ, భీమ్‌పూల్ చూసుకుని బదరీనాథ్‌కు చేరాలి. రాత్రి బస అక్కడే. ఒకవేళ ఆలయం మూసేలోపు చేరుకుంటే ఆ రోజు కూడా దర్శనం చేసుకోవచ్చు.





భారతాన్ని రాసింది ఇక్కడే

మాణా గ్రామం... సరస్వతి నది సముద్రమట్టానికి పదివేల ఐదు వందల అడుగుల ఎత్తులో ప్రవహిస్తూ ఉంటుంది. దేశం సరిహద్దులో ఉందనే చెప్పాలి. మాణా గ్రామం ఈ నది ఒడ్డున ఉంది. ఈ గ్రామం టిబెట్ బోర్డర్‌కి పాతిక కిలోమీటర్ల దూరంలో ఉంది. సరస్వతి నది హిమలయాల్లో పుట్టింది. కొండలు, లోయల్లో ప్రవహిస్తూ మాణా దగ్గర స్పష్టంగా కనిపిస్తుంది. మాణాలో నది తీరాన కట్టిన సరస్వతి ఆలయం అందంగా ఉంటుంది. మాణా ఎంత చిన్న గ్రామం అంటే జనాభా ఐదారు వందలకు మించదు. భోతియా జాతి ఆదివాసీల నివాసం మాణా. ఈ ప్రదేశానికి పౌరాణిక ప్రాశస్త్యం ఉంది. వ్యాసుడు చెప్తుండగా వినాయకుడు మహాభారతాన్ని రాసిన ప్రదేశం ఇదేనని చెబుతారు. వ్యాసగుహ, గణేశ గుహ ఉన్నాయి. ఈ గణేశ గుహ 5330 ఏళ్ల నాటిదని మూడేళ్ల కిందట పురావస్తు పరిశోధకులు నిర్ధారించారు. మరో ప్రాశస్త్యం ఏమిటంటే... పాండవులు స్వర్గారోహణ కోసం ప్రయాణించిన దారి ఇదేనని చెబుతారు. ఇక్కడ ఒక చోట ద్రౌపది నది దాటలేకపోవడంతో భీముడు పెద్ద బండరాళ్లను పేర్చి వంతెన ఏర్పాటు చేశాడని, ఇప్పుడు భీమ్‌పూల్ అని పిలిచేది అదే ప్రదేశాన్నని కూడా చెబుతారు. ఇక్కడ గ్రామం చివరగా ఒక ఎత్తైన ప్రదేశంలో పాండవులు నడిచారని చెప్పే దారిలో స్వర్గారోహణకు మార్గం అంటూ ఒక ఆర్చ్ ఉంటుంది. అలాగే భారతదేశానికి చివరి గ్రామంలో టీ తాగండి అంటూ బోర్డులతో ఉన్న టీ దుకాణాలు మనకు టీ తాగాలన్న ఆలోచన లేకపోయినా తాగేటట్లు చేస్తాయి.



4

తెల్లవారు జాయున లేచి తప్తకుండ్‌లో పుణ్యస్నానం చేసి బదరీనాథుడి దర్శనం చేసుకోవాలి. బ్రహ్మకపాలంలో పిండప్రదానాలు చేసుకున్న తర్వాత రుద్రప్రయాగ వైపు సాగిపోవాలి. రాత్రి బస రుద్రప్రయాగలో.


విష్ణుమూర్తి సేవలో...


బదరీనాథ్... విష్ణుమూర్తి ఆలయం. పురాణాల్లో బదరికాశ్రమంగా చెప్పిన ప్రదేశం ఇది. అలకనంద నది తీరాన ఉంది. ఏడాదిలో ఆరు నెలలు మూసివేస్తారు. వేసవిలో తెరుస్తారు. ఇది కేవలం పర్యాటక ప్రాధాన్యతతో విస్తరించిన ప్రదేశం. ఓ వందేళ్ల కిందట పాతిక గుడిసెలకు మించని ఊరు. అది కూడా ఆలయపూజారులు, ఇతర సేవలందించేవాళ్లు నివసించేవారు. పర్యాటకులు పెరగడంతో ఊరు విస్తరించి పట్టణమైంది. ఏడాదికి లక్షల మంది పర్యాటకులను చూస్తోందిప్పుడు.

తప్తకుండ్... ఇది బదరీనాథ్‌లో ఉన్న ఉష్ణగుండం. ఈ హాట్‌స్ప్రింగ్ బదరీనాథ్ ఆలయానికి అలకనంద నదికి మధ్యలో ఉంది. ఇక్కడ స్నానం చేసి ఈ నది తీరానే ఉన్న బ్రహ్మకపాలం అనే ప్రదేశంలో పితృదేవతలకు తర్పణాలు వదిలితే వారికి స్వర్గలోక నివాసం ప్రాప్తిస్తుందని విశ్వాసం. బదరీ క్షేత్రంలో ఒక చోట చరణ్ పాదుక అనే ప్రదేశం ఉంది. కొండ రాళ్ల మధ్య పాదుక ఆకారంలో ఒక రాయి అది. విష్ణుమూర్తి భూమ్మీదకు వస్తూ తొలిపాదం మోపిన ప్రదేశం అని చెబుతారు.









5

ఉదయం బ్రేక్‌ఫాస్ట్ చేసుకుని గది చెక్ అవుట్ చేసి హరిద్వార్ మీదుగా ఢిల్లీ చేరడంతో టూర్ పూర్తవుతుంది.

ఆహారం

ప్యాకేజ్‌లో భాగంగా నాలుగు రోజులు బ్రేక్‌ఫాస్ట్, లంచ్, డిన్నర్, ఐదవ రోజు బ్రేక్ ఫాస్ట్, లంచ్ ఇస్తారు.

ప్యాకేజ్ ధరలిలాగ

నిర్వహకులు పర్యాటకులను ఢిల్లీలో రిసీవ్ చేసుకుని టూర్ పూర్తయిన తరవాత తిరిగి ఢిల్లీలో వీడ్కోలు చెబుతారు. ఒక్కొక్కరికి 15,500 రూపాయలు, జీఎస్‌టీ అదనం. ఇందులో పిండప్రదానాల ఖర్చు లేవీ వర్తించవు.

ఏమేమి తీసుకెళ్లాలి? ఏమేమి తెచ్చుకోవాలి?

- ఐడీ కార్డు... ప్రభుత్వం ఫొటోతో జారీ చేసిన ఏదో ఒక కార్డు. ఓటర్ కార్డు, పాస్‌పోర్టు, ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, రేషన్ కార్డులలో ఏదో ఒకటి. ఐడీ కార్డుతోపాటు నాలుగు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు.
- స్వెటర్, షాల్, మంకీ క్యాప్, స్పోర్ట్స్ షూస్, గొడుగు, హ్యాండ్ శానిటైజర్, అవసరమైన మందులు తీసుకెళ్లాలి.
- సాలగ్రామ శిలలు, రాగి, ఇత్తడి పూజ సామగ్రి, రాతి విగ్రహాలు, దేవతల ఫొటోలు, ఆలయాల ఫొటోలు, రుద్రాక్ష మాలలు తెచ్చుకోవచ్చు.



గొప్ప స్థితికి వెళ్లేందుకు మంచి స్థితిని వదలడానికి వెనకాడకూడదు.
- జాన్ డి. రాక్‌ఫెల్లర్, అమెరికా వ్యాపారవేత్త

సాక్షి ప్లస్
సోమవారం। 14-4-2025

బిజినెస్ రీల్

టారిఫ్ అనిశ్చితి స్వల్పకాలమే

టీసీఎస్ సీఈవో కృతివాసన్



ముంబై: ప్రపంచ దేశాల మధ్య టారిఫ్‌ల కారణంగా తలెత్తిన అనిశ్చితి స్వల్పకాలమే కొనసాగనున్నట్లు సాఫ్ట్‌వేర్ సేవల దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్(టీసీఎస్) సీఈవో, ఎండీ కె.కృతివాసన్ పేర్కొన్నారు. వెరసి ఐటీ సేవల పరిశ్రమకు కొంత కాలమే అనిశ్చితి సవాళ్లు సృష్టించనున్నట్లు అభిప్రాయపడ్డారు. కొద్ది నెలల్లోనే పరిష్కారం లభించనున్నట్లు అంచనా వేశారు. 39 బిలియన్ డాలర్ల విలువైన కంపెనీ ఆర్డర్ బుక్ భవిష్యత్ ఆదాయ ఆర్జనకు హామీ ఇస్తున్నట్లు ఒక ఇంటర్వ్యూలో తెలియజేశారు. డీల్ పైప్‌లైన్ పటిష్టంగా ఉన్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితులతో కొంతమంది క్లయింట్ల నుంచి విచక్షణ వ్యయాలు నిలిచిపోతున్నట్లు వెల్లడించారు. అయితే ధరల విషయంగా ఒత్తిడిలేదని స్పష్టం చేశారు. నిజానికి వార్షికంగా, త్రైమాసిక వారీగా ధరలు స్వల్పంగా మెరుగుపడినట్లు తెలియజేశారు. గతేడాదికి 30 బిలియన్ డాలర్ల ఆదాయం సాధించిన కంపెనీ విచక్షణ వ్యయాల వాటాపై వివరణ ఇవ్వని సంగతి తెలిసిందే. ఇవి ఆదాయంలో కీలకమే అయినప్పటికీ ప్రస్తుత ట్రెండ్‌వల్ల కంపెనీపై ప్రతికూల ప్రభావం పడలేదని వివరించారు. యూఎస్‌లో పరిస్థితులు సర్దుకుంటే ఉత్తర అమెరికా బిజినెస్‌లో తిరిగి పురోభివృద్ధి అందుకోగలమని అంచనా వేశారు. సాఫ్ట్‌వేర్ సేవల ఔట్‌సోర్సింగ్‌కు ప్రపంచంలోనే యూఎస్ అతిపెద్ద మార్కెట్ కాగా.. ప్రస్తుతం కంపెనీ ఆదాయంలో వాటా 48%కి పరిమితం కావడం గమనార్హం!

ఓరియంట్ సిమెంట్ లాభం డౌన్

న్యూఢిల్లీ: సీకే బిర్లా గ్రూప్ కంపెనీ ఓరియంట్ సిమెంట్(ఓసీఎల్) గతేడాది(2024-25) చివరి త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. జనవరి–మార్చి(క్యూ4)లో నికర లాభం 38 శాతంపైగా క్షీణించి రూ. 42 కోట్లకు పరిమితమైంది. అంతక్రితం ఏడాది(2023-24) ఇదే కాలంలో రూ. 68 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం 7 శాతం తగ్గి రూ. 825 కోట్లను తాకింది. అంతక్రితం క్యూ4లో రూ. 888 కోట్ల టర్నోవర్ సాధించింది. అయితే మొత్తం వ్యయాలు 3 శాతం నీరసించి రూ. 765 కోట్లకు చేరాయి. వాటాదారులకు కంపెనీ బోర్డు షేరుకి 50 పైసలు చొప్పున తుది డివిడెండ్ ప్రకటించింది. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి నికర లాభం 48 శాతం క్షీణించి రూ. 91 కోట్లకు పరిమితమైంది. 2023-24లో రూ. 175 కోట్లు ఆర్జించింది. ఆదాయం 15% తగ్గి రూ. 2,729 కోట్లకు చేరింది. అంతక్రితం రూ. 3,201 కోట్ల అమ్మకాలు నమోదయ్యాయి.



కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

14-4-2025

విశాఖ	415-00
చిత్తూరు	460-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	400-00
విజయవాడ	420-00
రిటైల్ ధర (డజను)	60.00
హైదరాబాద్	395-00
వరంగల్	397-00
రిటైల్ ధర	4.55

ఆటో విడిభాగాల తయారీ...

ఆర్థిక ప్రోత్సాహకాలివ్వాలి

- 2030కల్లా 145 బిలియన్ డాలర్లకు విడిభాగాల ఉత్పత్తి అంచనా
- ఎగుమతులు 3 రెట్లు ఎగసి 60 బిలియన్ డాలర్లకు చేరవచ్చు

నితి ఆయోగ్ నివేదిక విడుదల



న్యూఢిల్లీ: ఆటో విడిభాగాల తయారీదారులకు ప్రభుత్వం ఆర్థిక ప్రోత్సాహకాలు అందించాలని నితి ఆయోగ్ తాజాగా పేర్కొంది. ప్రపంచ ఆటోమోటివ్ మార్కెట్లలో భారత్ కీలక దేశంగా నిలిచే బాటలో భారీస్థాయిలో ఆటో క్లస్టర్ల విస్తరణ, అభివృద్ధి చేపట్టవలసి ఉన్నట్లు అభిప్రాయపడింది. ఆటోమోటివ్ పరిశ్రమ: గ్లోబల్ వేల్యూ చైన్లలో భారత్ పార్టిసిపేషన్‌ను శక్తివంతగా మార్చడం పేరుతో నితి ఆయోగ్ వైస్‌చైర్మన్ సుమన్ బెరీ ఒక నివేదికను విడుదల చేశారు. 2030కల్లా ఆటో విడిభాగాల ఉత్పత్తి 145 బిలియన్ డాలర్లకు వృద్ధి చెందడంతోపాటు, ఎగుమతులు మూడు రెట్లు ఎగసి ప్రస్తుత 20 బిలియన్ డాలర్ల నుంచి 60 బిలియన్ డాలర్లకు చేరాలనే లక్ష్యంతో ఈ నివేదిక రూపొందింది. దీంతో 2–2.5 మిలియన్ మందికి అదనపు ఉపాధి కల్పించేందుకు సైతం వీలుంటుందని అంచనా వేసింది. దీని ప్రకారం తయారీ సామర్థ్యాల ఏర్పాటు, విస్తరణకు నిర్వహణ వ్యయాల(ఒపెక్స్)ను ప్రభుత్వం సమకూర్చవలసి ఉంటుంది. టూలింగ్, డై, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌పై మూలధన పెట్టుబడులు(క్యాపెక్స్) వెచ్చించేందుకు దృష్టి పెట్టాలని నివేదిక పేర్కొంది.

క్లస్టర్లకు మద్దతు

ఆటోమోటివ్ రంగంలో భారత్ ప్రపంచస్థాయిలో పోటీతత్వాన్ని పెంచుకునేందుకు వీలుగా ఆర్థిక, ఆర్థికేతర వ్యూహాలను అమలు చేయవలసి ఉంటుందని నితి ఆయోగ్ విడుదల చేసిన నివేదిక సూచించింది. క్లస్టర్ అభివృద్ధిలో సైతం ప్రభుత్వం మద్దతివ్వవలసి ఉంటుందని, తద్వారా కంపెనీల మధ్య సహకారానికి వీలు కల్పించాలని వివరించింది. దీనిలో భాగంగా ఆర్అండ్‌డీ, టెస్టింగ్ సెంటర్లు వినియోగించుకునేందుకు, సప్లై చైన్‌ను మెరుగుపరచుకునేందుకు వీలుంటుందని తెలియజేసింది. వృద్ధిని కొనసాగించేందుకు నైపుణ్యాలు కీలకమని, నైపుణ్యాభివృద్ధికి తగిన వసతులు కల్పించాలని పేర్కొంది. వెరసి పరిశోధన, అభివృద్ధికి ప్రోత్సాహకాలు అవసరమని స్పష్టం చేసింది. అంతర్జాతీయ బ్రాండింగ్ ద్వారా మెరుగైన ప్రొడక్టుల విభజనకు, ఐపీ ట్రాన్స్‌ఫర్ల ద్వారా ఎంఎస్ఎంఈలకు మద్దతు కల్పించవలసి ఉన్నట్లు అభిప్రాయపడింది. ప్రపంచ మార్కెట్లను అందుకునేలా భాగస్వామ్య కంపెనీ(జేవీ)లు, విదేశీ సహకారం, స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలకు తెరతీయవలసి ఉన్నట్లు వివరించింది.

2 ట్రిలియన్ డాలర్లు

2023కల్లా గ్లోబల్ ఆటోమొబైల్ ఉత్పత్తి సుమారు 9.4 కోట్ల యూనిట్లకు చేరింది. ఆటోమోటివ్ విడిభాగాల ప్రపంచ మార్కెట్ విలువ **2** లక్షల కోట్ల డాలర్లను తాకింది. వీటిలో ఎగుమతుల వాటా విలువ 700 బిలియన్ డాలర్లు. చైనా, యూఎస్, జపాన్ తదుపరి భారత్ నాలుగో అతిపెద్ద తయారీ దేశంగా నిలుస్తోంది. వార్షికంగా సుమారు 60 లక్షల వాహనాలను రూపొందిస్తోంది. అయితే గ్లోబల్ ఆటోమోటివ్ విడిభాగాల వాణిజ్యంలో 3 శాతమే వాటాను కలిగి ఉంది. వీటి విలువ 20 బిలియన్ డాలర్లు. వీటిలో ఇంజిన్ విడిభాగాలు, డ్రైవ్ ట్రాన్స్‌మిషన్, స్టీరింగ్ సిస్టమ్స్ అత్యధిక శాతం వాటా ఆక్రమిస్తున్నాయి. హైప్రెసిషన్స్ విభాగంలో భారత్ వాటా 2–4 శాతమే! కాగా.. చైనాకు వెలుపలవైపు ప్రపంచమంతా చూస్తున్నట్లు నితి ఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యం ప్రస్తావించారు. ఈ బాటలో భారత్‌వైపు దృష్టి సారిస్తున్నట్లు పేర్కొన్నారు. టారిఫ్ విధానాలు వెలుగులోకి వస్తున్న నేపథ్యంలో భారత్ ప్రాధాన్యతా ప్రాంతంగా నిలవనున్నట్లు అభిప్రాయపడ్డారు.

ఖాతాలను వెంటనే ఫ్రీజ్ చేసే అధికారులు కావాలి

- తద్వారా అక్రమ లావాదేవీలకు చెక్
- బ్యాంకింగ్ అసోసియేషన్ వర్కింగ్ గ్రూప్



న్యూఢిల్లీ: అక్రమ లావాదేవీలకు వీలు కల్పిస్తున్న మ్యూల్ ఖాతాలను వెంటనే స్తంభింపజేసేందుకు (ఫ్రీజ్) బ్యాంక్ సిబ్బందికి అధికారులు ఇవ్వాలనే ప్రతిపాదన తెరపైకి వచ్చింది. ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన వర్కింగ్ గ్రూప్ ఆర్‌బీఐకి ఈ మేరకు ప్రతిపాదన చేయనున్నట్లు తెలిపింది. సైబర్ నేరస్థులు ఈ మ్యూల్ ఖాతాల ద్వారానే నిధులు తరలిస్తుంటారన్నది గమనార్హం. కొంత కమీషన్ ముట్టచెప్పి వేరే వారి ఖాతాలను లావాదేవీలకు వినియోగించుకుంటూ ఉంటారు. కొన్ని సందర్భాల్లో ఖాతాదారుల ప్రమేయం లేకుండా కూడా వారి ఖాతాలను వినియోగిస్తుంటారు. అంతర్గత వ్యవస్థలు ఈ తరహా లావాదేవీల గురించి హెచ్చరించిన వెంటనే ఖాతాలను నిలిపివేసే అధికారం ఇవ్వాలని కోరనున్నట్లు వర్కింగ్ గ్రూప్ తెలిపింది. ప్రస్తుతం ఏదైనా ఖాతాను ఫ్రీజ్ చేయాలంటే కోర్టు లేదా దర్యాప్తు సంస్థల ఆదేశాలతోనే బ్యాంక్ సిబ్బంది చేయగలరు. మరోవైపు అక్రమ లావాదేవీలకు అవకాశం ఉన్న ఖాతాలను గుర్తించేందుకు బ్యాంక్‌లు సైతం తనిఖీ చేయాలన్నది మరో ప్రతిపాదన. ఓటరు గుర్తింపు కార్డుతో ఖాతాలు తెరిచిన వారి గుర్తింపు ధ్రువీకరించుకునేందుకు వీలుగా ఎన్నికల సంఘం డేటాబేస్‌ను తనిఖీ చేసే అవకాశం బ్యాంక్ సిబ్బందికి కల్పించాలని కోరనున్నట్లు వర్కింగ్ గ్రూప్ తెలిపింది.

ఒడిదుడుకుల మార్కెట్లో పెట్టుబడులకు వ్యూహం..

అజిత్ మీనన్



సీఈవో, పీజీఐఎం ఇండియా ఎంఎఫ్

అధ్యయనాలను బట్టి చూస్తే, దేశీ మార్కెట్లు మధ్యమధ్యలో క్రాష్ అవుతున్నప్పటికీ వృద్ధి బాటలో పయనిస్తూనే, ఇన్వెస్టర్లకు ప్రయోజనాలు చేకూరుస్తూ వస్తున్నాయి. ఇందు కోసం మేము కోవిడ్ సంక్షోభ సమయంలో సెన్సెక్స్ పనితీరును పరిశీలించి చూశాం. అప్పట్లో దేశాలన్నీ లాక్‌డౌన్ బాట పట్టగా, ఈక్విటీలు భారీగా పతనమయ్యాయి. కానీ ఆ తర్వాత మళ్లీ భారీగా కోలుకున్నాయి. ఈ నేపథ్యంలో మార్కెట్లో పెట్టుబడులకు అత్యుత్తమ రోజులను వదులుకున్నామంటే దీర్ఘకాలికంగా ఎలాంటి ప్రభావం పడుతుందనేది పరిశీలించేందుకు గత 24 ఏళ్ల వ్యవధిలో (2001 సెప్టెంబర్ – 2025 జనవరి) నిఫ్టీ 50 టీఆర్ఐ రాబడులను విశ్లేషించి చూశాం. దీని ప్రకారం ఈ వ్యవధిలో మీరు అత్యుత్తమమైన 50 రోజులను గానీ వదులుకుని ఉంటే, కాంపౌండింగ్ ప్రాతిపదికన మీ పెట్టుబడుల వృద్ధి ఒక్క శాతం కన్నా తక్కువే ఉంటుంది. మరోవైపు, పెట్టుబడులను అలాగే కొనసాగించి ఉంటే ఇదే వ్యవధిలో మీరు వార్షిక ప్రాతిపదికన 15.61 శాతం మేర రాబడులు అందుకునేవారు. ఉదాహరణకు 2001లో ఇన్వెస్ట్ చేసిన రూ. 10,000 మీరు పెట్టుబడిని 24 ఏళ్లపాటు అలాగే కొనసాగిస్తే, రూ. 3.25 లక్షలయ్యేది. అదే గానీ మీరు అత్యుత్తమమైన 50 రోజులను మిస్ అయి ఉంటే, మీరు పెట్టిన రూ. 10,000, గత 24 ఏళ్లలో కేవలం రూ. 11,550కి మాత్రమే పెరిగి ఉండేది. (మూలం: ఎంఎఫ్ఐ ఇక్రా, వర్సిటీ, పీజీఐఎం ఇండియా ఇంటర్నల్)



ఎలాంటి వ్యూహం ఉండాలంటే..

మార్కెట్లో నెలకొనే పరిస్థితులను బట్టి పెట్టుబడులకంటూ ఒక వ్యూహం అంటూ ఉండాలి. మార్కెట్ కదలికలను ప్రతీ క్షణం చూస్తూ కూర్చుంటే ఒత్తిడి పెరిగిపోతుంది. అప్పటికప్పుడు నిర్హేతుకమైన నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుంది. అలా కాకుండా, జీవితంలో ఏదైనా పెద్ద మార్పు వస్తే తప్ప మీ పోర్ట్‌ఫోలియోను ఏటా ఒకసారి సమీక్షించుకుంటే సరిపోతుంది. మీ పెట్టుబడుల లక్ష్యం ఏమిటనేది మీరు అప్పుడప్పుడు సమీక్షించుకుంటూ ఉండండి. ఒకవేళ మీ లక్ష్యాలు రిటైర్మెంట్, ఇల్లు కొనుగోలు, లేదా పిల్లల ఉన్నత విద్యలాంటి దీర్ఘకాలికమైనవైతే, మార్కెట్లలో స్వల్పకాలిక ఒడిదుడుకుల గురించి పెద్దగా ఆందోళన చెందనక్కర్లేదు.

పోర్ట్‌ఫోలియో డైవర్సిఫికేషన్

సంపన్నులు తమ సొంత కంపెనీల్లోనో లేదా ఏదో ఒక ఐడియాపైనో ఇన్వెస్ట్ చేయడం ద్వారా సంపదను పెంపొందించుకుంటారు. ప్రతి ఇన్వెస్టరుకు స్ఫూర్తినిచ్చే ఇలాంటి విజయగాథలు ఎక్కడ పడితే అక్కడ కనిపిస్తుంటాయి. కానీ నష్టపోయిన వాళ్లు ఎక్కువగా హైలైట్ కారు. వారి గురించి ఎవరూ ఎక్కువగా రాయరు. కార్పొరేట్ గవర్నెన్స్ వైఫల్యాల కారణంగా చితికిపోయిన షేర్ల కథలు స్టాక్ మార్కెట్లో ఎన్నో ఉన్నాయి. అలాంటప్పుడు జీవిత కాలపు పొదుపు మొత్తాలను కేవలం ఒకే స్టాక్ మీద ఇన్వెస్ట్ చేసేందుకు ఎంత మంది సాహసిస్తారు? కాబట్టి తన కష్టార్జితాన్ని పెట్టుబడి పెట్టే సగటు ఇన్వెస్టరు, ఇలాంటి రిస్కులను అధిగమించాలంటే డైవర్సిఫికేషన్ వ్యూహం పాటించడం శ్రేయస్కరం. అంటే మొత్తం డబ్బును ఒకే దాంట్లో ఇన్వెస్ట్ చేయకుండా పెట్టుబడుల్లో వైవిధ్యాన్ని పాటించడం మంచిది.

పెట్టుబడులను కొనసాగించాలి..

ఏకమొత్తంగా ఇన్వెస్ట్ చేసేంత డబ్బు మీ దగ్గర ఉండి, దీర్ఘకాలంలో మార్కెట్లు పెరుగుతాయనే భావనలో మీరు ఉంటే ఈక్విటీల్లో ఏకమొత్తంగా పెట్టుబడి పెట్టడం కూడా మంచిదే. దీనికి ఒక ఉదాహరణ చూద్దాం. గిరి సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) పద్ధతిలో 10 శాతం మేర వార్షిక రాబడి అంచనాలతో ప్రతి నెలా రూ. 5,000 చొప్పున పదేళ్ల పాటు పెట్టుబడులు పెట్టాడనుకుందాం. పదేళ్ల తర్వాత అతనికి రూ. 10.07 లక్షలు వస్తాయి. మరోవైపు, హరి రూ. 10 లక్షల డబ్బును 10 శాతం రాబడి అంచనాలతో ఏకమొత్తంగా ఇన్వెస్ట్ చేశారనుకుందాం. అప్పుడు అతనికి పదేళ్ల తర్వాత రూ. 15.56 లక్షల మొత్తం లభిస్తుంది. అంటే, గిరితో పోలిస్తే హరికి అదనంగా రూ. 5.48 లక్షలు లభించినట్లవుతుంది. చివరిగా చెప్పేదేమిటంటే.. వివిధ కాలవ్యవధులవ్యాప్తంగా మార్కెట్లు పతనమవుతుండటమనేది ఇన్వెస్టర్లకు గందరగోళంగానే ఉండొచ్చు. అయితే, కాస్త ఓపిక పట్టి, లక్ష్యాలకు కట్టుబడి ఉంటే మెరుగైన ప్రయోజనాలనే పొందవచ్చు. మార్కెట్లు క్షీణించినప్పుడు, విశ్వసనీయమైన అడ్వైజరు సహాయం తీసుకుంటే, మీ జీవిత లక్ష్యాల సాధన దిశగా ఇన్వెస్ట్ చేయడంలో తగిన మార్గదర్శకత్వం లభిస్తుంది.

రూ.1,000 కోట్ల ఆదాయం

- మరిన్ని ఉత్పత్తుల ఆవిష్కరణ
- కొత్త ప్రాంతాలకు కార్యకలాపాల విస్తరణ
- ఎలక్ట్రానిక్స్ సంస్థ మివి లక్ష్యాలు



న్యూఢిల్లీ: హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహించే కన్జూమర్ ఎలక్ట్రానిక్స్‌ఉత్పత్తుల సంస్థ 'మివి' ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2025-26) రూ.1,000 ఆదాయాన్ని సాధించాలన్న లక్ష్యాన్ని పెట్టుకుంది. మరిన్ని విభాగాల్లో ఉత్పత్తులను ఆవిష్కరించడంతోపాటు మరిన్ని ప్రాంతాలకు కార్యకలాపాలను విస్తరించడం, కొత్త తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం, మార్కెటింగ్ వ్యూహాల అమలు ద్వారా దీన్ని సాధించనున్నట్లు మివి సహవ్యవస్థాపకులు మిధుల దేవభక్తుని, విశ్వనాథ్ కందుల ప్రకటించారు. ఈ సంస్థ 2024-25లో రూ.300 కోట్ల ఆదాయాన్ని నమోదు చేయడం గమనార్హం. 1,500 మందికి ఉపాధి కల్పిస్తోంది. కంపెనీ విస్తరణ ప్రణాళికల గురించి ఓ వార్తా సంస్థతో సహవ్యవస్థాకులు వివరాలు పంచుకున్నారు. ఐవోటీ డివైజ్‌లు, స్మార్ట్ వేరబుల్స్, స్మార్ట్ సీసీటీవీ కెమెరాలు, స్పీకర్లలోని ప్రవేశించనున్నట్లు చెప్పారు. అలాగే, ప్రస్తుత ఆడియో, మొబైల్ యాక్సెసరీల కార్యకలాపాలను మరింత విస్తరించనున్నట్లు తెలిపారు. ఇయర్ బడ్స్‌ను విడుదల చేయడం ద్వారా తొలుత ఇయర్‌ఫోన్లలోకి ప్రవేశించనున్నట్లు మిధుల ప్రకటించారు. ఏఐ ఆధారిత ప్లాట్‌ఫామ్ 'మివి ఏఐ'ని కంపెనీ ఇటీవలే ఆవిష్కరించడం గమనార్హం. తన ఉత్పత్తులకు ఏఐ టెక్నాలజీని జోడించడం ద్వారా కస్టమర్లకు మెరుగైన అనుభవం ఇచ్చే లక్ష్యంతో ఉంది. ఈ ఏఐ ప్లాట్‌ఫామ్ సాయంతో తమ ఆదాయాలను రెట్టింపు చేసుకోనున్నట్లు కంపెనీ వ్యవస్థాపకులు తెలిపారు. వచ్చే ఐదేళ్లలో ప్రజల నుంచి నిధులు (ఐపీవో) సమీకరించనున్నట్లు చెప్పారు.

హైదరాబాద్ కేంద్రంలో కార్యకలాపాలు...

హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తున్న తయారీ కేంద్రం జూన్ నాటికి కార్యకలాపాలు మొదలు పెడుతుందని మివి ప్రమోటర్లు ప్రకటించారు. 2 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటయ్యే ఈ సదుపాయం ద్వారా విడిభాగాల తయారీపై దృష్టి సారిస్తామని, అంతర్జాతీయ బ్రాండ్లతో భాగస్వామ్యాలను కుదుర్చుకోనున్నట్లు తెలిపారు. యూఎస్, మధ్యప్రాచ్యం, యూరప్ మార్కెట్లలోకి విస్తరించనున్నట్లు చెప్పారు.

బ్యాంకు అకౌంట్లు విశ్లేషించండి

కె.సీహెచ్. ఎ.వి.ఎస్.ఎన్ మూర్తి | కె.వి.ఎన్ లావణ్య



ట్యాక్సేషన్ నిపుణులు

ఏప్రిల్‌లో అడుగుపెట్టామంటే రెండు ఆలోచనలు వస్తాయి. మొదటిది 2025 మార్చి 31తో ముగిసిన గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రిటర్నులు దాఖలు చేయడానికి సిద్ధమవడం. రెండోది ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) పన్ను ప్రణాళికలను తయారు చేసుకోవడం. అందరూ కొత్త విధానానికి మొగ్గుచూపుతున్న పరిస్థితుల్లో పెట్టుబడులు/సేవింగ్స్‌పరంగా ప్లానింగ్‌కి తక్కువ అవకాశాలున్నాయి. అందుకని 2025 ఆర్థిక సంవత్సరానికి రిటర్న్ వేయడానికి ఎలా సిద్ధంగా ఉండాలో తెలుసుకుందాం.

1. మీకున్న అన్ని బ్యాంకుల ఖాతాలకు సంబంధించి స్టేట్‌మెంట్లు/పాస్‌బుక్స్‌లని అప్‌డేట్ చేయించండి.
2. ప్రతి బ్యాంకు అకౌంట్ సేట్‌మెంటుని తెచ్చుకోండి.
3. గత ఆర్థిక సంవత్సరం తొలి రోజు (1.4.2024) నుంచి చివరి రోజు (31.3.2025) వరకు బ్యాంకులోని జమలు పరిశీలించండి.

పతి జమకు వివరణ రాసుకోండి. అంటే నగదు ద్వారా, చెక్కు ద్వారా, బదిలీ ద్వారా, గూగుల్ ద్వారా వచ్చిందా? మీరే స్వయంగా నగదు డిపాజిట్ చేసారా అని తెలుకోండి. ఆదాయమా.. అప్పు తీసుకున్నారా..? మీకు ఎవరైనా అప్పు చెల్లించారా? డివిడెండా.. వడ్డీనా .. జీతమా.. ఇంటి కిరాయా .. వ్యాపార ఆదాయమా.. షేర్ల విక్రయం ద్వారా వచ్చిన ఆదాయమా? క్యాపిటల్ గెయిన్స్ ద్వారా వచ్చిన ఆదాయమా.. స్థిరాస్తి అమ్మకం ద్వారా వచ్చిన ఆదాయమా? పీఎఫ్ విత్‌డ్రా ద్వారా వచ్చినదా.. ఎన్ఎస్‌సీ లేదా ఎల్ఐసీ పాలసీ మెచ్యూరిటీ ద్వారా వచ్చినది డిపాజిట్ చేశారా..? అలాగే చిట్‌ఫండ్ పాట ద్వారా వచ్చిందా? మన కుటుంబ సభ్యులు పంపించారా.., మన దేశం నుంచి వచ్చిందా.., విదేశాల నుంచి వచ్చిందా అనే దానిపై కచ్చితమైన అవగాహన ఉండాలి. వీటిలో కొన్నింటిపై పన్ను ఉంటుంది. కొన్ని పన్ను భారానికి గురికావు. కొన్ని ఆదాయ పరిధిలోకి వస్తాయి. కొన్నింటికి మినహాయింపు ఉంటుంది. ఇవి నిర్ధారించాలంటే మనకు ఎవరిచ్చారో కచ్చితంగా తెలియాలి. ఇచ్చిన వ్యక్తి పేరు, చిరునామా, పాన్ నెంబర్ సిద్ధంగా ఉంచుకోవాలి. దేని నిమిత్తం వచ్చిందో రాసుకోవాలి. ప్రతిదానికి రుజువులు ఉండాలి. ఇలా అన్ని అకౌంట్లలో అన్ని జమలకు వివరణ ఉండాలి. ఎందుకంటే ఈ వివరణ మీదే మీ పన్ను భారం ఆధారపడి ఉంటుంది.



ఇక రెండవ సైడు ... రెండో కాలమ్.. ఖర్చు కాలమ్. డెబిట్‌లోని పద్దులు/ఎంట్రీలు .. ఈ వ్యవహారాలు కూడా చాలా ముఖ్యమైనవి. ఇవి ఖర్చులే కదా అని అశ్రద్ధ వహించకండి. ఖర్చులు/డెబిట్‌లు మీ ఆదాయాన్ని నిర్ధారిస్తాయి. ఉదాహరణకు ఆదాయానికి మించిన ఖర్చులుంటే వాటికి తగిన 'మార్గాలు' లేకపోయినా .. లేదా మీరు ఇవ్వకపోయినా ఆ ఖర్చును ఆదాయంగా భావిస్తారు. ఖర్చు దేని మీద చేసారు? ఏ నిమిత్తం చేసారు అనేది మీకు డెబిట్. మరో అకౌంట్లో జమ అంటే క్రెడిట్. అది మీకు ఆదాయం కాదంటే, అటువైపు వ్యక్తికి ఆదాయం కావచ్చు/కాకపోవచ్చు. దీన్ని నిరూపించాలి. అంటే ఈ మేరకు మీరు స్వయంగా 'కన్ఫర్మ్' చేయాలి. అందుకని డెబిట్‌ను విశ్లేషించండి. కొన్ని చెల్లింపుల్లో ఆదాయ పన్ను చట్టప్రకారం మీరే బాధ్యులుగా ఉంటారు. ఉదాహరణకు మీరు జీతం ఇస్తారనుకుందాం... టీడీఎస్ తీసేశారా (కట్ చేశారా).., కమీషన్ ఇస్తే టాక్స్ రికవరీ చేశారా.., షేర్లు కొంటే వాటి మీద డివిడెండ్ ఎంత? ఎవరికైనా అప్పు ఇస్తే వడ్డీ వచ్చిందా, ఏదైనా ఇన్వెస్ట్‌మెంట్ చేస్తే దాని మీద ఆదాయమెంత, ఏవైనా స్థిరాస్తులు కొంటే దాని మీద ఆదాయమెంత? ఈ స్థిరాస్తి కొనేందుకు ఎంత అయ్యింది? ఎలా ఖర్చు పెట్టారు .. సోర్స్ ఏమిటి? ఇలా ప్రతి బ్యాంకు అకౌంటులో జమలు/ఖర్చులు విశ్లేషించాలి. వివరణలు రాసుకోవాలి.

పన్నుకు సంబంధించిన సందేహాలు ఏవైనా ఉంటే పాఠకులు business@sakshi.comకు ఈ-మెయిల్ పంపించగలరు.

పోర్ట్‌ఫోలియోకి అనువైనది..

కోటక్ ఫ్లెక్సీక్యాప్ ఫండ్





మెరుగైన రాబడుల కోసం ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేసే వారు రిస్క్-రాబడుల సమతుల్యంపై దృష్టి సారించాలి. అప్పుడే దీర్ఘకాలంలో పెట్టుబడికి రక్షణతోపాటు, మెరుగైన రాబడినీ పొందొచ్చు. ఇక మార్కెట్లో మెరుగైన రాబడి కోసం ఏ తరహా కంపెనీలను ఎంపిక చేసుకోవాలన్నది రిటైల్ ఇన్వెస్టర్లకు అంత సులభంగా అర్థం అయ్యేది కాదు. ఆర్థిక పరిణామాలు, అంతర్జాతీయ అనిశ్చితులు, కరెన్సీ మారకం విలువలు, టారిఫ్‌లు.. ఇలా ఎన్నో అంశాల ఆధారంగా కంపెనీల్లో పెట్టుబడులను మార్పులు చేర్పులు చేసుకోవాల్సి వస్తుంది. అలాగే, మెగాక్యాప్–లార్జ్ క్యాప్ కంపెనీల్లో ఉన్నంత స్థిరత్వం మధ్య, చిన్న స్థాయి కంపెనీల్లో ఉండదు. అయినప్పటికీ మిడ్, స్మాల్ క్యాప్‌లో సరైన సమయంలో సరైన అవకాశాలను గుర్తించి ఇన్వెస్ట్ చేస్తే దీర్ఘకాలంలో లార్జ్‌క్యాప్‌నకు మించి రాబడిని ఇస్తాయి. ఇలా లార్జ్, మిడ్, స్మాల్ క్యాప్ విభాగాల్లో మెరుగైన పెట్టుబడుల అవకాశాలను అందించేవే ఫ్లెక్సీక్యాప్ ఫండ్స్. ఒకే పథకంతో అన్ని విభాగాల్లోనూ ఎక్స్‌పోజర్‌కు వీలు లభిస్తుంది. ఈ విభాగంలో కోటక్ ఫ్లెక్సీక్యాప్ మెరుగైన రాబడులు అందిస్తోంది. కొంత రిస్క్ తీసుకునే వారు, 10 ఏళ్లు అంతకుమించిన లక్ష్యాల కోసం ఇన్వెస్ట్ చేసే వారు ఈ పథకాన్ని పరిశీలించొచ్చు.

రాబడులు

ఈ పథకం గడిచిన ఏడాది కాలంలో 6.48 శాతం రాబడిని అందించింది. మూడేళ్ల కాలంలో చూస్తే వార్షిక రాబడి 14 శాతానికి పైనే ఉంది. ఈ కాలంలో బీఎస్ఈ 500 టీఆర్ఐ 3.76 శాతం, 13 శాతం చొప్పున రాబడిని ఇస్తే.. ఫ్లెక్సీక్యాప్ విభాగం సగటు రాబడి ఏడాది కాలంలో 5.63 శాతం, మూడేళ్లలో 14 శాతం చొప్పున ఉండడం గమనార్హం. ఇక ఐదేళ్ల కాలంలో ఈ పథకం 26 శాతం చొప్పున ఏటా పెట్టుబడులపై రాబడిని తెచ్చిపెట్టింది. ఏడేళ్లలో 14 శాతం, పదేళ్లలోనూ 14 శాతం చొప్పున డైరెక్ట్ ప్లాన్‌లో రాబడులను గమనించొచ్చు. ఫ్లెక్సీక్యాప్ విభాగం, బీఎస్ఈఐ 500 టీఆర్ఐ సూచీల కంటే పదేళ్ల కాలంలో ఈ పథకంలోనే సగటు వార్షిక ప్రతిఫలం ఎక్కువగా ఉంది. ఈ పథకం 2013 జనవరిలో మొదలైంది. అప్పటి నుంచి చూస్తే వార్షిక రాబడి 16 శాతానికి పైనే ఉంది. ఇటీవలి దిద్దుబాటు అనంతరం ప్రస్తుత స్టాక్స్ విలువల ఆధారంగా సర్దుబాటు చేసిన రాబడులు ఇవి.

పెట్టుబడుల విధానం

మల్టీక్యాప్ ఫండ్స్ అన్ని రకాల మార్కెట్ విలువలతో కూడిన స్టాక్స్‌లో ఇన్వెస్ట్ చేస్తుంటాయి. మార్కెట్లో ఎప్పుడూ అన్ని విభాగాలు ఒకే రీతిలో పని చేస్తాయని చెప్పలేం. కొన్ని సందర్భాల్లో లార్జ్ క్యాప్ కంపెనీల్లో ఎక్కువ ర్యాలీ ఉండొచ్చు. కొన్ని సందర్భాల్లో మిడ్, స్మాల్‌క్యాప్ కంపెనీలు లార్జ్‌క్యాప్ కంటే అధిక రాబడులు ఇస్తుంటాయి. ప్రస్తుతం చూస్తున్నట్టు కొన్ని సైకిల్స్‌లో స్మాల్, మిడ్‌క్యాప్ కంపెనీల్లో దిద్దుబాటు ఎక్కువగా ఉంటుంది. ఆయా విభాగాల్లో వ్యాల్యూషన్ల ఆధారంగా ఈ పథకం మొత్తం పెట్టుబడులను తగ్గించుకోవడం, పెంచుకోవడం చేస్తుంటుంది. తద్వారా మెరుగైన రాబడులను ఇచ్చే విధంగా పనిచేస్తుంది.

పోర్ట్‌ఫోలియో

ప్రస్తుతం ఈ పథకం నిర్వహణలో రూ.45,433 కోట్ల పెట్టుబడులు ఉన్నాయి. ఇందులో 97.45 శాతాన్ని ఈక్విటీల్లో, డెట్‌లో 0.15 శాతం ఇన్వెస్ట్ చేసింది. 2.4 శాతం మేర నగదు నిల్వలు కలిగి ఉంది. ప్రస్తుత మార్కెట్‌లో ఆకర్షణీయమైన అవకాశాల్లో ఇన్వెస్ట్ చేసేందుకు వీలుగా ఈ మేర నగదు నిల్వలు కలిగి ఉన్నట్టు తెలుస్తోంది. మెగా, లార్జ్‌క్యాప్ కంపెనీల్లో 82 శాతం పెట్టబుడులు కలిగి ఉండడాన్ని ప్రధానంగా గమనించాలి. మిడ్, స్మాల్‌క్యాప్ కంటే లార్జ్ క్యాప్ విలువలే చౌకగా ఉన్నందున ఈ విభాగానికి ఎక్కువ కేటాయింపులు చేసినట్టు తెలుస్తోంది. ఇక మిడ్‌క్యాప్‌లో 17.17 శాతం పెట్టుబడులు కలిగి ఉంది. స్మాల్‌క్యాప్ పెట్టుబడులు ఒక శాతం లోపే ఉన్నాయి. బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్ రంగ కంపెనీల్లో అత్యధికంగా 25 శాతం ఇన్వెస్ట్ చేసింది. ఆ తర్వాత మెటీరియల్స్ కంపెనీల్లో 18 శాతం, టెక్నాలజీ కంపెనీల్లో 16 శాతం, ఇండస్ట్రియల్ కంపెనీల్లో 15 శాతం చొప్పున పెట్టుబడులు ఉన్నాయి.

టాప్ ఈక్విటీ హోల్డింగ్స్

కంపెనీ	పెట్టుబడులు శాతం
ఐసీఐసీఐ బ్యాంక్	7.02
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	6.10
భారత్ ఎలక్ట్రానిక్స్	5.26
ఇన్ఫోసిస్	4.46
ఎల్అండ్‌టీ	3.97
అల్ట్రాటెక్ సిమెంట్	3.90
ఎస్ఆర్ఎఫ్	3.85
ఎస్‌బీఐ	3.61
జిందాల్ స్టీల్	3.58
యాక్సిస్ బ్యాంక్	3.58

16 ఏళ్ల ప్రపంచ రికార్డు బద్దలు



పురుషుల 400 మీటర్ల ఫ్రీస్టయిల్‌లో జర్మనీ స్విమ్మర్ లుకాస్ మార్టిన్ ఘనత

స్టాక్‌హోమ్ (స్వీడన్): పురుషుల స్విమ్మింగ్ 400 మీటర్ల ఫ్రీస్టయిల్ విభాగంలో 16 ఏళ్లుగా చెక్కు చెదరకుండా ఉన్న ప్రపంచ రికార్డు బద్దలైంది. స్విమ్ ఓపెన్ స్టాక్‌హోమ్ టోర్నీలో జర్మనీకి చెందిన లుకాస్ మార్టిన్ ఈ విభాగంలో కొత్త ప్రపంచ రికార్డు సృష్టించాడు. పారిస్ ఒలింపిక్స్‌లో స్వర్ణ పతకం నెగ్గిన లుకాస్ మార్టిన్ 400 మీటర్లను 3 నిమిషాల 39.96 సెకన్లలో పూర్తి చేసి విజేతగా నిలిచాడు. ఈ క్రమంలో 2009 నుంచి పాల్ బీడెర్మన్ (3ని:40.07 సెకన్లు; జర్మనీ) పేరిట ఉన్న ప్రపంచ రికార్డును మార్టిన్ బద్దలు కొట్టాడు. 2009లో రోమ్‌లో జరిగిన ప్రపంచ చాంపియన్‌షిప్‌లో 'సూపర్ సూట్స్' ధరించి బీడెర్మన్ ఈ రికార్డు నెలకొల్పాడు. 2010లో ప్రపంచ స్విమ్మింగ్ సమాఖ్య 'సూపర్ సూట్స్'ను నిషేధించింది.

సెమీస్‌లో బాలాజీ జోడీ ఓటమి



చెన్నై: మెక్సికో సిటీ ఓపెన్ ఏటీపీ చాలెంజర్–125 టెన్నిస్ టోర్నీలో భారత డబుల్స్ మూడో ర్యాంకర్ శ్రీరామ్ బాలాజీ పోరాటం ముగిసింది. మెక్సికో సిటీలో జరిగిన ఈ టోర్నీ డబుల్స్ సెమీఫైనల్లో టాప్ సీడ్ శ్రీరామ్ బాలాజీ (భారత్)–మిగెల్ రేయస్ వరేలా (మెక్సికో) ద్వయం 4–6, 5–7తో సాంటియాగో గొంజాలెజ్ (మెక్సికో)–ఆస్టిన్‌క్రాయిసెక్ (అమెరికా) జోడీ చేతిలో ఓడిపోయింది. 86 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో బాలాజీ–వరేలా మూడు ఏస్‌లు సంధించి, ఎనిమిది డబుల్ ఫాల్ట్‌లు చేశారు. తమ సర్వీస్‌ను మూడుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను ఒకసారి బ్రేక్ చేశారు. సెమీఫైనల్లో ఓడిన బాలాజీ–వరేలాలకు 3470 డాలర్ల (రూ. 2 లక్షల 98 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 45 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

ఫైనల్లో మధ్యప్రదేశ్, పంజాబ్



ఝాన్సీ: జాతీయ సీనియర్ పురుషుల హాకీ చాంపియన్‌షిప్‌లో మధ్యప్రదేశ్, పంజాబ్ జట్లు టైటిల్ పోరుకు అర్హత సాధించాయి. ఆదివారం జరిగిన తొలి సెమీఫైనల్లో మధ్యప్రదేశ్ 5–3 గోల్స్ తేడాతో మణిపూర్ జట్టును ఓడించింది. మధ్యప్రదేశ్ తరఫున కెప్టెన్ యూసుఫ్ అఫాన్ (5వ, 34వ నిమిషాల్లో), అలీ అహ్మద్ (7వ, 15వ నిమిషాల్లో) రెండు గోల్స్ చొప్పున చేయగా... మొహమ్మద్ జైద్ ఖాన్ (49వ నిమిషంలో) ఒక గోల్ సాధించాడు. మణిపూర్ తరఫున రబిచంద్ర సింగ్(47వ నిమిషంలో), కెప్టెన్ చింగ్లెన్‌సనా సింగ్ కంగుజామ్ (50వ నిమిషంలో), లైస్రామ్ దీపూ సింగ్ (53వ నిమిషంలో) ఒక్కో గోల్ సాధించారు. రెండో సెమీఫైనల్లో పంజాబ్ 4–3 గోల్స్ తేడాతో ఉత్తరప్రదేశ్ జట్టుపై గెలిచింది. పంజాబ్ తరఫున జస్జీత్ సింగ్ కులార్ (14వ, 40వ నిమిషాల్లో) రెండు గోల్స్ చేయగా... హర్జీత్ సింగ్ (22వ నిమిషంలో), జుగ్‌రాజ్ సింగ్ (45వ నిమిషంలో) ఒక్కో గోల్ సాధించారు. ఉత్తరప్రదేశ్ జట్టుకు శార్దానంద్ తివారి (41వ, 43వ నిమిషాల్లో) రెండు గోల్స్ అందించగా... పవన్ రాజ్‌భర్ ఒక గోల్ చేశాడు.

ఈనెల 20న తెలంగాణ ర్యాంకింగ్ చెస్ టోర్నీ

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ జిల్లా చెస్ అసోసియేషన్ (హెచ్‌డీసీఏ) ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీన తెలంగాణ ర్యాంకింగ్ చెస్ టోర్నమెంట్ జరగనుంది. లాల్‌బహదూర్ స్టేడియంలోని యోగా హాల్‌లో ఈ టోర్నీని నిర్వహిస్తారు. అండర్–7, 9, 11, 13, 15 వయో పరిమితి విభాగాలలో బాలబాలికలు పాల్గొనవచ్చు. 1-1-2010న లేదా ఆ తర్వాత జన్మించిన వారు ఈ టోర్నీలో పాల్గొనేందుకు అర్హులు. టాప్–10లో నిలిచిన వారికి ట్రోఫీలు అందజేస్తారు. పాల్గొన్న వారందరికీ సర్టిఫికెట్లు, మెడల్స్ బహూకరిస్తారు. స్పాట్ ఎంట్రీలకు అవకాశం లేదు. ఆసక్తిగలవారు ఏప్రిల్ 18వ తేదీ లోపు తమ పేర్లను 7337578899, 7337399299 ఫోన్ నంబర్లలో నిర్వాహకులను సంప్రదించి నమోదు చేసుకోవాలని హెచ్‌డీసీఏ అధ్యక్షుడు కేఎస్ ప్రసాద్ తెలిపారు.



బిల్లీ జీన్ కింగ్ కప్ మహిళల టీమ్ టెన్నిస్ టోర్నమెంట్‌లో భారత జట్టు ప్రపంచ గ్రూప్ ప్లే ఆఫ్స్ దశకు అర్హత సాధించింది. పుణేలో జరిగిన ఆసియా ఓసియానియా గ్రూప్–1లో భారత జట్టు ఎనిమిది పాయింట్లతో రెండో స్థానంలో నిలిచి 2021 తర్వాత మళ్లీ వరల్డ్ గ్రూప్ ప్లే ఆఫ్స్ రౌండ్‌కు చేరుకుంది. భారత జట్టు విజయంలో తెలంగాణ అమ్మాయి భమిడిపాటి శ్రీవల్లి రష్మిక కీలక పాత్ర పోషించింది. రష్మిక ఈ టోర్నీలో తాను ఆడిన ఐదు సింగిల్స్ మ్యాచ్‌ల్లోనూ విజయం సాధించడం విశేషం. తెలంగాణకే చెందిన సహజ యామలపల్లితోపాటు అంకిత రైనా, వైదేహి, ప్రార్థన, మాయా రాజేశ్వరన్ భారత జట్టులో సభ్యులుగా ఉన్నారు. జట్టుకు కోచ్‌గా విశాల్ ఉప్పల్ వ్యవహరించాడు.

పియాస్ట్రి... మళ్లీ గెలిచాడు

ఫార్ములావన్ సీజన్‌లో రెండో విజయం

- బహ్రెయిన్ గ్రాండ్‌ప్రిలో విజేతగా నిలిచిన మెక్‌లారెన్ డ్రైవర్

సాఖిర్ (బహ్రెయిన్): క్వాలిఫయింగ్‌లో కనబరిచిన జోరును ప్రధాన రేసులోనూ కొనసాగించిన మెక్‌లారెన్ జట్టు డ్రైవర్ ఆస్కార్ పియాస్ట్రి ఈ సీజన్‌లో రెండో విజయాన్ని అందుకున్నాడు. ఫార్ములావన్ 2025 సీజన్‌లో భాగంగా ఆదివారం జరిగిన సీజన్ నాలుగో రేసు బహ్రెయిన్ గ్రాండ్‌ప్రిలో పియాస్ట్రి విజేతగా నిలిచాడు. 'పోల్ పొజిషన్'తో రేసును ఆరంభించిన ఆస్ట్రేలియాకు చెందిన పియాస్ట్రి... నిర్ణీత 57 ల్యాప్‌లను అందరికంటే వేగంగా, అందరికంటే ముందుగా 1 గంట 35 నిమిషాల 39.435 సెకన్లలో పూర్తి చేసి అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. ఈ సీజన్‌లో చైనా గ్రాండ్‌ప్రిలోనూ పియాస్ట్రి టైటిల్ సాధించాడు. మెర్సిడెస్ జట్టుకు చెందిన జార్జి రసెల్ రెండో స్థానాన్ని పొందగా... మెక్‌లారెన్‌కే చెందిన లాండో నోరిస్ మూడో స్థానంలో నిలిచాడు. గత నాలుగేళ్లుగా ప్రపంచ చాంపియన్‌గా నిలుస్తున్న రెడ్‌బుల్ జట్టు డ్రైవర్ మాక్స్ వెర్‌స్టాపెన్ ఆరో స్థానంతో సరిపెట్టుకోగా... ఫెరారీ తరఫున తొలిసారి బరిలోకి దిగిన లూయిస్ హామిల్టన్ ఐదో స్థానాన్ని సాధించాడు. 24 రేసుల ఈ సీజన్‌లో నాలుగు రేసులు పూర్తయ్యాయి. 77 పాయింట్లతో లాండో నోరిస్ అగ్ర స్థానంలో... 74 పాయింట్లతో ఆస్కార్ పియాస్ట్రి రెండో స్థానంలో... వెర్‌స్టాపెన్ 69 పాయింట్లతో మూడో స్థానంలో ఉన్నారు. సీజన్‌లోని ఐదో రేసు సౌదీ అరేబియా గ్రాండ్‌ప్రి ఈనెల 20న జిద్దా నగరంలో జరుగుతుంది.



బహ్రెయిన్ గ్రాండ్‌ప్రి రేసు ఫలితాలు

స్థానం	డ్రైవర్	జట్టు	టైమింగ్	వ్యత్యాసం	పాయింట్లు
1	ఆస్కార్ పియాస్ట్రి	మెక్‌లారెన్	1:35:39.435 సెకన్లు	–	25
2	జార్జి రసెల్	మెర్సిడెస్	1:35:54.934 సెకన్లు	15.499 సెకన్లు	18
3	లాండో నోరిస్	మెక్‌లారెన్	1:35:55.708 సెకన్లు	16.273 సెకన్లు	15
4	చార్లెస్ లెక్‌లెర్క్	ఫెరారీ	1:35:59.114 సెకన్లు	19.679 సెకన్లు	12
5	హామిల్టన్	ఫెరారీ	1:36:07.428 సెకన్లు	27.993 సెకన్లు	10
6	వెర్‌స్టాపెన్	రెడ్‌బుల్	1:36:13.830 సెకన్లు	34.395 సెకన్లు	8
7	పియరీ గ్యాస్లీ	అల్పైన్ టీమ్	1:36:15.437 సెకన్లు	36.002 సెకన్లు	6
8	ఎస్టెబన్ ఒకాన్	హాస్ టీమ్	1:36:23.679 సెకన్లు	44.244 సెకన్లు	4
9	యూకీ సునోడా	రెడ్‌బుల్	1:36:24.496 సెకన్లు	45.061 సెకన్లు	2
10	ఒలివెర్ బేర్మన్	హాస్ టీమ్	1:36:27.029 సెకన్లు	47.594 సెకన్లు	1

డోపింగ్‌లో విఫలమైన భారత అథ్లెట్ కార్తీక్



న్యూఢిల్లీ: భారత లాంగ్ డిస్టెన్స్ రన్నర్ కార్తీక్ కుమార్ డోపింగ్ పరీక్షలో విఫలమయ్యాడు. దాంతో అతనిపై తాత్కాలిక నిషేధం విధించారు. 2023 హాంగ్జౌ ఆసియా క్రీడల్లో కార్తీక్ కుమార్ పురుషుల 10,000 మీటర్ల విభాగంలో రెండో స్థానంలో నిలిచి రజత పతకం సాధించాడు. ఇటీవల శిక్షణ కోసం అమెరికాలోని కొలరాడో స్ప్రింగ్స్‌కు కార్తీక్ వెళ్లాడు. అక్కడ యూఎస్ యాంటీ డోపింగ్ ఏజెన్సీ అధికారులు కార్తీక్‌కు డోపింగ్ పరీక్షలు నిర్వహించారు. కార్తీక్ శరీరంలో నిషేధిత ఉత్ప్రేరకాల ఆనవాళ్లు ఉన్నట్లు తేలడంతో అతనిపై తాత్కాలిక నిషేధం విధించారు.

బంగ్లాదేశ్‌ను గెలిపించిన రీతూ



లాహోర్: ఐసీసీ మహిళల వన్డే ప్రపంచకప్ క్వాలిఫయింగ్ టోర్నీలో బంగ్లాదేశ్ జట్టు జోరు కొనసాగుతోంది. ఆదివారం జరిగిన పోరులో బంగ్లాదేశ్ జట్టు 2 వికెట్ల తేడాతో ఐర్లాండ్‌పై గెలుపొందింది. మొదట బ్యాటింగ్ చేసిన ఐర్లాండ్ మహిళల జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 235 పరుగులు చేసింది. లౌరా డెలానీ (75 బంతుల్లో 63; 6 ఫోర్లు) హాఫ్ సెంచరీ సాధించగా... ప్రెండర్‌గాస్ట్ (41), అమీ హంటర్ (33) రాణించారు. బంగ్లాదేశ్ బౌలర్లలో రాబియా ఖాన్ 3, ఫహిమా ఖాతూన్ 2 వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనలో బంగ్లాదేశ్ మహిళల జట్టు 48.4 ఓవర్లలో 8 వికెట్లకు 240 పరుగులు చేసింది. ఒకదశలో బంగ్లాదేశ్ 94 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. అయితే రీతూ మోనీ (61 బంతుల్లో 67 నాటౌట్; 6 ఫోర్లు, 1 సిక్స్) లోయర్ ఆర్డర్ బ్యాటర్ల సహకారంతో బంగ్లాదేశ్‌ను విజయతీరానికి చేర్చింది. అంతకుముందు కెప్టెన్ నిగార్ సుల్తానా (68 బంతుల్లో 51; 7 ఫోర్లు) అర్ధశతకంతో ఆకట్టుకుంది. ఐర్లాండ్ బౌలర్లలో ప్రెండర్‌గాస్ట్, అర్లీనా కెల్లి చెరో 2 వికెట్లు తీశారు. ఈ టోర్నీలో ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ గెలిచిన బంగ్లాదేశ్ 4 పాయింట్లతో పట్టిక అగ్రస్థానానికి చేరింది. తదుపరి మ్యాచ్‌లో మంగళవారం స్కాట్లాండ్‌తో బంగ్లాదేశ్ తలపడుతుంది.

స్కాట్లాండ్ రెండో విజయం

మరోవైపు స్కాట్లాండ్ జట్టు కూడా రెండో విజయం సాధించింది. థాయ్‌లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో స్కాట్లాండ్ 58 పరుగుల తేడాతో గెలిచింది. మొదట స్కాట్లాండ్ 41 ఓవర్లలో 206 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ క్యాథరిన్ బ్రైస్ (58 బంతుల్లో 60; 7 ఫోర్లు), మేగన్ మెక్‌కాల్ (60 బంతుల్లో 57; 6 ఫోర్లు, 1 సిక్స్) అర్ధశతకాలు సాధించారు. అలీసా లిస్టర్ (38; 6 ఫోర్లు) రాణించింది. అనంతరం లక్ష్యఛేదనలో థాయ్‌లాండ్ జట్టు 31.3 ఓవర్లలో 148 పరుగులకు ఆలౌటైంది. ఈ టోర్నమెంట్‌లో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు ఈ ఏడాది చివర్లో భారత్ వేదికగా జరగనున్న మహిళల వన్డే ప్రపంచకప్‌నకు అర్హత సాధిస్తాయి.

చెన్నై కోలుకునేనా!


ధోని


నేడు లక్నో సూపర్ జెయింట్స్‌తో ఢీ

రాత్రి గం. 7:30 నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

లక్నో: వరుస పరాజయాలతో సతమతమవుతున్న చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) జట్టు... 'హ్యాట్రిక్' విజయాలతో జోరు మీదున్న లక్నో సూపర్ జెయింట్స్‌తో పోరుకు సిద్ధమైంది. ఐపీఎల్ 18వ సీజన్‌లో 6 మ్యాచ్‌లు ఆడిన చెన్నై సూపర్ కింగ్స్ తొలి పోరులో గెలుపొందగా... ఆ తర్వాత వరుసగా ఆడిన ఐదు మ్యాచ్‌ల్లోనూ ఓడింది. ఐదుసార్లు ఐపీఎల్ ట్రోఫీ చేజిక్కించుకొని లీగ్‌లోనే అత్యంత విజయవంతమైన జట్టుగా గుర్తింపు పొందిన చెన్నై... తిరిగి గెలుపు బాట పట్టాలని భావిస్తోంది. గాయం కారణంగా రెగ్యులర్ కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ టోర్నీకి దూరం కాగా... గత మ్యాచ్‌లోనే 'మాస్టర్ మైండ్' మహేంద్రసింగ్ ధోని జట్టు పగ్గాలు చేపట్టాడు. అయితే పరాజయాలతో డీలా పడ్డ జట్టును అతడి సారథ్యం కూడా గట్టెక్కించలేకపోయింది. కోల్‌కతాతో జరిగిన పోరులో బ్యాటర్లంతా మూకుమ్మడిగా విఫలం కావడంతో చెన్నై ఘోర పరాజయం మూటగట్టుకుంది. వాటన్నింటిని పక్కన పెట్టి తిరిగి సత్తా చాటాలని ధోనీ సేన భావిస్తోంది. మరోవైపు రిషభ్ పంత్ సారథ్యంలోని లక్నో సూపర్ జెయింట్స్ జట్టు సీజన్‌లో 6 మ్యాచ్‌లాడి 4 విజయాలు, 2 పరాజయాలు నమోదు చేసుకుంది. గత మూడు మ్యాచ్‌ల్లో మాజీ చాంపియన్లు ముంబై ఇండియన్స్, కోల్‌కతా నైట్‌రైడర్స్, గుజరాత్ టైటాన్స్‌లపై గెలిచి లక్నో ఫుల్ జోష్‌లో ఉంది. మరి లక్నో జోరును అడ్డుకొని చెన్నై విజయాల బాట పడుతుందా చూడాలి!

హిట్టర్లతో దట్టంగా...

గత మూడు మ్యాచ్‌ల్లోనూ పవర్‌ప్లే వికెట్లు కోల్పోని లక్నో జట్టు... హిట్టర్లతో దట్టంగా ఉంది. వ్యక్తిగత కారణాల వల్ల గుజరాత్‌తో మ్యాచ్‌కు అందుబాటులో లేని మిచెల్ మార్ష్... చెన్నైతో పోరులో బరిలోకి దిగడం ఖాయమే. మార్క్‌రమ్, మిచెల్ మార్ష్, నికోలస్ పూరన్‌తో లక్నో టాపార్డర్ శత్రు దుర్భేద్యంగా ఉంది. గత కొన్నాళ్లుగా కేవలం సిక్స్‌లు కొట్టడమే తన లక్ష్యం అన్నట్లు చెలరేగిపోతున్న పూరన్‌ను అడ్డుకోవడం చెన్నై బౌలర్లకు కత్తి మీద సామే! ఈ సీజన్‌లో సీఎస్‌కే ప్లేయర్లంతా కలిసి 32 సిక్స్‌లు బాదితే... పూరన్ ఒక్కడే 31 సిక్స్‌లు కొట్టాడు. వన్‌డౌన్‌లో బ్యాటింగ్‌కు దిగుతున్న ఈ విండీస్ వీరుడు మరోసారి చెలరేగితే లక్నో జైత్రయాత్ర కొనసాగినట్లే. రిషభ్ పంత్, ఆయుశ్ బదోనీ, అబ్దుల్ సమద్‌లతో మిడిలార్డర్ బలంగా ఉండగా... డేవిడ్ మిల్లర్ ఫినిషింగ్ బాధ్యతలు తీసుకోనున్నాడు. ఇక అనూహ్యంగా జట్టులోకి వచ్చిన పేస్ ఆల్‌రౌండర్ శార్దుల్ ఠాకూర్ చక్కటి బౌలింగ్‌తో ఆకట్టుకుంటుండగా... యువ స్పిన్నర్ దిగ్వేశ్ రాఠీ... 'సంతకం' సంబరాలు కొనసాగించాలని చూస్తున్నాడు. అవేశ్ ఖాన్, ఆకాశ్ దీప్, రవి బిష్ణోయ్‌తో లక్నో బౌలింగ్‌లో మంచి వైవిధ్యం ఉంది.


పంత్

లోపాలు దిద్దుకుంటేనే!

చెన్నైకు ఈ సీజన్‌లో ఏదీ కలిసి రావడం లేదు. నిలకడ కనబర్చలేకపోతున్న ఆ జట్టు వరుస పరాజయాలతో సతమతమవుతోంది. డెవాన్ కాన్వే, రచిన్ రవీంద్ర రూపంలో మంచి ఓపెనర్లు ఉన్నా... ఆ తర్వాత ఇన్నింగ్స్‌ను నడిపించే వారు కరువయ్యారు. రాహుల్ త్రిపాఠి, విజయ్ శంకర్, శివమ్ దూబే, రవీంద్ర జడేజా స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేకపోతున్నారు. ఇక బ్యాటింగ్ ఆర్డర్‌లో అశ్విన్ తర్వాత క్రీజులోకి వస్తున్న ధోని... గతంలో మాదిరిగా ప్రత్యర్థి బౌలర్లపై ఆధిపత్యం కనబర్చ లేకపోతున్నాడు. ఇతర జట్లలో దేశీయ ఆటగాళ్లు చెలరేగుతుంటే... చెన్నైలో ఆ బాధ్యత తీసుకునే ప్లేయర్లు కనపించడం లేదు. కోల్‌కతాతో జరిగిన చివరి మ్యాచ్‌లో అయితే చెన్నై మరీ పేలవ ఆటతీరు కనబర్చింది. ప్లే ఆఫ్స్ రేసులో ముందంజ వేయాలంటే తప్పక గెలవాల్సిన పరిస్థితుల్లో ఆటగాళ్లంతా సమష్టిగా సత్తాచాటాలని మేనేజ్‌మెంట్ ఆశిస్తోంది. లీగ్ చరిత్రలో ఇప్పటి వరకు ఎప్పుడూ వరుసగా ఐదు మ్యాచ్‌లు ఓడని సీఎస్‌కే... మరో పరాజయం మూటగట్టుకుంటే ఇక కోలుకోవడం కష్టమే. స్పిన్నర్లను ఎదుర్కోవడంలో ఇబ్బంది పడుతున్న చెన్నై బ్యాటర్లు... దిగ్వేశ్ రాఠీ, రవి బిష్ణోయ్‌లను ఎలా ఎదుర్కొంటారనే దానిపైనే ఈ మ్యాచ్ ఫలితం ఆధారపడి ఉంది.

తుది జట్లు (అంచనా)

లక్నో సూపర్ జెయింట్స్: పంత్ (కెప్టెన్), మార్క్‌రమ్, మిచెల్ మార్ష్, పూరన్, పంత్, బదోనీ, మిల్లర్, సమద్, శార్దుల్, ఆకాశ్‌దీప్, రవి బిష్ణోయ్, అవేశ్ ఖాన్, దిగ్వేశ్ రాఠీ.

చెన్నై సూపర్ కింగ్స్: ధోని (కెప్టెన్), కాన్వే, రచిన్, త్రిపాఠి, విజయ్ శంకర్, శివమ్ దూబే, రవీంద్ర జడేజా, అశ్విన్, అన్షుల్ కంబోజ్, నూర్ అహ్మద్, ఖలీల్ అహ్మద్, పతిరణ.


టీ తాగుతున్న యూసఫ్ పఠాన్

నియోజకవర్గం అట్టుడుకుతుంటే చాయ్ ముచ్చట్లా!

ఎంపీ యూసఫ్ పఠాన్ ఇన్‌స్టా పోస్టుపై బీజేపీ విమర్శలు

కోల్‌కతా: తృణమూల్ ఎంపీ యూసఫ్ పఠాన్‌పై బీజేపీ విరుచుకుపడింది. ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న బెహ్రాంపూర్ పరిధిలో పలు ప్రాంతాలు వక్ఫ్ అల్లర్లతో అట్టుడుకుతున్నాయి. ఈ నేపథ్యంలో 'ప్రశాంతమైన మధ్యాహ్నం.. మంచి చాయ్.. ప్రశాంతమైన పరిసరాలు'అంటూ చాయ్ తాగుతున్న ఫొటోను యూసుఫ్ ఆదివారం ఇన్‌స్టాలో పోస్టు చేశారు. నియోజకవర్గం తగలబడి పోతుంటే ఇలాంటి పోస్టులా అంటూ బీజేపీ విరుచుకుపడింది. కాగా, వక్ఫ్ వ్యతిరేక నిరసనలతో అట్టుడికిన మాల్డా, ముర్షీదాబాద్, దక్షిణ 24 పరగణాలు, హుగ్లీ జిల్లాల్లో ఉద్రిక్తతలు ఆదివారం కొనసాగాయి. ముర్షిదాబాద్ నుంచి జనం భయంతో వలసబాట పడుతున్నారు. భద్రతా బలగాలు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించాయి. ఇప్పటిదాకా 150 మందిని అరెస్ట్ చేశారు. హింసాత్మక ప్రాంతాల్లో నిషేధాజ్ఞలు విధించారు. ఇంటర్నెట్ సేవలను నిలిపివేశారు. తృణమూల్‌ను లక్ష్యంగా చేసుకుని బీజేపీ కూడా పలుచోట్ల ప్రతి నిరసనలకు దిగింది.


తుర్కియేలోని ఇస్తాంబుల్ నగరంలో ఆదివారం రాత్రి కనువిందు చేసిన పున్నమి చంద్రుడు. నేపథ్యంలో కన్పిస్తున్నది సులేమానియా మసీదు


ఆదివారం అమృత్‌సర్‌లోని జలియన్‌వాలాబాగ్ స్మారకం వద్ద నివాళులర్పిస్తున్న పోలీసు సిబ్బంది

జలియన్‌వాలాబాగ్ అమరులకు నివాళులు

న్యూఢిల్లీ: 1919లో జలియన్‌వాలాబాగ్‌లో మారణకాండలో నేలకొరిగిన వారికి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం ఘనంగా నివాళులర్పించారు. మాతృభూమి కోసం ప్రాణాలర్పించిన ఆ త్యాగధనులకు ప్రజలు రుణపడి ఉంటారని ముర్ము పేర్కొన్నారు. వారి త్యాగాల వల్లే స్వాతంత్ర్య పోరాటం బలోపేతమైందన్నారు. వారిని భావి తరాలు సైతం గుర్తుంచుకుంటాయని మోదీ 'ఎక్స్'లో పేర్కొన్నారు. ''దేశ చరిత్రలో అదో చీకటి అధ్యాయం. వారి త్యాగం దేశ స్వాతంత్ర్య పోరాటంలో కీలకమైన మలుపు'' అన్నారు. రౌలత్ చట్టానికి వ్యతిరేకంగా అమృత్‌సర్‌లో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న వారిపై బ్రిటిష్ బలగాలు ఎలాంటి హెచ్చరికలూ లేకుండా కాల్పులకు తెగబడటంతో వందలాది మంది అసువులు బాయడం తెలిసిందే.


ప్రొఫెసర్ చింపాంజీలు!

భౌతిక శాస్త్ర సూత్రాలపై అవగాహన • వేటకు అనువైన కర్రపుల్లల ఎంపిక

చింపాంజీలను మన పూర్వీకులుగా చెబుతారు. అదెంత నిజమో గానీ మనిషిలాగే వాటికి కూడా భౌతిక శాస్త్ర సూత్రాలు బాగానే వంటబట్టాయని తాజా అధ్యయనంలో తేలింది. కడుపు నింపుకునేందుకు చెద పురుగులను తినడం చింపాంజీలకు అలవాటు. ఎర్రమట్టిలో, మెత్తటి నేలలు, మట్టి దిబ్బల్లో చెదపురుగులను చేత్తో ఏరకుండా, బొరియల్లో చెదలను ఒంపులు తిరిగిన కర్ర పుల్లలతో ఒడుపుగా పట్టుకోవడం వాటికి వెన్నతో పెట్టిన విద్య. అందుకోసం కనిపించిన కర్రపుల్లనల్లా వాడేయకుండా తమకు చక్కగా పనికొచ్చే పుల్లను మాత్రమే వేటకు వినియోగిస్తాయట. దాంతో, ఏ పుల్ల బాగా అక్కరకొస్తుందన్నది చింపాంజీలు ఎలా కనిపెడతాయో తెల్సుకోవాలనే జిజ్ఞాస పరిశోధకుల్లో ఎక్కువైంది. భౌతికశాస్త్రంపై వాటికి పట్టు ఎలా చిక్కిందనే అంశంపై పరిశోధన మొదలెట్టారు. వాటిలోనూ అభిజ్ఞాన వికాసం ఎక్కువేనని అందులో తేలింది. ఈ వివరాలు ఐసైన్స్ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. గట్టిగా ఉండే పుల్లలకు బదులు స్ప్రింగ్‌లాగా ఒంగిపోయే లక్షణమున్న కాస్తంత గట్టి పుల్లలతో వేట సులభమవుతుందని చింపాంజీలు గ్రహించాయని, ఇవి వాటిలోని సహజ సంగ్రహణ సామర్థ్యం వల్లే సాధ్యమైందని పరిశోధకులు చెబుతున్నారు.

మట్టిదిబ్బల్లో మహా ఒడుపుగా

మట్టిదిబ్బల్లో ఇబ్బడిముబ్బడిగా చెదపురుగులు ఉంటాయి. చైనా వాళ్లు నూడుల్స్‌ను ఎలాగైతే తెల్లని సన్నని చిన్న కర్రపుల్లతో తింటారో అచ్చం అలాగే చింపాంజీలు చెదపురుగులను పుల్లలకు అంటుకునేలా చేసి ఆబగా ఆరగిస్తాయి. అలాగే అలా తినాలంటే వాటికి సహజసిద్ధ పుల్లలు కావాలి. మట్టిదిబ్బ బురద బొరియలో ఒకసారి లోపలికి దూర్చాక బయటకు తీస్తే మట్టి బరువుకు పుల్ల విరిగిపోవచ్చు. మెత్తడి పుల్ల తీసుకుంటే మట్టి తడికి మెత్తబడిపోతుంది. అలాగని గట్టి పుల్ల తీసుకుంటే గట్టిగా లాగితే విరిగిపోతుంది. దీంతో మెత్తబడని, సులువుగా ఒంగిపోయే బలమైన పుల్ల అవసరం చింపాంజీలకు ఏర్పడింది. బిరుసుగా ఉండే కర్రపుల్లకు బదులు బురద బొరియల్లో అలవోకగా ఒంగుతూ దూరిపోయే ఫ్లెక్సిబుల్ పుల్లతోనే పని సులువు అవుతుందని చింపాంజీలు కనిపెట్టాయని పరిశోధనల్లో ముఖ్య రచయిత అలెజాంద్రా పాస్కల్ గరిడో చెప్పారు. '' దగ్గర్లోని ప్రతి పుల్లను అవి మొదట సరిచూస్తాయి. మెత్తగా ఉందా, గట్టిగా ఉందా, వంచేస్తే విరుగుతుందా, ఎంత కోణం వరకు విరగకుండా వంగగలదు? ఇలాంటి టెస్ట్‌లన్నింటినీ పుల్లలపై చేస్తాయి. అన్ని టెస్టుల్లో పాసైన పుల్లనే చెదపురుగుల వేటకు వినియోగిస్తాయి. టాంజానియా దేశంలోని గాంబే నేషనల్ పార్క్‌లోని చింపాంజీల వేట విధానాలపై ఈ పరిశోధన చేశారు. అడవిలో భిన్న రకాల చెట్ల నుంచి ఒకతరహా పుల్లలు వస్తున్నప్పటికీ కొత్త జాతుల చెట్ల పుల్లలనే చింపాంజీలు వినియోగిస్తుండటం విశేషం. చింపాంజీలు నివసించే ప్రదేశాల్లో వేర్వేరు రకాల పుల్లలు ఉన్నప్పటికీ ఏకంగా 175 శాతం ఎక్కువగా ఒంగిపోయే సామర్థ్యమున్న పుల్లలనే చింపాంజీలు ఎంపికచేసి వాడుతున్నాయి. ఒకే జాతి చెట్ల పుల్లల్లో ఒంగిపోయే గుణమున్నా, ఎక్కువ ఒంగే లక్షణమున్న ఉపజాతి చెట్ల పుల్లలనే అవి కనిపెట్టి వాడుతుండటం చూస్తుంటే వీటిని నిజంగా ఫిజిక్స్ మీద మంచి పట్టు ఉన్నట్లు చెప్పొచ్చు'' అని పాస్కల్ వ్యాఖ్యానించారు. '' ఒంగే పుల్లల్లోనూ ఏది ప్రస్తుతం వాడేందుకు అనువుగా ఉంది అనే అంశాన్ని తీరా వేట మొదలెట్టే



టప్పుడూ పరీక్షించి చూస్తున్నాయి. తోటి చింపాంజీ ఏ రకం పుల్లను వాడుతోంది? అది పుల్లను ఎలా వినియోగిస్తోంది? వేట ఫలితం బాగుందా? అనే వాటినీ పక్కక ఉన్న మరో చింపాంజీ గమనిస్తుంది. మానవుల పూర్వీకులు సైతం ఇలాగే సమష్టిగా వేటాడుతూ వనోత్పత్తులను తమ వేటకు ఉపకరణాలుగా వాడుకునేవారు. ఇలాగే చెక్క సంబంధ వస్తువుల వినియోగంలో విప్లవాత్మక మార్పులు సాధ్యమయ్యాయి'' అని పాస్కల్ వ్యాఖ్యానించారు. '' చింపాంజీలపై చేసిన ఈ పరిశోధన వాటికి ఏ పుల్ల అనువుగా ఉంది, అందుబాటులో ఉంది అనేది మాత్రమే కాదు వాటి అభిజ్ఞానవికాస స్థాయినీ తెలియజేస్తోంది. మన ఇంజనీరింగ్ సామర్థ్యాలు వేల సంవత్సరాల క్రితమే పరిణామ క్రమంలో మనలో ఇమిడిపోయాయనడానికి ఇదొక తార్కాణం. ఆదిమ మానవుల కాలం నుంచే అనాదిగా మనిషిలో ఇలా మేధాశక్తి పరంపరగా వస్తోంది'' అని ఆయన అన్నారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

హసీనాకు మరో అరెస్ట్ వారెంట్

ఢాకా: అధికారాన్ని దుర్వినియోగం చేసి అక్రమంగా భూమిని స్వాధీనం చేసుకున్నారన్న ఆరోపణలపై బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు బంగ్లాదేశ్ కోర్టు ఆదివారం అరెస్టు వారెంట్ జారీ చేసింది. ఆమె సోదరి షేక్ రెహానా, బ్రిటిష్ ఎంపీ తులిప్ రిజ్వానా సిద్ధిఖ్ సహా మరో 50 మంది పేర్లు పొందుపరిచింది. అధికార దుర్వినియోగంతో పుర్బాచల్ న్యూటౌన్ ప్రాజెక్టులో 10 అంతస్తుల స్థలాన్ని కొనుగోలు చేశారంటూ జనవరి 13న రెహానాపై ఏసీసీ కేసు నమోదు చేసింది. ఈ కేసులో హసీనా, రెహానా కుమార్తె బ్రిటిష్ ఎంపీ తులిప్ రిజ్వానా సిద్ధిఖ్ సహా 15 మందిని నిందితులుగా చేర్చారు. మరో 17 మందిపై చార్జిషీట్ దాఖలు చేసిన ఏసీసీ మార్చి 10న సమర్పించిన తుది చార్జిషీట్‌లో మరో 18 మంది పేర్లు చేర్చింది. మూడు వేర్వేరు ఛార్జిషీట్లను పరిశీలించిన అనంతరం ఢాకా మెట్రోపాలిటన్ సీనియర్ స్పెషల్ జడ్జి జాకీర్ హుస్సేన్ ఈ ఆదేశాలు జారీ చేశారు. అరెస్టు ఉత్తర్వుల అమలుపై నివేదికలను సమీక్షించడానికి విచారణను ఏప్రిల్ 27కు వాయిదా వేశారు. రజుక్ ప్లాట్ల కేటాయింపులకు సంబంధించిన మరో అవినీతి కేసులో హసీనా, ఆమె కుమార్తె సైమా వజీద్ పుతుల్, మరో 17 మందిపై ఏప్రిల్ 10న ఇదే కోర్టు అరెస్టు వారెంట్లు జారీ చేసింది. పుతుల్ 2023 నవంబర్ 1 నుంచి న్యూఢిల్లీ కేంద్రంగా ఉన్న ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) ఆగ్నేయాసియా ప్రాంతీయ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. హసీనాపై సామూహిక హత్యలు, మానవత్వానికి వ్యతిరేకంగా నేరాలు, బలవంతపు అదృశ్యాలు వంటి అనేక అభియోగాలు కూడా ఉన్నాయి. గతేడాది ఆగస్టు 5న తిరుగుబాటు అనంతరం తన ప్రభుత్వం కూలిపోవడంతో, 77 ఏళ్ల హసీనా అప్పటి నుంచి భారత్‌లోనే ఉంటున్నారు.

చిందేసిన ట్రంప్..!

మియామి: వలసదారుల బహిష్కరణలు, సుంకాలతో హడలెత్తిస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదివారం కాస్త రిలాక్సయ్యారు. తన బృందంలో కీలక సభ్యులైన ఎలాన్ మస్క్, తులసీ గబార్డ్ తదితరులతో కలిసి ఫ్లోరిడాలోని మియామిలో అల్టిమేట్ ఫైటింగ్ చాంపియన్ షిప్ కార్యక్రమాన్ని తిలకించారు. అభిమానులతో కలిసి కాసేపు డ్యాన్స్ చేసి, పిడికిలి బిగించి ఉత్సాహపరిచారు.

పూర్తిగా ఫిట్

78 ఏళ్ల ట్రంప్ పూర్తి ఆరోగ్యంగా ఉన్నట్టు వైద్యులు ధ్రువీకరించారు. అమెరికా సర్వసైన్యాధ్యక్షుడిగా పనిచేసే సామర్థ్యం ఆయనకుందని పేర్కొన్నారు. శుక్రవారం ట్రంప్‌కు జరిపిన సాధారణ వైద్య పరీక్షల ఫలితాలను వైట్‌హౌస్ విడుదల చేసింది. '2020లో అధ్యక్షుడిగా ఉండగా చివరిసారిగా జరిపిన పరీక్షల్లో ట్రంప్ 110.677 కిలోలుండగా ఇప్పుడు 9 కిలోలు తగ్గారు. రక్తంలో కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గాయి. అధ్యక్షుడిగా రోజూ సమావేశాలు, సభల్లో భేటీల్లో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఇటీవల ఓ గోల్ఫ్ పోటీలో విజేతగా నిలిచారు కూడా. ఆరోగ్యవంతుల్లో కొలెస్ట్రాల్ స్థాయి 200కు మించరాదు. బీపీ మాత్రం కాస్త ఎక్కువ (128/74)గా ఉంది. హృదయ స్పందన రేటు గతంలో మాదిరిగా 62గానే ఉంది. గుండెపోటు రిస్క్‌ను నివారించేందుకు ట్రంప్ నిత్యం ఆస్పిరిన్ టాబ్లెట్ తీసుకుంటున్నారు'' అని పేర్కొంది.


కార్యక్రమంలో డ్యాన్స్ చేస్తున్న ట్రంప్

కాంగోలో రక్తపాతం.. 50 మంది మృతి

గోమా: ఆఫ్రికా దేశం కాంగోలో కల్లోల పరిస్థితులు నెలకొన్న తూర్పు ప్రాంతంలో తాజాగా జరిగిన ఘర్షణల్లో కనీసం 50 మంది చనిపోయారు. ఇందుకు కారణం కాదంటూ ప్రభుత్వ బలగాలు, రువాండా మద్దతున్న ఎం23 రెబల్స్ పరస్పరం ఆరోపణలు చేసుకుంటున్నాయి. దేశంలోని అతిపెద్ద నగరం గోమాలోని ఎం23 రెబల్స్ ఆధీనంలో ఉన్న ప్రాంతంలో శుక్ర, శనివారాల్లో ఈ దారుణం చోటుచేసుకుంది. కాంగో ప్రభుత్వ, మిత్ర దేశాల బలగాలే ఇందుకు కారణమని ఎం23 ప్రతినిధి లారెన్స్ ఆరోపించారు. వీధుల్లో పడి ఉన్న సైనికుల మృతదేహాలను తాము చూసినట్లు స్థానికులు చెబుతున్నారు. కాంగోలో దశాబ్దాలుగా కొనసాగుతున్న సంక్షోభం జనవరిలో ఎం23 రెబల్స్ అనూహ్యంగా వ్యూహాత్మక గోమా నగరాన్ని స్వాధీనం చేసుకోవడంతో కీలక మలుపు తిరిగింది. అనంతరం రెబల్స్ ఫిబ్రవరిలో బుకావులో తిష్ట వేశారు. అంతర్యుద్ధం కారణంగా జనవరి నుంచి కనీసం 3వేల మంది పౌరులు ప్రాణాలు కోల్పోగా, 70 లక్షల మంది సురక్షిత ప్రాంతాలకు వలస వెళ్లినట్లు ఐరాస అంచనా వేస్తోంది.

అదో ప్రాంక్.. అంతే! ఆ విద్యార్థినులకు నోటీసులిచ్చాం

సూట్‌కేస్ ఘటనపై ఓపీ జిందాల్ వర్సిటీ వివరణ

సోనిపట్: హరియాణాలోని ఓపీ జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీకి చెందిన ఓ విద్యార్థి గర్ల్‌ఫ్రెండ్‌ను సూట్‌కేస్‌లో దాచి హాస్టల్‌లోకి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తూ అడ్డంగా దొరికిపోయిన ఘటన వీడియో ఆన్‌లైన్‌లో వైరలైంది. శనివారం చోటుచేసుకున్న ఈ ఘటనపై ఆదివారం వర్సిటీ యాజమాన్యం స్పందించింది. బాలికల హాస్టల్ విద్యార్థినుల బృందం ప్రాంక్‌లో భాగంగా తమ స్నేహితురాలిని సూట్‌కేస్‌లో ఉంచి హాస్టల్ లోపల, బయట తిప్పారని తెలిపింది. ఇది కేవలం ప్రాంక్ మాత్రమేనని తెలిపింది. అయితే, వారి తీరును, సూట్‌కేస్‌లో కదలికలను అనుమానించిన భద్రతా సిబ్బంది సూట్‌కేస్‌ను తెరిచి చూడటంతో విషయం తెల్సిందని పేర్కొంది. సంబంధిత విద్యార్థులను నోటీసులిచ్చామని, క్రమశిక్షణ కమిటీ ఎదుట హాజరై వీరు వివరణ ఇవ్వాల్సి ఉంటుందని వివరించింది. తదనుగుణంగా వీరిపై చర్యలుంటాయని పేర్కొంది. విద్యార్థుల భద్రతకు తాము అత్యంత ప్రాధాన్యం ఇస్తామని వర్సిటీ చీఫ్ కమ్యూనికేషన్స్ అధికారి అంజూ మోహన్ స్పష్టం చేశారు. కాగా, 'మా విద్యార్థులు అల్లరి చేశారంతే.. ఇదేమంత పెద్ద విషయం కాదు'అంటూ శనివారం వర్సిటీ అధికారులు కొట్టిపారేయడం తెల్సిందే.

ప్రజాస్వామ్యంపై దాడి.. నియంతృత్వం

నేషనల్ హెరాల్డ్ కేసులో ఈడీ నోటీసులపై కపిల్ సిబాల్

న్యూఢిల్లీ: నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్ నేతల స్థిరాస్తుల స్వాధీనానికి ఈడీ నోటీసులు జారీ చేయడంపై సీనియర్ లాయర్, రాజ్యసభ ఎంపీ కపిల్ సిబాల్ తీవ్రంగా స్పందించారు. కేంద్రం చర్యను ప్రజాస్వామ్యంపై దాడిగా ఆయన అభివర్ణించారు. వాస్తవానికి ఈ భవనాల్లో కాంగ్రెస్ కార్యాలయాలు నడుస్తున్నాయన్నారు. కాంగ్రెస్‌ను అణగదొక్కేందుకు నిఘా వ్యవస్థలను కేంద్రం అడ్డుగోలుగా వాడుకుంటోందని ఆరోపించారు. ప్రజాస్వామ్యానికి తల్లిగా చెప్పుకునే మన దేశం వాస్తవానికి నియంతృత్వానికి తండ్రిగా మారిందన్నారు. హిందు–ముస్లిం అజెండాతో ప్రతిపక్షాన్ని లేకుండా చేయడమే లక్ష్యంగా బీజేపీ రాజకీయాలు చేస్తోందని ఆయన మండిపడ్డారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలోని నేషనల్ హెరాల్డ్ పత్రికకు సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో ఈడీ శనివారం రూ.661 కోట్ల విలువైన స్థిరాస్తుల స్వాధీనానికి నోటీసులివ్వడంపై ఆయన పైవ్యాఖ్యలు చేశారు. కార్యాలయం కూడా లేకుండా చేసి, కాంగ్రెస్‌ను అణగదొక్కేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని విమర్శించారు. ప్రతిపక్షాన్ని నాశనం చేయడానికి ప్రభుత్వం ఎంతకైనా దిగజారుతుందని దీన్ని బట్టి అర్థమవుతోందన్నారు.

ఢిల్లీలో అంబేడ్కర్ అంత్యక్రియలను కాంగ్రెస్ అడ్డుకుంది: సీఎం యోగి

లక్నో: ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ కాంగ్రెస్ లక్ష్యంగా సంచలన వ్యాఖ్యలు చేశారు. దేశ రాజధాని ఢిల్లీలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అంత్యక్రియలు నిర్వహించకుండా కాంగ్రెస్ పార్టీయే అడ్డుకుందని ఆరోపించారు. ఢిల్లీలో ఆయన స్మృతి చిహ్నాన్ని కూడా నిర్మించనివ్వలేదన్నారు. లక్నోలో ఆదివారం భారత రత్న బాబా సాహెబ్ డాక్టర్ భీమ్‌రావ్ అంబేడ్కర్ సమ్మాన్ సమారోహ్‌లో ఆయన ప్రసంగించారు. 'ఎన్నికల్లో బాబా సాహెబ్ అంబేడ్కర్ ఓడిపోయేందుకు కాంగ్రెస్ ప్రయత్నించింది. ఆయన మహాపరినిర్వాణం చెందాక, ఢిల్లీలో అంత్యక్రియలు జరపనివ్వలేదు. అదేవిధంగా, స్మృతి చిహ్నాన్ని సైతం దేశ రాజధానిలో ఏర్పాటు చేసేందుకు అనుమతించలేదు'అని ఆదిత్యనాథ్ పేర్కొన్నారు. 1956 డిసెంబర్ 6వ తేదీన అంబేడ్కర్ ఢిల్లీలోని తన ఇంట్లో కన్నుమూశారు. ఆయన అంత్యక్రియలను బౌద్ధ ఆచారాల ప్రకారం ముంబైలోని చైత్యభూమిలో నిర్వహించారు.

దత్తత డీడ్ చెల్లదు.. కుమార్తెలే వారసులు

అలహాబాద్ హైకోర్టు తీర్పును సమర్థించిన సుప్రీం

న్యూఢిల్లీ: ఆస్తి వివాదం కేసులో దత్తత డీడ్ చెల్లదంటూ అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పులో జోక్యం చేసుకునేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. తండ్రి ఆస్తిలో ఇద్దరు కూతుళ్ల న్యాయబద్ధ వారసత్వ హక్కును నిరాకరించేందుకే పథకం ప్రకారమే ఈ డీడ్‌ను చూపుతున్నారంటూ వ్యాఖ్యానించింది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన భువనేశ్వర్ సింగ్‌కు ఇద్దరు కూతుళ్లు శివ కుమారీ దేవి, హర్మునియా. 1967లో భువనేశ్వర్ సింగ్ అశోక్ కుమార్ అనే బాలుణ్ని దత్తత తీసుకున్నారు. ఇందుకు సంబంధించిన పత్రం, ఫొటో కూడా ఉన్నాయి. అయితే, చట్ట ప్రకారం దత్తతకు సమ్మతి తెలుపుతూ దంపతుల సంతకాలు దత్తత పత్రంపై తప్పనిసరి. అయితే, దత్తత స్వీకార పత్రంపై కేవలం భువనేశ్వర్ సింగ్ సంతకం మాత్రమే ఉండటం, దత్తత స్వీకారం కార్యక్రమంలో ఆయన మాత్రమే కనిపించడం వంటి అంశాలను ఎత్తి చూపిన అలహాబాద్ హైకోర్టు ఈ మొత్తం వ్యవహారం చెల్లదని స్పష్టం చేసింది. కుమార్తెలే వారసులంటూ 2024 డిసెంబర్‌లో తీర్పు వెలువరించింది. అశోక్ కుమార్ దీనిపై సుప్రీంను ఆశ్రయించారు. జస్టిస్ సూర్యకాంత్ జస్టిస్ కోటీశ్వర్ సింగ్‌ల ధర్మాసనం ఇటీవల వాదనలు వింది. అలహాబాద్ హైకోర్టు తీర్పును సమర్థించింది. కుమార్తెలకు వారసత్వ హక్కును నిరాకరించేందుకు గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటివి జరుగుతుంటాయంది. దత్తత స్వీకార పత్రం చెల్లదని స్పష్టం చేసింది. భువనేశ్వర్ సింగ్ ఆస్తికి ఆయన కుమార్తెలే అసలైన వారసులని, అశోక్ కుమార్ పిటిషన్‌ను కొట్టివేస్తూ తీర్పు వెలువరించింది.

పాకిస్తాన్‌ను వీడిన అఫ్గాన్లు 8,60,000 పైచిలుకు

ఇస్లామాబాద్: సెప్టెంబర్ 2023 నుంచి ఇప్పటివరకు 8,60,000 మందికి పైగా అఫ్గాన్లు పాకిస్తాన్ వీడి అఫ్గనిస్తాన్‌లోకి ప్రవేశించారని పాక్ మీడియా నివేదిక ఒకటి తెలిపింది. ఖైబర్ పఖ్తుంఖ్వాలోని సరిహద్దు క్రాసింగ్ ద్వారానే 5 లక్షల మందికి పైగా అఫ్గనిస్తాన్లోకి ప్రవేశించారని వెల్లడించింది. అఫ్గాన్ సిటిజన్ కార్డు (ఏసీసీ)ల గడువు ముగియడంతో ఏప్రిల్ 1న అఫ్గాన్ శరణార్థులను స్వదేశానికి పంపడానికి పాకిస్తాన్ రెండవ దశను ప్రారంభించింది. రెండో దశ ప్రారంభమైనప్పటి నుంచి 16,242 మంది ఏసీసీ హోల్డర్లు పాకిస్తాన్‌ను వీడారు. దేశంలో నివసిస్తున్న అఫ్గాన్లను దశలవారీగా స్వదేశానికి పంపించడంలో భాగంగా, 2023లో మొదటి దశ ప్రారంభమైంది. పాకిస్తాన్‌లో అక్రమంగా నివసిస్తున్న అఫ్గాన్లను వెనక్కి పంపుతామని ప్రభుత్వం ప్రకటించింది. అనంతరం కొందరు స్వచ్ఛందంగా పాక్‌ను వదిలి వెళ్లగా.. కొందరిని అధికారులు బలవంతంగా పంపించారు. పంజాబ్, ఇస్లామాబాద్‌లోని అఫ్గన్ శరణార్థులను పెషావర్, లాండీ కోటల్‌లోని రెండు ట్రాన్సిట్ క్యాంపులకు తరలించి, రిజిస్ట్రేషన్ ప్రక్రియ అనంతరం అఫ్గనిస్తాన్‌కు తరలించారు.

విమానం కూలి ఆరుగురు దుర్మరణం

కోపేక్: అమెరికాలోని న్యూయార్క్‌లో విమానం కూలిన దుర్ఘటనలో ఆరుగురు మృతి చెందారు. రెండింజన్ల మిట్సుబిషి ఎంయూ–2బీ రకం విమానం శనివారం మధ్యాహ్నం కోపేక్ సమీపంలోని బురద ప్రాంతంలో కూలింది. అందులోని ఐదుగురు ప్రయాణికులు, ఒక పైలట్ సహా మొత్తం ఆరుగురూ చనిపోయారని నేషనల్ ట్రాన్స్‌పోర్ట్ సేఫ్టీ బోర్డ్ ఆదివారం ధ్రువీకరించింది. ఈ విమానం హడ్సన్‌లోని కొలంబియా కౌంటీ ఎయిర్‌పోర్టులో ల్యాండవ్వాల్సి ఉందని వివరించింది.

ఢిల్లీ ప్రభుత్వాన్ని నడిపిస్తున్న సీఎం భర్త: అతిశీ

న్యూఢిల్లీ: సీఎం రేఖా గుప్తా భర్త ఢిల్లీ ప్రభుత్వాన్ని నడిపిస్తున్నారని మాజీ సీఎం, ప్రతిపక్ష నేత అతిశీ ఆరోపించారు. రేఖా గుప్తా భర్త మనీష్ గుప్తా... వివిధ శాఖల ఉన్నతాధికారులతో సమావేశమైన ఫొటోను సోషల్ మీడియాలో ఆమె పోస్ట్ చేశారు. 'ఈ ఫొటోను జాగ్రత్తగా చూడండి. ఎంసీడీ, డీజేబీ, పీడబ్ల్యూడీ, డీయూఎస్ఐబీ అధికారులతో సమావేశాన్ని ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా భర్త మనీష్ గుప్తా నిర్వహిస్తున్నారు' అని అతిశీ తన పోస్టులో పేర్కొన్నారు. గ్రామాల్లో మహిళా సర్పంచ్ భర్త సర్పంచ్‌గా అధికారాన్ని చెలాయించడంతో ఆమె ఢిల్లీ పరిస్థితిని పోల్చారు. 'గతంలో గ్రామంలో మహిళ సర్పంచ్‌గా ఎన్నికైతే ప్రభుత్వ పనులన్నీ ఆమె భర్తే చూసుకుంటారని వినేవాళ్లం. కానీ ఒక మహిళ ముఖ్యమంత్రి భర్త ఆమె పనులను నిర్వహిస్తుండటం దేశ చరిత్రలో ఇదే మొదటిసారి' అని ఆమె పేర్కొన్నారు. 'రేఖా గుప్తాకు ప్రభుత్వ పనుల నిర్వహణ తెలియడం లేదా? ఆమె విద్యుత్ సంస్థలను హ్యాండిల్ చేయలేకపోతున్నారా? అందుకేఢిల్లీలో ప్రతిరోజూ విద్యుత్ కోతలు ఉంటున్నాయా? రేఖ విద్యాశాఖను నిర్వహించలేకపోతున్నారా? ప్రైవేటు పాఠశాలల ఫీజులు పెరగడానికి కారణం కూడా ఇదేనా? ఇది చాలా ప్రమాదకరం' అని రాసుకొచ్చారు.

తోసిపుచ్చిన బీజేపీ

అతిశీ వ్యాఖ్యలను తోసిపుచ్చిన బీజేపీ అతిశీపై ఎదురుదాడికి దిగింది. ఓ మహిళా నాయకురాలు మరో మహిళా నాయకురాలిని అవమానించడం ఆశ్చర్యంగా ఉందని ఢిల్లీ బీజేపీ అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవ్ వ్యాఖ్యానించారు. 'రేఖా గుప్తా డీయూఎస్‌యూ కార్యదర్శి నుంచి ఢిల్లీ సీఎం వరకు పనిచేశారు. ఆమె భర్త ఆమెకు మద్దతు ఇవ్వడం చట్టవిరుద్ధం కాదు, అనైతికం కూడా కాదు. ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అరెస్టు తరువాత ఆయన భార్య సునీతా కేజ్రీవాల్ సీఎం కార్యాలయం నుంచి ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. ఇది ప్రజాస్వామ్యాన్ని అవమానించడం కాదా?' అని ఆయన ప్రశ్నించారు.

రాణా 33 సాకులు

న్యూఢిల్లీ: ముంబై ఉగ్రదాడుల ఉదంతంతో సంబంధం ఉన్న పాకిస్తానీ ఉగ్రవాది తహవ్వుర్ రాణాను భారత్‌కు అప్పగించకుండా అడ్డుకునేందుకు అతని న్యాయవాది విశ్వప్రయత్నాలు చేసిన విషయం తాజాగా వెలుగులోకి వచ్చింది. చివరి ప్రయత్నంగా రాణా న్యాయవాది జాన్ డి క్లేన్ నేరుగా అమెరికా విదేశాంగ శాఖకు ఒక సుదీర్ఘ లేఖ రాశారు. రాణా ఇప్పటికే 33 రకాల సమస్యలతో సతమతమవుతున్నారని, ఇలాంటి పరిస్థితుల్లో భారత్‌కు అప్పగిస్తే అక్కడి కారాగారంలో చిత్రవధను ఎదుర్కోవాల్సి వస్తుందని, అందుకే భారత్‌కు అప్పగింత నిర్ణయాన్ని ఉపసంహరించుకోండని లేఖలో జాన్ పేర్కొన్నారు. ఈ మేరకు జనవరి 21న రాసిన లేఖలోని వివరాలు తాజాగా బహిర్గతమయ్యాయి. ''మరణశిక్షను ఎదుర్కొనే అవకాశమున్న భారత్‌కు రాణాను అప్పగించకండి. ఆయనను భారత్‌కు అప్పగిస్తే దారుణంగా హింసిస్తారు. పాకిస్తానీ ముస్లిం అయినందుకే రాణాపై భారత్‌లోనే అత్యంత హేయమైన ఉగ్రదాడి ఘటనతో సంబంధం అంటగట్టారు. ఇప్పటికే అనారోగ్యంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న రాణాను అప్పగిస్తే మరింతగా అనారోగ్యానికి గురయ్యే ప్రమాదముంది'' అని అన్నారు.



అప్పగింత అడ్డుకునేందుకు చివరిదాకా యత్నాలు

'' భారత జైళ్లలో పరిస్థితులు అత్యంత అధ్వాన్నంగా, అమానవీయంగా ఉంటాయి. ఆ జైళ్లలో మగ్గిపోతే రాణా చివరకు కేసు విచారణ ముగిసేలోపే కారాగారంలోనే కన్నుమూస్తారు'' అని అతని లాయర్ ఆరోపించారు. '' అమెరికాలో లాస్‌ఏంజెలెస్ నిర్బంధకేంద్రంలో ఉన్నకాలంలోనే రాణా ఆరోగ్యం క్షీణిస్తూ వచ్చింది. గత ఏడాదే అతనికి పార్కిన్సన్ వ్యాధి ఉన్నట్లు నిర్ధారణ అయింది. జ్ఞాపకశక్తి తగ్గుతూ వస్తోంది. మతిమరుపు ఎక్కువైంది. మూత్రసంబంధ వ్యాధులూ చుట్టుముట్టాయి. చలిని సైతం తట్టుకోలేకపోతున్నారు. బ్లాడర్‌లో పెరుగుదల చూస్తుంటే అది క్యాన్సర్ అయి ఉండొచ్చనే అనుమానాలు బలపడుతున్నాయి. తీవ్రస్థాయిలో హృద్రోగంతో బాధపడుతున్నారు. సుదీర్ఘ మూత్రపిండాల వ్యాధి స్టేజ్–3కి చేరుకుంది. టీబీ, సైనస్, బ్రాంకైటిస్, ఆస్తమా, ఊపిరితిత్తుల సమస్య, థైరాయిడ్ వ్యాధి, సోరియాసిస్, ప్రోస్టేట్ వాపు, వినికిడి సమస్య, మోకాలి నొప్పులు ఇలా మొత్తంగా 33 వ్యాధులు ఉన్నాయి'' అని అతని లాయర్ చెప్పుకొచ్చారు. '' మూత్రపిండం మార్చాల్సిన పరిస్థితి తలెత్తింది. గుండెపోటు వచ్చే అవకాశముంది. పక్షవాతం, చక్కెర వ్యాధి, టీబీ సోకే వీలుంది. బ్లాడర్ క్యాన్సర్‌కు చికిత్స చేయించుకుంటున్నారు'' అని లేఖలో లాయర్ పేర్కొన్నారు.

అయినాసరే పంపిస్తాం

లాయర్ 33 కారణాలు చెప్పినా అమెరికా ప్రభుత్వం ఒక్క కారణాన్ని కూడా లెక్కలోకి తీసుకోలేదు. మీరేం చెప్పినాసరే భారత్‌కు అప్పగింత తథ్యమని తేల్చిచెప్పింది. ఈ మేరకు ఫిబ్రవరి 11వ తేదీన స్పందనగా ఒక ప్రకటన విడుదలచేసింది. ఈ విషయమై అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో మాట్లాడారు. ' అన్ని అంతర్జాతీయ చట్టాల మేరకే భారత్‌కు అప్పజెప్తున్నాం. ఒకవేళ రాణా అనారోగ్యంతో ఉంటే అమెరికాలో ఉన్నప్పటికీ మెడికల్ రిపోర్టులను భారత్‌కు అందించేందుకు సిద్ధంగా ఉన్నాం'' అని ఆయన చెప్పారు. గత వారం రాణాను జాతీయ దర్యాప్తు సంస్థ బృందం భారత్‌కు ఎట్టకేలకు తీసుకురావడం తెల్సిందే.

కృష్ణదేవరాయల తర్వాత ఎవరు అధికారంలోకి వచ్చారు?

పద్మనాయకులు ఒక శతాబ్దం పాటు తెలంగాణను దాటకుండా బహమనీలకు అడ్డుగా నిలిచారు. వీరి పతనం తర్వాతే మిగతా తెలుగు ప్రాంతం కూడా బహమనీల వశమైంది. దక్షిణ భారతదేశంలోని చాలా భూ భాగాలకు ముస్లిం రాజుల ప్రవేశానికి మార్గం సుగమమైంది. పద్మ నాయకుల చివరి దశలోనూ, అనంతరం కొంతకాలం తెలంగాణలోని కొన్ని ప్రాంతాలు గజప తుల ఆధిపత్యంలో ఉన్నట్లు ఆధారాలున్నాయి. బహమనీ చివరి పాలకుడైన మహమూద్‌షా 1518లో మరణించాడు. దీంతో బహమనీల రాజ్య భాగాల్లో ఒకటైన గోలకొండ పాలకుడు కులీ కుతుబ్ ఉల్‌ముల్క్ స్వాతంత్ర్యం ప్రకటించుకొని కుతుబ్‌షాహీ వంశాన్ని స్థాపించాడు.

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
ఇండియన్ హిస్టరీ



కాకతీయానంతర యుగం

పద్మనాయకులు

పద్మనాయక పాలకుల్లో గొప్ప పరాక్రమవంతుడైన లింగమనీడు విజయనగర రాజ్య భాగాలైన కర్నూలు, నెల్లూరు సహా పరిసర దుర్గాలను ఆక్రమించాడు. చివరగా 1437లో కంచిని ఆక్రమించాడు. దీనికి సింగమనాయకుడు తోడ్పడ్డాడు. లింగమనీడు ఈ యుద్ధాల్లో మునిగి ఉన్న సమయంలో అతడి రాజ్య ఉత్తర భాగాన్ని బహమనీయులు ఆక్రమించుకునే ప్రయత్నం చేశారు. ఇదే సమయంలో బహమనీల మధ్య అంతఃకలహాలు మొదలయ్యాయి. అహ్మద్‌షా అనంతరం 'రెండో అహ్మద్ షా'గా పిలిచే అల్లావుద్దీన్ (1436-1458) బహమనీ రాజయ్యాడు. ఇతడి సోదరుడైన మహమ్మద్‌ఖాన్ తిరుగుబాటు చేసి రాయచూర్, షోరాపూర్, బీజాపూర్ దుర్గాలను ఆక్రమించి స్వాతంత్ర్యం ప్రకటించుకున్నాడు. నిజామాబాద్ జిల్లాలోని బాలకొండ సామంతుడైన సికిందర్‌ఖాన్ కూడా స్వాతంత్ర్యం ప్రకటించుకున్నాడు. ఇతడు మహమ్మద్‌ఖాన్‌తో కలిసి సబ్బి రాష్ట్రం (కరీంనగర్),భువనగిరి ప్రాంతాన్ని ఆక్రమించుకున్నాడు.

సింగమనాయకుడు 1444లో కపిలేశ్వర గజపతి సహాయంతో రాచకొండ రాజ్యాన్ని తిరిగి ఆక్రమించడానికి ప్రయత్నించి విఫలమైనట్లు తెలుస్తోంది. రెండో అహ్మద్‌షా అనంతరం హుమాయూన్ రాజ్యానికి వచ్చిన సందర్భంలో (1457) సికిందర్‌ఖాన్ చేసిన తిరుగుబాటును ఆసరాగా చేసుకొని తెలంగాణ ప్రాంతాన్ని తిరిగి జయించడానికి పద్మనాయకులు ప్రయత్నించారు. హుమాయూన్ సికిందర్‌ఖాన్‌ను సంహరించి, దేవరకొండపైకి నిజాం -ఉల్- ముల్క్, ఖ్వాజీ జహాన్ అనే సేనానులను పంపించి, తాను ఓరుగల్లుపై దండెత్తాడు. కపిలేశ్వర గజపతి కుమారుడైన హంవీరుడి సహాయంతో సింగమనాయకుడు వారిని ఓడించాడు. ఇతడు ఖమ్మం, భువనగిరి, ఓరుగల్లును జయించాడు. ఆ తర్వాత సింగమనాయకుడి తమ్ముడు ధర్మానాయకుడు ఓరుగల్లు పాలకుడైనట్లు 1462-64 నాటి శాయంపేట శాసనం ఆధారంగా తెలుస్తోంది. నిజాంషా (1461-63) కాలంలోనూ బహమనీలు తెలంగాణను జయించడానికి మళ్లీ ప్రయత్నించారు. గజపతుల సహాయంతో పద్మనాయకులు వారిని ఓడించారు.

1468లో కపిలేశ్వర గజపతి మరణించిన తర్వాత అతడి కుమారులు హంవీరుడు, పురుషోత్తమ గజపతి మధ్య వారసత్వ పోరు మొదలైంది. దీనివల్ల పద్మనాయకులకు మళ్లీ కష్టాలు వచ్చాయి. తనకు సహాయం చేస్తే తెలంగాణను జయించి స్వాధీనం చేస్తానని హంవీరుడు మూడో మహమ్మద్‌షా (1463 -1482)కు కబురు పంపాడు. ఇదే అదనుగా సుల్తాన్ తెలంగాణను ఆక్రమించడానికి నిజాం-ఉల్-ముల్క్ బహ్రీని పంపాడు. ఈ సమయంలో పద్మనాయకులు అటు గజపతులతో, ఇటు బహమనీలతో పోరాడాల్సి వచ్చింది. 1475 నాటికి తెలంగాణ ప్రాంతమంతా బహమనీల వశమైంది. పద్మనాయకుల రాజ్యం అంతరించింది. పద్మనాయకులు విజయనగర రాజుల కొలువులో చేరారు. ఈ కాలంలో విజయనగర పాలకులు, గజపతులు, బహమనీల సామ్రాజ్య దాహంతో తెలంగాణ తల్లడిల్లింది. 1481 నాటికి నిజాం-ఉల్-ముల్క్ బహ్రీ, ఆజంఖాన్ తెలంగాణలో బహమనీల రాజప్రతినిధులయ్యారు. సింగమనాయకుడు, లింగమనీడు అనంతరం లింగమనీడు కుమారుడు దేవరకొండకు నామమాత్ర పాలకుడిగా మిగిలాడు. ఆ తర్వాత వీరి వంశం దేవరకొండను 16వ శతాబ్దం చివరి వరకు పాలించినట్లు తెలుస్తోంది.

లింగమనీడు కళింగ, విజయనగర రాజ్యాలపై దండయాత్రలు చేసిన సందర్భంలో అతడి వెంట వెళ్లిన కొంతమంది పద్మనాయకులు ఆ తర్వాతి కాలంలో బొబ్బిలి, పిఠాపురం, వెంకటగిరి, పాల్వంచ సంస్థానాలను స్థాపించినట్లుగా తెలుస్తోంది. విజయనగర రాజ్య ప్రాంతాలకు వెళ్లినవారు తిరిగి తెలంగాణకు వచ్చి మహబూబ్‌నగర్ జిల్లాలో జటప్రోలు (కొల్లాపురం) సంస్థానాన్ని స్థాపించినట్లు భావిస్తున్నారు.

కళింగ గాంగులు

ఈ వంశ పాలకులు నేటి ఒడిశాలోని బరంపురం తదితర ప్రాంతాలతో పాటు శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు గోదావరి జిల్లా ప్రాంతాలను సుమారు క్రీ.శ. 5వ శతాబ్దం నుంచి 15వ శతాబ్దం వరకు పాలించారు. కాకతీయుల కాలంలో వీరితో యుద్ధాలు జరిగాయి. కాకతి గణపతి దేవుడు వీరి పాలనలో ఉన్న కొన్ని ప్రాంతాలను ఆక్రమించాడు. రుద్రమదేవి కూడా గోదావరి నది వరకు జయించారు.

కళింగ గాంగ రాజైన నాలుగో వీరనరసింహ దేవుడి కాలంలో (1378-1424) రేచర్ల పద్మనాయక అనపోతనాయకుడు కళింగను ముట్టడించాడు. వీర నరసింహదేవుడు ఓటమి పాలై తన కూతురును అనపోత నాయకుడి మనవడైన కుమార అనపోత నాయకుడికి ఇచ్చి సంధి చేసుకున్నాడు. నాలుగో భానుదేవుడి (1424-1434)తో ఈ వంశం అంతరించింది.

విజయనగర రాజ్యం

కాకతీయుల అనంతరం ముసునూరు, పద్మనాయక, రెడ్డి రాజ్యాలతోపాటు స్థాపించిన మరో రాజ్యం విజయనగర సామ్రాజ్యం. ఈ రాజ్య స్థాపకులైన హరిహరరాయలు, బుక్కరాయలు ఓరుగల్లుకు చెందినవారు. ధర్మపురికి చెందిన విద్యారణ్య స్వామి వీరికి ప్రేరకుడు. కంపరాయల భార్య గంగాదేవి కూడా తెలంగాణ ఆడబిడ్డే. పిల్లలమర్రి పిన వీరభద్రుడు కొన్నేళ్లు విజయనగర రాజుల ఆశ్రయం పొందాడు. అలంపురం లాంటి ప్రాంతాలు స్వల్పకాలం వీరి ఆధిపత్యంలో ఉన్నాయి. వీరి రాజ్యమంతా కృష్ణానది దక్షిణానికే పరిమితం.

సంగమ వంశం (1333-1485)

హరిహరరాయులు (1336-1356), బుక్కరాయలు(1356-1377)సంగమ వంశానికి చెందినవారు. వీరు కాకతి ప్రతాపరుద్రుడి భాండాగారికులుగా ఉన్నట్లు కొంతమంది చరిత్రకారులు భావిస్తున్నారు. కాకతీయుల పతనానంతరం వీరు ఆనెగొంది ప్రభువైన జంబుకేశ్వరుడి వద్ద మంత్రులుగా చేరారు. ఢిల్లీ సైన్యం 1334లో ఆనెగొందిని ముట్టడించి వీరిద్దరినీ బంధీలుగా తీసుకెళ్లి ముస్లింలుగా మార్చి కొంతకాలం తర్వాత మళ్లీ ఆనెగొందికి పాలకులుగా పంపించారని,విద్యారణ్యుడి ప్రేరణతో వీరు స్వమతంలోకి మారి 1336 ప్రాంతంలో విజయనగర రాజ్యాన్ని స్థాపించారని తెలుస్తోంది.

హరిహరరాయల కాలంలో తెలంగాణలో కొంత భాగాన్ని ముసునూరి వంశం పాలించింది. బుక్కరాయల కాలంలో రేచర్ల పద్మనాయకులు తెలంగాణకు అధిపతులయ్యారు. తర్వాత రెండో హరిహరరాయలు 1377 నుంచి 1404 వరకు పాలించాడు. ఇతడి ఆజ్ఞతో యువరాజైన రెండో బుక్కరాయలు రెండుసార్లు పద్మనాయకులపై దండెత్తాడు. కానీ విజయం సాధించలేదు. తండ్రి మరణానంతరం రాజైన రెండో బుక్కరాయలను తొలగించి విరూపాక్షుడు అధికారాన్ని చేపట్టాడు. రెండో బుక్కరాయలు తిరిగి అతడిని తొలగించి 1404 నుంచి 1406 వరకు పాలించాడు. ఇతడిని తొలగించి మొదటి దేవరాయలు (1406-1424), తర్వాత ప్రౌఢ దేవరాయలుగా పిలిచే రెండో దేవరాయలు (1406-1446) రాజులయ్యారు. ప్రౌఢ దేవరాయల కాలంలో రెడ్డి రాజ్యం సింహాచలం వరకు అతడికి సామంత రాజ్యంగా ఉంది. ఆ తర్వాత మల్లికార్జున రాయలు (1446-1465), రెండో విరూపాక్ష రాయలు (1465-1485) పాలించారు. మహబూబ్‌నగర్ జిల్లాలోని అలంపురం తదితర ప్రాంతాలు మల్లికార్జున రాయల ఆధీనంలో ఉండేవి. ఈ వంశ పాలకుల అసమర్థత వల్ల సామంత రాజైన సాళువ నరసింహరాయలు సింహాసనాన్ని ఆక్రమించాడు.

సాళువ వంశం (1486-1506)

సాళువ నరసింహరాయలు (1485-1490) తీరాంధ్రను కృష్ణానది వరకు జయించాడు. తెలంగాణపై దాడిచేసి బాలకొండ వద్ద ముస్లిం సైన్యాన్ని ఓడించాడు. ఇతడి మరణానంతరం ఇతడి కుమారులు చిన్నవాళ్లు కావడంతో సేనాధిపతి తుళువ నరసానాయకుడు తన పెద్ద కుమారుడైన తిమ్మరాజును, అతడు మరణించాక రెండో కుమారుడైన రెండో నరసింహరాయలను రాజులను చేసి రాజ్యాధికారం నెరిపాడు. రెండో నరసింహరాయలను హతమార్చి తుళువ వంశాన్ని ప్రారంభించారు.

తుళువ వంశం (1505-1570)

వీర నరసింహుడు (రెండో నరసనాయకుడు) 1505 నుంచి 1509 వరకు పాలించాడు. ఇతడు మరణించిన తర్వాత సోదరుడు శ్రీకృష్ణ దేవరాయలు (1509-1529) రాజయ్యాడు. ఇతడు తూర్పు దండయాత్రలో చితాబ్‌ఖాన్ పాలనలో ఉన్న తెలంగాణలోని అనంతగిరి, ఉండ్రకొండ, జల్లిపల్లి, కందికొండ, దేవరకొండ, నల్లగొండ, కనకగిరి, శంకరగిరి, ఖమ్మం ప్రాంతాలను ఆక్రమించాడు. సింహాచలం దాకా గజపతుల ఆక్రమణలో ఉన్న తీరాంధ్ర కూడా ఇతడి వశమైంది. ప్రతాపరుద్ర గజపతి తన కుమార్తెను ఇతడికి ఇచ్చి ఇరు రాజ్యాల మధ్య కృష్ణానది సరిహద్దుగా ఉండే విధంగా సంధి చేసుకున్నాడు. శ్రీకృష్ణ దేవరాయలు తెలంగాణతో పాటు కృష్ణానది ఉత్తర భాగాలను గజపతికే ఇచ్చేశాడు.

కృష్ణదేవరాయల తర్వాత అతడి సోదరుడు అచ్యుత దేవరాయలు (1530-42) అధికారంలోకి వచ్చాడు. అచ్యుత దేవరాయల తర్వాత రాజైన అతడి కుమారుడు వెంకటరాయలను హత్య చేసి సలికం తిరుమలరాయలు రాజయ్యాడు. ఇతడిని తుదముట్టించి అళియ రామరాయలు (కృష్ణదేవరాయల అల్లుడు) అచ్యుత రాయల అన్న కొడుకైన సదాశివరాయలను (1543-76) రాజుగా చేసి అధికారం చెలాయించాడు. ఇతడి కాలంలో ముస్లిం పాలకులు ఏకమై విజయనగరంపై దండెత్తారు. దీన్నే రక్కస తంగడి (తళ్లికోట) యుద్ధంగా పేర్కొంటారు. రామరాయల తర్వాత అతడి సోదరుడు తిరుమలరాయలు ఆరవీటి వంశ (1569-1578) పాలన ప్రారంభించాడు. విజయనగరం తన ప్రాభవాన్ని తిరిగి పొందలేదు. మూడో శ్రీరంగరాయల (1665-1680) మరణంతో ఆరవీటి వంశం, విజయనగర సామ్రాజ్యం అంతమయ్యాయి. ఈ సామ్రాజ్యంలోని కొంత భాగాన్ని గోల్కొండ సుల్తాన్‌లు ఆక్రమించగా, మరికొంత భాగం మధుర, తంజావూర్, మైసూర్ నాయక రాజుల వశమైంది.

విజయనగర రాజులకు బహమనీ సుల్తాన్‌లతో, కుతుబ్‌షాహీలతో కృష్ణా, తుంగభద్ర నదుల మధ్య ప్రదేశంలో నిరంతరం యుద్ధాలు జరిగేవి. అందువల్ల అలంపురం తదితర ప్రాంతాలు నిరంతరం చేతులు మారాయి. మల్లికార్జున రాయలు, కృష్ణదేవరాయలు, అచ్యుత దేవరాయల హయాంలో కొంతకాలంపాటు 'అలంపురం' విజయనగర పాలకుల ఆధీనంలో ఉన్నట్లు తెలుస్తోంది.

కళింగ గజపతులు

గాంగ వంశ రాజైన నాలుగో భానుదేవుడిపై అతడి మంత్రి కపిలేశ్వర గజపతి 1434లో తిరుగుబాటు చేసి గజపతి వంశాన్ని స్థాపించాడు. ఈ వంశ పాలకులు 1434 నుంచి 1538 వరకు ఒడిశా తదితర ప్రాంతాలతో పాటు తెలుగు ప్రాంతాలను కూడా పాలించారు. వీరికి విజయనగర రాజులు, కొండవీటి రెడ్డి రాజులు, పద్మనాయకులు, తెలంగాణను ఆక్రమించిన బహమనీ సుల్తాన్‌లతో యుద్ధాలు జరుగుతుండేవి.

బహమనీ పాలకుడైన హుమాయూన్ 1458లో తెలంగాణను ఆక్రమించి మాలిక్‌షాను సుబేదారుగా నియమించాడు. సికిందర్‌ఖాన్ పద్మ నాయకులతో కలిసి సుల్తాన్లపై తిరుగుబాటు చేశాడు. ఈ తిరుగుబాటును అణచివేసి సుల్తాన్‌లు పద్మనాయక రాజధానుల్లో ఒకటైన దేవరకొండను ముట్టడించారు. ఈ సమయంలో పద్మనాయక లింగమనీడి అభ్యర్థన మేరకు కపిలేశ్వర గజపతి ఆదేశంతో 'హంవీరుడు' లింగమనీడికి బాసటగా నిలిచి సుల్తాన్లను తరిమేశాడు.

కపిలేశ్వర గజపతి అనంతరం అతడి కుమారులైన పురుషోత్తమ గజపతి (1468-97), హంవీరుడి మధ్య వారసత్వ తగాదా తలెత్తింది. హంవీరుడు బహమనీ సుల్తాన్లను ఆశ్రయించి తనకు రాజ్యం ఇప్పిస్తే తీరాంధ్ర, తెలంగాణను ఇస్తానని చెప్పాడు. సుల్తాన్‌లు అతడికి సహాయపడి తీరాంధ్ర, అతడి ఆధీనంలోని తెలంగాణను వశపరుచుకున్నారు. పురుషోత్తమ గజపతి తర్వాత సింహాసనాన్ని అధిష్ఠించిన అతడి కుమారుడు ప్రతాపరుద్ర గజపతి (1497-1538) బహమనీలు ఆక్రమించిన తెలంగాణ భూభాగాలను తిరిగి కైవసం చేసుకున్నాడు. ఇతడికి సహకరించిన చిత్తాప్‌ఖాన్ (చితాబ్‌ఖాన్)ను ఖమ్మం, ఓరుగల్లు ప్రాంతాలకు సామంతుడిగా నియమించాడు. ప్రతాపరుద్ర గజపతి కొండపల్లి, ఉర్లుగొండ, చిట్యాల, అనంతగిరి, అరువపల్లి, నల్లగొండ, సిరికొండ దుర్గాలను పాలించడానికి సేనానులను నియమించాడు. 1512లో దిగ్విజయ యాత్ర ప్రారంభించిన విజయనగర పాలకుడు శ్రీకృష్ణ దేవరాయలు కళింగ గజపతులతో ఉన్న పూర్వ వైరాన్ని దృష్టిలో ఉంచుకొని 1515లో ప్రతాపరుద్ర గజపతి ఆధీనంలో ఉన్న కొండవీడు, కొండపల్లి, అనంతగిరి, చిట్యాల, నల్లగొండ, ఉర్లుగొండ, అరువపల్లి మొదలైన దుర్గాలను జయించాడు. చితాబ్‌ఖాన్‌ను ఓడించి ఖమ్మం, ఓరుగల్లు ప్రాంతాలను జయించాడు. తర్వాత 1516లో గజపతుల కటకం దాకా పురోగమించాడు. ప్రతాపరుద్ర గజపతి తన కూతురు తుక్కాదేవిని కృష్ణదేవరాయలకు ఇచ్చి సంధి చేసుకొని తిరిగి ఈ ప్రాంతాలను పొందాడు. ఉభయ రాజ్యాలకు కృష్ణానది సరిహద్దుగా ఉండే విధంగా ఒప్పందం కుదిరింది.

శ్రీకృష్ణ దేవరాయలు తన రాజ్య విస్తరణలో భాగంగా ప్రతాపరుద్ర గజపతి రాజ్య భాగాలపై 1524లో దండెత్తడం, 1530లో కొండపల్లి దుర్గాన్ని వశపరచుకోవడాన్ని బట్టి తెలంగాణ మొత్తం అతడి ఆధీనంలోకి వచ్చినట్లు తెలుస్తోంది. ఆ తర్వాత ఎనిమిదేళ్లకు ప్రతాపరుద్ర గజపతి మరణించడంతో ఆ వంశం అంతరించింది.

రాజ్‌ఘాట్ అనేది ఏ రకమైన ఆధారం?

ప్రాజెక్టు పద్ధతి/ ప్రకల్పన పద్ధతి / ఉద్యమ పద్ధతి

- జాన్ డ్యూయి ప్రతిపాదించిన వ్యవహారిక సత్తావాదం తత్ఫలితమే ప్రాజెక్టు పద్ధతి.
- ప్రాజెక్టు పద్ధతిని అమెరికాలోని కొలంబియా విశ్వవిద్యాలయానికి చెందిన కిల్ ప్యాట్రిక్ ప్రతిపాదించారు.
- ప్రాజెక్టు పద్ధతిని జె.ఎ.స్టీవెన్‌సన్ ఒక బోధన పద్ధతిగా రూపొందించారు.
- ప్రాజెక్టు పద్ధతి సంప్రదాయ బోధన పద్ధతులపై తిరుగుబాటు వంటిది.
- ప్రాజెక్టు పద్ధతిపై జరిగిన చర్చ మరే ఇతర పద్ధతులపై జరగలేదు.
- ప్రాజెక్టు పద్ధతిలో జీవించడం కోసం కాకుండా, పనిచేస్తూ, జీవిస్తూ నేర్చుకోవడం ముఖ్యమైన అంశం.

నిర్వచనాలు

- **కిల్‌ప్యాట్రిక్:** 1918లో కొలంబియా విశ్వవిద్యాలయానికి చెందిన కిల్‌ప్యాట్రిక్ 'సాంఘిక పరిసరాల్లో హృదయపూర్వకంగా, ఉద్దేశపూర్వకంగా కొనసాగే కార్యకలాపమే ప్రాజెక్టు' అని నిర్వచించారు.
- **స్టీవెన్‌సన్:** సహజమైన సన్నివేశంలో పూర్తి చేసిన సమస్యాత్మక కృత్యమే ప్రాజెక్టు.
- **బైనింగ్ అండ్ బైనింగ్:** నిజ జీవిత సన్ని వేశంలో పథకం విద్యార్థులు సాధించిన లక్ష్యాత్మక కృత్యమే ప్రాజెక్టు.
- **బెల్లార్డ్:** పాఠశాల వాతావరణంలోకి తీసు కొని వచ్చిన నిజజీవిత అంశమే ప్రాజెక్టు.

ప్రాజెక్టు సూత్రాలు

- **ఉద్దేశ సూత్రం:** ప్రాజెక్టు మంచి ఉద్దేశంతో కూడుకొని ఉండాలి.
- **వాస్తవికత:** విద్యార్థులు వాస్తవ జీవిత సన్నివేశాల్లో పనిచేయగలిగి ఉండాలి.
- **అనుభవ సూత్రం:** విద్యార్థి వ్యక్తిగతంగా పనిచేయడానికి ప్రాజెక్టు తోడ్పడాలి.
- **స్వేచ్ఛ సూత్రం:** విద్యార్థులను స్వేచ్ఛా యుత వాతావరణంలో అభ్యసించేటట్లు చేయాలి. ఉపాధ్యాయుల నిర్బంధం వారి పై ఉండకూడదు.
- **కార్యకలాప సూత్రం:** విద్యార్థులు వివిధ కార్యకలాపాల్లో పాల్గొనాలి.
- **ఉపయోగిత సూత్రం:** కార్యక్ర మాల ద్వారా పొందిన జ్ఞానం విద్యార్థుల కుఉపయోగపడాలి.

ప్రాజెక్టులు- రకాలు: కిల్‌ప్యాట్రిక్ ప్రాజెక్టులను నాలుగు రకాలుగా వర్గీకరించారు.

1. **ఉత్పత్తిదారుని రకం:**
ప్రాజెక్టు ద్వారా వస్తువు లను ఉత్పత్తి చేస్తే దాన్ని ఉత్పత్తిదారుని రకం అంటారు.
ఉదా: బొమ్మలు తయారుచేయడం, కూరగాయలు పండించడం, నమూనాలు తయారుచేయడం
2. **వినియోగదారుని రకం:** ప్రాజెక్టు ద్వారా విద్యార్థులు ఆనందాన్ని పొందగలిగితే దాన్ని వినియోగదారుని రకం అంటారు.
ఉదా: నాటకీకరణం (నమూనా పార్లమెంట్).
3. **సమస్య రకం:** ప్రాజెక్టు ద్వారా సమస్య పరిష్కార మార్గాన్ని కనుక్కోగలిగితే అది సమస్య రకం.
ఉదా: కాలుష్యానికి కారణాలు తెలుసుకోవడం.
4. **తర్ఫీదు రకం:** ప్రాజెక్టు ద్వారా విద్యార్థుల నైపుణ్యాలను పెంపొందించగలిగితే దాన్ని తర్ఫీదు రకం అంటారు.
ఉదా: విద్యార్థుల్లో మ్యాప్‌లను గీసే నైపుణ్యాన్ని పెంపొందించడం.

ప్రాజెక్టులు తిరిగి రెండు రకాలు

1. **వ్యక్తిగత ప్రాజెక్టులు:** ఒక విద్యార్థి మాత్రమే నిర్వహించే ప్రాజెక్టులను వ్యక్తిగత ప్రాజె క్టులు అంటారు.
2. **సమిష్టి ప్రాజెక్టులు:** ఐదుగురు విద్యార్థులు ఒక బృందంగా ఏర్పడి నిర్వహించే వాటిని సమిష్టి ప్రాజెక్టులు అంటారు.

ప్రాజెక్టు పద్ధతి సోపానాలు

1. **సన్నివేశాలను ఏర్పరచడం:** ఉపాధ్యాయుడు చర్చలు,సంభాషణల ద్వారా వివిధ ప్రాజెక్టుల గురించి విద్యార్థులకు పరిచయం చేయడం.
2. **ప్రాజెక్టు ఎంపిక:** విద్యార్థులు తమకు ఇష్ట మైన ప్రాజెక్టును ఎంపిక చేసుకొంటారు.
3. **ప్రణాళిక రచన:** విద్యార్థులు ప్రాజెక్టును ఎలా నిర్వహించాలో ప్రణాళిక తయారుచేసుకుటారు.
4. **ప్రణాళికను నిర్వహించడం:**
ప్రాజెక్టు పద్ధతి సోపానాల్లో అతి ముఖ్య మైంది, సుదీర్ఘమైంది ప్రణాళికను నిర్వహించడం.
5. **మూల్యాంకనం/ఉపయుక్తత:** విద్యార్థులు నిర్వహించిన ప్రాజెక్టును సమీక్షిస్తారు.
6. **నమోదు చేయడం:** విద్యార్థి ప్రాజెక్టుకు సంబంధించిన అభ్యసన కార్యకలాపాలన్నింటినీ పుస్తకంలో నమోదు చేస్తారు.

ప్రయోజనాలు

- మనోవైజ్ఞానిక సూత్రాలకు అనువైంది.
- విద్యార్థులకు స్వేచ్ఛ ఉంటుంది.
- శ్రమ గౌరవాన్ని సమర్థిస్తుంది.
- ప్రాజెక్టు పద్ధతి ద్వారా పాఠ్యవిషయాల పట్ల సహసంబంధం ఏర్పరచవచ్చు.
- జీవితంలో వాస్తవిక పరిస్థితులకు అనుగుణంగా విద్యను బోధించవచ్చు.
- వెనుకబడిన విద్యార్థులు కూడా ప్రాజెక్టు కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొంటారు.
- ప్రజాస్వామ్య జీవన మార్గానికి శిక్షణ ఇస్తుంది.
- కంఠత, జ్ఞాపకంతో పనిలేదు.

పరిమితులు

- పాఠశాల కార్యక్రమాలను తారుమారు చేస్తుంది.
- కచ్చితమైన కాల నిర్ణయ పట్టికను అను సరించడానికి సాధ్యం కాదు.
- విద్యార్థి తాను పొందిన జ్ఞానం క్రమంగా ఉండక అస్తవ్యస్తంగా ఉందని భావిస్తాడు.
- ప్రాజెక్టు పద్ధతి ద్వారా బోధించే పాఠ్యాంశాలు ఉన్న పాఠ్యగ్రంథాలు అందుబాటులో లేవు.
- కాలయాపనతో కూడుకుంది.
- ఖర్చుతో కూడింది.
- ఈ పద్ధతి ద్వారా సిలబస్ పూర్తిచేయడం కష్టం.
- ఎక్కువ సంఖ్యలో విద్యార్థులు ఉన్నప్పుడు ఈ పద్ధతి ఉపయోగించడం కష్టం.

ప్రాజెక్టు పద్ధతి ద్వారా బోధించే పాఠ్యాంశాలు

- బడి తోట
- రోడ్డు భద్రత,విద్య(విద్యార్థులను నాలుగు రోడ్ల కూడలిలో ఉంచి ట్రాఫిక్‌ను నియంత్రించడం)
- పాఠశాల బ్యాంక్
- గృహ బడ్జెట్‌ను తయారుచేయడం
- స్థానిక స్వపరిపాలన (విద్యార్థులకు ఎన్ని కలు నిర్వహించడం)
- నిరక్షరాస్యత,అధిక జనాభా,సమాజంలో స్త్రీల స్థాయి మొదలైన సమస్యలపై సామాజిక సర్వే
- వ్యవసాయం(ఆహార పంటలను పండించడం.
- కో-ఆపరేటివ్ స్టోర్స్
- హిందూ-ముస్లిం, క్రిస్టియన్, బౌద్ధ, జైనమతం పండుగలు పాఠశాలలో నిర్వహించడం.
- పౌరసత్వ శిక్షణ శిబిరాలు
- కుటీర పరిశ్రమలు
- మృత్తికలను సేకరించడం.



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం
సాంఘిక శాస్త్రం

మాదిరి ప్రశ్నలు

1. తరగతిలో వెనుకబడిన విద్యార్థుల్లో కుతూహలం కలిగించే బోధన పద్ధతి?
1) ఉపన్యాస పద్ధతి
2) సామాజికీకృత కథనం
3) మూలాధార పద్ధతి
4) సమస్యా పరిష్కార పద్ధతి
2. విద్యార్థుల్లో ప్రజాస్వామ్య విలువలు పెంపొందించడం అనే ఆశయాన్ని సాధించడానికి అనువైన బోధన పద్ధతి?
1) మూలాధార పద్ధతి
2) పర్యవేక్షిత అధ్యయనం
3) సామాజికీకృత కథనం
4) సమస్యాపరిష్కార పద్ధతి
3. సాంఘిక అధ్యయనాల పాఠ్యపుస్తకం ద్వారా ఏ పద్ధతిని ఉపయోగించడం కష్టం?
1) ఉపన్యాస పద్ధతి
2) మూలాధార పద్ధతి
3) ప్రకల్పన పద్ధతి
4) సామాజికీకృత పద్ధతి
4. పాఠ్యపథకంలోని సామాన్యీకరణం అనే సోపానాన్ని బోధించడానికి అనువైన బోధన పద్ధతి?
1) చర్చా పద్ధతి
2) మూలాధార పద్ధతి
3) ఉపన్యాస పద్ధతి
4) కథా పద్ధతి
5. మంచి బోధన ఉపగమానికి ఉండవలసిన లక్షణం కానిది?
1) వివిధ స్థాయిల వారికి అనుగుణంగా ఉండాలి.
2) ఎక్కువ పరిమాణంలో జ్ఞానం అందించాలి.
3) విద్యార్థి క్రియాశీలక పాత్ర పోషించాలి
4) ఉపాధ్యాయులు, విద్యార్థుల మధ్య అనుబంధాన్ని ఏర్పరచాలి.
6. ఛాత్రోపాధ్యాయుల బోధన నైపుణ్యాలను పెంపొందించే కార్యక్రమం?
1) బృంద బోధన 2) స్థూల బోధన
3) సూక్ష్మబోధన 4) నమూనా బోధన

సమాధానాలు
1) 3 2) 3 3) 3
4) 3 5) 2 6) 3.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. ప్రాజెక్టులను సమస్యారకం, తర్ఫీదురకం, వినియోగదారుని రకం, ఉత్పత్తిదారుని రకాలుగా సూచించినవారు? (డీఎస్సీ - 2004)
1) బెల్లార్డ్ 2) కిల్‌ప్యాట్రిక్
3) స్టీవెన్‌సన్ 4) జాన్ డ్యూయి
2. బోధనలో ఏ పద్ధతి సిద్ధాంతాలు, సూత్రా లు రూపొందించేందుకు అనువుగా ఉంటుంది? (డీఎస్సీ - 2004)
1) కథన పద్ధతి 2) సమస్యా పద్ధతి
3) యూనిట్ పద్ధతి 4) సామూహిక పద్ధతి
3. అన్ని బోధన పద్ధతుల్లో వీటిని ఉపయోగించడం ద్వారా మంచి ఫలితాలను సాధించవచ్చు? (డీఎస్సీ -2004)
1) మూలాధారాలు 2) వార్షిక పథకాలు
3) చర్చలు 4) పాఠ్యపుస్తకాలు
4. రెండు వరుస పీరియడ్ల పథకంలో మేబిల్. ఐ.సింప్సన్ ప్రకారం నియోజిత అధ్యయనం అనే కార్యకలాపానికి కేటాయించిన కాల వ్యవధి? (డీఎస్సీ-2006)
1) 35 ని॥ 2) 25 ని॥
3) 20 ని॥ 4) 30 ని॥
5. లోక్ అదాలత్‌లు - న్యాయ పరిష్కారాలు అనే అంశం పట్ల అవగాహన కోసం ఈ యుక్తి ఉపయోగించడం ఉత్తమమైంది? (డీఎస్సీ-2006)
1) వర్క్‌షాప్ 2) సందర్శన
3) స్వయం అధ్యయనం 4) సెమినార్
6. రాజ్‌ఘాట్ అనేది ఏ రకమైన ఆధారం? (డీఎస్సీ-2006)
1) తృతీయ 2) చతుర్థ
3) ప్రాథమిక 4) ద్వితీయ
7. 9వ తరగతి విద్యార్థులకు గ్రామీణ స్వపరిపాలనా సంస్థలు అనే పాఠ్యాంశ బోధనకు ఉత్తమమైన బోధన పద్ధతి? (డీఎస్సీ-2006)
1) మూలాధార 2) ప్రాజెక్టు పద్ధతి
3) ఉపన్యాస ప్రదర్శన పద్ధతి
4) సమస్యా పద్ధతి

సమాధానాలు
1) 2; 2) 2; 3) 3; 4) 1;
5) 2; 6) 3; 7) 2.

విద్య, ఉద్యోగ సమాచారం

డీఎస్‌హెచ్ కడప జిల్లాలో వివిధ ఉద్యోగాలు

కడప జిల్లాలోని డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్(డీఎస్‌హెచ్) ఒప్పంద ప్రాతిపదికన వివిధ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 09.
- **పోస్టుల వివరాలు:** బయో స్టాటిస్టియన్-01, రేడియోగ్రాఫర్-01, ల్యాబ్ టెక్నీషియన్-02, ల్యాబ్ అటెండెంట్-02, జీడీఏ/ఎమ్ఎన్‌వో/ఎఫ్ఎన్‌వో-03.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఏ, బీఎస్సీ, పదో తరగతి, డీఎంఎల్‌టీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- **వయసు:** 42 ఏళ్లు నిండి ఉండాలి. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
- **వేతనం:** నెలకు బయో స్టాటిస్టియన్ పోస్టుకు రూ.18,500, రేడియోగ్రాఫర్ పోస్టుకు రూ.35,570, ల్యాబ్ టెక్నీషియన్ పోస్టుకు రూ.32,670, మిగతా పోస్టులకు రూ.15,000.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ఆఫీస్ ఆఫ్ ది డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ ఆఫ్ హాస్పిటల్ సర్వీస్, డీఎస్‌హెచ్, కడప, ఓ బ్లాక్, న్యూ కలెక్టరేట్, కడప, వైఎస్సార్ జిల్లా చిరునామకు పంపించాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**16.04.2025
- **వెబ్‌సైట్:** https://kadapa.ap.gov.in

ఎన్‌సీఈఎస్ఎస్, తిరువనంతపురంలో 16 పోస్టులు

తిరువనంతపురం(కేరళ)లోని నేషనల్ సెంటర్ ఫర్ ఎర్త్ సైన్స్ స్టడీస్ (ఎన్‌సీఈఎస్ఎస్).. ప్రాజెక్ట్ సైంటిస్ట్, ప్రాజెక్ట్ అసోసియేట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 16.
- **పోస్టుల వివరాలు:** ప్రాజెక్ట్ సైంటిస్ట్1-14, ప్రాజెక్ట్ అసోసియేట్2-02.
- **అర్హత:** మాస్టర్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. పని అనుభవం కూడా ఉండాలి.
- **వయసు:** 35 ఏళ్లు ఉండాలి.
- **వేతనం:** ప్రాజెక్ట్ సైంటిస్ట్1 పోస్టుకు రూ.56,000, ప్రాజెక్ట్ అసోసియేట్2 పోస్టుకు రూ.35,000.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా .
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**08.05.2025
- **వెబ్‌సైట్:** www.ncess.gov.in

సహజ రేడియో ధార్మికత అంటే?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

కెమిస్ట్రీ

పరమాణు నిర్మాణం

రేడియో ధార్మికత

ఏ మూలక పరమాణువులోనైనా ఎలక్ట్రాన్లు, ప్రోటాన్లు, న్యూట్రాన్లు ఉంటాయి. వీటిని ఉప పరమాణు కణాలు (Sub Atomic Particles) లేదా మూల కణాలు (Fun-damental Particles) అంటారు. ఆవర్తన పట్టికలో అత్యంత తేలికైన, మొదటి మూలకమైన హైడ్రోజన్‌లో మాత్రం న్యూట్రాన్లు ఉండవు. ప్రోటాన్లు, న్యూట్రాన్లు కేంద్రకంలో ఉండటం వల్ల వీటిని కేంద్రక కణాలు అంటారు. సూర్యుని నుంచి వెలువడే ఫోటాన్లు (కాంతి కణాలు), న్యూట్రినోలను కూడా ఉప పరమాణు కణాలుగా పరిగణిస్తారు. వీటిలో ఎలక్ట్రాన్లు రుణావేశ పూరిత కణాలు. ప్రోటాన్లు ధనావేశపూరిత కణాలు. న్యూట్రాన్లు ఆవేశ రహిత కణాలు. న్యూట్రినోలు అస్తిత్వం లేని కణాలు. సాధారణంగా ఇవి సూర్యునిలో జరిగే 'కేంద్రక సంలీన' ప్రక్రియలో విడుదలై, భూమికి చేరతాయి. వీటి ద్రవ్యరాశి చాలా తక్కువ (శూన్యం కాదు). పరమాణు సంఖ్య పెరుగుతున్నకొద్దీ కేంద్రకంలో ప్రోటాన్ల సంఖ్య పెరగడం వల్ల వాటి మధ్య వికర్షణ కూడా పెరుగుతుంది (ధనావేశాలే కాబట్టి). అందువల్ల న్యూట్రా న్ల సంఖ్య గణనీయంగా పెరుగుతుంది. **ఉదా:** హీలియంలో రెండు ప్రోటాన్లు, రెండు న్యూట్రాన్లు ఉండగా.. యురేనియం- 235లో 92 ప్రోటాన్లు, 143 న్యూట్రాన్లు ఉంటాయి. ఇలాంటి భారీ కేంద్రకాలు సహజంగా ఆల్ఫా (α), బీటా (β), గామా (γ) లాంటి కిరణాలను ఉద్గారం చేస్తా యి. ఈ విషయాన్నే సహజ రేడియో ధార్మికత (Natural Radio activity) అంటారు. ఈ విషయాన్ని హెన్రీ బెక్వరల్ అనే శాస్త్రవేత్త యాదృచ్ఛికంగా కనుగొన్నాడు. తర్వాత వీటిపై నోబెల్ బహుమతి గ్రహీతలైన క్యూరీ దంపతులు (మేరీ, పియరీ క్యూరీ) పరిశోధన చేశారు. వీరు రేడియం, పొలోనియం అనే కొత్త మూలకాలు కనుగొన్నారు.

α - కణాలు: వీటికి రెండు యూనిట్ల ధనావేశం ఉంటుంది. ఇవి హైడ్రోజన్ కంటే నాలుగు రెట్లు బరువైనవి. వీటిని హీలియం కేంద్రకాలుగా పరిగణిస్తారు. వీటి వేగం సుమారు 16000 Km/sగా ఉంటుంది. ఇవి ప్రయాణిస్తున్నప్పుడు వాయుకణాలను అయనీకరణం చెందిస్తాయి (ఎలక్ట్రాన్లను వేరు చేస్తాయి). జింక్ సల్ఫైడ్ తెరపై స్ఫురదీప్తిని కలుగజేస్తాయి.

β - కిరణాలు: ఇవి అతివేగంగా చలించే ఎలక్ట్రాన్లు. వీటికి రుణావేశం ఉంటుంది. కాంతివేగం కంటే కొద్దిగా తక్కువ వేగంతో చలిస్తాయి. వీటికి చొచ్చుకుపోయే సామర్థ్యం α - కణాల కంటే ఎక్కువ ఉంటుంది.

γ - కిరణాలు: ఇవి కాంతివేగం (3×10^8 m/s)తో చలించే శక్తివంతమైన విద్యుదయస్కాంత వికిరణాలు. సాధారణంగా ఒక కేంద్రకం α - కణాలను ఉద్గారం చేసినప్పుడు ఉత్తేజిత స్థాయికి చేరుతుంది. అది భూస్థాయికి వచ్చినప్పుడు శక్తిని γ - కిరణాల రూపంలో విడుదల చేస్తుంది. ఈ గామా కిరణాలను క్యాన్సర్ చికిత్సలో (రేడియో థెరపీ), కూరగాయల, ధాన్యాలను క్రిమిరహితం చేసి, వాటి నిల్వ కాలాన్ని (Shelf life) పెంచడానికి ఉపయోగిస్తారు. దీని కోసం సాధారణంగా కోబాల్ట్ - 60 అనే మూలక కేంద్రకాన్ని ఉపయోగిస్తారు.

సాధారణంగా రేడియో ధార్మిక వికిరణాలు లెడ్ లోహం ద్వారా చొచ్చుకొని పోవు. కాబట్టి లెడ్ (Pb)ను రక్షక కవచంగా వాడతారు.

కాస్మిక్ కిరణాలు: ఇవి అత్యంత శక్తివంతమైన, ప్రమాదకరమైన విద్యుదయస్కాంత వికిరణాలు. ఇవి దాదాపుగా భూమిని చేరే లోపే క్షీణించిపోతాయి.

రేడియో ధార్మికత అనువర్తనాలు

రేడియో ధార్మికతపై పరిశోధనలో భాగంగా న్యూట్రాన్లు, పాజిట్రాన్లు, ఆల్ఫా కణాలు లాంటి ఉపపరమాణు కణాలను కనుగొన్నారు. వీటి ఆవిష్కరణ మూలకాల పరివర్తన (ఒక మూలకం నుంచి మరో మూలకానికి మార్పు)లో ఒక ముఖ్య ఘట్టంగా నిలిచింది. పరమాణు సంఖ్య 92 తర్వాత వచ్చే మూలకాలన్నీ కృత్రిమంగా కనుక్కున్నవే.

రేడియోధార్మిక ఐసోటోపులు (ఒకే మూలకానికి చెందిన ద్రవ్యరాశి భిన్నంగా ఉన్న కేంద్రకాలు) వ్యవసాయంలో, వైద్యశాస్త్రంతోపాటు ఇతర శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ఎంతో ఉపయుక్తంగా ఉన్నాయి.

రేడియో కార్బన్ డేటింగ్: కార్బన్‌కు 12, 13, 14 ద్రవ్యరాశి సంఖ్యలున్న ఐసోటోపులు ఉంటాయి. వీటిలో C-14కు రేడియో ధార్మికత ఉంటుంది. ఇది β - కిరణాలను ఉద్గారం చేసి, నైట్రోజన్‌గా పరివర్తనం చెందుతుంది. మొక్కలు, జంతువుల శిలాజాల్లోని C-14తోపాటు C-14ను కలిగిన CO_2 వాతావరణంలో స్థిరంగా ఉంటుంది. చనిపోయిన మొక్కలు CO_2ను తీసుకోలేవు కాబట్టి శిలాజాల్లోని C-14 పరిమాణం క్రమంగా తగ్గుతుంది. ఎందుకంటే అది β - కిరణాలను ఉద్గారం చేస్తూ, నైట్రోజన్‌గా మారుతుంది. ఈ విఘటనం చెందే రేటు ఆధారంగా శిలాజాల వయసును అంచనా వేస్తారు. దీన్నే 'రేడియో కార్బన్ డేటింగ్' అంటారు.

ఇదేవిధంగా యురేనియం - 226 ఆధారంగా శిలల వయసును నిర్ధారిస్తారు. ఈ పద్ధతిని 'రేడియో యురేనియం డేటింగ్' అంటారు.

- రేడియో ధార్మిక కేంద్రక విచ్ఛిత్తి ఆధారంగానే అణు విద్యుత్ శక్తి ఉత్పత్తి అవుతుంది.
- రేడియోధార్మిక కోబాల్ట్-60 నుంచి వచ్చే గామా కిరణాలను క్యాన్సర్‌ను నయం చేయడానికి (రేడియోథెరపీ) ఉపయోగిస్తారు.
- అయోడిన్-131ను థైరాయిడ్ సమస్యల నిర్ధారణ, చికిత్సలో (**ఉదా:** గాయిటర్ వ్యాధి) వినియోగిస్తారు. దీన్ని మెదడులోని కణితులను (బ్రెయిన్ ట్యూమర్లు) గుర్తించడానికి కూడా ఉపయోగిస్తారు.
- రక్తహీనతను అధ్యయనం చేయడానికి రేడియో ధార్మిక ఐరన్ (Fe-59)ను ఉపయోగిస్తారు.
- రేడియో ధార్మిక సోడియం (Na-24)ను రక్తప్రసరణలోని లోపాలను గుర్తించడానికి ఉపయోగిస్తారు.
- P-34ను ఉపయోగించి ఎముకల్లో పగుళ్లను గుర్తిస్తారు. దీని ద్వారా ఎముకలు ఫాస్ఫరస్‌ను శోషించుకుంటున్నాయో లేదో తెలుసుకుంటారు. మొక్కల్లో జరిగే జీవక్రియల అధ్యయనానికి కూడా దీన్ని ఉపయోగిస్తారు.
- యాంటీమొని (Sb-124)ను ఉపయోగించి పెట్రోలియం పైపుల్లో లీకేజీని గుర్తిస్తారు.
- α - కిరణాలను ఉపయోగించి క్రిమికీటకాలను నిర్వీర్యం చేయవచ్చు.
- ఆలుగడ్డలు, ఉల్లిగడ్డలు లాంటివాటిని ఎగుమతి చేయడంలో, వాటి నిల్వ సామర్థ్యం పెంచడంలో గామా కిరణాలను ఉపయోగిస్తారు.
- రేడియో ధార్మిక ఆక్సిజన్ (O-18)ను ఉపయోగించి అనేక రసాయన చర్యలను అధ్యయనం చేస్తారు.
- రేడియో ధార్మికతను కనిపెట్టినందుకు హెన్రీ బెక్వరల్‌కు, దానిపై మరిన్ని పరిశోధనలు చేసినందుకు క్యూరీ దంపతులకు 1903లో భౌతికశాస్త్రంలో సంయుక్తంగా నోబెల్ బహుమతి అందజేశారు.
- రేడియం, పోలోనియం మూలకాలను కనుగొన్నందుకు మేడమ్ క్యూరీ 1911లో రసాయన శాస్త్రంలో నోబెల్ బహుమతి అందుకున్నారు.
- కృత్రిమ రేడియోధార్మికతను కనుక్కున్నందుకు మేరీ క్యూరీ కూతురు ఐరీన్ క్యూరీ, అల్లుడు ఫ్రెడరిక్ జూలియట్ క్యూరీకి 1935 లో రసాయన శాస్త్రంలో సంయుక్తంగా నోబెల్ ప్రైజ్‌ను అందజేశారు.



మాదిరి ప్రశ్నలు

1. వివిధ వికిరణాల చొచ్చుకుపోయే క్రమాన్ని గుర్తించండి?
   1) α < β < γ 2) α < γ < β
   3) γ < α < β 4) γ < β < α
2. రేడియో ధార్మిక పదార్థం నుంచి ఉద్గారితమైన ఆల్ఫా కిరణాలు: (గ్రూప్-1, 2007)
   1) రెండింతలు అయనీకృత హీలియం పరమాణువులు
   2) రుణావేశిత కణాలు
   3) అయనీకృత హైడ్రోజన్ కేంద్రకాలు
   4) ఆవేశం లేని కణాలు
3. రేడియో ధార్మికతలో వెలువడే విద్యుదయస్కాంత వికిరణాలు?
   ఎ) α బి) β సి) γ డి) X - కిరణాలు
   1) ఎ, బి 2) బి, సి, డి
   3) ఎ మాత్రమే 4) సి మాత్రమే
4. అస్థిర పరమాణువు నుంచి β - కణాలు ఉద్గారం అయితే దాని ద్రవ్యరాశి:
   1) తగ్గుతుంది 2) పెరుగుతుంది
   3) మారదు 4) తగ్గవచ్చు లేదా పెరగవచ్చు
5. β - కణ ఉద్గారం జరిగినప్పుడు మూలక పరమాణు సంఖ్య:
   1) తగ్గుతుంది 2) పెరుగుతుంది
   3) మారదు 4) చెప్పలేం
6. జతపరచండి.
   ఎ) α-కణం ( ) 1. అనావేశపూరితకణం
   బి) β- కణం ( ) 2. ధనావేశిత కణం
   సి) γ- కణం ( ) 3. రుణావేశిత కణం
   డి) ఐసోటోప్ ( )
   4. ఒకే పరమాణు సంఖ్య
   5. ఒకే ద్రవ్యరాశి

	ఎ	బి	సి	డి
1)	1	2	3	4
2)	2	3	4	1
3)	3	2	1	5
4)	2	3	1	4

7. విద్యుత్ క్షేత్రంలో ధనావేశిత పలకదిశగా వంగే కణాలేవి?
   1) α 2) β 3) γ 4) ఏవీకావు
8. ప్రణాళికా సంఘం భారతదేశంలోని న్యూ ట్రినో అబ్జర్వేటరీని 11వ పంచవర్ష ప్రణాళికలో మెగా సైన్స్ ప్రాజెక్టుగా చేర్చింది. దీనికి సంబంధించి సరైన వాక్యాన్ని/ వాక్యాలను గుర్తించండి.
   ఎ) న్యూట్రినోలు, కాంతివేగానికి సమాన వేగంతో ప్రయాణించగలిగే నిరావేశ కణాలు
   బి) బీటా క్షయానికి చెందిన కేంద్రక చర్యల్లో న్యూట్రినోలు ఉద్భవిస్తాయి.
   సి) న్యూట్రినోలకు విస్మరించదగిందే అయినప్పటికీ శూన్యంకాని ద్రవ్యరాశి ఉంటుంది.
   డి) మానవశరీరంలో ప్రతి సెకండ్‌కి ట్రిలియన్ల న్యూట్రాన్లు పయనిస్తూ ఉంటాయి.
   1) ఎ, సి మాత్రమే 2) ఎ, బి, సి మాత్రమే
   3) బి, సి, డి 4) ఎ, బి, సి, డి
9. ఏ వ్యాధి నిర్ధారణలో అయోడిన్-131ను వాడతారు?
   1) గాయిటర్ 2) రక్తహీనత
   3) రేచీకటి 4) ఆర్థరైటిస్
10. జతపరచండి.
   ఎ) రక్తహీనత ( ) 1. సోడియం-24
   బి) రక్తప్రసరణ లోపాలు ( ) 2. ఐరన్-59
   సి) క్యాన్సర్ చికిత్స ( ) 3. కార్బన్-14
   డి) చెట్ల వయసు ( ) 4. కోబాల్ట్-60
   5. ఫాస్ఫరస్-34

	ఎ	బి	సి	డి
1)	2	1	4	3
2)	2	4	5	1
3)	3	2	1	5
4)	2	3	1	4

11. పరమాణు కేంద్రకానికి సంబంధించి కిందివాటిలో సరైన వాక్యం ఏది?
   ఎ) కేంద్రకంలో ధనావేశాలు (ప్రోటాన్లు) ఉంటాయి.
   బి) కేంద్రక పరిమాణాన్ని 'ఫెర్మి' యూనిట్లలో కొలుస్తారు.
   సి) ఒక ఫెర్మి అంటే సుమారు 10^{-13} సెం.మీ.
   డి) పరమాణు పరిమాణం 10^{-8} సెం.మీ. కాగా, కేంద్రక పరిమాణం సుమారు 10^{-13} సెం.మీ.
   1) ఎ మాత్రమే 2) ఎ, బి మాత్రమే
   3) ఎ, బి, సి మాత్రమే 4) ఎ, బి, సి, డి
12. రేడియో ధార్మికతకు ప్రమాణం ఏది?
   1) క్యూరీ 2) రూథర్‌ఫర్డ్
   3) బెక్వరల్ 4) పైవన్నీ
13. కేంద్రకం కిందివాటిలో ఏ కణాలను ఉద్గారం చేసినప్పుడు కొత్త మూలకాలు ఏర్పడతాయి?
   ఎ) α - కణాలు బి) β - కణాలు
   సి) γ - కణాలు
   1) ఎ మాత్రమే 2) ఎ, బి
   3) బి, సి 4) ఎ, బి, సి
14. లుకేమియా వ్యాధి చికిత్సలో వాడే రేడియోధార్మిక ఐసోటోపు ఏది?
   1) ఫాస్ఫరస్-32 2) కార్బన్-14
   3) అయోడిన్-132 4) ట్రిటియం
15. హైడ్రోజన్ రేడియోధార్మిక ఐసోటోపు ఏది?
   1) ప్రోటియం 2) డ్యుటీరియం
   3) ట్రిటియం 4) 2, 3
16. ఏ ప్రక్రియలో X - కిరణాలు ఉద్భవిస్తాయి?
   1) α - ఉద్గారం 2) β - ఉద్గారం
   3) పాజిట్రాన్ ఉద్గారం
   4) ఎలక్ట్రాన్ల పరిగ్రహణ
17. β - కణాల ఉద్గారానికి సంబంధించి సరైన వాక్యాలు ఏవి?
   ఎ) పరమాణు బాహ్య కక్ష్య నుంచి ఉద్గారమవుతాయి
   బి) ప్రోటాన్లు న్యూట్రాన్లుగా మారతాయి
   సి) న్యూట్రాన్లు ప్రోటాన్లుగా మారతాయి
   1) ఎ, బి 2) బి, సి
   3) సి మాత్రమే 4) ఎ మాత్రమే
18. క్యూరీ దంపతులుగా ప్రసిద్ధి చెందిన మేరీ క్యూరీ, పియరీ క్యూరీలకు నోబెల్ బహుమతి సంపాదించి పెట్టిన పరిశోధన ఏ అంశానికి సంబంధించింది?
   1) కాంతి విద్యుత్ ఫలితం 2) రేడియోధార్మికత
   3) కిరణజన్య సంయోగక్రియ 4) జీన్ థెరపీ
19. వేటివల్ల కేంద్రకం చుట్టూ ఎలక్ట్రాన్లు తిరుగుతాయి?
   1) అభికేంద్ర బలాలు 2) అపకేంద్ర బలాలు
   3) ఘర్షణ బలాలు 4) ఉద్గార బలాలు

సమాధానాలు:
1) 1; 2) 1; 3) 4; 4) 3; 5) 2; 6) 4; 7) 2; 8) 4; 9) 1; 10) 1; 11) 4; 12) 4; 13) 2; 14) 1; 15) 3; 16) 4; 17) 3;18) 2; 19) 1;

Rising rental rates force the middle class..

Bank Exams
GENERAL ENGLISH

Model Questions

Directions (Q. No. 1-5): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence, the mark the number of that part with error as your answer. Mark (5) as your answer, if there is 'No error'.

1. As more and much people invest their money in savings certificates or money-market funds (1)/ in order to earn higher interest, (2)/ they are abandoning traditional low-interest investment havens (3)/ such as passbook accounts and life insurance policies. (4)/ No error. (5)
2. Rising rental rates force the middle class to use (1)/ far more than the standard 25 percent of their incomes (2)/ for housing, leaving them with know equity (3)/ or tax write-offs to offset the expenditures. (4)/ No error. (5)
3. Astronomers studying(1)/ the newly discovered star (2)/ said that it provides clues about (3)/ our galaxy's origin. (4)/ No error. (5)
4. According to some economists, (1)/ the June decrease in unemployment suggest (2)/ that the gradual improvement (3)/ in the job market is continuing. (4)/ No error (5)
5. The qualities of a great leader are (1)/ coolness in the face of danger, (2)/ an excellent sense of strategy, (3)/ and a ability to plan in minute detail. (4)/ No error. (5)

Directions (Q. No. 6-10): Which of the phrases (1), (2), (3), and (4) given below each sentence should replace the phrase given **bold** in the sentence to make it grammatically correct? Mark (5) "No correction required" as your answer, if there is no error.

6. Aging **is a property** of all animals that reach a fixed size at maturity.
   1) was a property
   2) had been a property
   3) was being a property
   4) is being a property
   5) No correction required
7. All-terrain vehicles have allowed vacationers to reach many previously inaccessible areas, but they **have been blamed** for causing hundreds of deaths.
   1) have also been blamed
   2) have been also blamed
   3) have been blamed also
   4) have been blaming
   5) No correction required
8. Although fruit can no longer grow once it is picked, it continues for some time to respire, **taking in oxygen and giving often** carbon dioxide.
   1) taking in oxygen and giving of
   2) taking in oxygen and giving always
   3) taking in oxygen and giving off
   4) taking out oxygen and giving off
   5) No correction required
9. Amateur astronomers with good telescopes **should been able to** see the comet within the next few weeks.
   1) should be able
   2) would be abled
   3) should being able
   4) should belonging
   5) No correction required
10. As the price of oil rises, the prices of bread and livestock feed **sure to increases**.
   1) are sure to increased
   2) are sure to increasing
   3) are sure to be increase
   4) are sure to increase
   5) No correction required

Directions (Q. No. 11-15): Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.



11. The coordination of monetary policy can help ____ the orderly financing of ____imbalances.
   1) facilitate; existing
   2) felicitate; exciting
   3) fend; many
   4) fetch; permanent
   5) promote; promotional
12. __ the objects found in the excavated temple ___ small terra-cotta effigies left by supplicants.
   1) Below; wear
   2) Amongst; where
   3) Between; below
   4) Among; were
   5) Above; was
13. An array of tax incentives ___ to a boom in the construction of new buildings.
   1) have lead 2) has led
   3) have been lead
   4) has been leading 5) had leads
14. The yellow jacket can sting ____ without dying and ___ potent venom that can cause intense pain.
   1) repeatedly; carries
   2) repetition; carried
   3) repeat; carry
   4) repeats; carrier
   5) repeating; career
15. As envisioned by researchers, commercial farming ____ lobsters will enable fisheries to sell the shellfish year ____ .
   1) from; threw 2) of; round
   3) off; through 4) with; around
   5) among; always

Directions (Q. No. 16-20): Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A. The purpose was twofold: political control and religious communication. Experts believe that there were three types of human sacrifice practiced by the Shang.
B. Finally, in internment sacrifices, young girls were sacrificed. Unlike the first two, they were buried in the standard burial position and their bodies were kept intact.
C. In pit sacrifices, young men were sacrificed. Their bodies were dismembered and they were buried without their personal possessions. In foundation sacrifices, children and babies were used.
D. The practice of human sacrifice was very common in ancient China, particularly during the Shang Dynasty-the first Chinese dynasty with written records.
E. Archaeological evidences show that these human sacrifices experienced violent deaths, and they too were buried without possessions.
F. In fact, archaeological evidence suggests that human sacrifice was practiced on a grand scale during the Shang dynasty.

16. What is the FIRST sentence after rearrangement?
   1) C 2) B 3) D 4) E 5) F
17. What is the THIRD sentence after rearrangement?
   1) A 2) B 3) D 4) F 5) C
18. What is the FOURTH sentence after rearrangement?
   1) A 2) C 3) D 4) E 5) F
19. What is the FIFTH sentence after rearrangement?
   1) B 2) C 3) D 4) E 5) F
20. What is the SECOND sentence after rearrangement?
   1) A 2) B 3) D 4) E 5) F

Directions (Q. No. 21-30): In the following passage there are blanks, each of which has been numbered. These numbers are printed below the passage and against each, five words/ phrases are suggested, one of which fits the blank appropriately. Find out the appropriate word/ phrase in each case and mark your answer.

Dwarf planet Ceres continues to ___ (21) scientists as NASA's Dawn spacecraft gets closer to being captured into orbit around the object. The ____ (22) images from Dawn, taken nearly 29,000 miles (46,000 kilometers) from Ceres, reveal that a bright spot that stands out in previous images ____ (23) close to yet another bright area. As scientists receive better and _____ (24) views of the dwarf planet over the next 16 months, they hope to gain a deeper understanding of its origin and evolution _____ (25) studying its surface. The intriguing bright spots and other _____ (26) features of this captivating world will come into ____ (27) focus. Dawn visited the giant asteroid Vesta ____ (28) 2011 to 2012, delivering more than 30,000 images of the body along with many other measurements, and providing insights about its composition and geological history. Vesta has an average diameter of 326 miles (525 kilometers), while Ceres has an average diameter of 590 miles (950 kilometers). Vesta and Ceres are the ___ (29) most massive bodies in the asteroid belt, located _____ (30) Mars and Jupiter.

21. 1) puzzle 2) question 3) answer 4) doubt 5) propose
22. 1) later 2) latest 3) recently 4) frequently 5) presently
23. 1) lay 2) lain 3) lies 4) lays 5) laid
24. 1) batter 2) good 3) best 4) better 5) bought
25. 1) for 2) from 3) with 4) among 5) by
26. 1) interesting 2) annoying 3) disturbing 4) distributing 5) presently
27. 1) sharer 2) sharper 3) shaver 4) sharp 5) severe
28. 1) with 2) by 3) from 4) for 5) above
29. 1) to 2) too 3) toe 4) two 5) type
30. 1) beyond 2) besides 3) in front of 4) in addition to 5) between

Directions (Q. No. 31-35): Choose the word which is wrongly spelt from the five options given.

31. 1) misanthrope 2) misogynism 3) misappropriation 4) mismatch 5) mistake
32. 1) commission 2) apportion 3) succesion 4) concession 5) profession
33. 1) adjudicte 2) judicious 3) combat 4) demur 5) elope
34. 1) flamboyant 2) genuine 3) hinderance 4) inocuous 5) germane
35. 1) kiosk 2) lacerate 3) mirege 4) nocturnal 5) opulent

Directions (Q. No. 36-37): From the five options given in each question a set of words are either synonyms or antonyms, choose that set as your option and mark your answer.

Answers

1) 1;	2) 3;	3) 3;	4) 2;	5) 4;
6) 5;	7) 1;	8) 3;	9) 1;	10) 4;
11) 1;	12) 4;	13) 2;	14) 1;	15) 2;
16) 3;	17) 1;	18) 2;	19) 4;	20) 5;
21) 1;	22) 2;	23) 3;	24) 4;	25) 5;
26) 1;	27) 2;	28) 3;	29) 4;	30) 5;
31) 2;	32) 3;	33) 1;	34) 3;	35) 3;